
3120



భాషాశాస్త్రము - దాని క్రమాభివృద్ధి

శ్రీ కోరాడ రామకృష్ణయ్య

భాషాశాస్త్ర [illegible] *"It blesseth him that gives and him that takes"* — [illegible]

[illegible]

చున్నాము ? భాష ముందా, భావము ముందా ? ఈ మొదలగు ప్రశ్నలాకాలమువారికి గలిగినవి. వానికి సమాధానము లనేకములగు కథలమూలముననూ, ఐతిహ్యముల మూలముననూ మంత్రబ్రాహ్మణములలో వారు సూచించియుండిరి. ప్రధానముగా వారి దృష్టి ఆంతరంగికము, ఆధ్యాత్మికము నగుటచే తదనుగుణముగనే యీ వాగర్థముల సంబంధమును నిర్వచింపసాగిరి. ఋగ్వేదములో వాక్కు ఒక దేవతగా భావింపబడినది. ఆ దేవత శక్తి స్వరూపములనుగూర్చి యనేకవిధములగు స్తోత్రములుచేయబడినవి. ఋ వే. ౧౦ మం. ౧౨౫ సూక్తములో "అహమేవ స్వయ మిదం వదామి జుష్టం దేవేభి రుత మానుషేభిః, యం కామయే తం తముగ్రం కృణోమి తం బ్రాహ్మణం, తం ఋషిం, తం సుమేధాం"—తా నెవనిని ప్రేమించునో వానిని వీర్యవంతునిగను, బ్రహ్మస్వరూపునిగను, (ఋషి) మేధావంతునిగను జేయుదునని వాగ్దేవతి చెప్పినట్లు తెలుపబడినది. ఈ దేవతయే ప్రజాపతికి సహచరియై లోకమందు అర్థసృష్టికి కారణమగును. కావుననే వాగర్థములు పార్వతీపరమేశ్వర రూపములు. వీని కవినాభావము. అనగా సృష్టిలోని వస్తువులకును, వానిని బోధించు శబ్దములకును అవినాభావ సంబంధము సూచితము. శబ్దార్థముల సంబంధము నిత్యమని వైయాకరణులు. "సిద్ధే శబ్దార్థసంబంధే" యని భాష్యకారుడు పతంజలి వ్యక్తముచేసినాడు. శక్తి స్వరూపమగు శబ్దబ్రహ్మమే అర్థభావమున వివర్తమును బొందుటచే జగత్సృష్టి కలిగిన దను భావమును వైయాకరణభూషణకారుడు వెల్లడించుచున్నాడు. ఈ శబ్దబ్రహ్మభావమే వైయాకరణుల స్ఫోటవాదమునకు మూలమైనది. ఇది ఋగ్వేదమున దెలుపబడిన వాగ్దేవతా ప్రజాపతుల సహచరభావమును, సృష్టికారకత్వభావమునే యనువదించుచున్నట్లున్నది. బ్రాహ్మణములలోగూడ భావము - భాషలకు గల సంబంధమును గూర్చిన కథలు గలవు. అవ్యాకృతమైన వాక్కునింద్రుడు తొలుత వ్యాకరించినట్లు సూచించు కథ యొకటి శతపథబ్రాహ్మణమున గలదు. దీనినిబట్టి యీ భాషకు తొలుత ఇంద్రుడే వ్యాకరణకర్తయయి యుండునని తెలియుచున్నది. పాణినివ్యాకరణము బయలుదేరినపిదప, నంతకు పూర్వమున గల వ్యాకరణములతోపాటు ఈ ఐంద్రవ్యాకరణముగూడ నశించి నట్లు, సోమదేవుని కథాసరిత్సాగరమందలి యొక కథను

బట్టి తెలియవచ్చుచున్నది. ఏమైనను పాణినికి చిరపూర్వమే. మంత్రబ్రాహ్మణముల కాలమునుండి భాషాతత్త్వవిమర్శన మీ దేశమున జరుగుచునేయున్నదనుట స్పష్టము. వేదములందలి స్వరవర్ణోచ్చారణ రీతులు మారిపోకుండ అరికట్టుటకై 'ప్రాతిశాఖ్య'లను గ్రంథములు రచింపబడినవి. ఇట్టి స్వరవర్ణోచ్చారణ రీతులను దెలుపు భాగమునకు 'శిక్షాధ్యాయ'మని బ్రాహ్మణములలో పేరుపెట్టబడినది. "అథ శిక్షాం వ్యాఖ్యాస్యామః, వర్ణః స్వరః, మాత్రా బలం, సామ సంతానః, ఇత్యుక్తః శిక్షాధ్యాయః" అని తైత్తిరీయారణ్యకము. ఇచ్చట వర్ణములు (*letters*), స్వరము (*accent*), మాత్ర (*Quantity*)—హ్రస్వదీర్ఘ ప్లుతములు, బలం (*organs of pronunciation*), వర్ణోత్పత్తిక్రమము, సామ (*delivery*), ఉచ్చారణ రీతి, సంతానము (*euphonic laus*), వర్ణముల కలయిక అందువలన గలుగు మార్పులు—వీనినిగూర్చి యీ శిక్షాధ్యాయము చెప్పుచున్నది. ఆధునిక భాషాశాస్త్రమందలి యన్నియు ధ్వనిశాస్త్రము (*Phonetics*) అను శాఖలో జేరుచున్నవి. ప్రాతిశాఖ్యల నాటికే విభక్తులు సప్తసంఖ్యాకములని నిరూపింపబడినది. యాస్కాచార్యుడు 'నామాఖ్యాతోపసర్గనిపాత'లను భాషాభాగములను జేర్కొనియున్నాడు. ఈతడు రచించిన నిరుక్తగ్రంథముమూలముగా నా కాలమునకే భాషాతత్త్వపరిశీలన మీ దేశమున నంతటి యభివృద్ధిగాంచినదో వ్యక్తమగుచున్నది. ఈతడు క్రీ. పూ. ౭౦౦ సం. లనాటివాడు. అంతకు పూర్వమే యెన్నో మతములు భాషాతత్త్వపరిశీలకులలో నున్నట్లీతడు వారి ననువదించుటవలన దెలియవచ్చుచున్నది. "నైఘంటుకులు, నైరుక్తులు, వైయాకరణులు, ఐతిహాసికులు, కాల్పనికులు, నైదానులు" మొదలగువారి యభిప్రాయముల నీత డనువదించినాడు. వేదములయందలి ప్రతిశాఖనుగూర్చి, అందలి వాక్యములు, పదములు, అక్షరములు, ధ్వనులు మొదలగువానిని వ్యాకరించి రచింపబడిన ప్రాతిశాఖ్యలే ఆకాలమందు జరిగిన భాషాపరిశ్రమకు నిదర్శనములు. యాస్కాచార్యులు ధాతువుల నుండి శబ్దముల వ్యుత్పత్తిని దెలుపుచు నందు గలుగు ధ్వనిపరిణామముల నాధునికశబ్దశాస్త్రజ్ఞుల రీతినే వ్యక్తపరచినాడు. 'గం' ధాతువునుండి 'జగ్ముః'అను రూప మేర్పడినప్పుడు పదమధ్యాక్షరలోపమును గుర్తించినాడు.

ఇది ఇప్పుడు *Syncope* అనుపేర బరగుచున్నది. వర్ణవ్యత్యయము (*Metathesis*) మూలముగా నేర్పడిన శబ్దముల కుదాహరణముగా 'స్పృశత్' ధాతువునుండి 'స్తోకా'; 'సృజ్' ధాతువునుండి 'రజ్జుః'; కృత్— నుండి 'తర్కుః' (*a knife*) అనువాని నిచ్చినాడు. స్వరభక్తి (*Anaptyxis*) కుదాహరణముగా 'వృ'ధాతువు (*=to cover*) నుండిద్వారః, 'భ్రస్జ' ధాతువు (*=to fry*)నుండి—'భరూజాః' అనున వేర్పడినవి. 'తృచ'శబ్దము త్రి+ఋచ (*=three stanzas*). సమానాక్షరములు సన్నిహితములైనపు డొకదానికి లోపము. దీనినే ఇప్పుడు *Haplology* అంటున్నారు. ప్రాచ్యపాశ్చాత్యదేశము లన్నిటిలో యాస్కుడే మొదటి నిరుక్తకారుడు. ఈ నిరుక్త రచనాసందర్భముననే యీతడు భాషాతత్త్వమును గూర్చి తన ముఖ్యభావములను బ్రకటించినాడు. భాష లోని పదము లన్ని కొన్ని మూలధాతువులనుండి నిష్పన్నములై యుండును. పదముల వ్యుత్పత్త్యర్థమును దెలుపునపు డా శబ్దమునకు, మూలధాతువునకు గల సంబంధము వ్యక్తము కావలెను. మార్పులు గలిగినచో నవి స్వర సూత్రానుగుణములై యుండవలెను. సంజ్ఞారూపకమగు భాషకంటె ధ్వనిరూపమగు భాషకు ప్రయోజకత్వ మెక్కుడు. గ్రీకుతత్త్వవేత్తలకు వారి కాలమునగూడ శబ్దములకు ధాతువు ప్రత్యయములమూలముగా వ్యుత్పత్తి గల్పించుట తెలియదు.

భాష యనున దెట్లు పుట్టినది అను విషయమున గూడ యాస్కునికాలమున విశేషచర్చ జరిగినట్లు తెలియుచున్నది. శబ్దములన్నియు గొన్ని మూలధాతువులనుండి పుట్టిన వను నైరుక్తుల వాదమునకు జెందినవాడు యాస్కాచార్యుడు. గార్గ్యుడు మొదలగువారు దీని నొప్పుకొనలేదు. భాషలో ధ్వన్యనుకరణశబ్దములకు తావులేదను వాదములోనివాడు ఔపమన్యవుడు. అనగా నీకాలమునందలి *'Onomatopoeia'* వాదమునకు ప్రతికక్షి అన్నమాట. ఇటీవల మాక్సుముల్లరు మొదలగువారు దీనికే "*Bow-vow theory*' అని పేర్కొనినారు. '*Bow vow*' వాదమును యాస్కాచార్యు డొప్పుకొనకపోయినను భాషలో 'దుందుభి, కితవ, కృకవాక' మొదలగు, ధ్వన్యనుకరణశబ్దములు లేకపోలేదని అతడు చెప్పినాడు. ఇట్లే యాస్కుని కాలము దేశమున విశేషముగ భాషాసాహిత్యసంచలనము, శబ్ద తత్త్వాన్వేషణపరత్వము కలిగిన కాలముగా గనబడుచున్నది.

ఆయా పదముల కర్థము స్వాభావికమా, సాంకేతికమా యను విషయమునుగూర్చియు విచారణ జరిగినది. దీని నీకాలమున *'Semantics'* అని యందురు. నామవాచకపదములకు వాని గుణములనుబట్టియా, లేదా కర్మనుబట్టియా ఆపేరు వచ్చుట అను విషయములు చర్చింపబడినవి. తక్షకుడు—అనగా వడ్రంగి— అనేకములగు పనులు చేయుచున్నను ఆతని కాపేరు వడ్రంగముపని చేయుటచేతనే వచ్చినది. ఆతడు చేయు పనులన్నిటినిబట్టి చెప్పవలసినచో నాతని కనేకమైన పేర్లు పెట్టవలసియుండును.

శబ్దార్థములకు గల సంబంధము స్వాభావికమా, సాంకేతికమా యనువిషయమును పతంజలి విమర్శించినాడు. శబ్దార్థముల సంబంధము నిత్యమేయైనను, ఈ శబ్దమున కీ యర్థమనునది లోకప్రయుక్తమే అని యాతడు తెలిపినాడు. ఇది తార్కికుల వాదమునకు భిన్నము. ఈశ్వరసంకేతముమూలముననే యీ యర్థబోధ కలుగుచున్నదని వారు చెప్పుదురు. "అస్మాత్పదా దయ మర్థో బోద్ధవ్య ఇతి ఈశ్వరసంకేతశ్శక్తిః—శక్తం పదం" —ఈశ్వరుడే యీశబ్దముల కీయర్థమనినిర్ణయించిపెట్టినాడని వారి మతము. గ్రీసుదేశమునగూడ నీ వాదము బయలుదేరినది. *Cratylus* పదపదార్థసంబంధము స్వాభావికమే యని చెప్పగా, *Hermogenes* అను నాతడు సాంకేతికమని, కాలభేదముచే మారవచ్చునని చెప్పినాడు. కాని సోక్రటీసు నామముల పేర్లు స్వాభావికముగనే వచ్చినవైనను 'సంకేతము'కూడ కొంత లేకపోలేదను భావము కలిగినవాడు.

ఇట్లు ప్రాచీనకాలమున నీ దేశమున భాషాతత్త్వ పరిశీలనము, విచారణ విశేషముగా జరిగియుండెనుగాని, తరువాతికాలమున వ్యాకరణశాస్త్రాభ్యాసము సుశబ్దాపశబ్దపరిజ్ఞానమునకు, శబ్దప్రక్రియనుగూర్చిన వివాదములకు, పూర్వపక్షసిద్ధాంతములకు ప్రధానముగా మూలమగుచు వచ్చినది. కాని భాషాశాస్త్రాభివృద్ధికి దోడ్పడలేదు. పతంజలి చెప్పినట్లుగా వ్యాకరణ శాస్త్రప్రయోజనము "రక్షోహాగమలఘ్వసందేహాః ప్రయోజనం—వేదానాం రక్షార్థమధ్యేయం వ్యాకరణం"—వేదములను వైదికకలాపమును రక్షించుటకే యను దృష్టి ప్రబలి,

తర్కకళాపమునందు, తద్విజ్ఞానప్రచారమునందునే పండితులు నిమగ్నులైయుండిరి. ఇది దేవతల భాష యను భావము ప్రబలుటచే నితర దేశభాషలతో పోల్చి పరిశీలింపవలయునను దృష్టి వారికి కలుగలేదు. కావున నే [illegible] యూరపుఖండమున [illegible] కలుగలేదు.

యూరపుదేశమున ప్రాచీనకాలమున భాషాతత్త్వమును గూర్చి విచారింపసాగినవారు గ్రీసుదేశీయులు. తరువాతి [illegible] వారిని కొంత [illegible] గ్రీకుదేశము [illegible] 'Barbarians' అనాగరికులని [illegible] కలవారగుటచేత, వారి భాషల సఖ్యసంబంధమును [illegible] కాదు. కావున స్వీయ [illegible] భాషాతత్త్వమును [illegible] పరిశీలన [illegible] మార్గమున [illegible] తత్త్వపరిశీలన [illegible] [illegible] వెప్పవచ్చును [illegible] లుటచేలినే [illegible] గాంచిన [illegible] మత [illegible] ప్రతివిదేశీయులతో [illegible] భాషలు [illegible] మాతలిని [illegible] కొల్పలేరు. [illegible] "[illegible] కాదు [illegible]" [illegible] నారాయణ [illegible] మిత్రుడు [illegible] లకు గాని [illegible] గాని [illegible] [illegible] తమ్ము [illegible]

[illegible] కాలములో [illegible] భాష యాశ్వరకల్పితమే యను భావము [illegible]. గ్రీకుభాష ప్రాచీనమైన దగుటచే తక్కినవన్నియు తజ్జన్యములే యని నమ్మెడువారు. క్రీస్తుమతము బహుళముగా వ్యాపించిన తరువాతి హీబ్రూభాషయే మతభాష యగుటచేత దానికే [illegible] భాష యని, దానినుండియే ప్రపంచమున [illegible] పుట్టినవని చెప్పెడివారు. [illegible] భాషాపదములకు [illegible] సామ్యము [illegible] హీబ్రూపదముల [illegible] పుట్టినవని నిరూపించెడివారు. [illegible] పదముల వ్యుత్పత్తిని గట్టించుటకు హీబ్రూభాష [illegible] వ్రాయబడుటచే, [illegible] లలోని యక్షరములను [illegible] చదివి వ్యుత్పత్తులను, పోలికలను సూచించెడివారు. పదముల సామ్యము [illegible] నిరూపించుటకే గాని [illegible] పరిశీలన దృష్టి వారికి కలుగలేదు. [illegible] ప్రత్యయము మొదలగు విభాగమే వారికి తెలియదు. [illegible] వ్యుత్పత్తులగూర్చి [illegible] ఒక వస్తువు [illegible] వ్యుత్పత్తి [illegible] Bellu noth అనగా యుద్ధము [illegible] 'bellus' అనుదాని నుండి [illegible] అందమైనది [illegible] Feodus [illegible], సంధి అని అర్థము. [illegible] 'Fedus' [illegible] వ్యుత్పత్తులను కల్పించిరి. [illegible] 'నిరుక్తాన్వయము' అను [illegible] ఉత్తర భాషలకు [illegible] ప్రాముఖ్య [illegible] నవిశేష [illegible] బాగుగా సభ్య [illegible] దక్ష [illegible] మొదలు [illegible] లేకుండ [illegible] [illegible] తెరిగెను. [illegible] శతాబ్దాంత [illegible] దృణపద్ధతి కను [illegible] బడెను. ఇతరభాషల సఖ్యసంబంధమును [illegible] చేయ [illegible] భాషల [illegible] బడినది. కాని లాటిన్ మొదలగు యూరోపుభాషా పదములకు [illegible] దేవభాష [illegible], స్వర్గమున (paradise) [illegible] భాష యని తలపుడిసదిగుటచే హీబ్రూ భాషాపదములనుండియే వ్యుత్పత్తిని గల్పింప యత్నించుచుండిరి. [illegible] శతాబ్దమున భాషల సంబంధమునుగూర్చిన విచారణ బయలు



చేరినది. అన్ని భాషలలోని సమానార్థకపదములు ప్రోగు చేయబడినవి. లీబ్నిట్స్ (Leibnitz) అను తత్వవేత్త ప్రోత్సాహముమూలముగా, కేథరిన్ ది గ్రేట్, కాథరైన్ రాణియు వారి రాజ్యములోని సుమారు ౨౦౦ భాషలనుగూర్చిన విషయములు సంగ్రహింపబడునట్లు చేసెను. లీబ్నిట్స్ హీబ్రూ భాష తక్కిన భాషలకు మూలమను వాదమును ఖండించెను, యూరపు, ఆసియా దేశములలోని భాషలన్నియు నొక వర్గమునకు చెందినవే యని సూచించినాడు. ఇండోయూరపియన్ భాషా కుటుంబమునకు తొలుత పేర్పరచినవాడు 'అడెలంగ్' అనువాడు. హెర్వాస (Hervas) అనువాడు పదములపట్టికలకంటె భాషలసంబంధము నిర్ణయించుటకు వ్యాకరణమునే ప్రధానముగా గ్రహింపవలయునని సూచించినాడు. ఏమైనను ఈకాలమున యూరపు దేశములలో లాటిన్ వ్యాకరణముల యభ్యాసమునకు ప్రాధాన్యము కలదు. మన దేశమున సంస్కృత భాషకు గలిగిన స్థానమునే యది యాదేశమున నాక్రమించినది. ఇతర భాషలకంతయు—విభక్తులు, క్రియారూపములు మొదలగునవి లాటిన్ వ్యాకరణ సంప్రదాయములననుసరించి చెప్పబడుచుండెను. కోశములలో—ఫ్రెంచి ఇటాలియన్ వారిచే ప్రకటింపబడిన కోశములలో ఉత్తములు, శిష్టులు ప్రయోగించెడు శబ్దములకే స్థానము. ఇట్టి పద్ధతి భాషాతత్వపరిశీలనము విశేషముగా జరిగిన మన దేశమునందే యిప్పటివరకు నశించక యుండగా నాకాలమున యూరపులో నట్లుండుట కాశ్చర్యమేమి? క్రీ. శ. ౧౯వ శతాబ్దితో భాషాశాస్త్రపరిశోధన మను నొక నూతనయుగము ప్రారంభమైనది. ఇంతకాలమునుండి లాటిన్ భాషా వ్యాకరణముల యభ్యాసములవలన గలుగని విశేషప్రయోజనము నూతనముగా గలిగిన సంస్కృతభాషాజ్ఞానమువలన గలిగినది. భాషల వ్యాకరణము నభ్యసించుటయేకాక వాని నిర్మాణక్రమమును పరిశీలించుట, నూతనభాషలతో పోల్చిచూచుట యందలి శబ్దభాషల పరస్పరసంబంధతత్వముల నారయుట, వాని వర్గీకరణము, భాషారూపములను వ్యాకరించుటయేకాక, వాని ప్రాచీనచరిత్ర నన్వేషించి మూలరూపములను గనుగొనుట, భాషలలో కాలగతిని గలుగు మార్పులకు కారణముల నారయుట — మొదలగునవి యీ యుగమునందలి భాషాపరిశీలనమున ప్రధానవిషయములైనవి. శాస్త్రీకపద్ధతి యనునది చరిత్రకే కాక, భాషాపరిణామమువిషయమునగూడ నన్వయింపబడ జొచ్చినది. తక్కినవాని చరిత్రలవలెనే భాషాచరిత్రకూడ నొకటి కలదని గుర్తింపబడినది. దీనికంతకు ఆంగ్లప్రదేశమున ప్రబలిన సంస్కృతభాషాజ్ఞానమే ముఖ్యకారణము మనవచ్చును.

గ్రీకు ప్రదేశీయులకు ఇండుదేశమును గూర్చి అలెగ్జాండరు దండయాత్ర చేసినప్పటినుండియు తెలియును. కాని వారితరదేశములవారిని బార్బరియన్లని, వీరు వారిని మ్లేచ్ఛులని తలచినందువలన ఒకరి భాషయం దొకరికి శ్రద్ధ లేకపోయియుండును. కాని పికనేమాదిశబ్దములు కొన్ని వైదికభాషలోనే చేరకపోలేదు 'పిక' శబ్దము గ్రీకుభాషలోని 'pecus' అనుదానినుండి వచ్చినదే యైనను, నిరుక్తకారులు సంస్కృతధాతువునుండి వ్యుత్పత్తి కల్పింపజూచినారు సంస్కృత వైయాకరణులు. "అపి హింతి కాయతీతి పిక" అని. ఇట్టి వ్యుత్పత్తికల్పనముగూర్చి కుమారిలభట్టు గట్టిగా వాదించినాడు.

తరువాత నింగ్లీషువారు, ఫ్రెంచివారు నీ దేశము నాక్రమించుటకై పోటుసాగినంతవరకు ఈ దేశమును గూర్చి యూరపుదేశీయులకేమియు దెలియదు. లాటిన్, సంస్కృతములకు గల సంబంధమును గూర్చి ఫ్రెంచివారికి తొలుత నొక వృత్తాంతమును బంపినవాడు ఫ్రెంచివాడైన 'కోర్డో' అనువాడు. సంస్కృతభాషయొక్క ప్రాచీనత, గ్రీకులాటిన్లతో దానికి గల సన్నిహితసంబంధము, పదముల విషయమునకేగాక వ్యాకరణవిషయమునను వీనికి గల సామ్యము ఈ మూడుభాషలు నేకమాతృకములే, యను నీ మొదలగు విషయము నాంగ్లేయులకు దెలిపినవాడు సర్ విలియమ్ జోన్సు (౧౭౮౬). ఈతడే కాళిదాసు శాకుంతల గ్రంథముల నాంగ్లములోనికనువదించినవాడు. సంస్కృతమునకు నితరయూరపియన్ భాషలకునుగల సాజాత్యమును తెలుపుటయేగాక, యితరదేశభాషలను గూడ పరిశీలించి ప్రాపంచికభాషలను సంస్కృతభాషావర్గమని, ఇతరభాషావర్గమని విభజించినవాడు 'ష్లెగెల్' అను జర్మనుపండితుడు. ఎక్కడో మారుమూలనున్న హిందూదేశములోని సంస్కృతభాష

కును, యూరపులోని ప్రాచీనభాషలగు గ్రీకు లాటినుల కును సన్నిహితసంబంధము కలదని తెలియుటతోడనే, యూరపుదేశములలోని విశ్వవిద్యాలయములు పెక్కింటిలో సంస్కృతభాషాపరిశీలన, పరిశోధనములకై ప్రత్యేకపండితస్థానము (*Professorships*) లేర్పాటు చేయబడినవి. భిన్నప్రదేశములం దొక్కసారిగా సంస్కృతభాషాపరిశీలనము ప్రారంభింపబడినది.

డెన్మార్కుదేశములో నీ పని బూనినవాడు రాస్కుపండితుడు. బాల్యమునుండియు వ్యాకరణతత్త్వవేత్త. ఐస్లాండిక్ భాష నితరభాషలతో బోల్చి విమర్శించినవాడు. ఒక భాషనుబట్టి దానిని వ్యవహరించిన జాతియొక్క ప్రాచీనచరిత్ర నన్వేషింపవచ్చును. వారి మతము, సాంఘికమర్యాదలు మారినను వారు వ్యవహరించు భాషలోని పదములనుబట్టి వారి పూర్వచరిత్ర గ్రహింపనగును. పదము లొకభాషనుండి మరియొక భాషలోనికి సంక్రమింపవచ్చునుగాని వ్యాకరణ సంప్రదాయము లట్లు రావు. కావున వ్యాకరణపద్ధతియే భాషల సంబంధమును నిర్ణయించుటకు ముఖ్యసాధనము. ఇదిగాక అత్యావశ్యకములగు వస్తువులను దెలుపు శబ్దములు, సర్వనామములు, సంఖ్యావాచకములు—వీనిలో సామ్యము గలిగినచో నాభాష లొక్కకుటుంబమునకు జెందినవే యని నిర్ణయింపవచ్చును. ఈ శబ్దములనుబట్టి యాభాషలలోని ధ్వనులమార్పులను గనిపట్టి స్వరసూత్రములను గల్పింపవచ్చును. ఈ పద్ధతి ననుసరించి యూరపుభాషల సంబంధములను నిర్ణయించి భిన్నశాఖలను విడదీసిచూపినవాడు రాస్కుపండితుడు. ఇండియాదేశమునకు వచ్చి హిందూదేశభాషలనుగూర్చియు, పరిషియన్ - జెండుభాషలను గూర్చియు లక్షణములను దెలిపినాడు. ఈదేశమునందలి 'మలబారిక్' భాషలు — అనగా ఇప్పుడు ద్రావిడభాషలనబడుచున్నవి—సంస్కృతముకంటె భిన్నవర్గమునకు జెందినవని కనిపట్టి ప్రకటించినవారిలో 'రాస్కు' పండితుడే ప్రథముడు.

తరువాత 'జేకబ్ గ్రిమ్' అను జర్మనుపండితుడు జర్మానిక్ భాషలకు చారిత్రకవ్యాకరణమును రచించెను. భాషాశాస్త్రములో చారిత్రకపద్ధతిని ప్రవేశపెట్టినవా డీతడే. ఈతని చారిత్రకపద్ధతిలో తారతమ్యపరీక్షకూడ లేకపోలేదు. ఒక భాషయొక్క భిన్నావస్థలనుగాని, అతిసన్నిహితములగు భాషలలోని రూపములనుగాని పరిపోల్చి వాని సంబంధమును కనిపట్టుట మూలముగా వారి చరిత్ర నన్వేషింపవలయు నని యాతని యభిప్రాయము. సన్నిహితభాషల తారతమ్యపరీక్షయే భాషాచరిత్రము గూడ నగుచున్నది. జర్మానిక్ భాషలలో నిట్టి తారతమ్యపరీక్షమూలముగా నొక ధ్వనిపరివర్తన నీతడు కనిపెట్టెను. ఇతరఇండోయూరపియన్ భాషలలోని ప, త, క అను ధ్వనులు జర్మానిక్ భాషలలో (*f, th, h,*) ఫ, థ, హ-గా మార్పుజెందిన ట్లీతడు నిరూపించెను. సం-పితా. లాటిన్-పేటెర్ శబ్దములు గాథిక్‌లో '*faeotor*' అని మారుటచేతనే తరువాతి ఇంగ్లీషులో '*father*' అనే శబ్ద మేర్పడినది. ఈ ధ్వనిసూత్రము '*Grims law*' అని యాతని పేర బరగినది. ఇట్టి ధ్వనిసూత్రములలో గొన్నిలోపములు తరువాత కనబడినను, ధ్వనిసూత్రములను (*Phonetic laws*) కనుగొనుట యనునది భాషాశాస్త్రాభివృద్ధి మార్గమున నొక క్రొత్త మెట్టుగా గ్రహింపబడినది.

భాషాశాస్త్రప్రవక్తృత్రయములో మూడవవాడుగా గ్రహింపబడినవాడు 'ఫ్రాంజ్ బాప్' (*Franz Bopp.*) అనునాతడుకూడ జర్మను దేశీయుడే. ఈతడు ఇండోయూరపియన్ భాషల కన్నిటికిని మొట్టమొదట సమగ్రవ్యాకరణము వ్రాసినవా డగుటచే నీతని గ్రంథముతోడనే భాషాశాస్త్రము పుట్టినదని జర్మన్ దేశీయులు తలంతురట. ధ్వనిసూత్రముల విషయమంతగా నీతడు పరిశ్రమ చేయలేదుగాని, పదవాక్యనిర్మాణపద్ధతిని నిరూపించుటలో నీతని కభిమాన మెక్కువ. సంస్కృతభాషాసామ్యముచే నీ భాషలలోని విభక్త్యాదివ్యాకరణరూపముల మూలరూపముల నన్వేషించి, గ్రీకు లాటిన్ మొదలగు భాషలు సంస్కృతమునుండి పుట్టినవి కావనియు, దీనితోపాటన్నియుగూడ వేరొకమూలభాషనుండి పుట్టినవనియు, సంస్కృతముమాత్ర మితరసోదరభాషలకంటె మూలభాషాలక్షణములను నిలుపుకొనియున్నదనియు నాతని యభిప్రాయము. సంస్కృతభాషాలక్షణములలో గ్రీకు లాటిన్ భాషాలక్షణములను బట్టి సమన్వయించుకొనవలసినవిగూడ కొన్ని గలవు. ఈ భాషలలోని విభక్తిప్రత్యయము లనబడునవి ప్రత్యేకార్థములు గల స్వతంత్రశబ్దములనుండి యేర్పడినవే యని బాప్ పండితుడు నిశ్చయించెను. భాషల నీతడు మూడువర్గము

ఖుగా జేసెను: (౧) ధాతుసంయోగము—వ్యాకరణము లేని చీనాభాష; (౨) ఏకాక్షరధాతువులు, ధాతుసంయోగము—వ్యాకరణము కలిగి ఇండోయూరపియన్ భాషలు; (3) ద్వ్యక్షరధాతువులు—మూడేసి హల్లులతో గూడిన ధాతువులుగలవి—సెమెటిక్ భాషలు.

జర్మానిక్ భాషలకు 'గ్రిమ్' ధ్వనిసూత్రముల నేర్పరచినట్లే, ఇండోయూరపియన్ భాషల కన్నిటికి నన్వయించు ధ్వనిసూత్రములను పాట్ (*'Pott'*) అను వాతడు ప్రతిపాదించినాడు. భాషల సాజాత్యసంబంధములను నిర్ణయించుటలో నీ సూత్రముల ప్రాముఖ్యము నీతడు నొక్కి చెప్పినాడు. కేవలధ్వనిసాదృశ్యమునుబట్టి సంబంధమును నిర్ణయింపగూడదు. ఇంగ్లీషు *'bad'* శబ్దమునకు పరిషియన్ *'bad'* అనుదానికిని సారూప్యము కలదుగాని సాజాత్యము లేదు. *(cf. Eng. prop— Tel.* ప్రాపు; *mouth*—మూతి; *Gastics*—గొల్లలు *etc.*) పరిషియన్ — *Xva har=Sister*, = *Oestic-o*— ఈ రెంటికి రూపసామ్యము లేకపోయినను, సాజాత్యము కలదు. అది ధ్వనిసూత్రములనుబట్టి నిరూపింపదగియుండును. ఇంక నీతడు ధాతురూపముల పట్టికలను తయారుచేసి పదవ్యుత్పత్తులను దెలుపు ధాతుకోశమును రచించెను.

ష్లైచర్ (*Schleicher*) అనువాతడు స్వరసూత్రముల సహాయముచే ఇండోయూరపియన్ మూలభాషా స్వరూపమును కనిపట్టవలయు నని యత్నించినవారిలో ప్రథముడు. దానినిబట్టి భిన్నభాషలలో గలిగిన మార్పులను, వాని పరస్పరసంబంధమును దెలిసికొనవచ్చునని, ఆయా భాషల చారిత్రక వ్యాకరణరచన కిది తోడ్పడునని యాతని భావము. అట్టి మూలభాషలో నొక కథను వ్రాసి యాతడు చూపెను. ఈ కుటుంబమందలి భాషలకు గల సంబంధమును జూపుచు నొక వంశవృక్షమును గూడ నాతడు సిద్ధముచేసియున్నాడు. ఈమూలరూపము లనునవి యూహాకల్పితములే యని తరువాతి వారీ వాదము నొప్పుకొనలేదు. మూలభాషలోని యచ్చులు, హల్లులు నల్పసంఖ్యాకములే యని, పదనిర్మాణ మొక్క తీరుననే జరిగిన దని, సంస్కృతమందలి వర్ణములే మూలభాషకు చేరువగా నుండునని నాతడు తలచెనుగాని, తరువాతి కాలపు పరిశోధన విషయమును ప్రత్యాఖ్యానముచేసినవి. సంస్కృతమునందలి అచ్చులకంటెను హల్లులకంటెను హెచ్చువర్ణములే మూలభాషలో కల వని, సంధ్యక్షరములలో అఇ, ఎఇ, ఒఇ, ఆఇ, ఏఇ, ఓఇ—అనునవి, హ్రస్వతర 'అ' కారము అజ్గుణమే గలిగిన *l, m, n, r* అను హల్లులు, మూడురకములైన కంఠ్యములు మొదలగునవి ఇండోయూరపియన్ మూలభాషలో నుండె నని వెర్నగర్, బ్రుగ్మన్ మొదలగు పండితుల తరువాతి పరిశోధనలవలన వ్యక్తమైనది.

ష్లైచర్ యొక్క భావముల ననుసరించి ఇండోయూరపియన్ కుటుంబభాషలకు సంబంధించిన పదజాలమును పోగుజేసిపెట్టినవాడు 'ఆగస్టుఫిక్కు' అనువాతడు. ఈ కోశమునందీ భాషలు ఇండో ఐరేనియన్ అని, యూరపియన్ అని రెండు వర్గములుగా జేయబడినవి. మూలరూపములను కనిపట్టుటలో కొన్నిలోపము లున్నను ఇండోయూరపియన్ భాషల కన్నిటికిని సంబంధించిన సజాతీయపదముల కోశమును తయారుచేయుటలో నీతడు ముందంజ వేసె నని చెప్పవచ్చును. ఇప్పటికి ఇండోయూరపియన్ శాఖా భాషల కన్నిటికిని చక్కని వ్యాకరణములు బయలుదేరినవి. లాటిన్ నుండి బయలుదేరిన ౭,౮ శాఖాభాషలకు (*Romance Languages*) పరస్పరసంబంధము, క్రమపరిణామము నిరూపింపబడినది. ఈ పరిశోధనఫలితములను సులభముగ బోధపడునట్లు చేసినవాడు మాక్సుముల్లరు పండితుడు. ఆయన 'భాషాశాస్త్రోపన్యాసములు' సామాన్యులకుగూడ భాషాశాస్త్రమునందభిరుచి కల్పించుటకు దోడ్పడినవి. ఎన్నియో ముద్రణ లందినవట. ధ్వనిపరిణామసూత్రముల ప్రాధాన్యమును గుర్తించి వాని సమన్వయమున గలుగు చిక్కుకు సమాధానముల నారయుట, శబ్దముల వ్యుత్పత్తివిషయమున నూహాగానమున కవకాశము తగ్గించి, వాని పూర్వచరిత్ర నన్వేషించి నిర్ణయించుటలో తగు శ్రద్ధ వహించుట, ప్రాచీనభాషల పరిణామమును గుర్తించు విషయమున నాధునికభాషాపరిశీలనావశ్యకతను గుర్తించుట మొదలగు విషయములందు పరిశ్రమ విశేషముగా సాగ జొచ్చిన దని, బాప్, ష్లైచర్లు ప్రారంభించిన పని నంత సమర్థతతో బ్రుగ్మన్ కొనసాగించి యొక స్థిరరూపము నొందించినా డనియు మాక్సుముల్లర్ పండితుడు ౧౯వ శతాబ్దాంతమున ప్రకటించిన భాషాశాస్త్రగ్రంథముయొక్క ఉపోద్ఘాతములో చెప్పినాడు.

ఈ పనియంతయు — నీ భాషాశాస్త్రవిషయిక జ్ఞానాభివృద్ధి యంతయు నింతవరకు ఇండో యూరోపియన్ భాషా పరిశీలనమునకు సంబంధించినదిగా నేర్పడి నదగుటయేగాక విదేశీయులచే జరిగినదిగానే యున్నది. మనదేశమందలి సంస్కృత [illegible] జ్ఞానమే [illegible] మూలమైనది గాక. తదభివృద్ధి యంతయు మనచే [illegible] కొన్నను ఈ [illegible] భాషాశాస్త్రపద్ధతి ఈ దేశమందలి యితరభాషల పరిశీలనకు [illegible] ఉపయోగింపబడి, మన దేశము కొంతవరకు స్వయంకృషియందు [illegible] యను విషయము ముఖ్యముగా గమనింపవలసి యున్నది.

ఇటీవల జరిగిన భాషాశాస్త్రాభివృద్ధి

హిందూదేశమున నిరువది కాలమున ఇండో యూరోపియన్ కుటుంబభాషలను గూర్చిగాని, ప్రత్యేక సంస్కృతమును గూర్చిగాని భాషాతత్త్వదృష్టితో పరిశీలించినవారు చాల తక్కువ. [illegible] ౧౮ [illegible] సంవత్సరప్రాంతమున మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ సంస్కృతభాషాచార్యులుగను, దేశభాషావిద్యాపర్యవేక్షకులుగ నుండిన ఎస్. శేషగిరిశాస్త్రిలు (M. A.) గారు తెలుగు [illegible] భాషలను గూర్చి పరిశోధన చేసిన వారుగాని, [illegible] వారు గాని [illegible] దేశభాషలను గూర్చిన పరిశీలనము కొంత జరిగినది. ఆధునికము [illegible] ఉత్తరహిందూదేశభాషలను గూర్చి బీమ్సు (Beams) అనునాతడు "తులనాత్మకవ్యాకరణము" (Comparative grammar of the Modern Aryan Languages of India) అనుదానిని రచించినాడు. డాక్టరు హార్నులి అనునాతడు గౌడభాషల కట్టి వ్యాకరణము [illegible] రచించినాడు. ఇక ఈ దేశమునందలి ద్రావిడభాషాకుటుంబమునకు చెందిన భాషలనుగూర్చి బాగు ఇండో యూరోపియన్ భాషలవలె [illegible] యమున పరిశ్రమచేసి వ్రాసిన కీర్తి "ద్రావిడభాషలతులనాత్మక వ్యాకరణము" ను వ్రాసిన [illegible] దక్షిణహిందూదేశమున మిషనరీగా నుండిన డాక్టరు కాల్డ్వెల్ అను నాతడు. ఈ దక్షిణహిందూదేశమునందలి తమిళము, తెలుగు, కన్నడము, మలయాళము, తుళు మొదలగు [illegible] ఉత్తరదేశమునందలి కురుక్, మాల్టో, కుయి, గోండ్, బ్రాహుయి మొదలగువానితోగూడి సంస్కృతాది ఇండో యూరోపియన్ భాషలకంటె భిన్నములు, ప్రత్యేకము [illegible] నొక కుటుంబమునకు చెందిన [illegible] పండితులే తెలిపి నారు. [illegible] వాని నెల్లను 'మలబారిక్' భాషలని [illegible] 'భాషాశాస్త్రమున' [illegible] భాషలను గూర్చి వ్రాయుచు, [illegible] 'తమిలిక్' భాషలని [illegible]. ఈ భాష లకు [illegible] వ్యాకరణము [illegible] ద్రావిడభాష లని [illegible] కాల్డ్వెల్ పండితుడే. [illegible] గ్రంథము [illegible] క్రీ. శ. ౧౮౫౬ [illegible] నే ప్రకటించినాడు. కాని యితడు [illegible] యూరోపియన్ పండితులనుగాని, [illegible] విశేషముగా [illegible] కనిపించదు. కాని [illegible] దక్షిణదేశమున నిండో యూరోపియన్ భాషలను గూర్చి బాప్ పండితుని వ్యాకరణమును గూర్చిగాని, కాల్డ్వెల్ పండితుని దక్షిణ దేశ భాషా [illegible] గూర్చి గాని [illegible] ఉపయోగించి, [illegible] మార్గమున [illegible] ప్రయత్నించినవారిలో [illegible] స్త్రి గారు. [illegible] యన [illegible] సంస్కృతము, ఆరవము, తెలుగు, కన్నడము [illegible] భాషల నభ్యసించినవారగుటచే, మద్రాసు ప్రెసిడెన్సీ కాలేజీ [illegible] విద్య నభ్యసించి పట్టభద్రులగునప్పటికే, భాషాతత్త్వజ్ఞానము [illegible] ప్రబలినది. పిదప [illegible], [illegible], బెంగాలీ, [illegible] భాషల నభ్యసించి, అప్పటి [illegible] 'కాంపరే [illegible] గ్రీకు భాషల జ్ఞాన [illegible] సంపాదించి భాషాతత్త్వపరిశీలన కార్యమున [illegible]. ౧౮౮౪ సం. మున 'Notes on Aryan and Dravidian Philology' అనే గ్రంథ మును ప్రకటించినారు. అప్పటికి ప్రెసిడెన్సీ కాలేజీలో దేశభాషాశాఖకు పర్యవేక్షకులుగ నుండిరి. ద్రావిడభాషలు [illegible] కుటుంబమునకు చెందిన [illegible] తలచిన యప్పటి ద్రావిడభాషాపండితుల యభి ప్రాయమునకు [illegible] ముగా, [illegible] భాషలు ఆర్యభాషా కుటుంబమునకు చెందినవే యని తా నభిప్రాయపడినట్లు వ్యక్తమగుచున్నది, యందలి శబ్దముల కార్యభాషాశబ్దముల తో [illegible], వ్యాకరణపద్ధతుల కార్యభాషావ్యాకరణరీతుల లతో [illegible] సంబంధము కల్పించి దీనినుండి విష్పన్నమైన

వనియే చూపుటకు యత్నించినారు. ఇందు తపబలకముగా తానురచించుచున్న కోశములు, తులనాత్మక వ్యాకరణములే తన భావములను స్థిరీకరింపగల వని యూహించినారు. కాని యివి ప్రకటితములైన ట్లగపడదు. ఆంధ్రశబ్దతత్త్వమునకు సంబంధించిన 'క్రియారూపములు', అర్థానుస్వారతత్త్వము, తమిళశబ్దతత్త్వము అను గ్రంథములు మాత్రమే ప్రకటితములై యున్నవి. ద్రావిడభాషలగు తమిళాంధ్రకన్నడమళయాళములకు గల పరస్పరసంబంధమును, సాజాత్యమును గుర్తించి, యా భాషారూపములను బరస్పరము పోల్చి పరిశీలించుటచే గలుగు విశేషలాభమును, గుణములను ఆయన బాగుగా గమనించి వ్యక్తముచేసినవాడే యయ్యెను. కాని వీని నార్యభాషలతోడను, సంస్కృతముతోడను ముడిపెట్టి రూపనిష్పత్తిని కల్పించుటలో స్వరసూత్రకల్పనము చేయక తన కిచ్చవచ్చిన స్వతంత్రపథమును ద్రొక్క యత్నించినవా డగుటచే, నీతనిమార్గము తరువాతివారి కంత యాదరపాత్ర మగుటగాని, అది యొక శాస్త్రీయపద్ధతిగా నాదరింపబడుటగాని తటస్థింపలేదు. భిన్నదేశీయములైన యనేకభాషలనుగూర్చి చక్కని జ్ఞానము సంపాదించుటేగాక అంతకుపూర్వము నుండి వానిలో విశేషపరిశ్రమ చేసిన పాశ్చాత్యభాషావేత్తల వ్రాతలను, పద్ధతులనుగూడ బాగుగ తెలిసికొనినవాడే యైనను, స్వానుభవమునుబట్టి వారు చూపినదానికంటె భిన్నమైన పద్ధతిని ఈ భాషలకు గల సంబంధమును, శబ్దనిష్పత్తిని, అర్థపరిణామమును, వ్యాకరణవిశేషములను సాధింపవలెనని యత్నించినాడు.

ఇంతకుపూర్వ మీ భాషలలో పరిశ్రమచేసిన బాప్, బెన్ఫీ మొదలగువా రెవరును ఆర్యభాషావర్గములోని శబ్దముల సాదృశ్యసంబంధములను కనిపెట్టలేకనే పోయినారని, కాని తా నవలంబించిన పదవర్గముల విధానమునుబట్టి శబ్దనిష్పత్తిని సులభముగా సాధించవచ్చునని యీయననమ్మకము. ఇక ద్రావిడభాషల విషయములో కాల్డ్వెల్ మొదలగువా రవి 'తురేనియన్' కుటుంబమునకు జెందినవని చెప్పినను, అందలి పదముల కార్యభాషాపదములనుండియే నిష్పత్తి కల్పించి, ఆ భాషల నార్యభాషావర్గములోనికే తీసికొనిరాగలిగితి నని యీయన తలచినాడు.

సంస్కృతము, గ్రీకు, లాటిన్ భాషాపదముల సుసారూప్యమునుబట్టి, అర్థమునుబట్టి కొన్ని వర్గములుగా విభజించి, వానిలో నొకదానినుండి మరియొకటి యెట్లు నిష్పన్నమయ్యెనో చూపినాడు. ఒకటి 'అత్మన్' వర్గము. దీనినుండి స్వ, స్వర్, సుమేరు, మేరు, బాష్ప, నభస్, శ్వస, ఆత్మన్, ధ్మా (*to blow*) ధాతువు—ఇట్టి వింక ననేకములు గ్రీకులాటిన్ శబ్దములేగాక, సెమిటిక్ కుటుంబమునకు జెందిన హీబ్రూ శబ్దములు శబత్, సెలమ్, రబక్, బలగ్—వంటి వనేకములు నిష్పన్నములైనవట. ఇట్లే దీనినుండియే తమి. మేడు, తె. మిట్ట మొదలైనవికూడ నిష్పన్నములైనవట. ఇట్లే కొన్ని వర్గములలో ననేకభాషాశబ్దములను జేర్చి వానికి నిష్పత్తి కల్పించినారు. నామవాచకశబ్దములనుండియే క్రియావాచకములు. ధాతువులు నిష్పన్నములైనవని వీరి వాదము. ఈ "అత్మన్" శబ్దమునుండియే శుభ్, స్వప్, దీప్, గుప్, ముష్ మొదలగు ధాతువులు మప్పదినలుగుదనుక నిష్పన్నములైనవట. ధాతువులనుండి నామములకు నిష్పత్తి కల్పింపదలచుటచేతనే పాణినిధాతువుల పాఠము ౨౦౦౦ వరకు పెరిగిన దని వీరి తాత్పర్యము. ఇక ద్రావిడభాషలలో 'ద్రావిడులు' మొదలగువానిలోని 'డులు' తమి—కల్ అనునవి "అవన్" అనువాని రూపాంతరములే. 'చేతన్' = చేయి + అన్. ఇక్కడ 'య' కారమే తకారముగా మారినది. సరసమ్మొటలుక—సరసమ్ + ఇన్ + అలుక - అని యుండగా ఇన్ ఇట్ అయి, ఉక్ గా మారినదట. చేసితిని: చేయు + ఇన్ + ఇన్ - దిద్దేన్ = దిద్ + ద్ + ఏన్ - వీనియందలి 'ఇత్', 'ద్' అనునవి సంస్కృతమునందలి 'పతితి', 'కృతి' అనువానిలోని ఇతి - తి - ప్రత్యయములే ఇచ్చట చేరినవట. తి - 'ఒరువన్ + ఉ' > ఒర్వడు > ఒవ్వడు > ఒక్కడు. (వకారమునకు కకారాదేశము) తె. 'అవన్' - కి ఇప్రత్యయము చేర్పగా 'అది' అగును. ఈ 'ది' అనునది స్త్రీలింగప్రత్యయము.

ద్రావిడభాషల కార్యభాషలతో గల సంబంధమునుగూర్చి మరియొక విశేషము గలదు. అవి తరువాతి సంస్కృతముతోకంటె వైదికభాషతోనే యెక్కుడు సంబంధము గలవి. శబ్దతత్త్వపరిశీలనము విషయము, మతచరిత్ర వేదాంతములవిషయమున సంస్కృతము, లాటిన్, గ్రీకు, హీబ్రూభాషలు తప్ప తక్కిన

యార్యభాష లన్నిటికంటె ప్రాచీనము లని వారి యభిప్రాయము. ఈ విషయము రెండవభాగమున బాగుగ ప్రతిపాదింపబడు నని వ్రాసినారు. కాని యీ రెండవ భాగము ప్రకటితమైన ట్లగపడదు. ఆర్యద్రావిడభాషల తత్త్వమును గూర్చి శ్రీ శేషగిరిశాస్త్రులవారు ఆ కాలమున చాల పరిశ్రమచేసినవారిలో ముఖ్యులైనను, వీ రవలంబించిన మార్గము సరియైన శాస్త్రీయపద్ధతి కాక పోవుటచే గాబోలు నా కాలపు శాస్త్రజ్ఞుల దృష్టి నాకర్షింపలేదు. కాని వీరి తరువాత వీరిమార్గము ననుసరింప యత్నించి, తెలుగు ఆర్యద్రావిడభాషలలో నతిప్రాచీనమైన దని తలచి, ట్యూటానిక్ భాషావర్గమునకు చెందిన ఆంగ్లో సాక్సన్ మొదలగు భాషలలోని పదములకును, తెలుగుపదములకును గల సామ్యమును జూపుచు నట్టి సామ్యము గల పదముల పట్టికలను తయారుచేసి ప్రకటించినవారు శ్రీ టేకుమళ్ల రాజగోపాలరావుగారు. వీరు మద్రాసు క్రైస్తవ కాలేజీలో నాంధ్రోపన్యాసకులుగ నుండి 'South Indian Research' అను మాసపత్రికకు సంపాదకులుగ నుండి యనేక భాషావిషయకవ్యాసములను ప్రకటించుచుండెడివారు. శ్రీ శేషగిరిశాస్త్రులవారివలెనె వీరును ఆంధ్రముయొక్కయు, ద్రావిడభాషలన్నిటియొక్కయు ప్రాచీనతనుగూర్చి, వాని కార్యభాషలతో గల జాతీయతను గూర్చి నిశ్చయభావము కలవారై, దానిని ప్రతిపాదించు యత్నము లనేకవిధముల సలిపిరి. కాని వీరి ప్రయత్నములును విశేషముగా ఫలించినట్లగపడదు.

పై యిద్దరివలె ద్రావిడభాషలు నవి యార్యభాషాజన్యములే యను వాదమును పురస్కరించుకొని శాస్త్రీయపద్ధతి నాభాషారూపముల నిష్పత్తిక్రమమును నిరూపింప నీవల యత్నించినవారిలో శ్రీ డాక్టరు చిలుకూరి నారాయణరావుగారు ప్రధానులు. వీరు పై వారివలె ద్రావిడభాషలప్రాచీనత నొప్పుకొనరు. ఉత్తరహిందూస్థానమునందలి యాధునిక కార్యభాషలవలెనే యివియు ప్రాకృతాపభ్రంశములనుండి క్రీ. శ. ౮,౧౦ శతాబ్దముల ప్రాంతముననే బయలుదేరిన వని వీరు వాదింతురు.

బీమ్సు, హార్నీలు పండితు లుత్తరహిందూస్థాన భాషలనుగూర్చియు, కాల్డ్వెల్ పండితుడు దక్షిణదేశమందలి ద్రావిడభాషలనుగూర్చియు తారతమ్యపరిశీలనతో గూడిన తమ వ్యాకరణగ్రంథములను ప్రకటించిన తరువాత నీ దేశములో గూడ దేశభాషాతత్త్వపరిశీలనము విషయమై కొంత సంచలనము కలిగినది. ప్రత్యేకభాషలనుగూర్చిన పరిశీలనము, వాని కితరభాషలతో గల సంబంధము, వాని ప్రాచీనత, చరిత్రనుగూర్చిన పరిశోధనము ప్రారంభింపబడినది. ఉత్తరదేశమందలి మరాఠీ భాషకు, బంగాళీభాషకు సునీతికుమారచటర్జీ పండితునిచేతను ఆధునిక భాషాశాస్త్రపద్ధతుల ననుసరించి చారిత్రిక వ్యాకరణములు రచింపబడినవి. దక్షిణదేశమున తమిళ భాషావిషయమున 'పోప్' పండితుడును, కన్నడ భాషావిషయమున కిట్టెల్, రైసు పండితులును, మళయాళమున గుండర్ట్ పండితుడును, తెలుగున బ్రౌన్ దొరగారును విశేషపరిశ్రమ చేసి, ఆయా భాషలకు వ్యాకరణములు, కోశములు, విమర్శగ్రంథములు రచించి ఆయా దేశముల భాషాసాహిత్యముల కొక నూతనోత్తేజమును గలిగించిరి. సంస్కృతభాషాజ్ఞానము కలిగినపిదప యూరపుదేశమున కొనసాగింపబడిన ఇండో యూరపియను భాషాతత్త్వపరిశీలనము మూలముగా బయలుదేరి నిర్ణయింపబడిన భాషాశాస్త్రపద్ధతుల ననుసరించి దేశీయభాషల పుట్టుపూర్వోత్తరములను, వాని సహజలక్షణములను, తత్త్వమునుగూర్చి పరిశీలించుటయే యిప్పుడు మన దేశమున గలిగిన భాషాశాస్త్రాభివృద్ధిమార్గమని మనము గమనింపవలసియున్నది. ఈ సందర్భమున హిందూదేశ మంతటికిని సంబంధించునదిగా చేయబడిన భాషావిషయకమగు మహోద్యమ మొకటి కలదు. అది గ్రియర్సన్ (Sir George Grierson) పండితుని యాధ్వర్యమున కొనసాగింపబడిన (Linguistic Survey of India) హిందూదేశభాషా సమీక్షణ మనునది. ఇది కాశ్మీరము మొదలుకొని కన్యాకుమారివరకు గల మన దేశమునందు వ్యవహారములో నున్న భాషల స్వరూపలక్షణములు, సంబంధబాంధవ్యములు, ప్రాచీనత, చరిత్ర, వర్గీకరణము మొదలగువానినిగూర్చి విపులముగా జర్చించి వ్రాయబడిన ౧౧ పెద్ద సంపుటముల యుద్గ్రంథము. ఇందు ఇండో ఆర్యభాషలు, దార్దిక—లేక పిశాచభాషలు, ఇరేనియను భాషలు, ముండాభాషలు, ద్రావిడభాషలు—ఈ మొదలగు భిన్నవర్గములకు చెందినవై హిందూదేశమున చిరకాలమునుండి వ్యవహరింపబడుచున్న భాషలను గూర్చి సవిమర్శముగ సోదాహరణముగ జర్చింపబడినది.

ద్రావిడభాషావర్గమునకు హిందూదేశమునందలి సంస్కృతాద్యార్యభాషా కుటుంబముతో కంటె పూర్వాసియా భాగమునందలి సిథియన్ — లేదా తురేనియన్ భాషాకుటుంబముతోనే సన్నిహితసంబంధము కల దని నిరూపింపయత్నించిన కాల్డ్వెల్ పండితుని వాదమును ఖండించి, సిథియన్ లేదా తురేనియన్ కుటుంబమనునదే యొక ప్రత్యేకభాషాకుటుంబముగా జెప్పుటకు వీలులే దనియు, నందు చేర్పబడిన భిన్నవర్గముల భాషలకు సజాతీయసంబంధమే కానరా దనియు, నట్టి సందర్భములో నీ ద్రావిడభాషల నా కుటుంబమున జేర్చుట యేమాత్రము యుక్తముకాదు గావున, నీ ద్రావిడభాషల నొక ప్రత్యేకకుటుంబముగ గ్రహించుటయే న్యాయమను నభిప్రాయమును గ్రియర్సన్ పర్యవేక్షణమున ద్రావిడభాషలనుగూర్చిన కొన్ని సంపుటములను సిద్ధము చేసిన 'స్టెన్ కోనో' పండితుడు వ్యక్తము చేసినాడు. అప్పటినుండియు నీ ద్రావిడభాషలకు సంస్కృతప్రాకృతములతో గూడ సంసర్గజమగు సంబంధమే గాని సాజాత్యసంబంధము లేదని, యివి యీ దేశములో బహుశః ఆర్యజను లీ దేశమునకు వచ్చుటకు పూర్వమునుండియు నెలకొనియున్న భాషలే గాని, యిటీవలి ప్రాకృతాపభ్రంశములనుండి విజాతీయభాషాసంసర్గమున నేర్పడి యుండునని తలంపబడుచుండిన ఉత్తర హిందూస్థానభాషలవంటివి కావనియు పలువురు భాషాతత్త్వపరిశోధకులు తెలుపుచున్నారు. తమిళభాషలలో విశేషపరిశ్రమ చేసిన 'పోప్' పండితుడు ఈ భాషలకు సంస్కృతముతోనే సన్నిహితసంబంధ మున్న దని తలచినను, కాల్డ్వెల్ గారి వాదమును ప్రత్యాఖ్యానము చేసి, సిథియన్ భాషాసంబంధమును జూపయత్నించినాడు. తరువాత సిథియన్ సంబంధవాదముకూడ ప్రత్యాఖ్యాతమైనది. కన్నడభాషలలో విశేషపరిశ్రమ చేసిన కిట్టెల్ పండితుడు, మలయాళకోశము రచించిన గండర్టుకూడ తద్భవరూపములను వ్యక్తముచేయుచు, దేశ్యశబ్దజాలమును ప్రత్యేకముగా నెత్తిచూపుటయే కాక, భిన్నభాషలలో గల సజాతీయరూపములతో వానిని బోల్చి మూలధాతుస్వరూపమును గుర్తించు మార్గముల నన్వేషించి వ్యక్తపరచియున్నారు. వారి మార్గము ననుసరించి యీ కన్నడమలయాళభాషాతత్త్వపరిశీలనకు గడగి, కన్నడమలయాళభాషాచరిత్ర నన్వేషింప యత్నించిన దేశీయపండితప్రముఖులగు ఆర్. నరసింహాచార్యులు, యస్. నరసింహయ్యగారలు, ఉల్లూర్ పరమేశ్వరయ్యర్, ఎల్. వి. రామస్వామయ్యర్ మొదలగువారుకూడ నా భాషలు సంస్కృతభాషా సాహాయ్యము నంత పొందినను, తజ్జన్యములుమాత్రము కావనియు, తెలుగుతమిళాదులతో సజాతీయములైన స్వతంత్రభాష లనియే తలచినారు. పోప్ తరువాతి తమిళభాషాపరిశోధకులుగూడ నీ భావమునే యనుసరించుచున్నారు. ఇటీవల నుత్తరహిందూస్థానభాషలలో నొకటియగు బంగాళీభాషయొక్క ఉత్పత్తివికాసములనుగూర్చి యగాధమగు పరిశ్రమను సలిపి, రెండు సంపుటముల యుద్గ్రంథమును రచించిన సునీతికుమారఛటర్జీపండితుడుకూడ వంగదేశమున కార్యభాషాసంసర్గము కలుగుటకు పూర్వ మనార్యజనులు, అనార్యభాషలును నా దేశమున నెలకొనియున్నట్లు నిదర్శనము లగపడుచున్న వనియు, నార్యభాషలను ప్రాకృతాపభ్రంశములలోను, అంతకంటె నెక్కుడు తరువాతి హిందూస్థానభాషలలోను గానవచ్చెడు అనార్యభాషాసంప్రదాయము లనునవి యీ ద్రావిడభాషాలక్షణములతో దగ్గరపోలిక గలవై యుండుటచేత నా దేశ మొకప్పుడు ద్రావిడజనాక్రాంతమై యుండియుండు ననియు, తద్భాషాసంప్రదాయములే యార్యభాషను ప్రాకృతములుగను, తరువాతి వ్యావహారికభాషలుగను మార్చియుండు ననియు, కావుననే ద్రావిడభాషా సంప్రదాయము లనేకము ఈ భాషలలో గానవచ్చు చున్న వనియు దెలిపి, యార్యభాషలలోని ద్రావిడ లక్షణముల పట్టి నొకదాని నిచ్చియున్నాడు. దీనిని బట్టి ద్రావిడభాష లొకప్పు డీదేశమునం దంతటను వ్యాపించియుండిన వని, అవి కొన్ని సహజలక్షణములతో గూడిన స్వతంత్రభాష లని యాతని యభిప్రాయమైనట్లు గ్రంథములవలన దెలియుచున్నది.

ఆంధ్రదేశమున మాత్రము పెక్కురు పండితులు నీ యాంధ్రభాషను గూర్చియు, దీనితోపాటు తక్కిన దక్షిణదేశభాషలనుగూర్చియు భిన్నాభిప్రాయము ప్రబలినది. "జనని సమస్తభాషలకు సంస్కృతభాష యెంతలంబునన్" అను సంస్కృతభాషాభిమానులగు వైయాకరణుల భావమే నిలిచి తెలుగు సంస్కృతప్రాకృతభవమే యను వాదము ప్రబలినది. లాక్షణికులలో మొదటివాడను కేతన "తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును, దానివలన గొంత

గానబడిరో, కొంత తాన గలిగె నంతయు నేకమై, తెనుగుబాసనాగ వినుతి కెక్కె" నని తెనుగు సహజముగ గొంత యున్నదనియే చెప్పినాడు. కాని తరువాతి పరిశోధకు లీ భాషయంతయు ప్రాకృతభవమే యనియు, తక్కిన 'యాధునికార్యభా' షలవలె ప్రత్యేకముగ తెనుగు, దక్షిణదేశభాషలును పైశాచీ ప్రాకృత పరిణామరూపములే యనియు, నివియు పై యార్యభాషలవలెనే క్రీ. శ. ౧౦ వ శతాబ్దినో, లేదా ౭, ౮ శతాబ్దిప్రాంతముననో స్వతంత్రభాషలుగ మారినవిగాని యంతకుపూర్వము వీని స్వరూపమే కానరాదనియు చెప్పి, తెనుగునందలి దేశ్యాదిశబ్దములనే కాక, యందలి ధాతువులను, వ్యాకరణరూపములనుగూడ సంస్కృతప్రాకృతరూపములనుండి నిష్పన్నములైనట్లు నిరూపించుటకు విశేషప్రయత్నము చేసినారు. ఇట్టి వారిలో సిద్ధహస్తులు డాక్టరు చిలుకూరి నారాయణ రావుగారు. వీరి '*Dravidian Philology*' అను గ్రంథ మాంగ్లమున ప్రకటింపబడినది. ఆంధ్రభాషాచరిత్ర మను రెండుసంపుటముల గ్రంథ మాంధ్రవిశ్వవిద్యాలయము వారు ప్రకటించినారు. ఈ యాంధ్రభాషాచరిత్రరచనలోనే ద్రావిడభాష లార్యభాషాజన్యము లను వాదమును వీరు బలపరచినారు.

ప్రాకృతవ్యాకరణములలో కొందరు దాక్షిణాత్య, ద్రావిడి, కాంచీదేశీయ మొదలగునవి దక్షిణదేశభాగమునందు వ్యాపించిన పైశాచీప్రాకృతరూపములని చెప్పియుండుటచేత, దానిని పురస్కరించుకొని వీరీదక్షిణదేశభాషలన్నియు పైశాచీప్రాకృతభవములని తలంచిన ట్లగపడును. పైశాచీప్రాకృతము లనువాని స్వరూపలక్షణములనుగూర్చి విశేషముగా తెలియనే తెలియదు. ద్రావిడభాషా లక్షణములతో బోల్పదగియున్న స్వల్పవిశేషములనుమాత్రమే లాక్షణికులు వాని ప్రత్యేకలక్షణములుగా నుదాహరించియున్నారు. గుణాఢ్యుని రచన పైశాచిలో నుండిన దన్నమాటయే గాని అది యెట్టిదో లోకమునకు దెలియదు. ప్రాకృతభాషాలక్షణము లనేకములను విచారించిచూచినచో నవి విజాతీయ భాషాసంప్రదాయములవారు సంస్కృతభాషను నేర్చుకొనుసందర్భమున నా శబ్దములను స్వీయసంప్రదాయానుగుణముగా పలుకుచుండుటవలన గలిగిన మార్పుల మూలముగా నేర్పడిన వికారములే యని వ్యక్తముకాకపోదు. కావున నార్యభాషలు ప్రాకృతములుగా మారుటకు ముఖ్యకారణము వానిపై గలిగిన విజాతీయభాషాసంప్రదాయప్రాభవము (*influence*) అనకతప్పదు. ఆర్యు లీదేశమునకు వచ్చునప్పటి కీదేశము నిర్జనారణ్యము కాదు. ద్రావిడభాషలు మాట్లాడినవారు, కోలులు మొదలగువారు, నీయార్యులచే దస్యులని, వ్రాత్యులని, మ్లేచ్ఛులని పిలువబడినవారెందరెందరో కలరు గదా. వారిని వీరణగద్రొక్కి సంఘములో జేర్చికొనినను, చేర్చుకొనకపోయినను వీరి భాషను వారు నేర్చుకొనవలసినదైనను, వారి యుచ్చారణసంప్రదాయముల ననుసరించి యార్యభాష మారిపోక తప్పదు. క్రొత్తభాష లేర్పడకమానవు. "ఈ పిశాచజాతులవారు అంతకుపూర్వ మిచటనుండిన జాతులతో సఖ్యము నెఱపి వారిని తమలో గలుపుకొనుచుండిన కాలముననే" (ఆతరువాతనే) ఆర్యు లిందు ప్రవేశింపజొచ్చిరి- (సం. *I*—౫౫ పేజీ) అని పిశాచజాతులవారు, అంతకుపూర్వ ముండిన జనులు వారిభాషలతో నీ దేశములో నార్యులు ప్రవేశించుటకు బూర్వమే యున్నారని శ్రీ నారాయణరావుగారే చెప్పుచున్నారు. వేదముల కాలమునుండియు నీ యాదిమజను లార్యభాషను నేర్చుకొని భాషించుసందర్భమున నా భాష వీరి యుచ్చారణసంప్రదాయముల ప్రభావముచే, దేశభేదమునుబట్టి భిన్నవిధములగు ప్రాకృతములుగా మారిన దనుటకు సంశయ మేమి ? ఈయాదిమఅనార్యజనులలో ద్రావిడ భాషలను మాట్లాడిన జనులుకూడ నుండవచ్చునని యొప్పుకొన్నప్పుడును, ప్రాకృతభాషలలో గానవచ్చెడి యనార్యభాషాసంప్రదాయము లనబడునవి ద్రావిడభాషాప్రసిద్ధములుగనే కనబడుచున్నప్పుడును, ఆ ప్రాకృతములయొక్కయు, తరువాతి యార్య భాషలయొక్కయు ప్రాదుర్భావమునకు ద్రావిడభాషా సంప్రదాయప్రాభవమే కారణమని చెప్పుటకు వెనుదీయవలసిన పనియేమి ? సునీతికుమారఛటర్జీ పండితుడు తాను రచించిన బంగాలీభాషాచరిత్రలో నాధునికార్య భాషలపై ద్రావిడభాషాసంప్రదాయప్రాబల్యమును నిరూపింపగల పట్టులను ప్రత్యేకించి చూపినాడు. వాని నన్నిటిని ఆంధ్రభాషాచరిత్రకారు లనువదించి తన గ్రంథములో (I-౬౬ పేజీ) తెలుపుచు "ద్రావిడ భాషలు ప్రాకృతములు కావనుకొనుటచే, నార్య భాషలు వే రనియు, ద్రావిడభాషల ప్రోద్బలమువలన నార్యభాషలు ప్రాకృతములుగాను, నేటి యార్య

భాషలుగాను బరిణమించిన వనియు చెప్పుట సంభవించినది" అని ఘటర్జీ పండితు నెత్తిపొడిచినారు. వీరి గ్రంథము తెలుగులో రచింపబడుటచే ఘటర్జీగారికి తెలియలేదుగాని—ఇది తెలిసి యున్నట్లయినే— "అయ్యా, నేను ద్రావిడభాషలు ప్రాకృతములు కావనుకొన్న మాట నిజమే. కావుననే వాని ప్రభావమువలన నివి బయలుదేరిన వని చెప్పినాను. మీరును ద్రావిడభాషలు ప్రాకృతజన్యము లని, యేవిధముగానైన చూపవలె నని యనుకొనుటచేతనే గదా వానికి సూటిగా సమాధానము చెప్పకుదరక, ఈ పరిణామము సహజముగనే కలిగియుండవచ్చునని, లేదా ఇతర భాషల ప్రోద్బలము (ఒక్క ద్రావిడ భాషలుమాత్రము కాక ఇతరఅనార్యభాషలట!) చేతనైనను కలిగియుండవచ్చుననియు, ఇంక నేమేమో చెప్పి ద్రావిడభాషలు ఆధునికార్యభాషలవలెనే క్రీ. శ. ౧౦ వ శతాబ్దికివలనే యేర్పడినవని చెప్పవలసిన స్థితి యేర్పడినది" అని వారు బదులు చెప్పియుండెవారేగదా. ప్రాకృతములలో గనబడు ద్రావిడభాషాసంప్రదాయము లనబడునవి ఇతర భాషాప్రోద్బలమువలన గలిగినచో వానిని ద్రావిడ సంప్రదాయము లనవలసిన పని యేమి? ఇవి యేయితర భాషలలో గనబడుచున్నవి? ఈ ప్రశ్న రాకుండ చేయుటకే ప్రాచీనప్రాకృతముల కాలమున ద్రావిడ భాషలు నేటిరూపమున నున్నవని చూపింపవలె నని వారడుగుచున్నారు. ప్రాచీనప్రాకృతముల కాలమున ద్రావిడభాషలుమాత్రము ప్రాచీనరూపముననే యుండును గాని నేటిరూపమున నెట్లుండగలవు? అనార్య సంప్రదాయము లనబడునవి మాత్ర మాకాలపు ద్రావిడ భాషలలోగూడ నిప్పుడువలెనే యుండకపోవు. అప్పుడు లేనివి యాభాషలలో నిప్పుడు కారణము లేకయే రావుగదా. ఆకాలములోను వీనిలో నున్న యనార్య సంప్రదాయములే, వేదభాషలోగాని, సంస్కృతములోగాని కనబడక సామాన్యజనులు వ్యవహరించు నార్యప్రాకృతములలో మాత్రమే కనబడుటచేత, అనార్యజనసంపర్కము గలిగిన వీరి భాషలో నవి సంక్రమించియుండు నని తలచుట కవకాశము కలిగినది. అసలు ప్రాచీన ప్రాకృతముల రూపమే యెట్టిదో నిర్ణయింప సుసాధ్యము కానప్పుడు ఆకాలపు ద్రావిడభాషలిట్లుండెనని చూపవలసిన పని యేమి? చూపుటకు నిదర్శనము లెట్లు వచ్చును? వాస్తవముగా పైశాచీ ప్రాకృతస్వరూప మెట్లుండెనో ఎవరికి తెలుసును? ఏవో నాలుగైదు వాక్యములనుబట్టి తరువాతి వైయాకరణులు చెప్పిన లక్షణపు ముక్కలుతప్ప. ద్రావిడ, దాక్షిణాత్య, కాంచిదేశీయ మొదలగువానిని జేర్చినవారు కేవలము అర్వాచీనప్రాకృతభాషావైయాకరణులుగాని ప్రాచీను లెవ్వరును గారు. వీరి కాలమునకు 'జనని సమస్తభాషలకు సంస్కృత'మను భావము స్థిరపడినది. ప్రాకృతవైయాకరణులు ద్రావిడి పైశాచీ ప్రాకృతవికార మన్నారు గనుక, దానినిబట్టి వీరును ద్రావిడభాషలన్నియు పైశాచీపరిణామరూపములే యని నిరూపింప యత్నించినట్లున్నారు.

ఆధునికార్యభాషలనియు ౧౧ వ శతాబ్దికివెనుక బయలుదేరిన వే. వీనిలో ప్రాకృతములలోకంటె ద్రావిడ సంప్రదాయచిహ్నములు విశేషముగా గనబడుచున్నవి. ద్రావిడభాషలలోవలెనే వీనిలోను నీ విజాతీయసంప్రదాయములు బయలుదేరిన వని గదా వీరి భావము. కావున ద్రావిడభాషలనుగూడ ౧౦ వ శతాబ్ది ప్రాంతమునకే తీసికొని రావలసివచ్చినది. ఇవి యంతకుపూర్వ ముండెనని చెప్పుటకు తగిన నిదర్శనములు లేవని భావించిరి. అయినను "తమిళములో ౫, లేక ౬ వ శతాబ్ది నుండి గ్రంథములు కాన్పించుచున్నవి. తమిళము తరువాత లిఖితమైనది కన్నడము. ౭ వ శతాబ్దము. తరువాత లిఖితమైనది తెనుగు ౯ వ శతాబ్దము." అని వారే చెప్పియున్నారు. క్రీ. శ. ౫వ శతాబ్దమువరకు భారత దేశమున ప్రాకృతభాషలు ప్రచారమం దుండినవి. నాటినుండి ౬, ౭ శతాబ్దములవరకు దక్షిణదేశమున ప్రచారమందుండిన భాషల స్వరూప మెట్లుండెనో తెలిసికొనుట కాధారమే లేదట! (౬౦ పేజీ సం) కావున ద్రావిడభాషలకాలమున ప్రాకృతభాషలు, నేటి యార్యభాషలును గలిగిన వనుట సమంజసము కాదని వారి వాదము.

౬ వ శతాబ్దికిపూర్వమునందలి యాంధ్రదేశమును పాలించిన రాజుల ప్రాకృతసంస్కృతశాసనములలోని తెలుగుదేశపు గ్రామనామములలో ద్రావిడభాషాసహజములగు శకటరేఫ 'ఱ' కారములు కనబడుచున్నవే— ఇంకను అనేక దేశీయశబ్దములు కనబడుచున్నవే—ఇవి యాదేశమున సంస్కృతప్రాకృతములకంటె భిన్నమైన భాష యుండుటను సూచింపవా?

తమిళములో క్రీ. శ. ౫, ౬ శతాబ్దములనాటికే గ్రంథములే కాన్పించుచున్నవన్నప్పుడు, ఆ శతాబ్దములలోనే కాని, అంతకు పూర్వమునగాని యీ భాషలు ప్రచారములో నుండెననుట యసమంజసముగునా? ఉత్తర దేశమున ౫వ శతాబ్దమువరకు ప్రాకృతము ప్రచారమునందుండినంతమాత్రమున ౫, ౬ శతాబ్దములనాటికే తమిళ భాషలో గ్రంథములు బయలుదేరినట్లు తెలియుచుండగా, ౬, ౮ శతాబ్దముల నీ దక్షిణదేశమున ప్రచారములో నుండిన భాషాస్వరూప మెట్లుండెనో తెలిసికొనుటకు ఆధారములు లేకపోవుటేమి? ఆయా కాలముల యందలి గ్రంథములు అప్పటి ప్రచారములోనున్న భాషాస్వరూపమును తెలుపలేవా? కన్నడము ౮ వ శతాబ్ది వరకును, తెలుగు ౯ వ శతాబ్దివరకును లిఖితము కాలేదని ప్రాచీనశాసనపరిశోధకులగు వీరే అట్లుండే, కేవలస్వీయవాదసమర్థనార్థమే అని అనుకోకతప్పదు గదా! ఈ భాషలలో ౬, ౮ శతాబ్దములవరకు శాసనములు కనబడలేదు గనుక, శాసననిదర్శనములేదు గనుక, భాషలుకూడ నా కాలమున లేవనియే వీరు మరొక చోట ప్రతిపాదించిరి. ఒకభాషలో రచింపబడిన శాసనములు లేనిచో నా భాషయే లేదనగలమా? ౫, ౬ శతాబ్దములనాటికి గల తమిళ గ్రంథము లంతకుపూర్వమా భాష కలదని చూపలేవా? 'తిరునాథకుణ్ణు' తమిళ శాసనము, కన్నడమున 'హల్మిడి' శాసనము, తెనుగున చిక్కుళ్ళశాసనములోని 'విజయరాజ్యసంవత్సరంబుళ్' అను పదము ఆయా భాషలు ౪, ౫, ౬ శతాబ్దములలో గలవని చూపగలవన్నచో—నవి దొంగ (*Spurious*) శాసనము లందురుగాబోలు. క్రీస్తుశకారంభమునను, పూర్వమునను ప్రాకృతశాసనములుమాత్రమే కనబడినంతమాత్రమున ద్రావిడభాషలు వ్యవహారముననే లేవనుట, సింహళదేశభాషలన్నియు ప్రాకృతజన్యములను తమవాదమును సమర్థించుకొనుటకే గాని వేరుగాదనుట నిర్వివాదము.

ఇక నీ వాదసమర్థనార్థమే యీ ద్రావిడభాషా ధాతువుల శబ్దజాలమును, వ్యాకరణరూపములను ప్రాకృతజన్యములని నిరూపింప యత్నించిరి. ఈ యత్నములో తెలుగురూపములను మాత్రమే ప్రధానముగా గ్రహించిరిగాని - ఇతర ద్రావిడభాషారూపములతో బోల్చి మూలరూపముల నన్వేషింపలేదు. వీలునుబట్టి మాత్రమే యితర భాషారూపములను గ్రహించిరి. ఉన్న ఆధారము శబ్దరత్నాకరము. దానినే వీరు కందలకు గాలించి ౨౫౦-౩౦౦ మించని దేశ్యధాతువులను గ్రహించిరి. వాని యంత్యములనుబట్టి కు, గు, చు, జు, టు, డు, తువర్గము లంత్యములుగలవిగా విభాగించిరి. సంస్కృతధాతుపాఠ మతివిపులమైనది. ఒక్కొక్క ధాతువనేకరూపముల గనబడును. ఒక్క గత్యర్థమున ఉఖ, ఊఖ, నఖ, రఖి, మఖ, మఖి......ఈ రీతిగా నుండును. ఈ ధాతువుల తుదను తెలుగుధాతువులలోని కు, గు, టు, డు ఇత్యాదివర్ణములను నిష్పత్తిచేయుటకు వీలైన మరియొక ధాతువునో, ప్రత్యయమునో, లేదా మొదట ఉపసర్గనో చేర్చి, సామ్యము కనబడునటుల వీరవలంబించిన పద్ధతి. సూచ + కృ > మూచకు; కృశ + కృ = కొంకు; ఘృత + కృ = ...దకు; ఏక + కృ > ఎక్కు; నగ్న + ఇష్య = నచ్చు; పక్వ = పండు; విస్తృత = విళ్ళు; నివృత = క్రుళ్ళు. పాణినీయధాతుకోశములోని ధాతువులు సరాసరిగా తెలుగులోనికి వచ్చినవి చాల గలవట! - అగ్ - తె. అగు, అల్ - అల, ఏల్ - ఏలు, కొల్ - కొలుచు, పుష్ప - పువ్వు, కృ - కొను ఇత్యాదులు. (*Mouth* - మూతి, *Prop* - ప్రాపు, *eaten* - తినెను మొదలగువానినిబట్టి తెలుగు ఇంగ్లీషునుండి వచ్చిన దన్నవారును గలరు.)

ఇక ద్రావిడభాషలలోని ప్రత్యేకవర్ణములన బడు ఱ, ఴ, ళ లను గూర్చి ఉత్తరహిందూస్థానభాషలలోగూడ, అనగా ౧౧ వ శతాబ్దినుండి ప్రాంతలోనికి వచ్చినవానిలోగూడ నీ వర్ణములు లేకపోలేదు. ఇది సంస్కృతప్రాకృతములలో లేకపోయినను, క్రీ. శ. ౬ వ శతాబ్దినుండియు శాసనములలో ననేకదేశ్యశబ్దములలో గానవచ్చుచుండినను, నీ శబ్దములలో నీ వర్ణము సంస్కృతశబ్దములనుండి పుట్టిన దనియే నమ్మవలెనట. దీనికి కారణముగా ౧౩ వ శతాబ్ది శబ్దమణిదర్పణకారుడు 'ఘటికా' 'కుక్కుట' మొదలగు శబ్దముల నుండి కన్నడమున గళిగె, కోళి మొదలగు శబ్దము లేర్పడినవని చెప్పుటచేతనేయని వారు గ్రహింతురు. ఇవి సంస్కృతశబ్దముల నుచ్చరింపలేని ద్రావిడజనులు తమ కలవాటైన 'ళ'ను జేర్చి పలికిరేమో అన్నచో "ద్రావిడులు భారతవర్షమంతయు వ్యాపించియుండిరని (శాసన) ప్రమాణము చిక్కువరకు" (సం. I-౨౩౮

పేజీ)మాటాడకూడదట. 'ఱ' ౧౧ శతాబ్దికే తెలుగులో నంతరించినది. ఆ ఇప్పటికి నిలిచియున్నదే. "ద్రావిడ భాషలం దిది అనాదినుండియు ప్రత్యేకచిహ్నముతో గాన్పించుచున్న"దట (సం. I–౨౬౯). ద్రావిడ భాషలు ప్రాకృతభాషావికారములైనచో నీ శకటరేఫ మార్యభాషాశబ్దములతో సంబంధము కలిగియుండ (డితీర)వలెనట." వికారము లనియే వారు నిశ్చయించినారుగాన, సంబంధము కనబడకతీరునా? కాడము నుండి కఱ్ఱ, పృష్ఠ–పిఱ్ఱ, అగ్వాఱ—ఏఱు, ఆరుపా—తమి–ఏఱు, తె–ఎకుఱ్ఱ. ఇట్లే శకటరేఫము సంస్కృతమునుండి తెలుగునకు వచ్చినది.

ఇక 'సంధి' విషయమున "సంస్కృతమం దనేక విధములుగా నుండిన సంధివిధాన మంతయు ప్రాకృతము లందే (౧) అచ్చులు ప్రత్యేకముగా నిలిచి వాని నడుమ నొక యాగమాక్షరము చేరుట, (౨) పరరూప సంధి గలుగుట—అను రెండు విధానములు మాత్రమే నిలిచిన"వట. సంస్కృతమునుండియే వచ్చిన యీ సంధిలో ఇంత మార్పు గలుగుటకు గారణ మేమో? అది సహజమనియే నారాయణరావుగారి వాదము. కాని ఈ సహజధోరణి ద్రావిడభాషలలోని ధోరణినే యనుస రించుటకు కారణమేమో? విషయమును తిరుగ వేయుటయే సమాధానము. "ద్రావిడభాషలలోని సంధికూడ నార్యభాషాసంప్రదాయానుసారముగనే కాని వేఱు కాదు" (I. ౩౩౩) అని వారి సమాధానము. సంధివిషయమున తమిళమలయాళములలోని విధానిని చెప్పినారు. కాని ఆచ్ఛికశబ్దజాలము, ధాతువులు విషయమున నితరభాషారూపములతో బోల్చలేదు. పోల్చి చూపవలసినది లేకయే, 'మూలధాతువుల ప్రాకృతత్వమును గూర్చి యిదివరకే వివరింపబడిన'దని తృప్తిపొందినారు. ఈ తెలుగు ధాతురూపములే సర్వద్రావిడభాషామూలరూపము లని కూడ వారు తలచిరి కాబోలును.

సంధిలక్షణమునుగూర్చివలెనే సమాసలక్షణమును గూర్చియు సంస్కృతవ్యాకరణమునకు సంబంధించిన దంతయు తెలిపి సంస్కృతసమాసవిధానము తెనుగునకు "కొంతవరకు మాత్రమే పోసగు"ననియు వ్యక్తము చేసినారు. కాని యిందలి ఆ విశేషలక్షణములైనను ఆర్యభాషలనుండి వచ్చినవేనా యను విషయమును బరిశీలింపలేదు.

సంస్కృతమున లింగము శబ్దగతము. శబ్దముల యంతములనుబట్టి చూచినచో అనియతస్థితి కనబడవచ్చు. "ప్రాకృతమున లింగవిషయమున వ్యత్యయము గలిగినది. ద్వివచనము లోపించినది. విభక్తిప్రత్యయములు సమసిపోయినవి" (సం. II ౧౩౨). ఆధునికార్యభాషలలో నిదివరకే యస్తవ్యస్తమయిన శాబ్దికలింగము మరింత వ్యత్యయమంది విశేషణమునుబట్టి జాతిని బట్టి లింగ మేర్పడ వచ్చినది. అట్టి భాషలలో నీ విధానము చాలవరకు ద్రావిడభాషామార్గము ననుసరించినది (II–౧౩౪). ఈ ద్రావిడభాషలు ప్రాకృతజన్యములే యని చూపుటయేగదా వీరి ప్రయత్నమంతా. ఆధునికార్యభాషలతోపాటు ఇవియు ప్రాకృతములనుండి పుట్టినవే. అట్టి సందర్భములో జాతినిబట్టి లింగ మేర్పడుట యీ ద్రావిడభాషలకుమాత్ర మెట్లు వచ్చును? వీనితో సజాతీయములే యని చెప్పబడుచున్న యితరార్యభాషలు "ద్రావిడభాషామార్గము ననుసరించుట" యెట్లు పొసగును? ద్రావిడవిశిష్టలక్షణము లనబడున వన్నియు ప్రాకృతములనుండి వచ్చినవనియే కదా వీరి వాదము. సంస్కృతముననే జాతి, లింగము కల వని తిరువాతి చెప్పినారు. అప్పుడు కోల్ భాషల సంపర్కమువలన నీమార్పు రావచ్చు నను ఘటర్జీగారి వాదముతోనే పని లేదు. కాని పైని ఆర్యభాష లీ లింగవిషయమున ద్రావిడభాషామార్గము ననుసరించిన వని తామే చెప్పుచు "ద్రావిడభాషాసంపర్కము మూలముననే కలిగిన దని ఘటర్జీగారు తెలిపిరి. కాని యీ విషయమున వారి భావనాశక్తియే మూలము" అని నారాయణరావుగారు చెప్పుదురు. తాము పైని చెప్పిన విషయమే ఘటర్జీగారన్నపుడు అది వారి భావనాశక్తిమూలమైనదట! "ఆనాటి ద్రావిడభాష లనగా నేవో? వాని స్వరూప మెట్టిదో?" సమాధానము ఘటర్జీగారు చెప్పవలెనట (II–౧౫౯) ఇతరార్యభాషలు ద్రావిడభాషాలక్షణమునే యెందు కనుసరించినవి? ప్రాచీన ప్రాకృతమున లింగ మస్తవ్యస్తమగుటకు గారణ మేమి? క్రీ. శ. ౫,౬ శతాబ్దములనాడు గ్రంథస్థములై యున్నవని తామే చెప్పిన ద్రావిడభాషలు అంతకుపూర్వము ప్రాకృతములనాడు లేవా?

వచనమువిషయమై కాల్డ్వెల్ చూపిన ద్రావిడార్యభాషలకుగల భేద మొక్క తమిళముననే వర్తించు

నట (II-౧౬౪). అన్ని విషయములలోను గూడ నీ భాషలకు గల సామ్యభేదములు చూచి, మూలలక్షణములను కనిపెట్టవలసియుండునుగదా. తెలుగునగూడ నట్టి వాడుక లేకపో లేదని వారే అన్నారు. కాల్డ్వెల్ చూపిన తక్కిన భేదములను వీరు కాదనలేకపోయిరి. విభక్తివచనముల కొరకే ప్రత్యయ మార్యభాషలలో నుండుట కాదందురా? అట్టివి ద్రావిడభాషలలో గల వందురా? విభక్తివిధానమే విభిన్నము. క్రియావిభక్తి పద్ధతియు నట్టిదే.

"సంఖ్యావాచకపదములకు ప్రాకృతములందుగాని, ఇతరార్యభాషలయందుగాని పోలికలు చిక్కుట లేదట" (II-౧౮౦). యూరపియన్ భాషలలోగూడ సామ్యము కనబడుటలేదు. కావున దీనికి గారణ మక్కడలే దైయుండును. దీనికి మూలమై పైశాచీ భాష ప్రచారమునుండి తొలగియుండవలయు ననుట. లేదా ఏ ఐరేనియన్ భాషాపదములతోనో ముడిపెట్ట వలయు నన్నచో నీ భాషలలోని పదముల రూపములను పోల్చిచూపవలసి యుండును. 'ఒక' ఏకశబ్దభవమే కావచ్చును. కాదనుటకు కాల్డ్వెల్ అనవసరముగా బాధపడినాడు. రెండు = రొండు. ఇది రొంగు > ద్వంద్వమునుండి వచ్చినది. మూడు, నాలుగుశబ్దములకు మూలము లేమియు కనబడలేదనిమాత్రము నిశ్చయించినారు. ఏను, అయిదు మొదలగు ద్రావిడరూపముల కన్నిటికి 'పంచన్' అనునదే మూలము. 'షట్' - ప్రాచీన ప్రాకృతములందే 'హర్ - హాస్' లుగ మారి "ఐరేనియన్ భాషలకు సంబంధించిన పైశాచీభాషలద్వారా ద్రావిడభాషలయందు మొదటినుండియు నెలకొని యున్నదని చెప్పవచ్చునట (II-౧౧౧). ఐరేనియన్ భాషలకు సంబంధించి యిదివర కెప్పుడో బహుశః అంతరించిపోయియుండిన, పైశాచీ భాషలలోనే తక్కిన ద్రావిడభాషాలక్షణము లనుకొను మన్న వన్నియు కూడ మొదటినుండియు, క్రీస్తుశకము మొదటినుండియు నుండిన వని ఏల తలంపగూడదు? అంతరించి పోయిన యీ భాషలతోపాటు ద్రావిడభాషలు నాకాలముననే యుండియుండును.


విశేషణములు విశేష్యముల లింగ, విభక్తి, వచనములనుబట్టి మారుచుండుట సంస్కృతములో నుండుటచే కాల్డ్వెల్లీ భాషలకు సంబంధము లేదన్నాడు. సంస్కృతములో నా మార్పు విధియేయైనను దానికి సంబంధించిన యనేకార్యభాషలలో ద్రావిడభాషల యందువలెనే అట్లు మారనక్కరలేదట. కావున నా యార్యభాషలవలెనే ద్రావిడభాషలును సంస్కృతాదిభాషాజన్యములు కావలె నని వీరి భావము. ఈ భాషలను సమర్థించుకొనుటకు తెలుగులో తత్సమ విశేషణముల లింగము మారుచున్నదని తెలుపుట. భాషయొక్క సహజలక్షణమును గుర్తించుటకు ఇతర భాషలనుండి యెరువు తెచ్చుకొనిన సామ్యములనా పరిశీలించుట!

ఉదా: సుగుణాభిరాముడు రాముడు, భక్తవత్సల సీత కాపాడుగాత. ఇవి తత్సమభాషలో నుదాహరించుట. "ఇట్టి వనేకములు సంస్కృతభాషా వ్యాకరణముల ప్రభావముచే నీభాషలోనికి వచ్చినవి కలవు. వానినిబట్టియా యీ భాషాసహజలక్షణములను కనిపెట్టుట? శ. ర. లోని తత్సమశబ్దజాలమును బట్టియే యీ భాష సంస్కృతజన్యమని చెప్పదలచిన నట్లే యుండును. తిరిగి యాభావమును సంస్కృతము నందుకంటె భిన్నముగ నెలుపును ప్రాకృతభాషలందే బయలుదేరినదట. కావున తెలుగునకు, సంస్కృతము నకు సంబంధము లేదని చెప్పగూడదట ప్రాకృతముల ద్వారా సంబంధమట. క్రియల నిర్మాణవిషయమునగూడ నాగుని కార్యభాషలకును ద్రావిడభాషలకు నెంతో సామ్యము కలదట. కాని యీ నాయల నార్యభాషలు ద్రావిడభాషలనుండి యెరువు తెచ్చుకొన్న వందురు. వారి రెండుపక్షములకు గల భేదములనుగూర్చియే యెక్కువగ నూరి చెప్పవలెనుగదా" అని వారి వాదము. సంస్కృతము నుండి వచ్చిన భాషలగుటచే సంస్కృతభాషా సంప్రదాయము లనేకములు వీనిలో సంక్రమించి యుండుట సహజము. ఆ నిలిచియున్న సంస్కృతసంప్రదాయములు ద్రావిడభాషాసంప్రదాయములకు భిన్నములు కాకమానవు. ద్రావిడభాషా సంపర్కప్రభావముచేత ననార్యసంప్రదాయములు మరికొన్ని వానిలో జేరినవు అవి ద్రావిడభాషలతో బోలికను కల్పింపక మానవు. కావున నీ భేదము సృష్టిభేదమునుబట్టి యేర్పడినదిగా గనబడకపోదు. 'సరళసృష్టి' యనున దేది యను నదే విచార్యము.

ఈ దేశములోగాని, యితరదేశములోగాని భాషా తత్త్వజ్ఞులగువా రనేకు లీ ద్రావిడభాష లార్యభాషా

జన్యము లను వాదమును బలపరచువారుగా గనబడరు. పలువురు ద్రావిడభాషావిశేషలక్షణములను గూర్చియు, నందలి ధ్వనిసంప్రదాయములను, ధ్వనిపరిణామరీతులను గూర్చియు, నీ కుటుంబమునందలి ప్రత్యేకభాషల ప్రాచీనచరిత్రాన్వేషణము, ఆధునికమాండలికభాషలలోనిపరిణామవిశేషపరిశీలనను మొదలగువానినిగూర్చియే విశేషపరిశ్రమ చేయుచున్నారు. ద్రావిడభాషలలోని ధ్వనిపరిణామరీతులను గూర్చి "*London School of Oriental Studies*" అను సంస్థలోని బరోస్, ఆల్ఫ్రెడ్ మాస్టరు, టర్నర్ మొదలగువారు కడు శ్రద్ధతో పనిచేయుచున్నారు. ఫ్రాన్సుదేశమునగూడ ***Jules Bloch*** పండితుడు ద్రావిడభాషానిర్మాణలక్షణములను గూర్చి యిటీవలనే ఫ్రెంచిభాషలో నొక యుద్గ్రంథమును ప్రకటించినాడు. అమెరికాలోగూడ 'భాషాతత్త్వశాస్త్రపత్రిక' (***Philological Journal***)లో ద్రావిడభాషాతత్త్వమునుగూర్చిన వ్యాసములు ప్రకటితములగుచున్నవి. ద్రావిడభాషల ప్రత్యేకతను, వాని విశేషలక్షణములను గూర్చి యీ దేశముననేగాక యితర దేశములలోగూడ విశేషపరిశ్రమ జరుగుచున్నది. మన దేశమునందలి యువకులును భాషాతత్త్వశాస్త్రమునందును, ద్రావిడభాషాతత్త్వపరిశీలనమందును నిత్యోధిక శ్రద్ధ వహించి, తెలుగుభాష పుట్టుపూర్వోత్తరములను సరిగా దెలిసికొని ప్రాచీనకాలమున నీ భాషాశాస్త్రమునకు మన దేశమున గల గౌరవమును, ప్రాధాన్యమును నిలువబెట్టుదురుగాక !!!





పాతిక సంవత్సరాల తెలుగు కవిత్వము

శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి

౧౯౨౩ డిసెంబరు మాసాంతములో కాకినాడ కాంగ్రెసు జరుగుతూన్నప్పుడనుకుంటాను, బసవరాజు అప్పారావుగారితో భారతి మొదటిసంచిక చూశాను. చూసినతక్షణం ఎవరెవరి పద్యాలు దానిలో పడ్డాయా అని పేజీలు ఆత్రంగా తిరగేశాను. 'కన్నీరు' అనే నా పద్యం దానిలో పడ్డట్టు జ్ఞాపకం. అప్పటికప్పుడే మా సాహితి, శారద వస్తున్నా భారతిలాగ నిగనిగలతోను, నిండుతనంతోను ఏదీ రాలేదు. అందుచేతనే భారతిని అంత ఉత్సాహంతో అందుకున్నాను. ఇక నాడు మొదలుకొని ఈ రోజుదాకా నిరాఘాటంగా, హుందాగా నడుస్తూ వస్తూఉన్న పత్రిక భారతి ఒకటే. అంతేకాక తరతరాలవారినీ, రకరకాలవీ కావ్యాలకి సమానాదరాలు చూపుతూవస్తున్న పత్రికకూడా భారతే.

౨

దాదాపు ౧౯౨౩ మొదలుకుని నేటిదాకా పాతిక సంవత్సరాలు కదా! ఈ పాతిక సంవత్సరాల ఆంధ్రకవిత్వంస్థితిగతు లెలా ఉన్నాయో వ్రాయాలంటే చాలా చిక్కులున్నాయి. చిక్కులంటే చిక్కులా! నాకు మరీ గడ్డుగా కనిపించి కలం కదపనీయనంత గట్టివి.

నేనూ ఈకాలంలోవాణ్ణే అయెను! మరి కొద్దో గొప్పో నేనూ కొంత సందడి చేసినవాణ్ణే అయెను! ఏది వ్రాసినా సహేతుకంగా ఉండాలి; సరసంగా ఉండాలి; సంక్షిప్తంగా ఉంటూ సమగ్రంగా ఉండాలి; స్వంత ఇష్టాలూ, అయిష్టాలూ రాకుండా, స్వంతనగారా మోతలు రాకుండా, సాక్షి చెప్పినట్టు మహా తటస్థంగా ఉండాలి. ఏవిధంగా చూసినా అలాగ చెప్పడానికి ఇప్పుడున్నవాళ్లెవరూ కావలసినంత దూరంగా లేరనిపిస్తుంది. కనక నేనూ అలాగ చెప్పలేను.

మరొక ఇబ్బంది ఉంది. ఇప్పటి ఆంధ్రకవిత్వానికున్నంత వైవిధ్యము, సంపద, మరి ఏ ఇతర రాష్ట్రకవిత్వానికీ లేదని నా గట్టి నమ్మకం. అసలు తెలుగునాటి సాహిత్యకేదారంలో కవిత్వపు పంట ఎప్పుడూ ఎక్కువే. ఆంధ్రదేశంలో ప్రతి రెండో వ్యక్తి కవిలాగ కనబడుతున్నాడని ఒక ప్రఖ్యాతాంగకవి అన్నట్లు వింటున్నాము. ఇది పరిహాసానికి అన్న పలుకైనా పరమార్థంలాగే తోస్తుంది. ఇంతకీ ఈ మాట వంగజాతినిగురించికూడా అనవచ్చును. కవులూ, కవిరాజులూ అక్కడా ఇక్కడాకూడా ఎక్కువే. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిల వద్ద బయలుదేరి, వేంకటపార్వతీశ్వరులు, రాయప్రోలు సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణరావు మొదలైన కవుల దగ్గిర ఆగి, విశ్వనాథ సత్యనారాయణ, పింగళి కాటూరి కవులు, నాయని, నండూరి సుబ్బారావులు, శివశంకరశాస్త్రి, వేదుల సత్యనారాయణశాస్త్రి, కవి

ఆంధ్రము - తెలుగు: దాని ప్రాచీనత

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఆంధ్రము, తెలుగు అను నీరెండును సహజసంబంధములేని శబ్దములే యైనను, ఏకార్థబోధకములే యై మన మీ దేశమున వ్యవహరించు భాషను సూచించునవై యున్నవి. లోకములో నొక మనుజునకు గాని, అతని భాషకు గాని, దేశమునకు గాని తత్సంకేత రూపమగు నొక్క పేరుండుటయే స్వాభావికము. కాని మనకు, మన భాషకు, మన దేశమునకు రెండు పేర్లు గలుగుట కొంత విపరీతముగా గనబడకమానదు. ఇట్టి స్థితియే అరవము (తమిళము, ద్రావిడము) మొదలగు మఱికొన్నిటి విషయమునగూడ గనబడవచ్చును గాని, లోకవ్యవహారమున కది సౌకర్యమనికాని, స్వాభావికమనికాని చెప్ప వలనుపడదు. ఇట్లు గలుగుటకు గల కారణముల నించుక పరిశీలించితిమేని మన భాషయొక్కయు, సంఘముయొక్కయు ప్రాచీనస్థితియు, పరిణామక్రమమునుగూడ కొంతవరకు బయలుపడక పోవని తోచుచున్నది.

భాష యనునది మానవులు తమ హృద్గతాభిప్రాయములను దమ సంఘములోని యితరులకు వ్యక్తపఱచుటకై యేర్పరచుకొనిన సంకేతరూపమగు నొక సాధనము. కావున నానా మానవసంఘములు, లేదా జాతుల పేర్లనుబట్టియే వారు నివసించెడి దేశమునకును, వ్యవహరించెడు భాషకును పేర్లేర్పడుచుండుట స్వాభావికము. ఆంగిలుల దేశ మాంగ్లలాండు. అదియే ఇంగ్లాండైనది. వారి భాష ఇంగ్లీషు. చీనా దేశమునకును, నాభాషకు నాపేరు క్రీస్తుశకమునకు పూర్వము మూడవ శతాబ్ది ప్రాంతమున నాదేశము నేలిన 'ట్సిన్' వంశస్థులనుబట్టియే వచ్చిన దని చెప్పెదరు. పారసీకుల భాష పరిషియన్; దేశము పరిషియా. ఓఢ్రుల భాష ఓఢ్రము. తులువల భాష తులు. కోగుల భాష కోదు. ఎరుకలవారిది ఎరుకల భాష. ఒక్కొక్కప్పుడు దేశనామమును బట్టికూడ నందలి జనులకును, భాషకును పేర్లేర్పడుచుండుటయు గలదు. 'సింధు' నదినిబట్టి, లేదా దానికి రూపాంతరమగు 'హిందు' శబ్దమునుబట్టి యీ దేశము హిందూదేశమైనది. ఇందలి భాష హిందీ. మహారాష్ట్రము, శౌరసేనము, మగధ, కర్ణాటము (కరు + నాడు), మలయాళము (మలై + ఆళం) అను దేశనామములనుబట్టి యేర్పడినవే మహారాష్ట్రి, శౌరసేని, మాగధి, కన్నడము, మలయాళము మొదలగు భాషలు. దక్షిణదేశభాషలలో తమిళము 'తమిళర్' అను ద్రవిడజాతివారినిబట్టి యేర్పడినదే. దీనికి 'అఱవము' అను నామాంతరముకూడ 'అఱువాళర్' అను నొక తెగవారినిబట్టి యేర్పడినదే. కాని తమిళదేశమున గాని, తద్వాఙ్మయమున గాని యీ పేరు వాడుకలో లేదు. ఇది ఉత్తరమున వీరికి సమీపస్థులైయున్న యాంధ్రులచే పెట్టబడిన పేరుగా గనబడుచున్నది. కాని భాషమాత్ర మొక్కటే. తమిళము, అఱవము వలెనే ఆంధ్రము, తెనుగు అను పేర్లుగూడ నానా జాతుల నామములనుబట్టి యేర్పడినవే. చిరకాలము నుండి యీ పేర్లు రెండును దేశపరముగను, భాషాపరముగను నాదేశజనులచే నభిన్నముగనే వ్యవహరింపబడుచున్నవి. కాని యీ రెండు తెగలవారు నాదికాలము నుండియు తమిళమువలెనే యొక భాషనే వ్యవహరించిరా, లేక వేర్వేరుభాషలు గల భిన్నజాతుల వారైయుండి, యీదక్షిణాపథమున నెలకొనిన

వెనుక నేకజాతివారై యేకభావ నవలంబించిరా యను విషయము విమర్శనీయమై యున్నది. ఐతరేయ బ్రాహ్మణమునందలి కథనుబట్టి యార్యాంధ్రులార్యసంఘమునుండి బహిష్కరింపబడి పుండ్రపుళింద మూతిబాది-తెగలతోపాటు వింధ్యదక్షిణభాగమున నెలకొనినట్లు తెలియవచ్చుచున్నది. వీరు కాలక్రమమున దక్షిణాపథమును జేరి యందు కృష్ణాగోదావరీ ప్రాంతములందలి యాదిమనివాసులను తెలంగులతో గలిసి, కొంతకాలమునకు కృష్ణానదియొడ్డున నాంధ్రరాజ్యమును స్థాపించిరి. మెగస్తనీస్ కాలమునకే, అనగా క్రీస్తుకుపూర్వము మూడవశతాబ్దినాటికే యిది అప్పటి మగధరాజ్యముతరువాత జెప్పదగిన ప్రబలరాజ్యముగ నాతనిచే నెన్నబడినది. అశోకుని కాలమున కించుక తరువాతిదని తలపబడుచున్న భట్టిప్రోలుశాసనములలో కృష్ణానదీప్రాంతమున 'కుబీరకు' డను ఆంధ్రరాజొకడు పేర్కొనబడియున్నాడు. క్రమముగా నాంధ్రులు పశ్చిమదిగ్భాగమునగూడ వ్యాపించి మగధరాజ్యము నాక్రమించి హైందవసామ్రాజ్యధురంధరులైరి.

ఇట్లుత్తరదేశీయులగు నార్యాంధ్రులు కృష్ణాగోదావరీప్రాంతములను దమ నివాసముగా జేసికొని యచ్చటి జనులతో గలిసి సామ్రాజ్యపాలకులగుటచే నీదేశ మాంధ్రదేశ మైనది. ఇందలి జను లాంధ్రులైనారు. అప్పటి యాంధ్రుల ప్రాబల్యాతిశయముచే నిచ్చటి యాదిమనివాసుల యూరుపేరులు కొంతకాల మంతరించినవి గాని యార్యాంధ్రులు వచ్చునప్పటి కిది నిర్జనారణ్యముగా నుండెనని తలపరాదు. బౌద్ధయుగమున నుత్తరదేశమునందలి తామ్రలిప్తి ప్రాంతమునుండి సముద్రమార్గమున దక్షిణదేశమునకు బోవుచుండిన బౌద్ధయాత్రికులకు కృష్ణానదీముఖద్వారమున నాగరాజు లాతిథ్య మిచ్చినట్లు సూచించెడి యమరావతీస్తూప శిల్పమున చిత్రితములగు గాథలను బట్టి యీదేశమున నాగజాతివారుకూడ నున్నట్లు తెలియుచున్నది. ఆకాలమున భూమిమీదకంటెను సముద్రముమీద ప్రయాణ మెక్కుడు సుకరమై యుండియుండును. ఇక్ష్వాకులనాటి నాగార్జునకొండ శాసనములలో నొకదానియందు వీరపురిసదత్తుని రాజ్యకాలమున 'బుధిన్నకు'ని భార్య యగు 'బోధిసిరి' యనునామె శ్రీపర్వతమునకు సమీపమున నున్న విజయపురియందలి 'చులధమ్మగిరి విహారము' లో నొక 'చేతియఘర' (చైత్యగృహము) నిర్మించినట్లున్నది. అది 'తంబపన్న'-అనగా తామ్రపర్ణి యనబడు సింహళమునుండి వచ్చు బౌద్ధ సన్న్యాసులకును (థేరీస్), ఇంకను కాశ్మీర, గాంధార, చీన, చిలాత, తోసలి, అవరాంత, వంగ, వనవాసి, యవన, దమిల, పాలూర దేశములనుండి వచ్చు సన్న్యాసులకును నివాసముగా సమర్పింపబడిన ట్లామె యుద్దేశించినదని చెప్పబడుటచే నాకాలమున నానాదేశములనుండి బౌద్ధసన్న్యాసులు ఆంధ్రదేశమునకు వచ్చుచుండెడివారనుట నిశ్చయము. అప్పటికి చిరకాలమునుండి కృష్ణానదియొడ్డున నున్న 'కంటకోస్సల' (ఘంటసాల) గొప్ప రేవుపట్టణ మైనట్లు తెలియుచున్నది. కావున కృష్ణాగోదావరీనదుల మధ్యప్రాంత మాకాలమున నిర్జనారణ్యమై యుండెననుట కవకాశము లేదు. కాని యప్పటి తెలుగువారినిగూర్చిన ప్రశంసమాత్ర మెచ్చటను గానరాదు. బహుశః చిరకాలముక్రిందటనే బాహ్యదేశమునకు వలసపోయిన యచ్చటి తైలంగులనువారును, ఈదేశమున నిప్పటికి నిలిచియున్న తెలగాణ్యబ్రాహ్మణులు, తెలగాలు అనువారును మాత్రమే యిం దాదిమనివాసులగు 'తెలుంగు' జాతివారిని స్మరింపజేయుచున్నట్లు తలపవలసియున్నది. ఆంధ్రుల మూలమున నీ తెలుగుదేశ మాంధ్రదేశ మైనతరువాత పెక్కుశతాబ్దములవరకును దాని ప్రశంస గానరాలేదు. కాని క్రీస్తుశకారంభకాలమున నీదేశమునకీ నామము కేవల మంతరించిపోయినట్లగపడదు. యవనయాత్రికుడగు టాలమీ యనునాతడు 'త్రిలింగాన్', 'త్రిగ్లిఫాన్' అను పదములచే పేర్కొనిన దేశ మిదియే యైయుండుటచే, నాతని కాలమున, అనగా క్రీ. శ. ౨-వ శతాబ్దినాటికీ దేశమునకీ పేరు కొంచెము మార్పుతోనైన నింకను సుప్రసిద్ధమై యున్నట్లే తలంపనగును. త్రిలింగములనుగూర్చిన కథ పౌరాణికము తరువాతి కాలమున కల్పింపబడినదే యైయుండును. అట్లే యైనచో టాలమీ ప్రయోగించిన శబ్దములోని తొలివర్ణము రేఫయుక్తమగుట యెట్లు సంభవించు నను సం

దేహము కలుగవచ్చును. త్రైలింగులు, తెలగాలు, తెలింగానా, తెలుగు మొదలగు శబ్దములనుబట్టి 'తెలుంగు' అనునదే తొలిరూపమైయుండినను, ఆకాలమునందలి సంస్కృతపండితులు దీనిని సంస్కృతీకరించియీ దేశీయ శబ్దమునకు స్వభాషానురూపమగు రూపమును, వ్యుత్పత్తిని గల్పించియుందురనుటకు సందేహము లేదు. అట్టి రూపమే వారి మూలముగా 'టాలమీ'కి జేరియుండవచ్చును. కృష్ణానదికి ప్రాచీననామము 'మైసోలాస్' అని యున్నట్లగపడుచున్నది. తత్ప్రాంతదేశము 'మైసోలియా.' అదియే 'మసలీపట్టణ'మైనది. 'మై'శబ్దమునకు ద్రావిడభాషలలో నలుపర్థము. దీని సంస్కృతీకరణమూలముననే యీనది 'కృష్ణ' యైయుండును. ప్రాచీనశాసనములలో నిది 'కృష్ణ' 'కణ్ణ' అని పేర్కొనబడియుండగా తరువాత 'కృష్ణవేణి'యైనది గదా. 'గోదావరి' అను శబ్దములోని రెండవ భాగము కావేరి, తాన్నేరి, పెన్నేరి (పెన్నార్), పాలార్, అడ్డైయార్ మొదలగు నదీనామములలోని రెండవ భాగమునకు సమమైన 'ఆర్' అను (తె. ఏరు) శబ్దమే. కాని యది సంస్కృతీకరణమూలముగా 'వరి', 'వేరి' అని మారినది. ఇట్లు ప్రాచీనకాలమున సంస్కృతపండితులు దేశ్యభాషాశబ్దములను గొని సంస్కృతీకరించి సంస్కృతశబ్దానురూపములను వ్యుత్పత్తులను గల్పించి వాని యర్థము నెట్లో సాధింప యత్నించుచుండిరో కుమారిలభట్టు తంత్రవార్త్తికమున ద్రావిడభాషాశబ్దములనుదాహరణముగా గ్రహించి వివరించియే యున్నాడు.* త్రిలింగశబ్దము నట్టి సంస్కృతీకరణము మూలముగా నేర్పడిన శబ్దమనియే తలపనగును.

మొత్తముమీద టాలమీ తరువాత చిరకాలమువఱకు నీ దేశమునకును, నిందలి జనులకును, వారి భాషకునుగూడ నాంధ్రశబ్దవ్యవహారమే ప్రబలుటచేత తెలుగుశబ్దవ్యవహారము మందగించినదనియే చెప్పవచ్చును. క్రీ. శ. 4-వ శతాబ్దప్రాంతమునందలి యువమహారాజ శివస్కందవర్మ మైదవోలు శాసనమున నీదేశ 'మాంధ్రపథ' మనియే పేర్కొనబడినది (అంధాపథ గామే విరిపరదత్తం). భరతుని నాట్యశాస్త్రమున కిరాతాంధ్రద్రవిడాది జాతుల సమయమున వారివారి భాష ప్రయోగింపఁగూడదనియు, శౌరసేనీప్రాకృతమే సమాశ్రయింపదగినదనియు జెప్పినాడు. కాని యొకప్పుడిచ్చవచ్చినచో ద్రావిడాదులకు ద్రావిడియు ప్రయోగింపవచ్చునన్నాడు. దీనినిబట్టి ఆంధ్రము, ద్రావిడము ననునవి నాటి వైయాకరణులకు భిన్నములైన ప్రత్యేకభాషలని వ్యక్తమగుచున్నది. కుమారిలభట్టు దేశభాష నాంధ్రమనియే పేర్కొనినను, నది ద్రావిడభాషకంటె భిన్నమనియు, నీ రెండును గూడ నార్యభాషలలోనివి కాక మ్లేచ్ఛభాషలలోనివనియు దెలిపియున్నాడు. ఇట్లాంధ్రులు దక్షిణాపథమునకు వచ్చి తెలుంగుదేశమున నెలకొనినపిదప తెలుగు లాంధ్రులలో గలిసి యాంధ్రులైనట్లే తెలుగుదేశ మాంధ్రదేశమైనది. ఆంధ్రరాజులు శాసనములలో మాత్రమే ప్రాకృతము నవలంబించినను, నిత్యవ్యవహారమున నీ దేశీయభాషనే యవలంబించిరన్నచో భాషాప్రయోగమునగూడ నీయభిన్నత్వ మాకాలముననే యేర్పడిన దనవచ్చును. కాని కొందఱు [illegible] తలచినట్లుగా నాంధ్రరాజుల శాసనములలోని భాషయే యాంధ్రమనియు, దాని పరిణతరూపమే యిప్పటి మన తెనుగనియు నెంచినచో నీవిషయ మింకను బరిశీలింపదగియుండును. అంతకుబూర్వము మాట యెటులున్నను నన్నయభట్టు కాలమునకు మాత్ర మీ రెంటికి నభిన్నత్వ మేర్పడిన దనుట స్పష్టముగదా. నందంపూడిశాసనమున నీతడు నారాయణభట్టు నాంధ్రభాషాకవీశ్వరు డని చెప్పుటయు, నీతనిని రాజరాజనరేంద్రుడు భారతమును

* "తద్యథా ద్రావిడాదిభాషాయామేవ తావత్ వ్యంజనాంతభాషాపదేషు స్వరాంత విభక్తి స్త్రీప్రత్యయాది కల్పనాభిః స్వభాషానురూపానర్థాన్ ప్రతిపాద్యమానా దృశ్యంతే. తద్యథా-ఓదనం 'చోర్' ఇత్యుక్తే చోరపదవాచ్యం కల్పయంతి. పన్థానం 'అతర్' ఇత్యుక్తే 'అతర' ఇతి కల్పయిత్వాహుః. సత్యం దుస్తరత్వాదతర ఏవ పన్థా ఇతి. తథా 'పాప్' శబ్దం పకారాంతం సర్పవచనం అకారాంతం కల్పయిత్వా సత్యం పాప ఏవాసౌ ఇతి వదంతి ...తద్యథా ద్రావిడాదిభాషాయామీదృశీ స్వచ్ఛందకల్పనా తదా పారసీక బర్బర యవన రౌమకాది భాషాసు కిం వికల్ప్య కిం ప్రతిపత్స్యంత ఇతి నవిద్మః"

ఆ.1

'తెనుగున రచియింపు'మనగా నీనన్నయభట్టు తెనుంగునన్ మహాభారతసంహితా రచనబంధురు డగుటయు నిందుకు నిదర్శనములు. తిక్కనయు నాంధ్రావళి మోదముం బొరయునట్లు "పదునేనింటి తెనుంగుబాసనే" రచియించెను. నన్నయకు బూర్వ మీ భాషను 'తెనుం'గను పేరుతో స్మరించినవా రెవరు నన్నట్లగపడదు. నన్నయయు నంతకుబూర్వ మీభాషస్థితిగతులనుగూర్చి యేమియు తెలుపలేదు. కాని నన్నిచోడమహాకవిమాత్ర మించుక యీక్రిందిరీతిని సూచించియున్నాడు:

"మును మార్గకవిత లోకం
బున వెలయగ దేశికవిత బుట్టించి తెనుం
గున నిలిపి రంధ్రవిషయం
బున జన చాళుక్యరాజు మొదలుగ పలువుర్."

నన్నయకుబూర్వ మీలోకమున—నీదేశమునందు సంస్కృతభాషలో తత్సంప్రదాయానుసారముగ జెప్పబడిన కవిత వ్యాపించియున్నది. దేశభాషలో దేశీయసంప్రదాయసిద్ధమైన కవిత బయలు దేరకపోవుటచే దేశభాషయగు తెనుగున కాదరము లేక అణ అడుగంటుచున్నది. అట్టి స్థితిలో చాళుక్యరాజగు రాజనరేంద్రుడు మొదలగు పలువురు దేశికవితను బ్రోత్సహించినవారగుటచే తెనుగుభాష నాంధ్రదేశమున నిలువబెట్టినవారైనారు. నన్నయకు బూర్వకాలమున నీదేశమున సంస్కృతభాషకు, నందలి కవితకు గల ప్రాధాన్యమును, దానిమూలమున దేశభాషలకు, దేశికవితకు నాదరము లేకపోవుటయు నన్నిచోడుని పద్యము వలన వ్యక్తమైనది. క్రీస్తుశకారంభమునందలి యాంధ్రరాజుల కాలములో దేశమున ప్రాకృతభాషకు ప్రాధాన్యము కలుగుటచే దేశభాష వెనుకబడిపోయినది. క్రీ. శ. ౪-వ శతాబ్దివఱకును ప్రాకృతభాష, బౌద్ధమతము ఈదేశమున విశేషవ్యాప్తి గాంచియున్నవి. అటుపిమ్మట వైదికమతమునకును, సంస్కృతభాషకును ప్రభావము హెచ్చినది. కావుననే యీదేశమున నైదవశతాబ్దినుండి బయలుదేరిన పల్లవ, శాలంకాయన,విష్ణుకుండిన రాజుల శాసనము లన్నియు సంస్కృతభాషారచితములే యై కనబడుచున్నవి. రాజాదరణము మార్గకవితకే.

ఈస్థితి సుమా రేడవశతాబ్దివఱకు సాగినది. కాని చాళుక్యరాజులు దక్షిణాపథమున ప్రభుత్వము వహించినప్పటినుండియు నంతకుబూర్వము లోకమున వెలసిన సంస్కృతప్రాకృత కవితాధోరణిని వదలిపెట్టి, దీని ప్రాబల్యముమూలమున దేశమున వెనుకబడియుండిన దేశికవితను లేవనెత్తి, దేశభాషలలోనే తమ శాసనములను రచింపించి, క్రీ. శ. ఏడవశతాబ్దినుండియు నాంధ్రదేశమున తెనుగును నిలుపబెట్టినారు. కన్నడదేశమున కన్నడమునుగూడ నిలుపబెట్టినవారును వీరే. నన్నిచోడుడు "చాళుక్యరాజు మొదలుగ పలువుర్" అనుపాఠమునుబట్టి ఒక్క చాళుక్యరాజునే పేర్కొనినపుడు ఆతని యుద్దేశము రాజనరేంద్రు డనియే మనము తలపవలసియున్నది. కావున అంతకుపూర్వము నాలుగు శతాబ్దులనుండియు చాళుక్యనృపులీభాషావిషయమున జేసిన మహోపకారము నాతడు తలపలే దనియే యెంచనగును. అది ఆతని కప్పటికి దెలియదేమో! అట్లు తెలియునిచో "సత్యాశ్రయుని దొట్టి చాళుక్యనృపుల్" అని శ్రీ మా. రామకృష్ణకవిగారు సంపాదించిన పాఠమాతని దగుట కవకాశ ముండెదుగాని, చాళుక్యనృపులారవశతాబ్దినుండియు నీయాంధ్రవిషయమున తెనుగు బాసను నిలువబెట్టి ఈదేశమునకు మహోపకారము చేసినారను యథార్థవిషయమునే తెలిపినవాడగునని చెప్పవలసి యుండును.

ఇట్టివేవల బయలువడిన చాళుక్యరాజుల తెలుగుశాసనముల మూలముగా రాజనరేంద్రుని ప్రోత్సాహముచే నన్నయచేతనే సృష్టింపబడెనని కొందఱిచే దలపబడుచుండిన తెలుంగుబాసయొక్క ప్రాచీనత క్రీ. శ. ఏడవశతాబ్దారంభమునకు బోవుచున్నది. అంతకు బూర్వము రెండు మూడు శతాబ్దముల వఱకు గల శాసనము లన్నియు సంస్కృతభాషలోను, ఇంకను వెనుకటి శాసనములు ప్రాకృతభాషలోను రచియింపబడియుండుటచే నేడవశతాబ్దికి బూర్వము తెనుగు బాసయొక్క స్థితిగతులనుగూర్చి తెలిసికొనుట కాధారమేమియు గనబడుటలేదు. దాని యూరుపేరుల

నెచ్చుటను గానము. అవి రెండు నాంధ్రములోనే లీనమైపోయిన ట్లున్నది. ఈకాలమున శ్రీకాకుళ మందలి శ్రీవల్లభుడుకూడ నాంధ్రవల్లభుడుగనే యణిగి మణిగి యుండెనే కాని, ౧౬-వ శతాబ్దమున విజయనగర సామ్రాజ్యాధీశ్వరుడగు తెనుంగురాయలు తనను దర్శించువఱకు "దేశంబు తెలుగేను, తెలుగువల్లభుండ" నని తన నిజస్వరూపమును బ్రకటించుకొని "దేశభాషలందు దెలుగు లెస్స"యని చాటలేకపోయినాడు. కాని ఏడవశతాబ్దికి బూర్వము తెలుగుదేశ మాంధ్రదేశమున లీన మైన దని చెప్పగలిగినట్లుగా, తెలుగుభాష ఆంధ్రమున లీనమైన దని చెప్పగలుగుటకు పూర్వము అప్పటి ఆంధ్రభాషయొక్క స్వరూప మేదో మనము నిర్ణయింపవలసియుండును. ఆంధ్రరాజుల శాసనములలోని ప్రాకృతభాషయే యాకాలపుటాంధ్ర మని తలచినచో, నేడవశతాబ్దమునాటి చాళుక్యరాజుల శాసనములలోని తెలుగు, కాలక్రమమున గలిగిన దాని పరిణతరూపమే యనదగిన నన్నయకాలమునాటి తెలుగు నాటాంధ్రమున లీనమైనదనికాని, యీరెంటికి నభిన్నత్వ మేర్పడినదనికాని చెప్పుటకు వలనుపడదు. కాని యాంధ్రరాజు లాకాలమున దేశమందలి బౌద్ధమతప్రాబల్యమువలన ప్రాకృతభాషకు గలిగిన విశేషవ్యాప్తినిబట్టి దాని నీకాలపు టింగ్లీషువలె రాజభాషగా గ్రహించి, దేశమం దంతటను దెలియుటకొఱకు శాసనములనుమాత్ర మాభాషలో రచియించి యుండిరేకాని, ఆకాలమున నాంధ్రదేశీయులగు జనులతోడి నిత్యవ్యవహార మంతయు దేశీయమగు తెనుగుబాసనే నడపుచుండి రని తలచినచో, తెలుగున కాంధ్రముతో నభిన్నత్వ మప్పటినుండియే కలిగెనని చెప్పవచ్చును. అనగా ఆంధ్రు లీదేశమునకు వచ్చి యందలి జనులతో గలిసి, వారి కాంధ్రత్వమును గలిగించినట్లే యీదేశభాషను జేపట్టి దాని కాంధ్రత్వము కలిగించినవారని చెప్పుట కవకాశము గలుగును. భరతుడు, కుమారిలభట్టు, హూయన్‌త్సాంగ్ మొదలగువా రీ యాంధ్రమును గూర్చి వారివారి కాలమున జెప్పినదానిని బట్టి చూడగా వారి యాంధ్రము ప్రాకృతభాషలకంటె భిన్నమైనట్లును, మ్లేచ్ఛభాషగాగూడ పరిగణింపబడినట్లును తెలియవచ్చుచునేయున్నది. కావున తెలుగున కాంధ్రముతో నభిన్నత్వము గ్రహించినపుడు ఆంధ్రము ప్రాకృతముకంటె భిన్నమనియే గ్రహింపవలయును. కావున తెలుగుభాషయొక్క ప్రాక్తన స్వరూపమును దెలిసికొని దాని చరిత్ర నింకను వెనుక కన్వేషింపవలె నన్నచో నాంధ్రరాజుల ప్రాకృతశాసనములలోని భాష యావిషయమున నిరుపయోగము కాకమానదు.

ఇక ప్రాచీనాంధ్రరాజులు తమ శాసనముల నుపయోగించిన ప్రాకృతభాషయే యీదేశమున నాకాలమున నిత్యవ్యవహారములో నుండిన యాంధ్రభాష యని చెప్పువారు ఏడవశతాబ్దికి బూర్వ మాంధ్రమున శాసనము లేమియు గనబడకుండుటచే నాకాలమందలి చాళుక్యశాసనములలోని తెలుగుభాష యాప్రాకృతాంధ్రముయొక్క పరిణతరూపమే యనియు, తక్కిన ప్రాకృతములతోపాటు ఈ యాంధ్రము నార్యభాషాజన్యమగుటచే దెనుగుభాషకూడ నార్యభాషాజన్యమే యనవలెననియు వాదింతురు. ఈ వాదమున కిటీవలి యాంధ్రవైయాకరణుల యభిప్రాయములుగూడ కొంత బలము చేకూర్చినవి. వీరు సామాన్యముగా సంస్కృతభాషా పండితులు కావున ఆ భాషయందు సహజముగ దమకు గల విశేషాభిమానము చేతను, తెనుగున నిటీవల విశేషముగా జేరిన తత్సమ తద్భవ పదజాలముయొక్క ప్రాబల్యముచేతను తెనుగు సంస్కృతప్రాకృతముల వికృతియే యనికూడ జెప్పనొడగిరి. వా రీభాషకు వ్యాకరణములు సంస్కృతభాషావ్యాకరణపద్ధతి ననుసరించియే రచింపబడినను, ఈ భాషకు సహజములగు కొన్ని విశేషలక్షణములను గూర్చి చెప్పవలసివచ్చినపు డాచ్ఛికపరిచ్ఛేద మను నొక ప్రత్యేక పరిచ్ఛేదమును వారికి కల్పింపక తప్పినది కాదు. ఈ వైయాకరణు లీ భాషలో తత్సమ తద్భవ దేశ్యరూపముల విభాగమును గల్పించి తత్సమ తద్భవ విషయమున మాత్రమే సంస్కృత సంబంధమును జూపయత్నించిరి గాని దేశ్యమునకుగూడ వికృతిత్వ మారోపింప సాహసింపలేరు. కాని ఇటీవల దక్షిణదేశ భాషాతత్త్వ పరిశీలకులలో కొందరు క్రీ. శ. ౬, ౭ శతాబ్దులకు బూర్వ మీ భాషల స్వరూపమును, పరిణామమును దెలుపగల శాసననిదర్శన మేమియు

గానరాకుండుటచే, నీభాషలలోని ధాతువులు, శబ్దములు, క్రియారూపములు, విభక్తి ప్రత్యయములు, వ్యాకరణప్రక్రియ మొదలగునదంతయు సంస్కృత ప్రాకృతభవమే యని యత్కించి ద్రూపసామ్య ధ్వని సామ్యమునుబట్టి నిరూపింప యత్నించుచున్నారు. కాని చాళుక్యశాసనములలోని తెలుగు ఆంధ్రరాజుల శాసనములలోని ప్రాకృతభాషతో సభిన్నమనికాని, తత్పరిణతరూపమనికాని చెప్పుట యెంత యసమంజసముగా గనబడునో వాని నించుక సరిపోల్చి చూచిన వారికి వ్యక్తము కాకపోదు.

ఆంధ్రరాజులనాటి యమరావతీస్తూప శాసనము :—

"సిధం రనో వాసిఠిపుతస సామిసిరిపులమావిస స వచ్చరె.....పిండసుతరి యాణం కహూతర గహపతిస పురిగహపతిస చపుతస ఇసిలస సభాతుకస సభగినికస నాకానికాయస ప్రతికస భగవతో మహాచేతియే చేతికి యానం నాకా (య)స పతిగహో అపరదారె ధమచకం దేయధమ్మం ఠాపిత."

ఇందలి శబ్దములేకాక విభక్తిప్రత్యయములు, క్రియారూపములు, వాక్యనిర్మాణపద్ధతి యంతయు సంస్కృతభాషకు ఛాయయే యనుట ఈ క్రింది ఛాయవలన బోధపడగలదు:

"రాజ్ఞో వాశిష్ఠీపుత్రస్య స్వామిశ్రీపులమావి(స్య) సంవత్సరే......ఇసిలస్య (ఋషిలకస్య) సపుత్రకస్య, సభ్రాతృకస్య...దేయధర్మం ధర్మచక్రం అపరద్వారే స్థాపితం."

క్రీ. శ. మూడవశతాబ్దములోని ఇక్ష్వాకురాజుల నాటి శాసనము:—

"సిధం రనో మాఢరిపుతస ఇఖాకునం సిరివిరపురిసదతస సంవత్సర...కమ్మకరఠె ఛడతూరె ఆవెసనిస నాకచందసపుతో గామె మహాకాండురూరె ఆవెసని సిధతో ఆపణో మాతరం నాగిలనిమ్ పురతో కాతూనం ఘరనించ...గామె వెళగిరియం భగవతో బుధస మహాచెతియపువాదరె ఆయకఖంబె ౫ సవనియుతె అపణో దెయధమ్మం సపసతానం హితసుఖాయ పటిఠపితతి."

క్రీ. శ. నాల్గవశతాబ్దిమధ్యభాగమున పల్లవరాజు శివస్కందవర్మ కాంచీపురమునుండి చేసిన యాజ్ఞప్తి శాసనము ప్రాకృతముననే కలదు :—

"కాంచీపురతో యువమహారాజో భారద్దాయసగోత్తో పలవానం సివఖందవమ్మో ధఞ్ఞకడే వాపతం ఆనపయతి. అంహపతీయా గామో...విరిపరం అంహేహిఉదకాదింసంపదత్తో. ఏతస గామస పరిహరస సవ బంహదేయపరిహారో వితరమ."

తరువాత నేడవశతాబ్దివరకు నాంధ్రదేశమును పాలించిన శాలంకాయనులు, విష్ణుకుండినులు మొదలగువారి శాసనము లన్నియు సంస్కృతభాషలోనే యున్నవి. ౭-వ శతాబ్దిప్రారంభమున చాళుక్యరాజగు జయసింహవల్లభుని శాసనము ప్రాకృతభిన్నమని చెప్పదగిన తెలుగులో నున్నది :—

"జయసింఘవల్లభ మహారాజులాకున్ ప్రవర్ధమాన విజయరాజ్యసంవత్సరంబుల్ ఏణ్బొదగు అన్నేణ్డి ఆస్మత్ పుణ్ణెను నాణ్డ్రాం డ్నాపించిరాజులుముట్లుకలివి మడిరాజుల్ డ్నాపించిసముద్రకర్తి నాదుబణిసేసిన కల్బిపిటి రణ్లమద్ది కదుమూటికి విత్పట్ట్ ఉత్తరంబున పులొంబున చెఱువు పదుమాటికోలన్ ఏణ్బొదిపుట్లు అఱ్ఱుపట్టు నేనుతాలన్ తోంటశాయు...పదువారంబు ఇచ్చిరి."

ఇందలి భాష నొకటి యాంధ్రరాజుల శాసనములలోని భాషకంటె భిన్నమై కొంత తెనుగుదనము కలదైయున్నదనుటకు సందేహము లేదుగదా. కొన్ని తత్సమశబ్దములు, సుబోధ్యముగాని ప్రాచీనరూపములు నున్నను, విభక్తి ప్రత్యయములు, క్రియారూపములు, అన్వయక్రమము, శబ్దస్వరూపము, వర్ణక్రమము మొదలగున వన్నియు సంస్కృత ప్రాకృత భాషాపద్ధతినిగాక, యితర దక్షిణదేశ భాషాపద్ధతిని బోలినవై కనబడుచున్నవి. ప్రాకృత భాషల యపభ్రంశరూపములనుండి క్రీ. శ. ౧౦, ౧౧-వ శతాబ్దప్రాంతముల బయలుదేరిన వని చెప్పబడుచున్న ఉత్తరహిందూస్థాన భాషలలో నయితము సంస్కృతభాషావ్యాకరణపద్ధతులే నిలిచియుండుటనుబట్టి, యంతకు పెక్కు శతాబ్దములకు బూర్వమే

తద్భిన్నపద్ధతుల నవలంబించి వృద్ధినొందియున్న యీ దక్షిణదేశభాషలు తజ్జన్యములే యనుట యసంభవ మనక తప్పదు. కావున నాంధ్రరాజుల కాలముననే యీ దేశమునందలి యాంధ్రులు ఆకాలపు ప్రాకృతశాసనములలోని భాషకంటె భిన్నమైన మఱియొక తెలుగు భాషనే వ్యవహరించియుండిరని తలచినగాని, తరువాతి చాళుక్యరాజుల శాసనములలోని తెలుగుభాష దాని పరిణతరూప మని చెప్పుట కవకాశము లేదు.

దీనినిబట్టి ౬-వ శతాబ్దమునాటి శాసనములలోని తెలుగుభాషయొక్క పూర్వచరిత్ర నన్వేషించి తెలిసికొనుట కంతకుపూర్వమున గల యాంధ్రరాజుల ప్రాకృతశాసనము లేమాత్రమును తోడ్పడజాల వని విశద మగుచున్నది. కావున దీని పూర్వచరిత్రమును, ప్రాచీనస్వరూపమును దెలిసికొనవలెనన్నచో బరిసరవర్తులగు నితరదక్షిణదేశభాషాలక్షణములతో సరిపోల్చి చూడవలసియుండును.

క్రీ. శ. ౬-వ శతాబ్దికి బూర్వము తెలుగుశాసనములు లేకున్నను, తెలుగుదేశమున బయలుదేరిన యీ సంస్కృతప్రాకృతశాసనములలోని నదులు, ఊళ్లు మొదలగువాని పేళ్లును, కొన్ని బిరుదనామములు నాకాలపు దేశభాషాస్వరూపచిహ్నములను వ్యక్తపఱచుచున్నట్లగపడుచున్నది. నాగరలిపిలో వ్రాయబడిన కొన్ని సంస్కృతశాసనములలో తద్భాషావర్ణసమామ్నాయమున లేని నూతనవర్ణములతో గూడిన దేశీయశబ్దములను వ్రాయవలసివచ్చినపుడు ఆశాసనములను జెక్కినవారు ఈ దేశీయవర్ణములనే యీ నాగరలిపి నడుమ జొనుపవలసినవా రగుటచే నాకాలమున సంస్కృతప్రాకృతభాషాసంప్రదాయములకు భిన్నములగు సంప్రదాయములతో గూడిన భాషలు దేశమున వ్యాప్తిజెందియున్నవని తెలియవచ్చుచున్నది. అట్టి శబ్దములే యీ దేశభాషల ప్రాచీనచరిత్రను సూచించునవై తదన్వేషణమున మనకు మిగుల తోడ్పడగలవు. ఇట్టిశబ్దములను గొన్నిటిని పరిశీలింతము. పై ఆంధ్రరాజుల శాసనములలో గానవచ్చు 'నాగనిక' మొదలగు పేళ్లు ఆంధ్రజాతివారివిగాక, దేశీయులగు నాగజాతివారివై యుండు ననుటకు సందేహము లేదు.

ఆంధ్రశాతవాహనులతరువాత ఆంధ్రదేశములోని కృష్ణాగుంటూరుప్రాంతదేశమును ఇక్ష్వాకువంశీయులు పాలించిరి. వారిలో వాశిష్ఠీపుత్రశాంతమూల అనువాతడు మొదటివాడు. శాసనములలో నీపేరు 'చాంతమూల' యని 'చ'కారాదిగా వ్రాయబడియుండుట చూడ నీపేరు దేశీయమగు శబ్దమా యని చార్పెంట్‌పండితుడు మొదలగువారు సందేహించిరి. తొలుత ద్రావిడభాషలలో 'శ'వర్ణము లేకుండుటచే, నిప్పటికిని తమిళములో 'శ'వర్ణము 'చ'వర్ణముగా బలుకబడుటనుబట్టి ప్రాకృతభాషలలోని యీపద్ధతి ద్రావిడభాషాసంప్రదాయసిద్ధ మగునని కూడ తలపబడుచున్నది (cf. సం. శత్రు - త. చత్తురు ; సం. శవః—త. చవం ; సం. శక్తిః—త. చత్తి అనియే తమిళమున వ్రాసి చదువబడును). ఈ చాంతమూలుని కుమారుడు వీరపురిసదత్తుడు. ఈతని రాజ్యకాలమున బయలుదేరిన నాగార్జునకొండశాసనములలో నొకదానిలో శాంతమూలుని చెల్లెలు చాంతిసిరి మహాసేనాపతి, మహాతలవరుడగు ఖందసిరిభార్య యైనట్లు తెలుపబడినది. ఈ 'మహాతలవర' శబ్దము 'సేనాపతి'వలెనే యొక బిరుదచిహ్నముగా గనబడుచున్నది. జైనగ్రంథములలో ౧౮ గణరాజులలో నీమహాతలవరులుగూడ గ్రహింపబడుటచే నిది జైనసంప్రదాయసిద్ధమై యుండునని తోచుచున్నది. జైనకల్పసూత్రములో దీని నిట్లు నిర్వచించియున్నారు: "తలవరాః తుష్టభూపాల ప్రదత్త పట్టబంధవిభూషితరాజస్థానీయాః" అని. కాని యీశబ్దము స్వతస్సిద్ధముగ ద్రావిడభాషలలోనిదై జైనులలోనికి సంక్రమించినదా యని కొందరు తలచుచున్నారు. తెలుగున 'తలారి' శబ్ద మొకటి గ్రామనాయకుడు, గ్రామమునందలి కాపలావాడు అను నర్థమున గలదు. ఇదే త. తలైయారి, కన్న. తళవర, తళవార అను రూపముల పైయర్థముననే కలదు. తమిళమున 'తలైవన్' అనునది అధ్యక్షుడు, శాసకుడు, రాజు అను నర్థమునగూడ గలదు. దీని బహువచనరూపము 'తలైవర్.' ఐకారాంతశబ్దములు తెలుగున అకారాంతము లగుట సహజము (తలై - తల, వలై - వల, మలై - మల). కావున 'తలైవర్' అనునది తెలుగున 'తలవర' అగును. కావున పై తెలుగుదేశమున నున్న ప్రాకృత

శాసనములోని 'తలవర' అనునది తెలుగుశబ్దమే. అది యీ నాడొక బిరుదచిహ్నముగా ప్రాకృతభాషలో గ్రహింపబడి కాలక్రమమున గ్రామరక్షకు డను నర్థమున వ్యవహరింపబడియుండును. ఇక్ష్వాకులకు దరువాత వచ్చిన బృహత్పలాయనరాజగు జయవర్మ కొండముడి తామ్రశాసనములోగూడ నీ 'మహాతలవర'శబ్దము గానవచ్చుచున్నది. "మహాతలవరేన మహాదండనాయకేన భాపహానవర్మణా కటతి" అని శాసనమును జెక్కించిన వాని బిరుదముగా నున్నది. ఇందు "కూడూరాహారే గామం పాంటూరం బమ్హదేయం దదామ"—కూడూరాహారమందలి పాంటూరను గ్రామమును బ్రహ్మదేయముగా నిచ్చిన ట్లున్నది. కూడూరు, పాంటూరు తెలుగు దేశములోని పేళ్లగుటయే కాక, యిందలి 'కూడూర'నునది యిప్పటి మచిలీపట్టణ సమీపమునందలి 'గూడూరే' యని తలపబడుచున్నది. ప్రాచీన శబ్దములలోని పదాదికకారము తెనుగున తరువాతికాలమున గకారముగా మారుచుండుటను బట్టి యీ దేశభాషాసంప్రదాయమున కీశబ్దములు నిదర్శన మగుచున్న వనవచ్చును (cf కడప—గడప, త. కాల్, కాల్లు—తె. గాలి; త. కిళి-కన్న. గిళి; త. కిణ్ణి-తె. గిన్నె).

పాంటూరు తరువాతికాలమున తిక్కనార్యుని కుటుంబమువారు కరణీకము వహించిన పాటూరగునేమో. బృహత్పలాయనుల తరువాత వేంగిపురము నుండి యాంధ్రదేశము నేలిన శాలంకాయనరాజులలో మొదటివాడగు దేవవర్మ ఏళూరశాసనముకూడ ప్రాకృత భాషలోనే యున్నది. ఈతడు క్రీ. శ. నాల్గవశతాబ్ది పూర్వభాగమున నున్నవాడని చారిత్రకుల యభిప్రాయము. ఈ శాసనమునందు ప్రాచీన వేంగిపురమునకు సమీపముననున్న 'ఏలూరు' అను గ్రామము 'ఏళూరు' అను పేరుతో గనబడుచున్నది. ఈ శబ్దములోని 'ళ' కారము తరువాత 'ల'కారముగా మారియుండును. ఇది ప్రాచీనద్రావిడశబ్ద మగు 'అళ్' అనునది. ఏలు-ఏలు (govern, rule) అని తెలుగులో మారినది. ఈ శాసనమందలి రూపములో నీ తెలుగుశబ్దము యొక్క ప్రాచీనరూపము పొడసూపుచున్న దనవచ్చును.

ఇంక నీశాసనములలో గానవచ్చు నడతూరు, కొండురూరు, విరిపర మొదలగు నూళ్ల పేళ్లు తెలుగుదేశమునందలివానివే. 'ఊరు' అనునది సంస్కృత 'పుర'శబ్దభవమే యని చెప్పుదురుగాని, అది దేశ్యమనుటయే సమంజసము. దక్షిణదేశభాషలన్నిటిలో నిది 'ఊరు, ఊర్' అను రూపములతో గనబడుచున్నది. హేమచంద్రుడు దేశినామమాలలో "ఊరో గ్రామః" అని దీనిని దేశిశబ్దముగానే పఠించినాడు. ఇది ఉండు, నివసించు (to be, to exist, to reside, to dwell) అను నర్థముగల 'ఊఱు' అను ద్రావిడధాతువునుండి యేర్పడియుండును. శకటరేఫము రేఫముగా మాఱుట పెక్కు శబ్దములలో గాననగును. తెలుగులో నిది నాడు కలో లేదుగాని 'ఉండు' ధాతువు దీనినుండియే యేర్పడియుండవచ్చును. "నీయుఱుకడ కేగి తోడుపడు మొఱ్ఱకు నెవ్వరికేని" (భార. ఉద్యో. ౪ ఆ) మొదలగు ప్రాచీనప్రయోగములును గలవు. దీనికి 'ఉన్న—తగియున్న' అని యర్థము చెప్పవచ్చును. 'ఉఱు' అను రూపముకూడ 'తగు' అను నర్థమున శ.ర.లో గ్రహింపబడినది. శివస్కందవర్మశాసనములో ఆంధ్రపథీయగ్రామ మగు 'విరిపరు'అనునది పేర్కొనబడినది. ఈ 'విరిపరు'అనునదే తరువాతికాలమున'విప్పఱ్ఱు'అయియుండును. ఇందలి 'పఱ్ఱు' అనునది ఆంధ్రదేశమునందలి యనేకగ్రామనాముల తుదిని గనబడుచున్నది. ౫-వ శతాబ్దము నాటి సింహవర్మ'ఓంగోడు'శాసనమున'పెణుకంబఱ్ఱు' అను గ్రామమును, రెండవఅమ్మరాజు మయిలఫ్రాండి శాసనమున 'మల్కపఱ్ఱు' గ్రామమును పేర్కొనబడినవి. ఇట్లే యనేకములు గలవు. ఇందొక్క విశేషము. ప్రాచీనములగు ప్రాకృతశాసనములలో నీ'పఱు' శబ్దము రేఫముతోడనే వ్రాయబడియున్నది. కాని తరువాతికాలపు సంస్కృతశాసనములలో నీగ్రామనామము వ్రాయవలసివచ్చినపుడు ఇప్పటి తెలుగులిపిలోని శకటరేఫమును బోలిన వర్ణమే వరుస జొనుపబడుచువచ్చినది. ఇందుకు నిదర్శనము పై శివస్కందవర్మప్రాకృతశాసనములో'విరిపరు'అనుదానిలో రేఫమే వ్రాయబడియుండగా, ఈగ్రామనామమే క్రీ. శ. ౭-వ శతాబ్దమునాటి రెండవపులికేశికొప్పరపుతామ్రశాసనములో 'విపఱు'అని శకటరేఫముతో వ్రాయ

బడియుండుటయే. ఈ రెండుశాసనములలో గ్రహింపబడిన యీ గ్రామ మొక్కటియే కావున దీనిరూపము కాలక్రమమున నెట్టిమార్పులను బొందియున్నదో తెలిసికొనుటకు నవకాశము గలుగుచున్నది. విరిపఱు విపఱు అయి తరువాతికాలమున 'విప్పఱ్ఱు' అయినట్లున్నది.

కొన్ని గ్రామనామములలో నీ 'పఱ్ఱు' 'వఱ్ఱు, మఱ్ఱు' రూపములను బొందుటయు గలదు. (గొడవఱ్ఱు, పెనుమఱ్ఱు, పామఱ్ఱు, పోతుమఱ్ఱు మొ.). దీని యౌపవిభక్తిక రూపము పఱ్ఱి, మఱ్ఱి యగును. ఈ గ్రామనామములే కొందఱి గృహనామములైనప్పుడు గొడవఱ్ఱి, పెనుమఱ్ఱి, పామఱ్ఱి అని వాని యౌపవిభక్తికరూపములే వాడుకలోనికి వచ్చినవి. ఈ 'పఱ్ఱు' అనునదే 'పట్టు' అను రూపమునుగూడ బొందినది (చెంగల్ పట్టు మొదలగువానిలో గాననగును.) ఈ శకటరేఫము సంస్కృతప్రాకృతాద్యార్యభాషలలో లేక దక్షిణదేశభాషాసహజమగు నొక ప్రత్యేకవర్ణము. ఇది ద్విత్వమును బొందినపుడు, సహజముగా నది మూర్ధన్యమే యగుటచే 'ట్ర'వలె, అనగా రేఫసహితటకారమువలె నుచ్చరింపబడును. ప్రాచీన ద్రావిడభాషలలోని యీ యుచ్చారణపద్ధతి యిప్పటికిని తమిళభాషలో నిలిచియున్నది. తెనుగున నీ సంప్రదాయము కొన్ని ప్రాచీనరూపములలో గనబడుచున్నను, ప్రస్తుత మది ద్విత్వాభావమునొందిన రేఫముగానే యుచ్చరింపబడుచున్నది. పఱ్ఱు పట్రు — పట్టు అయినట్లే, చిఱు చిఱ్ఱు — చిట్రు — చిట్టి; వఱు వట్రు — వట్టిపోవు - వఱు వట్లు; మిఱు మిట్టిమాచు-మిఱుమిట్లు; మాఱు మాఱ్ఱు-మాట ఈ మొదలగు రూపము లేర్పడినవి. ఇట్లనేకములగు తెలుగుశబ్దములలో నీ 'ట'కారము ప్రాచీనరూపములలోని 'ఱ'కారమునుండి యేర్పడినదే యైయుండును. ఇంక ననేకములగు ప్రాచీనశాసనములలో నీశకటరేఫము కనబడుచునేయున్నది.

ఈ శకటరేఫమువలెనే ద్రావిడభాషలకు సహజమై సంస్కృతప్రాకృతములలో గానరాని మఱియొక వింతయక్షరము 'ఴ'అనునది. ప్రాచీనసంస్కృతశాసనములలో గనబడుచున్నది. ఇది యొక విలక్షణమైన యుచ్చారణము కలదగుటచే ద్రావిడభాషలలోనే యొక వింతయక్షరముగా బరిగణింపబడుటయే కాక ఆయా భాషలలో భిన్నరూపములను బొందియున్నది. ప్రస్తుతకాలమున నిది తమిళమలయాళములందు మాత్రమే వ్యవహారమందున్నను కన్నడభాషలో ౧౩-వ శతాబ్ది వరకును, తెనుగున ౯, ౧౦ శతాబ్దములవరకును వ్యవహారమున నుండెను. ఇటీవలికాలమున నీవర్ణ మీ భాషలలో ళకారముగానో, డకారముగానో, రేఫముగానో మాఱుచువచ్చినది. క్రీ. శ. ౬-వ శతాబ్దిప్రాంతమునందలి ఆనందమహర్షి వంశసంభూతుడగు అత్తివర్మ గోరంట్ల తామ్రశాసనమున కృష్ణబేణ్ణా దక్షిణకూలమునందలి 'తాఴ్ఴికొఴ్ఴ' గ్రామములోని అష్టశతపట్టికా క్షేత్రము కోటిశర్మ యను బ్రాహ్మణునకు దానము చేసినట్లు కలదు. ఇందలి 'తాఴ్ఴికొఴ్ఴ' అను గ్రామము తరువాత 'తాడికొండ' యయినట్లగపడుచున్నది. ఇందలి 'తాఴ్ఴి' తెలుగునందలి 'తాడిచెట్టు' అను శబ్దములోని తాడి శబ్దముయొక్క ప్రాచీనరూపము. ఇది సంస్కృత 'తాళ' శబ్దభవమని చెప్పుదురు గాని, తమిళమున నతి ప్రాచీన కాలమునుండి యిప్పటివఱకు 'ఴ' కారమను వింతయక్షరముతో గూడిన 'తాఴి' శబ్దమే కనబడుచుండుటచేతను, తెనుగుదేశమునందలి ప్రాచీన సంస్కృతశాసనములలోగూడ గ్రామనామములలో వచ్చిన యీ శబ్దము 'తాఴ్ఴి'అని 'ఴ'కారసహితముగా దేశీయమగు లిపిలోనే వ్రాయబడియుండుటను బట్టియు నిది దక్షిణదేశభాషాసహజమగు శబ్దమే యనియు, సంస్కృతభాషలోనికి గ్రహింపబడినదనియు దలపవగును. ప్రాచీన ద్రావిడభాషలలోని యీ 'ఴ' కారమే తెలుగుకన్నడములలో వరుసగా డకార ళకారములుగా మాఱిన దనుట కనేక నిదర్శనములు గలవు (cf. త. కోఴి- తె. కోడి, కన్న. కోళి; త. చోఴ - తె. చోడ, కన్న. చోళ; త. పఴం- తె. పండు, కన్న. పళం; త. ఏఴు — తె. ఏడు, క. ఏళ్; త. నెఴిల్— తె. నీడ, క. నీళల్; త. చుఴి — తె. సుడి, క. సుళి మొ.).

'తాఴి' శబ్ద మా ప్రాచీనరూపముననే ౭-వ శతాబ్దమునాటి పై జయసింహవల్లభుని తెలుగుశాసనమునను 'తాఴితోంట' అను శబ్దమున గానవచ్చుచున్నది.

ఆ 'కాటితోంట' యే యిటీవల 'కాడితోట' యయినది. క్రీ. శ. ౬౬౦ నాటి మొదటి విక్రమాదిత్యుని తలమంచి శాసనమున " कोऽच्चुंकोन्तु ग्रामस्योत्तर पार्श्व " అని 'కొఱ్చుంకొన్తు' అను గ్రామము పేర్కొనబడినది. 'కొన్తు' శబ్దము ప్రాచీనద్రావిడ భాషలలోని 'కున్తు' శబ్దభవము. త. కున్తు తెలుగు కన్నడములలో (కొన్డ) 'కొండ' అను రూపమును బొందినది. కాని 'కొఱ్చుంకొండ' ఇప్పు డేగ్రామముగా మాఱినదో తెలియదు. మొదటి విష్ణువర్ధనుని తిమ్మాపురము శాసనములో " पलकि विषये कुमुळूर नाम ग्रामे " అని 'పలికి' విషయ మొకటి పేర్కొనబడినది. విష్ణుకుండిన వంశీయుఁడగు రెండవ విక్రమేంద్రవర్మ 'చిక్కుళ్ల' శాసనములో (క్రీ. శ. ౭౦౦) "విజయ తెండుఱార వాసకాత్...రేగోన్తుమ్ నామ గ్రామం దత్తం" అని 'తెండుఱారు', 'రేగోన్తుం' అను ఊళ్లు పేర్కొనబడినవి. ఈ 'తెండుఱారు' ఇప్పటి యేలూరు ప్రాంతమందలి దెందులూరే కావచ్చును. దీనికి 'దెందులూరు' పూర్వరూపము కావచ్చును. 'రేగోన్తుమ్' అను గ్రామము కృష్ణవేణ్ణాతటమునం దున్నట్లు చెప్పబడినది. ఇది 'రేగొండ'గా మాఱియుండవలయును. అట్టి గ్రామ మాప్రాంతమున నున్నదేమో.

ఇట్లే ద్రావిడభాషలకు విలక్షణములు, సహజములు నని చెప్పదగిన యీశకటరేఫ 'ఱ' కారములు ౭-వ శతాబ్దమునకు బూర్వపు సంస్కృతశాసనములలోను, తరువాతివానిలోనుగూడ నాంధ్రదేశీయగ్రామముల నామములను బేర్కొనుసందర్భమున గానవచ్చుచున్నవి. ఇవి తరువాతి చోళచాళుక్యరాజుల తెలుగు శాసనములలోని యనేకములగు ప్రాచీనతెలుగుశబ్దములలో గానవచ్చుచున్నవి. ఈశబ్దము లన్నియు దేశీయములై తక్కిన దక్షిణదేశభాషలకు సన్నిహితములుగను, సజాతీయములుగను గనబడుచుండుటచే ౭-వ శతాబ్దినుండి చాళుక్యరాజుల శాసనములలో మన కగపడుచున్న తెలుగుభాషయొక్క ప్రాచీనచరిత్రమును ఆంధ్రరాజుల శాసనములలోని ప్రాకృతభాషామూలమునగాక, దక్షిణదేశమునందలి యితరద్రావిడభాషల సహాయమున నన్వేషింప యత్నించుటే సమంజసముగా దోపకమానదు. పైని గ్రహింపబడిన జయసింహవల్లభుని తెలుగుశాసనములోని పెక్కుశబ్దములు ఈకాలమున మనకు గొంత వికృతములుగ గనబడినను, తమిళకన్నడాదిదక్షిణదేశభాషారూపములతో బోల్చిచూచినపుడు వాని పరిణామక్రమము కొంత బోధపడగలదు.

'సంవత్సరంబుళ్'—ఇందలి బహువచనప్రత్యయము కళ్, గళ్ అను ప్రాచీనద్రావిడప్రత్యయము నుండి యేర్పడినదై, అది యింకను 'ళు' అను రూపమును బొందని ప్రాచీనస్థితిని దెలుపుచున్నది.

'ఎణుంబోది'—ఎనబది అనుదాని ప్రాచీనరూపమేమో. తొళిశబ్దము ఎట్టు, ఎణ్టు అనుదాని రూపాంతరము కావచ్చును. రెండవశబ్దము పత్తు-పది అనుదాని మాఱురూపము. నడుమ 'ఉం' అను సముచ్చయార్థకము చేర్పబడినట్లున్నది. ఈసముచ్చయార్థకము పదునొకండు మొదలు 'పంతొమ్మిది' వరకు గల సంఖ్యలలోనే కనబడునుగాని ఇరువది, ముప్పది, నలువది, అఱువది, ఎనబది మొదలగువానిలో గానరాదు. కావున నిది 'ఎనబది' అనుదాని ప్రాచీనరూపమనుట యుక్తముగా గనబడుటలేదు. మఱియు నట్లే యైనచో జయసింహవల్లభుఁడు ఎనబదిసంవత్సరములు రాజ్యముచేసినాడనవలసివచ్చును. కాని యీ మొదటి జయసింహుఁడు క్రీ. శ. ౬౩౩ మొదలు ౬౬౩ వఱకు, అనగా ౩౦ సంవత్సరములుమాత్రమే రాజ్యముచేసిన ట్లితరనిదర్శనముల వలన దెలియవచ్చుచున్నది కావున నీతని రాజ్యకాలములో నెనబదిసంవత్సరమనుట యసంభవము. కావున నిది 'ఎనిమిది' యనుదాని ప్రాచీనరూపమై యుండవచ్చును. లేదా ఎట్ + ఉం + పది = ఎనిమిదియు, పదియు- పదునెనిమిదియైన కావచ్చును.

'ఏణ్డి'--ఏండు అనుదాని యొకవిభక్తికరూపము. ఇది తమిళమున 'ఆండు' అనురూపము గలదై యున్నది. అనుస్వారము పలుకనప్పుడు 'ఏఁడు' అయినది. త. 'ఆళు' ఏలు అయినట్లే పదాది 'ఆ' కారము కొన్ని తెలుగు శబ్దములలో 'ఏ'గా మాఱుచున్నది.

'పుణ్ణమ' - పూర్ణిమాశబ్దభవము. దీనినుండి 'పున్నమ' అను నర్వాచీనరూప మేర్పడినది.

'ముట్లు' — శాలంకాయన విజయనందివర్మ్మ ఏలూరుశాసనములోని 'ముటుడ'శబ్దము దీని పూర్వ రూపమేమో. గ్రామాధికారియని యర్థము కావచ్చును. విజయనందివర్మ్మకంతేరు శాసనములో గూడ నీశబ్దమే కాననగును(cf. "కురువాడగ్రామే ముటుడ సహితా గ్రామేయకాణాజ్ఞాపయతి.").

'బణి'—పణి, పని. ఇది ప్రాయసగాని పొరపాటు అని చెప్పవలనుపడదు. తమిళమున నిప్పటికిని 'పణ్'(= చేయు) అనునదే ధాతువు. ఈధాతువు తెలుగులో నంతరించినది. కించిదర్థభేదమున 'పన్ను - పన్నుగడ'అనువానిలోను, ఈ'పని' అను నామవాచకశబ్దము లోను నిలిచియున్నది (cf. మన్-మన్ను; కన్-కన్ను మొ.).

'ఫులొంబు'—ఇది 'పొలము' అనుదాని ప్రాచీన రూపము. తమిళమున నిప్పటికి నీశబ్దము 'పులంబు' 'పులమ్' అనియే కలదు. తొలివర్ణముమీది ఉకారము ఒకారముగను, ఇకారము ఎకారముగను మాఱుట ద్రావిడభాషలకు సహజమే. ఇందలి'ము'వర్ణరూపము కంటె 'ంబు'రూపమే ప్రాచీనముగా కనబడుచున్నది.

'చెఱువు'—దీని కన్నడరూపము 'కెఱె'. కకారము తాలవ్యాచ్చరక మగుటచే తాలవ్యచకారముగా మాఱినది.

'పడుమాఱ్' (కోటక్)—ఇది 'పడుమర, పడమట' అనుదాని ప్రాచీనరూపము కావలయును. దీని యొపవిభక్తికరూపము'పడమటి' యగుచున్నది. ఇందలి 'మర'అనున దేమో, అందు శకటరేఫము ప్రాచీనరూపమున గలుగుటకు గారణమేమో తెలియదు. కన్నడమున 'పడు'శబ్దమే పశ్చిమదిక్కను నర్థమున గలదు. దీనికి పడువ, పడువల్, పడువణ అను రూపాంతరములుగూడ కలవు. పడువణ, పడుమఱలకు సంబంధము కలదేమో.

'తాళ్'— 'తాడి'శబ్దమునకు బూర్వరూపము. తమిళమున 'తాళ్' అనునదే రూపము. 'తాళ' శబ్దము దీని రూపాంతరము గావచ్చును.

'తోంట'—ఇం దనుస్వారస్థానమున నిప్పుడు అరసున్న వచ్చుటచే 'తోఁట'అయినది. తెలుగున దీని మూలధాతువు లోపించినది. తమిళమున 'త్రవ్వు'అనునర్థమున 'తోండు' అనుధాతువు నిలిచియున్నది. దీని నుండి వచ్చిన నామవాచకరూపమే 'తోంట'.

దీనినిబట్టి తెనుగున కాంధ్ర మను పేరు ఆంధ్రులు కృష్ణా గోదావరీ మధ్యదేశము నాంధ్రమునకు వచ్చి యచ్చట రాజ్యము స్థాపించికొని తద్దేశీయులతో గలిసిపోయిననాటినుండి కలిగియుండు ననియు, తెనుంగుభాష యంతకు ప్రాచీనమైన దనియు దీని ప్రాచీనచరిత్ర, పూర్వస్వరూపము నన్వేషింపవలసినచో సన్నిహితములగు నితర దక్షిణదేశ భాషలతో బోల్చి పరిశీలింపవలసియుండు ననియు, ఇది క్రీస్తు శకమునకు బూర్వ మనేకశతాబ్దముల క్రిందటనే తక్కిన అఱవము, కన్నడము మొదలగువానినుండి విడివడి స్వతంత్రభాషగా నేర్పడి క్రీస్తుశకారంభకాలమునుండి సంస్కృతప్రాకృతభాషాప్రభావబలముచే నూతన పరిణామములను బొందజొచ్చిన దనియు తలపదగియున్నది.



అఱవము, తెలుగు - వాని ప్రాచీనత

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

అఱవము, తెనుగు — ఈ భాషల ప్రాచీనతనుగూర్చి కీ. శే. కొమఱ్ఱాజు లక్ష్మణరావుగారిచే వెనుక రచియింపబడి మూలపడియుండిన యొక విమర్శన్యాస మీనడుమ శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారి మూలమున ఆంధ్రపత్రిక వృష సంవత్సరాదిసంచికలో ప్రకటితమగుట తటస్థించినది. అందు ద్రావిడభాషలలో మిక్కిలి పురాతనమైన భాష యేది, అది అఱవమునా, తెనుగు అఱవమునుండి పుట్టినదా అను విషయములు విమర్శింపబడినవి. మూల ద్రావిడభాషాస్వరూపము తక్కిన భాషలకంటె అఱవమున నెక్కుడుగా గనబడుచున్న దను కాల్డ్వెల్ పండితుని యభిప్రాయముతో శ్రీ లక్ష్మణరావుగా రేకీభవింపక, గ్రియర్సన్ మొదలగువారు చెప్పినట్లుగా అఱవముకంటెను తెనుగు మొదలగు నితర ద్రావిడభాషలలోనే ప్రాచీన భాషాసంప్రదాయము లెక్కువగా నిలిచియున్న వనియు, కాని గ్రియర్సన్ అట్టి నిదర్శనములను జూపలేదు గావున తా మట్టివానిని కొన్ని చూపదలచితి మనియు తెలిపియున్నారు. అందుకుగాను కొన్ని సజాతీయపదములను గ్రహించి తెనుగులో నిలిచియున్న యాపదముల రూపమే తక్కిన యఱవ కన్నడ భాషారూపములకంటె ప్రాచీనమని నిరూపింప యత్నించియున్నారు. తెనుగు భాషలో మూలభాష యొక్క పురాతన స్వరూపమును సూచించు చిహ్నములు—అఱవకన్నడములనుబట్టి యూహ సత్రించుట కవకాశము లేనివి—కొన్ని నిలిచియున్న వనుమాట వాస్తవమేకాని, యీ వ్యాసములో జర్చింపబడిన తెలుగుపదముల స్వరూపము తమిళ కన్నడపదములకంటె మూలభాషాస్వరూపమునకు సన్నిహితమని, ఆకారణముచే నవి ప్రాచీనము లని చెప్పుట కవకాశము గలదా యను విషయముమాత్రము పునఃపరిశీలనార్హమని తోచుటచే నే నీవ్యాసము వ్రాయ గడగితిని.

దక్షిణదేశమున వ్యవహారములో నున్న భాష లన్నియు నొక కుటుంబమునకు జెందిన వనియు, ఆ కుటుంబము ద్రావిడభాషాకుటుంబ మనుపేర బరగుచున్న దనియు, తెనుగు, అఱవము, కన్నడము మొదలగు భాష లొక్క కుటుంబమునకు జెందిన సోదర భాషలని చెప్పబడినపుడు వానిలో నేది పురాతనము, యేదినుండి యేది పుట్టినది యను ప్రశ్నలకు తావుసంభవము లే దనియు, మూలభాషాస్వరూపమునే తత్తద్దేశకాలానుగతములగు మార్పులతో నానాభాషలు వహించి యుండునని యీ మొదలగు విషయములను శ్రీ లక్ష్మణ రావుగా రందు చక్కగ వ్యక్తీకరించియున్నారు.

అఱవము, తెనుగు నొక్క కుటుంబమునకు జెందిన సోదర భాషలు. వీనికి జన్యజనక భావసంబంధము లేదు. కాని తెనుగుభాష పుట్టుపూర్వోత్తరములనుగూర్చి తెలిసికొనదలచినపుడు మాత్రము అఱవభాషయొక్క సాహాయ్య మత్యావశ్యకముగా గనబడును. ఒక్క అఱవముతోడనే కాక తక్కిన దక్షిణదేశభాషలతో గూడ పోల్చి పరిశీలించినగాని తెనుగుభాషయొక్క ప్రాచీనచరిత్రము దెలిసికొన సాధ్యముకాదు. ఈ విషయ మిటీవలనే దక్షిణదేశభాషాతారతమ్యపరిశీలనకు గడగిన కాల్డ్వెల్ పండితుడు మొదలగువారి పరిశ్రమలఫలముగా గనిపట్టబడినది.

తెనుగుభాష పుట్టుక, పూర్వచరిత్రములనుగూర్చి భిన్నమతములు కలవు. "ఆంధ్రభాష వికృతి. అనగా సంస్కృత ప్రాకృతములనుండి యేర్పడిన" దని యాంధ్రవైయాకరణుల మతము. ఇది ప్రాకృతములలో నొకటియే యని, లేదా అర్ధమాగధియొక్కగాని, పైశాచీ ప్రాకృతముయొక్కగాని పరిణతరూపమే యని కొందఱి మతము. సంస్కృతప్రాకృతములనుండి

పదజాలము విశేషముగా దీనిలో జేరినను, తెనుగు భాషయంతయు సంస్కృత ప్రాకృతభవము కాదనియు, తెనుగు దేశ్యమునుబట్టియే దాని ముఖ్యలక్షణములను గ్రహింపవలయు ననియు, నాలక్షణములలో దీనికి దక్షిణహిందూదేశభాషలతో సన్నిహితసంబంధము కనబడుచుండుటచే నిది ద్రావిడభాష లనబడు దక్షిణ హిందూదేశభాషలతో సాజాత్యముగలిగిన యొక స్వతంత్రభాషయే కాని సంస్కృతప్రాకృతములవికృతి కాదనియు మఱికొందఱ మతము.

ఈ దక్షిణదేశభాషలగు తెలుగు, అఱవము, కన్నడము, మలయాళము మొదలగునవి సజాతీయము లని చెప్పువారు వీనికి ద్రావిడభాషాకుటుంబ మని వాడుచుందురు. ఒక మూలభాషనుండి యేర్పడినవై కాలక్రమమున గలిగిన మార్పుల మూలముగా భిన్నములు, స్వతంత్రములు నైన భాషలనే, వానికి గల సజాతీయత్వమునుబట్టి, యొక భాషాకుటుంబముగా భాషాతత్త్వవేత్తలు పరిగణింతురు. ఇవియన్నియు నొక కుటుంబమునకు జెందినవని చెప్పబడినప్పుడు ఇవి యన్నియు నొక మూలభాషనుండి కాలక్రమమున బయలుదేరిన సోదరభాషలని తలపవలయునే కాని, వీనిలో నొక్కదాని నుండి యేది పుట్టినది యను ప్రశ్న కవకాశము లేదు. కాని వీనిలో నొక్కొకదానినుండి ప్రాంతీయభాషలు బయలుదేరి యవి మరల స్వతంత్రము లైనప్పుడు అట్టి భాషలలో శాఖ లేర్పడు ననుట కవకాశము లేకపోలేదు. ఒక మూలభాషనుండి యేర్పడిన సజాతీయ భాషలని చెప్పబడుచున్న అఱవము, కన్నడము, తెలుగు మొదలగువాని విషయములో మాత్ర మొకదాని నుండి మఱియొకటి పుట్టినదని కాని, ఒకటి పురాతనము, ఒకటి యర్వాచీనము అని కాని తలచుట కవకాశ ముండదు. కాని యీప్రశ్న తఱచుగా బయలుదేరుచునే యున్నది. అందు కొక కారణము ఎవరి భాషయందు వారికి గల యభిమానాతిశయము కావచ్చును. అది పాటింపదగినది కాదుగదా. ఒక భాషయందు లభించిన వాఙ్మయ మితరభాషల లోనిదానికంటె ప్రాచీనమై యగపడుచుండుటవలన గూడ నట్టి భావ మేర్పడవచ్చును. తెనుగు కన్నడములం దిప్పటికి లభించిన వాఙ్మయముకంటె మిగుల ప్రాచీనమగు వాఙ్మయము తమిళభాషలో గలదను టకు దగిన కారణము లగపడుచున్నవి. కాని యొక భాషలో నితర సోదరభాషలందుకంటె ప్రాచీన మన దగిన వాఙ్మయము లభించినంతమాత్రమున దానినుండి యితరములు పుట్టినవని నిరూపింప సాధ్యము కాదు. ఇతరభాషలలోని వాఙ్మయ మేకారణములచే నంతరించినదో, వృద్ధినొందనే లేదో యను విషయములను చారిత్రకదృష్టితో బరిశీలింపవలసియుండును. తమిళభాషలో ప్రాచీనవాఙ్మయ ముండుటయే కాక భాషారూపములలో గూడ ననేకము లితరభాషారూపముల కంటె ప్రాచీనములుగ గనబడుటచేతనో, ఆభాషతో నితరదక్షిణదేశభాషలతోడి పరిచయముకంటె నెక్కుడుపరిచయము కలుగుటచేతనో "కాల్డ్వెల్ పండితుడు అఱవభాష యితరభాషలకంటె మూల ద్రావిడభాషకు సన్నిహితమైయుండు ననియు, మూల భాషాస్వరూపము ఈ భాషలో నెక్కుడు కనబడు చున్న దనియు జెప్పినమాట వాస్తవమే. అది వాస్తవము కాదనియు, తెలుగు మొదలగు నితరద్రావిడ భాషలలో నఱవమునందుకంటె నెక్కుడు పురాతనము లైన విశేషరూపములు కనబడుచున్నవి గావున నఱవముకూడ నితరభాషలవలెనే యొక యుపభాషయే కాని, దీనికంటె ప్రాచీనమని చెప్పుట కవకాశ మేమియు లేదనియు గ్రియర్సన్ పండితుడు మొదలగు వారు చెప్పియున్నారు. విచారింపగా నీ యిద్దరు పాశ్చాత్యపండితుల యభిప్రాయములలోను ప్రమాద కరమైన వైరుధ్యము వాస్తవముగా లేదనియే చెప్ప వచ్చును. ఏలయనగా ప్రాచీనమగు మూలద్రావిడ భాషాస్వరూపమును మన మన్వేషించి గుర్తింపవలె నన్నచో నీ యఱవకన్నడాంధ్రాదిభాషలలోని విశేష రూపముల నన్నిటిని పరిపోల్చిచూచి, వానిలో కాల క్రమమున గలిగిన మార్పులను గమనించి, వానిమూల మున నాయాభాషల ప్రత్యేకలక్షణములను నిర్ణయించి వీని మూలముగా నేయే మూలభాషారూపము లెట్టిసంప్ర దాయములకు లోనై యాయాభాషలలో కాలక్రమ మున నాయారూపములను బొందినవో కనిపట్టిన పిమ్మటనే, యా మూలభాషాస్వరూపమును మనము

గోచరింపజేసికొని, యాయా భిన్నరూపములందు పొడకట్టిన సామ్యభాగములనుబట్టి ఆ మూల భాషను నిర్మాణముచేయవలసియుండును. కావున నా ప్రాచీనభాషాస్వరూపమును గుర్తించు విషయములో నీ సజాతీయ సోదరభాషలన్నియు మనకు సమానముగ దోడ్పడగలిగియే యున్నది. కొన్ని సహజ లక్షణము లొకభాషలో మార్పునొందక నిలిచియుండ మఱికొన్ని లక్షణములు మఱికొన్ని భాషలలో నిలిచి యుండవచ్చును. కావుననే వాఙ్మయముకూడ లేని తుళుభాషలోని లక్షణములు కొన్ని యతిప్రాచీనము లని తద్భాషాపరిశీలకులు చెప్పుదురు. అట్లే మధ్యపరగణాలలోని గోండు, కుయి, రాజమహాల్ భాషలు, బ్రాహుయీ భాష మొదలైనవికూడ మూలభాషా స్వరూపనిర్ణయమున చాల ప్రయోజనకారులగునని తలపబడుచున్నది. కాని యీనడుమ పాశ్చాత్యులగు భాషాతత్త్వవేత్తలు కొందరు ఈ మధ్యపరగణాలలోని ఆటవికజాతులు వ్యవహరించు గోండు మొదలగు ద్రావిడభాషలే ద్రావిడభాషాతత్త్వ పరిశోధనము విషయమున తమిళభాషకంటెనుగూడ నెక్కువగా తోడ్పడ గలవనియు, నాకారణముచే నీ పరిశోధనము దక్షిణపు కొననున్న తమిళభాషతో ప్రారంభించుటకన్న మధ్యదేశమందలి యాయాటవికుల భాషల పరిశీలనము తోనే ప్రారంభించుట మిక్కిలి ప్రయోజనకారి కాగలదనియు చెప్పకొడగిరి.* ఈ పరిశోధన విషయమున సంస్కారముగలిగిన తమిళాదిభాషలకు గల ప్రాధాన్యమును సంస్కారహీనములగు గోండు మొదలగువానికి నివ్వవలసియుండునని చెప్పుట న్యాయమేమోకాని, తమిళాదిభాషలకు గల ప్రాధాన్యమును తగ్గింపజూచుట సాహసమనక తప్పదు. ఒకభాషలో నెంత ప్రాచీనమగు వాఙ్మయము లభించిన నంత ప్రాచీన కాలమువరకు నాభాషయొక్క స్వరూపపరిణామము నన్వేషించుటకు సులభావకాశము దొరకునుగదా. వాఙ్మయసామగ్రిలేని భాషలలో నెన్ని యతిప్రాచీన లక్షణములు నిలిచియున్నను, వాని ప్రాచీనత యిట్టిదని నిర్ణయించుటకు తగిన యాధార ముండదు కావున నితరనిదర్శనముల జేసికొనిన నిర్ణయముల సరిమాపకొను టకుమాత్రము నుపయోగించును. అవి సంస్కారహీనము లగు భాషలగుటచే నాభాషారూపములు తొందర తొందరగా నెక్కువమార్పులకు లోనగుచుండుట యూహింపవచ్చును.

పైనిజెప్పిన జూలిస్‌బ్లాక్, టటిల్ పండితుల యభిప్రాయము దక్షిణదేశీయములగు ద్రావిడభాషలకు ఉత్తరదేశీయములగు నార్యభాషలపై గల ప్రభావ మెట్టిదను విషయమునుగూర్చి చర్చించునపుడు తెలుపబడినదేయైనను ద్రావిడభాషావిశేషలక్షణములను దలచికొనదలచినప్పుడు తమిళభాషయొక్క ప్రాముఖ్యమును తగ్గించుట కేవిధమగు నవకాశమును లేదనియే చెప్పవలసియున్నది. ప్రాచీనద్రావిడభాషాలక్షణములు దానినుండి బయలుదేరిన భాషలన్నిటిలోను గనబడుచుండు నగుట సహజమేయైనను, తమిళభాషకు దక్కిన వానికంటె ప్రాచీనకాలముననే సంస్కార మేర్పడుట చేతను, వాఙ్మయము బయలుదేరుటచేతను, అవి మన కిప్పుడు లభ్యములైయుండుటచేతను వానినిబట్టి తక్కిన భాషలలో నేయేకాలమున నెట్టిమార్పులు గలిగినవో, వాని పరిణామక్రమ మెట్టిదో సరిపోల్చి తెలిసికొనుట

* *"If we want to understand the history of the languages of the South, we should begin from the Northern side"— E. Tuttle of America.*

"The Dravidian language which has almost always been chosen for comparison is Tamil, which, in fact is best known of all the dialects for various reasons. Even if we admit that from the Vedic up to the present time, Tamil has changed very little, there still remains the fact that the domain of this Dravidian dialect is the further most off from the region of Vedic civilization on this principle alone, it should have been the last one to be taken into consideration for the sake of comparative study. If we want to understand the history of the languages of the South we should begin from the Northern side." (Pre- Aryan & Pre- Dravidian).

కవకాశ మేర్పడుచున్నది. ఈవిషయమున దీనివలన గలుగు ప్రయోజనము విశేష మనియే చెప్పకతప్పదు. గ్రియర్సన్ పండితుడు తమిళ భాషయొక్క ప్రాముఖ్యమును గూర్చి కాల్డ్వెల్ చెప్పిన యభిప్రాయము నించుక యాక్షేపించుచు, తక్కిన భాషల సమప్రాధాన్యమును గూర్చి నొక్కి చెప్పదలచినవాడైనను, తెనుగు మొదలగు భాషలలోనుండి గ్రహింపవలసిన ప్రాచీనభాషాలక్షణములను గూర్చిన ప్రత్యేకనిదర్శనములను దేనిని జూపకయే విడిచిపెట్టవలసినవాడైనాడు. కారణము బహుశః అది యంత ముఖ్యమైనదని కాకపోవుటయే [illegible] యుండును. ఈ విషయమును గూర్చి గ్రియర్సను రావుగారే యుపన్యాసమున తెలిపియున్నారు. పిదప గ్రియర్సన్ పండితుడు తమ పెట్టిన నియమములనే తాము నిర్వహింపలేనందున కాని తమిళాంధ్రములలో తమిళముకంటె తెనుగే ప్రాచీన భాషాలక్షణములను మనకు సుస్పష్టము చేయగలదని చూపదలచినప్పుడు వారి భాషలలోని పదములను నిదర్శనముగా గ్రహించుటలో బాగుగ నాలోచించి చేసినట్లగపడదు. అట్లాలోచింపకపోవుటకు కారణము గాదు. ఒకవిషయము ప్రమాదములో బడియుండును. దానికి కారణ మప్పటికి మనవారికి సంస్కృత ప్రాకృత భాషాలక్షణములు, సంప్రదాయములు తెలిసినట్లుగా ద్రావిడభాషాసంప్రదాయములు బాగుగా తెలియకపోవుట కారణమైయుండవచ్చును. అది యిప్పటి కంటె విశేషముగా పరిశీలింపబడలేదు. ఇప్పుడు మాత్రము తెలిసి యూహించెదనని చెప్పవచ్చునా యను ప్రశ్న రావచ్చును గాని, ఏదో కొంతవఱకు జరుగుచున్నదని మాత్రము చెప్పకతప్పదు.

తమిళముకంటె తెనుగుయొక్క పురాతనత్వమును జూపుటకు నిదర్శనముగా గ్రహించిన శబ్దములలో, తెనుగునందలి నాని రూపములు సంయుక్తాక్షరయుతము లగుటచే నవి వాని పురాతనత్వమును సూచించు ననియు, తమిళరూపములు విడిపోయిన సంయుక్తత్వము గలవి గావున నర్వాచీనములై యుండు ననియు తెలిపిరి. అట్లనుటకు కారణమేమనగా సంయుక్తాక్షరములు గల శబ్దములు మొదటివిగ నుండు ననియు, తరువాత నందుండి వికృతిశబ్దములు పుట్టునప్పుడు ఉచ్చారణసౌకర్యార్థమై సంయుక్తాక్షరములు విడదీయబడుననుటయు తెల్లమే యగుట. ఇందులకింకను నిదర్శనము వలయునన్న ప్రాకృతవ్యాకరణములను జూడవలయునని వారి వాదము. ఈవాదమంతయు యుక్తియుక్తముగనే యున్నట్లగపడును గాని వాస్తవస్థితి దెలుపుచున్నదా యని మాత్రము పరిశీలింపవలసియున్నది. సామాన్యముగాను, అందు ప్రధానముగ ద్రావిడభాషలలోను, ప్రాకృతభాషలలోను గూడ సంయుక్తాక్షరములతో గూడిన సంస్కృతాద్యన్యభాషాపదములు స్వీకరింపబడునప్పుడు వానియందలి సంయుక్తాక్షరములు విడదీయబడి నడుమ నేదో యొక అచ్చు చేర్పబడుచుండు నాచారము యుండిన నుండవచ్చును గాని, యీపద్ధతి, అన్నియు నింత ప్రబలముగా తమిళ కన్నడాది ద్రావిడభాషలలోను, ప్రాకృతములలోను మాత్రము కనబడుచుండుటకు గల కారణ మేమి యని మనము విచారింపవలసియున్నది. సంస్కృతభాషలలోను, ఆంగ్లము మొదలగు భాషలలోను సంయుక్తాక్షరములతో గూడిన పదము లనేకము లున్నవి. కాని యాభాషలలో నవి యుచ్చారణ సౌకర్యార్థమై, ఆభాషను వ్యవహరించు జనులచే, నా సంయుక్తాక్షరములు విడదీయబడి పలికినట్లుగాని, ఆభాషలలో నట్టి శబ్దములకు ద్విరూపములు కలిగినట్లుగాని కనబడదు. కాని అవియును ద్రావిడభాషలను వ్యవహరించు జనులచే నుచ్చరింపబడినప్పుడు అందలి సంయుక్తాక్షరములు తప్పక విడదీయబడియే పలుకబడుచున్నవి. ఒకవేళ విడదీయబడి నడుమ అచ్చు చేర్పబడనిచో, నా సంయుక్తాక్షరములోని యొక వర్ణము రెండవదానితో సావర్ణ్యమును బొంది, అది ద్విత్వాక్షరముగా నేర్పడుచున్నది. తమిళాంధ్ర కర్ణాటకాదిభాషలలో నేనిఘంటువును తెఱచి చూచినను పెక్కుపదము లిట్టివి మనకు కంటబడగలవు.

సం. ప్రా.	తె. సి.	త. తిరు.
అగ్ని	తె. అగ్గి	అగిని
ఉద్యోగ		ఉత్తియోగం
యుక్తి	జుత్తి	ఉత్తి
ఋక్ష	రిక్క	

బ్రాహ్మణ బమ్మ పిరమిన
శుక్ర చుక్ర
Hospital తె. ఆసుపత్త్రి

సంస్కృతాదిభాషాశబ్దములు ద్రావిడభాషలలో బొందిన మార్పులను బట్టి చూడగా నందలి భిన్నాక్షరసంయోగము నుచ్చరించుట కలవాటుపడనివారు పదముల నుచ్చరింపవలసివచ్చినపుడు స్వోచ్చారణసంప్రదాయముల కనుగుణముగా జేసికొనిన మార్పులను లోనైనవిగా కనబడుచున్నవేకాని కేవల ముచ్చారణసౌలభ్యముకొరకు మాత్రమే యేర్పడిన ట్లగపడదు. ఏలయనగా సంయుక్తాక్షరములతో గూడిన సంస్కృతశబ్దములు తద్భవములై దక్షిణదేశభాషలలో నెద్దాన ప్రవేశించినను ఒక్కరీతినే సంయుక్తాక్షరముల సంయుక్తత్వము విశ్లేషమును బొందుచున్నది. తెలుగున తత్సమరూపమున ప్రవేశించినవానిలో మార్పు లేకున్నను, తద్భవరూపము లన్నిటిలోను తమిళము నందువలెనే సంయుక్తవర్ణత్వము సహింపబడుటలేదు. దీనిబట్టి పదములందు సంయుక్తవర్ణసహిష్ణుత్వము ద్రావిడభాషాకుటుంబములలో నొకటిగా గ్రహింపవలసియున్నది. పదములయందు అనునాసికలతో తప్ప నితరవర్ణములకు సంయుక్తత్వము సహింపకుండుట, మహాప్రాణములను వ్యవహరింపకుండుట, రెండుమూడుపదములకు మించిన దీర్ఘసమాసములు లేకుండుట మొదలగునవి యా భాషలకు సహజలక్షణములు. ఇట్టి యుచ్చారణసంప్రదాయములు కలవాటుపడినవారు గనుకనే తొలుత సంస్కృతభాషతో వీరికి సంసర్గము గలిగి యాపదములను వీరు వ్యవహరింపవలసివచ్చినపుడు అందలి సంయుక్తాక్షరములను విడదీసి పలికియు, మహాప్రాణముల నల్పప్రాణములుగ జేసియు నా యా పదములను తమ భాషలోనికి దెచ్చుకొనిరి. ఇది యీ భాషలకు సహజసంప్రదాయసిద్ధమగుటచేత నేకాని, కేవల తాత్కాలికసౌకర్యముమాత్రమే కారణముగా జరిగిన పనికాదు. అట్లైనచో సంస్కృతము వ్యవహరించువారిలో గూడ నిట్టిమార్పు కలిగి, సంస్కృతభాషలోనే యా యా పదములకు ద్వైరూప్యము సిద్ధించియుండునుగదా.

ఇక సంస్కృతజన్యము లనదగిన ప్రాకృతములలో నట్టిమార్పు కలిగియుండలేదా అను ప్రశ్న కలదు. ప్రాకృతభాషలలో నట్టిమార్పు కలుగుటకు ప్రధానకారణ మా సంస్కృతభాష నతిప్రాచీనకాలమున నవలంబించి వ్యవహరింపవలసిన యార్యజనసంఘమునందలి క్రిందితరగతివా రగు సామాన్యప్రాకృతజనులలో ద్రావిడులో, లేదా ఈ ద్రావిడభాషాసంప్రదాయముల కలవడినవారో విశేషముగా నుండియుండుటయే యని చెప్పవలసియున్నది. హిందూదేశపు వాయవ్యదిగ్భాగమున నిలిచియున్న బ్రాహూయి భాషను బట్టియు, మధ్యపరగణాలలో నిప్పటికిని వ్యవహరింపబడుచున్న గోండు, కుయి, రాజమహాల్ మొదలగు భాషలను బట్టియు, నింక ననేక కారణములను బట్టియు నొకకాలమున నుత్తరహిందూదేశమున గూడ ద్రావిడభాషలను వ్యవహరించు జనులు నివసించియుండిరని యూహింపక తప్పదు. ఈ ద్రావిడభాషాసంప్రదాయముల కలవడిన యుత్తరహిందూస్థానమునందలి ప్రాకృతజనుల మూలముననే — అనగా నా దేశమున వ్యాప్తిలోనున్న యార్యభాషను స్వీయోచ్చారణసంప్రదాయానుసారముగా వ్యవహరించుటజేసియే హిందూదేశమునందలి ప్రాచీనార్యుల వైదికభాష కాలక్రమమున ప్రాకృతభాషగా మారిపోయియుండును. కావుననే దక్షిణదేశమున నెలకొనిన ద్రావిడభాషల సంప్రదాయములు కొన్ని యుత్తరహిందూస్థానమునందలి ప్రాకృతభాషలలోను, విశేషముగా దత్ప్రకృతిభవములగు నాధునికార్యభాషలలోను గానవచ్చుచుండుట. అట్టి లక్షణములలో సంయుక్తాక్షరములను విడదీసికాని, లేదా సావర్ణ్యమును బొందించికాని పలుకుట యనున దొకటి. కావుననే యీలక్షణము దక్షిణమునందలి ద్రావిడభాషలకును, ఉత్తరదేశమునందలి ప్రాకృతాద్యార్యభాషలకును సమానమైన దగుట తటస్థించినది.

ఇదియే ద్రావిడభాషలకు సహజలక్షణమైనచో తెలుగు కన్నడముల మాటలలో ననేకపదములలో సంయుక్తవర్ణములు కనబడుచున్నవే యను ప్రశ్న కలదు. దీనికి ప్రధానకారణ మా భాషలపై సంస్కృతభాషకు గలిగిన ప్రబలప్రభావమే. అదియైనను సంస్కృతసమశబ్దములలో గానవచ్చునేకాని దేశ్యశబ్దములలో విశేషముగ గానరాదు. సంస్కృతసమ మీ భాషలలో గలిసి

నట్లుగా దమిళభాషలో గలిసియుండలేదు. ద్రావిడ భాషాసంప్రదాయానుసారముగా వర్ణసంస్కారమును బొందని సంస్కృతశబ్దమునకు తమిళభాషలో ప్రవేశమే లేకపోయినది. కావుననే యా భాషలో తక్కిన తెలుగు కన్నడములందువలె ననునాసికలతో తప్ప భిన్నవర్ణసంయోగముతో గూడిన శబ్దములే కనబడవు.

ఇట్టిది ద్రావిడభాషాసహజమగు సంప్రదాయమే యయినట్లయినచో, తెలుగునమాత్రము అందులో పదాదిని సంయుక్తవర్ణముతో గూడిన యిన్నిపదములెట్లు వచ్చిన వన్న ప్రశ్న నిలిచియున్నది. దీనిని గురించి మఱియొక విశేషము గమనింపదగియున్నది. తెనుగున పదాదిని సంయుక్తాక్షరము గల పదములలో ననేకములు—బహుశః సర్వమును గూడ—రేఫసంయోగముతో గూడినవే కాని మఱియొకటి కాదు. ద్రావిడభాషాసంప్రదాయమునుబట్టి పదమధ్యమునసైన ద్విత్వరూపాక్షరసంయోగ మెప్పనుగాని పదాది నసలు రాగూడదు; రాదు. అట్టి సందర్భములో తెనుగున నైనను పదాదియందు రేఫసంయోగము వచ్చుట వింతగా కనబడకమానదు. ఇట్టిపదము లితరద్రావిడభాషలలో నెచ్చటను గానరావు. కావున నాంధ్రమున నిది యొక వికృతలక్షణ మనకతప్పదు. ఇది సంస్కృతభాషాసంసర్గబలముచే వచ్చినదై యుండిన నుండవచ్చును. ఈ భాషలో ప్రత్యేకముగ నెలకొనినదని చెప్పినను చెప్పవచ్చును. ఇది యితరద్రావిడభాషలలో నెచ్చటను గానరాకుండుటచేతను, విదేశీయ భాషలనుండి సంగ్రహించిన, సంగ్రహింపబడుచున్న పదములలో నిప్పటికి నీ భాషలన్నిటిలోగూడ నట్టి సంయుక్తత్వము తొలగింపబడుచునే యుండుటచేతను ఇది తెనుగునకు మాత్రమే యొకకాలమున గలిగిన విశేషలక్షణ మనియు, సామాన్యద్రావిడభాషాసంప్రదాయసిద్ధము కాదనియు చెప్పవలసివచ్చుచున్నది.

తెలుగులోని యీవిశేషరూపములు 'వర్ణప్లుతి' యను స్వరసూత్రము(Phonetic principle)ననుసరించి యేర్పడినవై యున్నవి. దీనినే Metathesis అని ఆధునికశబ్దతత్త్వశాస్త్రవేత్తలు చెప్పుదురు. వర్ణప్లుతి యనగా నొకపదమునందలి సమీపాక్షరములలోని యొకవర్ణము తన స్థానమునుండి యెగిరిపోయి ప్రక్కవర్ణముపై నిలుచుట. 'విరల్' శబ్దములోని రేఫము తనకు సన్నిహితమునందున్న 'వి' అనుదానిలోని ఇకార వ్యవధానమును తప్పించుకొని వకారముపై నెగిరిపడగా వ్ + ఇ + ర్ + అ + ల్ > వ్ + ర్ + ఇ + అ + ల్ = వ్రిఅల్—వ్రేల్—వ్రేలు అని వకారరేఫసంయోగము ప్రాప్తించిన తరువాత నున్న ఇకార అకారసంయోగముచే ఏత్వసిద్ధి గలిగి వ్రేల్ > వేలు రూపము సిద్ధించుచున్నది. ఇది యథాస్థితియొక్క వర్ణనము మాత్రమే. భాషలో నిట్టిమార్పు లనేకస్థలముల గలుగుటను జూచి, అది యాభాష కొక ప్రత్యేకలక్షణముగా గ్రహించి, యిట్టివి యితరభాషలలో నెచ్చటనైన నున్నచో వానికి గల కారణముల నారసి భాషాతత్త్వవేత్తలు కొన్ని సామాన్యస్వరసూత్రముల General Phonetic laws) నేర్పాటుచేయుదురు. ఈవర్ణప్లుతి యనునదియు నట్టివానిలో నొకటి. ఇట్టివి గలుగుటకు మూలకారణ మేమి యని విచారించినచో ఒకపదములోని వర్ణముల నుచ్చరించుటలో గలుగు త్వరయే యయియుండునని చెప్పవలసియుండును. ఆ త్వరితోచ్చారణమునుబట్టి వర్ణములు తారుమారగుచుండును. ఇట్టిరేఫమే కాక ఒక పదమందలి యక్షరములే మారుచుండుటయు గలదు. అప్పుడాపదములకు ఒక్కభాషలోనే ద్వైరూప్యము సిద్ధించును. మాదిరి :

అరల్—అలర్—అలరు = పుష్పము. cf. క. అరల్—to expand, to open.

గులివి—గుపిలి

ఎఱల్—ఎరర్ cf. తె. లమ్మెరలు. కన్న. తెంబెలర్

అగప—అబక

చమురు—చరుము

పాడగము—పాగడము

పిచ్చిలు—చిప్పిలు cf. తమి. పిచిర్—to drizzle

దబ్బ—బద్ద cf. తమి. తప్పై=Split bamboo

కుతకుత—తుకతుక

పొక్కిలి—క. పొక్కుళ్; త. కొప్పూళ్

పిగిలు—క. పిళిగు. cf. త. పిళ= to be rent

సం. ఆత్మశబ్దమునుండి(ఆత్పమూలముగా)అత్తశబ్ద మేర్పడుటకు గారణ మీ వర్ణప్లుతియే యని పిషెల్ పండితుని యభిప్రాయము. 'వారాణసీ' శబ్దమునుండి వర్ణప్లుతిచేత 'వాణారసి' యను రూపము గలుగుట చేతనే ఇంగ్లీషులో 'బెనారస్' (Benares) అను శబ్ద మేర్పడినది. ఇట్టి వనేకములు కలవు.

దీనినిబట్టి యుచ్చారణమందలి త్వరనుబట్టి పలుకునప్పు డొక పదమునందలి వర్ణములు తెగబడు చుండును, లేదా తారుమా రగుచుండును అని తెలియు చున్నదిగదా. ఈ కారణముచేతనే తెలుగుభాష మూల ద్రావిడభాషనుండి విడివడి ప్రత్యేకభాషగా నేర్పడిన పిదప నెప్పుడో కొంతకాలమునకు ద్వితీయాక్షరము రేఫగా గలిగిన మూలభాషాపదముల యుచ్చారణమున గొంతమార్పు గలిగి యందలి రేఫము తొలివర్ణము మీదికి ముందుకువచ్చి దానితో గలియుటచే బదాదియందు రేఫసంయుక్త వర్ణములు గలుగుట తటస్థించినది. పదాది యందలి రేఫసంయుక్తవర్ణముతో గూడిన రూపమే ప్రాచీనము. ఉచ్చారణసౌకర్యమునకై నడుమ నచ్చుచేరుటచేతనే తక్కినరూపము లేర్పడిన వన రాదా యన్నచో, పదాదియందు సంయుక్తాక్షరము గలుగుట యీ భాషలకు సహజలక్షణము కాదనియు, పదాదియందేకాక పదమధ్యమందైనను ద్విత్వాక్షర ములు తక్క స్పర్శవర్ణములకు పరస్పరసంయో గము పొసగదనియు నిదివరకే సూచించియున్నాను. ఇదియే సహజలక్షణ మని చెప్పగలుగుట యెట్లన్నచో నీభాషలలోని పదజాలముయొక్క వైఖరిని పరిశీలింపు డనియే చెప్పవలసియుండును. ఇతర ద్రావిడభాషలలోనే కాదు, తెనుగునందలి కోశము లను బరీక్షించినను దేశ్యపదములలో నీ రేఫసంయో గముతక్క సంయుక్తాక్షర మాదియందుగల శబ్దము లేమియు గానరావు. ఇంతేకాక సజాతీయము లగు భాషలన్నిటిలో నీశబ్దములు సంయుక్తవర్ణ రహి తములై కనబడుచుండగా నొక్క తెనుగునందే యిట్లుండుటనుబట్టి యిది యీ భాషకు విలక్షణ మని తలపవలసినదేకాని యొక్క భాషలోమాత్రమే కన బడు విశేషలక్షణమును సజాతీయభాషల కన్నిటికి సహజలక్షణమనికాని, యది దాని ప్రాచీనతకు చిహ్న మనికాని గ్రహించుట యెంతమాత్రమును యుక్తము కాదు. ఈ భాషలలోని శబ్దములు సామాన్యముగా రెండుమూడక్షరములకు మించినవిగా నుండవు. సంస్కృతమందువలె దీర్ఘసమాసములు లేవు. భావభేదము లను సూచించుటకుగా నొక ధాతువునకు, లేదా శబ్దము నకు మఱియొక ధాతువును, లేదా శబ్దమును జేర్చు టయే వీరి సంప్రదాయము. అనగా 'శబ్దపల్లవము'లను కల్పించుటయే యీభాషలకు సహజలక్షణముగాని దీర్ఘసమాసములను గూర్చుట కాదు.

'కొను' ధాతువుసహాయమువలన ఎత్తికొను, మార్కొను, మూర్కొను, చేకొను మొదలైన వెన్నో కలవు. అట్లే పడు-తలపడు, నిలబడు, విడివడు, ఒడబడు మొ. ఎంచు-ఏసడెంచు, తోతెంచు, అరుదెంచు, కడతేరు, వీతెంచు మొ. ఆడు-మాటాడు, వేటాడు, కొట్లాడు, పాలసాడు, తిరుగాడు, చెనలాడు మొ. ఇట్లే యనేకములు.

ఇటీవలి భాషలో సంయుక్తాక్షరములతో గూడిన పదములు కొన్ని కానవచ్చినను, అవి సామాన్యముగా ఉచ్చారణవేగమునుబట్టి కలిగిన యక్షరలోప ముచే నేర్పడిన యర్వాచీనరూపములు. ఉదా: కలికి- కల్కి, ములికి- ముల్కి, కోరికి- కోర్కి, చెలువు - చెల్వు, గెల్వు, కల్వ, కుదురుచు-కుదుర్చు, అమర్చు, కూర్చు, చేర్చు మొ. తగను-తగ్గు (తగ్గు), మాఱుమాట-మార్మాట, నీరు వామి-నీర్వామి మొ.

పదాదియందు రేఫసంయుక్తాక్షరము గలిగిన పదము లిట్టి యక్షరలోపముచే నేర్పడినవి కావు. కాని యవి ద్వితీయాక్షరము రేఫగా నున్న ప్రాచీన పదములలో గలిగిన రేఫప్లుతివలన నేర్పడిన యర్వాచీన రూపము లనుటకు సందేహములేదు. ఇది తెనుగునందే విశేషముగా గానవచ్చుటచే నిది దీని కొక విశేషలక్షణ మనవలసి వచ్చినది. ఇది యొకకాలమున భాషలో బయలుదేరినను ఇది సామాన్యముగా ద్రావిడభాషాసంప్రదాయమునకు విరుద్ధముగుటచేతనేకాబోలు నిటీవల నిది యీ భాషలో గూడ నిలువక మరల మార్పునొందుట తటస్థించినది. కావుననే పదాదిరేఫసంయోగ మీభాషలో నిటీవలికాల

మున నంతరించినది. ఆపదములలోని రేఫము లోపించి రెండవ వర్ణమాత్రమే నిలుచుట తటస్థించినది. అనగా మరం-మ్రానై, మరల మానైనది. విరల్-వ్రేలై, మరల వేలైనది. ఇట్లే భాషలలోని పదాద్యక్షరము లోని రేఫము లోపించుటచే నాపదము లన్నిటికిని ద్వైరూప్య మిప్పుడు సిద్ధించినది. పదాదియందు సంయుక్తాక్షరము నిలుచుట యీ ద్రావిడభాషా సంప్రదాయ మేమాత్రమును కాదని చెప్పదగియుండుటచేతను, అందుకు నిదర్శనముగా నేయితర భాషలలో గాని, యీ తెలుగులోనే కాని మఱి యేపదములలోను ఆదిని సంయుక్తాక్షరము కనబడకపోవుటచేతను కొన్ని తెలుగుపదముల మొదట చేరిన యీ రేఫసంయోగము మధ్యకాలమున నెట్లో వచ్చి, సహజసంప్రదాయ సిద్ధము కాకపోవుటచే మరల నంతరించినదని తలప వలెనదే కాని యది యీ తెలుగుపదముల పురాతనత్వమునకు నిదర్శనముగా గ్రహింపరాదు. ఆ పదముల పరిణామక్రమము నిందుక పరిశీలింతము:

త	మ	క	తు	తె		ధాతువు
మరను	మరమ్	మర		మ్రాను	మాను	మా ?
విరల్	విరల్	బెరల్	బెల్	వ్రేలు	వేలు	విరు = to expand
పొళుదు	పొళుతు	పొళ్తు		ప్రొద్దు	పొద్దు	పొ = to shine, shoot
తిరుప్పు	తిరుప్పు	తిరుపు		త్రిప్పు	తిప్పు	తిర్ = to turn
పరుత్తి	పరుత్తి	పత్తి		ప్రత్తి	పత్తి	ప = to spread
పొళిల్		పొళల్		ప్రోలు	పోలు–వోలు	—
పరమ్బు, పమ్బు	పరగు	పబ్బు, పర్బు		ప్రబ్బు, పంబు, పర్వు	పంబు	పర = to spread, extend etc.
ముళంగు	ముళక్కు	మొళగు		మ్రోగు, మ్రోయు, మొరయు, మొరగు	మోగు	ముళ
కురుడక్	కురుడన్	కురుడ	కురుడ	గ్రుడ్డి	గుడ్డి	—
కురుంగు		కుగ్గు, కుసుగు, కుగ్గు, కుంగు		క్రుంగు	కుంగు	కురు = to bend, shrink
కొళు, కొళుప్పు	కొళు, కొళుప్పు	కొబ్బు, కొవ్వు, కొబ్బు		క్రొవ్వు, కొవ్వు	క్రొవ్వు	కొళు = To grow fat
	కరుగ	కర = an imitative word for some harsh grating sounds		క్రంగు	కంగు	(ధ్వని విశేషము)
కరై	కరక్కు	కరంగు, కరగు = to be dissolved, to melt		క్రాగు = తపనము	కాగు	కర = to melt
తురువు		తురువు = grating scraping		త్రుప్పు	తుప్పు	తురు = to grate scrape

వికృతి యెప్పుడును శబ్దోచ్చారణమును సులభము చేయునేకాని కఠినపఱచ దను సిద్ధాంతము చాలవఱకు సమంజసమైనదే. ఆ సిద్ధాంతమును బట్టి 'ప్రూన్' నుండి 'మరమ్', 'క్రేల్' నుండి 'విరల్' పుట్టిన వనుట యుక్తియుక్తముగనే కనబడునుగాని, వాస్తవస్థితిని తెలుసుకొనుట కొక్కప్పు డింకను లోతుగా బరిశీలింపవలసివచ్చుచుండును. అనగా నాయా పదములయొక్క పూర్వచరిత్రను, వాని నిర్మాణక్రమమును, మూలధాతుస్వరూపము మొదలగువానిని గ్రహించి తత్పరిణామక్రమము నన్వేషించినగాని యిదమిత్థమని నిర్ణయింపవీలుండదు. దీనికితోడుగా నాయా భాషల సహజలక్షణములనుగూడ గమనించి పరిశీలింపవలసియుండును. పదాదియందు సంయుక్తాక్షరము పలుకుట ఈ భాషలలో స్వభావవిరుద్ధము, కష్టతరము నైనను పొఱుదు, పుఱోలు, ముఱంగు, కొఱుప్పు మొదలగు శబ్దములు ద్రుతతరోచ్చారణముతో వ్యవహరింపబడినపుడు ఆ త్వరలో నడిమియచ్చు లోపించుట, లేక వర్ణములు తారుమారగుట మొదలగు మార్పులు జరుగుటచే ప్రొద్దు, ప్రోలు, మ్రోగు, క్రొవ్వు మొదలగురూపము లేర్పడినవి. ఇట్లేర్పడినపుడు పదాది సంయుక్తవర్ణోచ్చారణమునందలి కాఠిన్యము పాటింపబడదు. కాని యీ భాషను వ్యవహరించువారి కది పరిపాటిలోనిది కాకపోవుటచేతనే కాబోలు కాలక్రమమున రేఫము మరల జాఱవిడువబడుట తటస్థించినది.

ఱకారముయొక్క విశేషము : పైశబ్దములందు గొన్నిటిలో ద్రావిడభాషలలో వింతయక్కర మనబడు 'ఱ'కార మొకటి కనబడుచున్నది. ఇది తమిళకన్నడ మలయాళములలో ప్రధానముగ మూలధాతువులందు గానవచ్చుచున్నది. కన్నడమున ౧౩-వ శతాబ్దినుండియు, తెనుగున ౧౦, ౧౧-వ శతాబ్దిప్రాంతమునను నంతరించినను, నన్నయకు బూర్వపు శాసనములలో ననేకశబ్దములందు పొడసూపుచునే యున్నది. కావున నితరద్రావిడభాషలతోపాటు ప్రాచీనకాలమున తెనుగునగూడ నీవర్ణము వ్యవహారములో నున్న దనకతప్పదు. ప్రాచీనభాషలలో నీ'ఱ'కారము రెండవయక్షరముగా గూడిన శబ్దములలో నిది రేఫముగ మాఱి వర్ణప్లుతిచే పదాదిసంయోగమునకు గారణమైనది. ప్రొద్దు, ప్రోలు, మ్రోగు, క్రొవ్వు మొదలగు తెలుగుశబ్దములే మూలద్రావిడభాషారూపములైనచో, నందలి తొలిసంయుక్తాక్షరము విడదీయబడినపుడు పొఱుదు, పుఱోలు, ముఱగు - మొఱగు, కొఱువు మొదలగు రూపము లేర్పడునేకాని వీనిలోని రకారస్థానమున నెప్పుడో తరువాతికాలమున 'ఱ' కారము వచ్చినదనుట సమంజసము కాదు. ఒక్క తెలుగులో తక్క తక్కిన ద్రావిడభాషలలో-ముఖ్యముగా తమిళ కన్నడ మలయాళములలో పొఱు, పుఱో, ముఱి కుఱు మొదలగునవి మూలరూపములుగా గనబడుచున్నవి. వీనిపైని గు, అగు మొదలగు ప్రత్యయములనో, పదములనో చేర్చినగాని పై రూపము లేర్పడుటలేదు. ఈ కారణములచే తమిళ కన్నడరూపములకంటె తెనుగు రూపములు ప్రాచీనములని కాని, మూలభాషకు సన్నిహితములని కాని చెప్పుటకు వీలులేదు. ప్రాకృతభాషలలోని ఱా సంప్రదాయములు సంస్కృతమునుండి వచ్చినవికాక, ద్రావిడభాషాసంసర్గముచే వచ్చినవియే కావున నీవిచారణలో వాని సామ్యము ప్రయోజనకారి కాదు.

ప్రోయిల్లు, క్రేగాలు మొదలగు సమాసపదములలోగూడ ప్రో, క్రే రూపములు ప్రాచీనము లనుటకు వీలు లేదు. వీని తమిళ కన్నడ రూపములు పుఱ, కీఱ్ (పుఱయిల్ కీఱ్ కాల్) అనునవి ద్రావిడ వింతయక్కరమగు 'ఱ' కారముతో గూడియున్నవి. ఈ 'ఱ' కారము సామాన్యముగా 'డ' కారముగా తెలుగులో మాఱుచున్నది. పఱం = పండు, కీఱ్ = కేడు. ఈ దృష్టిచేతనే వెనుక నిచ్చిన పట్టికలో 'కొఱుప్పు' అనుదానిని 'కొడుప్పు' అనియు, 'పొఱుదు' అనుదానిని 'పొడుదు' అనియు శ్రీలక్ష్మణరావుగారు వ్రాసియుందురు. ప్రొద్దుపొడిచిన దన్నప్పుడు, 'పొడుచు' లోని డకారముకూడ 'పొఱుదు' లోని, లేదా 'పొఱు' లోని 'ఱ' కారమునకు సంబంధించినదే. 'అప్పుడు' లోని 'డు' వర్ణముకూడ 'అ + పొఱుదు' = 'అప్పొఱుదు' లోని 'ఱ' కారమునకు సంబంధించినదే. కొన్నిశబ్దములలోని 'ఱ' కారము తరువాతికాలమున రేఫముగగూడ మాఱియున్నను రేఫము 'ఱ' కారముగ

మారినదని చెప్పుటకు తెనుగుభాషలోని యీరూపములు తక్క తక్కిన భాషలనుండి నిదర్శనము లగపడవు. కొన్ని సంస్కృతశబ్దములు కన్నడమునజేరినప్పు డాశబ్దములలోని ట, శ, త, రకారములకు బదులుగా కన్నడమున 'ఱ' కారము వచ్చినట్లే (అట్లు వచ్చినదని కేశిరాజు శబ్దమణిదర్పణమున జెప్పియున్నాడు) తెలుగునందలి యీపదాద్యక్షరమందలి రేఫము తమిళకన్నడాదులలో 'ఱ' కారముగా మాఱియుండకూడదా యను వాదము యుక్తియుక్తముగా గనబడినను సమంజసము కాదు. దేశ్యశబ్దములలోను, అందును పెక్కు భాషలలోను 'ఱ' కారముతోగూడిన శబ్దము కనబడినపు డదియే దాని ప్రాచీనరూపముగా గ్రహించుట న్యాయ్యముగాని, యొక భాషలో గొన్ని రూపములలో మాత్రమే కనబడు రకార, డకార, శకారాదుల స్థానమున నీ 'ఱ' కార మిటీవల వెలసిన దనుట యుక్తముగా లేదు. శకటరేఫమునుగూర్చిన వీరి వాదమే దీని కుపబలకము.

ఈ ఱ కారముతోడిదే యీ ద్రావిడ భాషలకు ప్రత్యేకవర్ణమని చెప్పదగిన శకటరేఫమనునది మఱియొకటి కలదు. దీనికి పూర్వకాలమున స్వతంత్రోచ్చారణ ముండి, యది క్రమముగ నశించి రేఫయొక్క యుచ్చారణమును, దీని యుచ్చారణమును సమములగుటచే బూర్వము బండిరాగ బలుకబడిన శబ్దములు క్రమముగ రేఫయుతముగ బలుకబడ జొచ్చెననియు, నాకారణముచే బండి 'ఱ' యుక్తరూపములే పురాతనములుగ నిశ్చయింపవలయునని యు వారు చెప్పియున్నారు. తెనుగున రేఫ శకటరేఫముల భేద మంతగా నిటీవల పాటింపబడక పోయినను, అప్పకవి మొదలగు లాక్షణికులు రేఫ శకటరేఫములతోగూడిన పదముల పట్టికను తయారుచేసి వాని భేదమును నిలువబెట్టియే యున్నారు. యతిప్రాసములలో వీని భేదమును బాటింపనివారిని లాక్షణికకవులుగా గ్రహింపక తూలనాడినారు. అట్లయినను యతిప్రాసములలో సంకరము గలిగినప్పు డట్టి వానికి ద్వైరూప్యమును సాధించి సరిపెట్టుకొనినారు. ఈరీతిగా తెనుగుపదములలోని రేఫశకటరేఫములను నిర్ణయించుటకు నిష్కృష్టమైన సాధనము లేదు. వాని నితరద్రావిడభాషాపదములతో బోల్చిచూచుటయే కొంతవరకైన నిశ్చయించుటకు సాధనము కాగలదు. అట్టి సందర్భములోగూడ తెనుగురూపములలో శకటరేఫము కనబడినంతమాత్రమున వానిని ఇతర భాషారూపములకంటె బురాతనములుగా గ్రహింపవలె నని వాదించుచు, తెనుగులో నన్నయకుబూర్వకాలముననే యంతరించిన 'ఱ'కార మితరభాషాపదములలోను, మూలధాతువులలోనుగూడ గనబడినపుడు, ఆపదములనే ప్రాచీనములుగా గ్రహింపక, తత్స్థానమున వచ్చిన రేఫయుక్తపదములనే ప్రాచీనములుగా గ్రహింపవలె ననుట యెట్లు పొసగును? ఇచ్చట ఉచ్చారణసౌకర్యమును స్వరసంప్రదాయమునకు ప్రాధాన్యమిచ్చితిమని వారు వాదింపవచ్చునుగాని, యది యితర సంప్రదాయవిరుద్ధము కాకుండిననే సమంజసము కాగలదు. కాని అట్లు గానిచో గ్రాహ్యమెట్లగును? ఇక శకటరేఫమువిషయమునగూడ తెనుగుననే యనేక పదములకు ద్వైరూప్యము గలుగుటచేతను ఇతర భాషారూపములతో బోల్చి నిర్ణయింపవలసియుండునే కాని, యీ భాషారూపములనుబట్టి యేది రేఫమో, యేది శకటరేఫమో నిర్ణయింప వీలులేదు. పెక్కు భాషలలో శకటరేఫ మున్నపుడుగాని, లేదా యితర కారణములనుబట్టి యది శకటరేఫమని నిర్ణయింపదగినపుడుగాని యారూపము ఏభాషలోనున్నను ప్రాచీనమే యగును. మేర యను నర్థముగల 'వఱకు' అనునది వీరు గ్రహించినవానిలో తొలిపదము. దీని విషయముననే యీచిక్కు విశేషముగా గనబడుచున్నది. దీనికి ద్వైరూప్యము కలదని లక్ష్మీనారాయణీయనిఘంటువు ఆంధ్రపదపారిజాతమునుబట్టి తెలుపుచున్నది. కావున నిది మొదట సందేహమునకు గారణము. ఈసందేహమును దీర్చికొనుట కితరభాషారూపములను బరిశీలించినచో, తమిళమందలి వరై, వరైప్పు, వరమ్బు లనువానిలోను, కన్నడమందలి వరె, బరె, వరెగం (=Limit, **boundary, upto, until, as far as**) అను పదములలోనుగూడ రేఫమే కానవచ్చుచున్నది. ఇంతేకాక కన్నడనిఘంటుకారుడగు కిటెల్ వరె—వరెగం అను పదమును దేశ్యముగాగూడ గ్రహింపలేదు; తద్భవ శబ్దముల

క్రింద జేర్చినాడు. ఇంతేకాక దీనికి “నీళ్లు వచ్చుట కేర్పరచిన కాలువ, లేక పొలములోని కట్టవ” అనునర్థముగల ‘వరవ’ అను శబ్దముతో సంబంధము కల్పించినాడు. ఇట్టి సందర్భములో తెనుగునందే ద్వైరూప్యము గలిగి యితర భాషలతో పొందిక లేకయున్న యీ ‘వఱకు’ అను శకటరేఫయుక్తరూపమును గ్రహించి యిదియే మూలరూప మనికాని, దీనివలన నా భాషయొక్క పురాతనత్వము ద్యోతక మగుననికాని యెట్లు చెప్ప నగును? మఱియొకదానిని గ్రహించి చూతము: ‘తేఱు’ అనుదాని కఱవమున రేఫయుక్తరూప మున్నట్లు చెప్పినారు. కాని ఆ భాషలో ‘తేఱు’ (To be clarified, to become clear as water) అని శకటరేఫయుక్తరూపము కలదు. కన్నడమున మాత్రము ‘తేరు’ (To reach as the end) అని రేఫమే కనబడుచున్నది. తెనుగునకూడ తేటపడు అను నర్థమున ‘తేఱు’ రూపము కలదని ఆంధ్రపదపారిజాతము సూచించుచున్నది. ఇప్పుడు నిర్ణయ మెట్లు? ‘వఱకు’ శబ్దమువలెనే ద్వైరూప్యమునుబట్టి త్రోసిపుచ్చుటా అని విచారింపగా, పైని దీని కర్థముగా జెప్పబడిన ‘తేటపడు’ అను శబ్దమే ఇందలిది శకటరేఫ మని మనకు సూచించుచున్న దనవచ్చును. ‘తేట’ అనునది ‘తేఱు’ అనుదానినుండి యేర్పడిన నామవాచకరూపమే. శకటరేఫము ద్విత్వమై యుచ్చరింపబడినపుడు ‘ట్ర’ అనుదానివలె పలుకబడుట ద్రావిడభాషాసంప్రదాయములలో నొకటి. తమిళ మలయాళముల నామవాచకరూపము ‘తేఱ్ఱు’ అనునదే. ఇది యుచ్చారణలో ‘తేట్ట’ యై తుదకు ‘తేట’ యైనది. ఈ రూపమే తెనుగుననే కాక కన్నడమునగూడ ‘తేట’ అని నిలిచియున్నది. కావున శకటరేఫముతోగూడినదే యీ శబ్దమని మనము నిర్ణయింపవచ్చును. కాని దీని ప్రాచీనత తెలుగు రూపమునుబట్టిమాత్రమే నిర్ణయింపనగునా? శకటరేఫము టవర్ణముగా బరిణామమందిన రూపము లీ భాషలలో ననేకములు గలవు. cf. చిఱు-చిట్టి, చిటి; మాఱు-మాట; కఱచు-కాటు; మిఱ్ఱు-మిట్టు, మెట్టు; నాఱు-నాటు; నిఱు-నిట్టు)పవాసము; గీఱు-గీటు; కుఱు కుట్టి, కుట్టుగుఱు; ఊఱు-(తె. నీరూరు. తె. ఊఱు - ఊఱ్ఱు - ఊట్టు)) ఊట మొ. ‘ఎఱుపు’ శబ్దమువిషయము సందేహమే. తమిళకన్నడముల రెంటను రేఫమే కనబడుచున్నది. తెనుగులోవలె నా భాషలలో నుచ్చారణభేదము సంపూర్ణముగా రూపుమాసిపోలేదని తద్భాషావేత్తలు చెప్పుదురు. కన్నడమున ఎరె అనగా ఎఱ్ఱనిరంగు (dark red colour) అనియే కాక తమిళమున ‘ఎరువై’ అనగా రక్తము, రాగి (blood, copper) అను నర్థములు కలవు. దీనినిబట్టి రక్తము, రాగి అనువానినిబట్టి వానికి గల రంగు అను నర్థము వచ్చినదేమో యనియు దలపవచ్చును. మొత్తమువిూద తెలుగులోని ‘ఎఱుపు’ శబ్దము అఱవము నందలిదానికంటె శకటరేఫమునుబట్టి పురాతనమని మాత్రము చెప్పుట కవకాశమేమాత్రమును లేదు. తీఱుశబ్దమునకును ద్వైరూప్యము కలదని తెలుగులాక్షణికుల మతము. నిర్ణయించుటకు వేఱుసాధనములు లేవు.

ఇక రెప్ప, రెక్క, రేయి మొదలగు తెలుగు శబ్దముల పురాతనత్వమును సాధించుటకుగా తమిళ భాషాసంప్రదాయము సహాయముగా గైకొనబడినది. ఈ ద్రావిడభాషలలో పదాదియందు సంయుక్తాక్షరము గానట్లే పదాదియందు రేఫ ఱకార లకారములుకూడ రావు. తమిళకన్నడములలో నట్టిశబ్దము లేవియు లేవు. సంస్కృతాద్యన్యభాషలనుండి యట్టిపదము లీభాషలలో బ్రవేశించినచో వాని మొదట అ, ఇ, ఉలలో నేదో యొక వర్ణము చేర్పబడును. రాజన్ అనుశబ్దము తమిళమున ‘అరశన్’ అయినది. రామ-ఇరామన్, లోకం-ఉలుగం మొ. ఈపద్ధతినిబట్టి విచారించగా, అనగా సంస్కృతాద్యన్యభాషాపదము లీ భాషలలో బొందు మార్పుల ననుసరించి చూడగా రకారముతో బ్రారంభింపబడిన రూపము మొదటిదనియు, అచ్చు చేర్పబడిన రూపము తరువాతిది యనియు తెలియవచ్చుచున్న దన్నమాట నిజమే. అట్లగుటకు కారణ మేమనగా రకారాదిశబ్దముల నుచ్చరించుట ప్రాచీన ద్రావిడజనులకు నలవాటు లేకుండుటయే. కావుననే యట్టిపదము లా భాషలలో లేకుండుటయే సంభవించినది. అట్టి పదము లితరభాషలలోనివి వారు వ్యవహరింపవలసి వచ్చినపుడు ఉచ్చారణసౌకర్యమునకై అకారేకారోకారములను ముందు జేర్చికొని యుచ్చరించెడివారు.

ఇది తమిళమునమాత్రము నిలిచినది. తక్కినభాషలలోను, తెనుగున నంతరించినది. రగము > అరదము మొదలగు వానినిబట్టి తెనుగున నొకప్పుడీసంప్రదాయ ముండెనన వచ్చును. స్కూలు అను నింగ్లీషుపదమునందలి తొలి సంయుక్తాక్షరమును పలుకలేక, యుచ్చారణ సౌకర్యమునకుగా 'ఇ' కారమును జేర్చి పలుకుట తెలుగునను గలదుగదా! స్కూలు - ఇస్కూలు; తమి. స్టేషన్ - ఇస్టేషన్. ఇట్లు అన్యభాషాపదముల విషయమున గలిగిన సంప్రదాయము దేశీయపదములపట్లగూడ నన్వయింపగూడదు. అట్లు చేసిన నాసంప్రదాయమే తారుమారగుట తటస్థించును. ఏలయన దేశీయపదములలో రకారాదులే యుండవుగదా! అయితే పదాదిని రేఫము పలుకుట ద్రావిడులకు అలవాటు లేకపోవుటచేతనే యట్టిపదము లీ భాషలలో నే లేవని చెప్పబడినచో తెలుగులో రెప్ప, రెక్క మొదలగుపదము లెట్లు వచ్చినవి అను ప్రశ్న బయలుదేరకమానదు. దీనికిని జెనకటి క్రారతోగూడిన శబ్దముల విషయమందు వలెనే ద్వితీయాక్షరము రేఫగా గలిగెన శబ్దములలోని రేఫ వర్ణప్లుతియే ముఖ్యకారణము. ఇందువలననే తెనుగున పదాదిని రేఫసంయుక్తవర్ణము గలిగెనట్లే, రేఫలకారములతో గూడిన శబ్దములుగూడ బయలుదేరినవి. ఇంక్రైక — ఎంక్రైక — ఎక్క — రెక్క; ఇరవు — ఇరా — రేయి; ఉరల్ — ఒరల్ — రోల్ — రోలు; ఇరట్టి (ఇగండు) రెట్టి — రెట్టింపు మొదలగునవి. తెనుగు కన్నడ కోశములలో జూచినచో నిట్లు రకారాదులగు దేశీయపదములు పది పదునైదుకంటె నెక్కుడుగా కనబడవు. కొన్నిటికి మూలరూపములు తెలియకపోయినను, అవియన్నియు నజాదిపదములలో ద్వితీయస్థానమందున్న రేఫవర్ణముయొక్క ప్లుతిచే నేర్పడినవనియే చెప్పవచ్చును. లకారాదిపదములు నట్టివేయైయుండు ననుటకు సందేహము లేదు మిగిలినపదములనేకము లున్నను అవి సంస్కృతాద్యన్యభాషలనుండి వీనిలో సంక్రమించినవై యుండునేకాని దేశీయములు కావు.

శ్రీ లక్ష్మణరావుగారీ రేఫాదిపదముల విషయమున నీవాదము నెఱుగనివారు కారు. కావుననే 'ఇరప్పై' మొదలగు రూపములే మొదటి వనియు, వానిలోని మొదటియచ్చులు కప్పగంతులువేసి రకారమందలి యచ్చులో గలిసి రెప్ప మొదలైన రూపములు సిద్ధించెనని తెలచు లాక్షణికులు గలరనియు చెప్పుచు, నది స్వభావవిరుద్ధమైనదని వారి తాత్పర్యమగుటచే, దానిని త్రోసివేసి రేఫాంత తెలుగుశబ్దముల పురాతనత్వమును సాధింపగడగిరి. అచ్చు పూర్వమందుగల రేఫ ముచ్చారణకు సులభమని, దానిని రేఫాదిగా మార్చుట కఠినమగుటచే నస్వాభావికమని వారిమతము. నిజమేకావచ్చును గాని, వర్ణోచ్చారణమందలి సౌలభ్యాసౌలభ్యములు ఆయాభాషలను మాటలాడు జనుల యుచ్చారణ సంప్రదాయములు, నలవాటులను బట్టి యుండును. ఇతరభాషాసంసర్గముచే నివి యొకొక్కప్పుడు మారినను మారవచ్చును గాని సహజసంప్రదాయములు కొన్ని యుండుననుటకు సందేహము లేదు. ఒకదేశమునందలివారికి, లేదా ఒకభాష మాటలాడువారికి కఠినముగా దోచిన యుచ్చారణము మఱియొక భాష మాటాడువారికి సులభముగనే కనబడి వారికి పరిపాటియగు సంప్రదాయ మగుటయు దటస్థింపవచ్చును. వీని నన్నిటిని గమనించికాని యేనిర్ణయమునకును రాలేము. సంస్కృతమునందు సహజములగు మహాప్రాణాక్షరములు ద్రావిడభాషలలో లేవు. ఆ వర్ణములతో గూడిన పదములు నెరువుతెచ్చుకొన్నప్పుడుగూడ సామహాప్రాణములను దొలగించి వాని స్థానమున నల్పప్రాణములను జేర్చుకొనియే వీరు గ్రహింతురు. అనగా సంస్కృతభాషావ్యవసాయులు సులభముగా నుచ్చరింప నలవాటుపడిన మహాప్రాణములను ద్రావిడభాషలను వ్యవహరించు జను లుచ్చరింపలేకపోయి రనుట. కాని యిందలి శకటరేఫ 'ఱ' కారము లను వింతయక్షరము లితరులకు కష్టతరముగా గనబడును. హిందూస్థానీభాషలకు సహజమగు కంఠ్యకకారోచ్చారణ మితరభాషలవారికి కష్టతర మగునుగదా. సంస్కృతమందలి 'గౌః' మొదలగు శబ్దములలోని 'గ' కారము గ్రీకుభాషలో సన్నిహిత సంబంధమేమాత్రమును లేని 'బ' కారముగా మారినది. సం. గౌః — గ్రీకు. 'బౌస్' (bous). కావున నుచ్చారణ సౌలభ్యమునకుగా గలుగు మార్పులవిషయమైన సామాన్యసూత్రములు కొన్ని సహజములు, నుచితములుగనే కనబడినను, ఆయాభాషలలో ప్రత్యేకసంప్ర

దాయము లెట్టివో యను విషయమునుగూడ తత్తద్భాషాలక్షణపరిశీలనమమూలముగా దెలిసికొననిది వానిని సర్వత్ర అన్వయింపగూడదు. 'ఇరవు' నుండి 'రేయి' పుట్టినదనుట స్వభావవిరుద్ధమని వారి తాత్పర్యముగా జెప్పుటయేకాక 'ఇరాత్రి' నుండి సంస్కృతమందలి 'రాత్రి' పుట్టిన దనరాదా యనికూడ లక్ష్మణరావు గారు ప్రశ్నించుటచేతనే ఇంత విపులముగా నీ విషయమును జర్చింపవలసివచ్చినది. 'రాత్రి' శబ్దము సంస్కృతమనుట ప్రసిద్ధము. రేఫాదిశబ్దముల నుచ్చరింపలేకపోవుట ప్రాచీన ద్రావిడ సంప్రదాయసిద్ధము. కావున 'రాత్రి' శబ్దమును వీ రుచ్చరింపవలసినపుడు దాని కొక అచ్చును ముందు జేర్చి 'ఇరాత్రి' ని జేసి యుందురు. కాని 'రేయి' శబ్దము అన్యభాషాపదము కాదే. వీరి భాషోచ్చారణసంప్రదాయములనుబట్టి వీరి భాషలో రేఫము పదాదిని రానేకూడదుగదా. తెలుగుభాషకూడ అరవముతోపాటు ద్రావిడ కుటుంబమునకే చెందె దని చెప్పుచు నీ భాషలోమాత్రము దేశీయమును 'రేయి' అను రేఫాదిశబ్దము కలదనియు, ఇదియే మూలభాషకు సన్నిహితమని, అరవమునందలి 'ఇరవు' అనుదానికంటె పురాతనమని, సజాతీయమగు తెలుగుభాషలోని 'రేయి' అనుదానిని పలుకలేక సౌలభ్యముకొరకు అరవమున 'ఇ' కారము చేర్చబడినదని, దీని మూలముగనే అరవముకంటె తెనుగుయొక్క పురాతనత్వము సాధిత మగుచున్నదని వాదించుట యెట్లు? కావున వారిచ్చిన రేఫాదులగు తెనుగురూపములు పురాతనములు కావు; అరవరూపములాధునికములు కావు. అయితే వస్తుస్థితి యేమి, వీని పౌర్వాపర్యమునకు నిర్ణాయక మెట్లు అని అడుగవచ్చును. ద్రావిడసంప్రదాయమును బట్టి రేఫాదిశబ్దములు ప్రాచీనభాషలో నుండవుగదా. కావున దేశ్యశబ్దములు రేఫాదులు తెనుగునను ఉండకూడదు. ఇప్పుడగపడుచున్న శబ్దములన్నియో అవి యిటీవలికాలమున నేర్పడియుండవలయును. తమిళ కన్నడశబ్దములతో వీనిని బోల్చి యివి యీభాషలలో నెట్లేర్పడియుండునో, వీని మూలధాతువు లేవో పరిశీలించినచో దెలియనగు వాని పరిణామక్రమమునుబట్టి మనము వీని పౌర్వాపర్యమును నిర్ణయింపవలసియుండును. 'రేయి'శబ్దము సంస్కృత'రాత్రి' శబ్దభవ మన్నచో దీనినుండి తమిళమందలి 'ఇరాత్తిరి'గాని, 'ఇరవు'గాని వచ్చెననుట కభ్యంతరము లేదు. కాని ఇది దేశీయపదమే యన్నచో దీనిని తమిళమునందలి 'ఇరా'శబ్దముతోను, ఈరెంటిని తమిళ కన్నడాంధ్ర తుళుభాషలు నాలుగింటిలోను గానవచ్చు ఇరుళ్, ఇరులు, ఇర్ళు మొదలగు రూపములతోను బోల్చి చూడవలసియున్నది. వీనికిగల చీకటి-అంధకారము అను నర్థమునుబట్టి 'ఇరవు' అను శబ్దముతో సంబంధము కల్పించినచో ఇరా, ఇరవు అనువాని ప్రాచీనత్వము, ఇరా _| రే _| రేయి అను తెనుగుశబ్దము యొక్క నిష్పత్తిక్రమము తెలియనగును. ఇరుళ్ అను పద మీనాలుగుభాషలలోగూడ గనబడుచుండుటచే నిదియే మూలభాషకు సంబంధించిన దనవలసియున్నది. దీనికి సంబంధించియే ఇరా, ఇరావు, ఇరవు అనునవి యేర్పడియుండుననుట సంభావ్యము. 'ఇరా' నుండి తెలుగులో 'రేయి' యిటీవలికాలమున నేర్పడియుండును. ఈ వ్యుత్పత్తి యరవమున తక్కినభాషలలో కంటె తెనుగున నేదోయొకకాలమున ప్రబలమైయున్నట్లగపడుచున్నదని యింతవరకే గ్రహించితిమిగదా.

ఇట్లే తెనుగున రేఫాదిశబ్దముల యర్వాచీనత్వము ఈభాషలలో గనబడు సజాతీయ మూలశబ్దములు, లేదా ధాతువులనుండి వాని పరిణామక్రమము నన్వేషించినచో వ్యక్తము కాగలదు. ఉరల్ _| ఒరల్ _| రోలు అయినది గాని 'రోలు' నుండి ఉరోలు—ఉరలు కాలేదు. cf. త. ఉరల్; మల. ఉరల్; కన్న. ఒరళు; తుళు. ఒరల్. ఇట్లది యీనాలుగు భాషలలోను సమానరూపము గలదై యున్నది. ఒక్క తెలుగులోనే 'రోలు' అయినది. దీనికి మూలధాతువు త. ఉరుళ్; క.మ-ఉరుళ్. తెనుగునగూడ ధాతువు ఉరలు-ఉర్లు అనునదే. ఇది తిరుగు, భ్రమించు (=to roll, **tumble over and over, revolve**) అను నర్థముల గలదు. ఉలూఖల మన్న యర్థమున తెనుగున 'ఱోలు' అని శకటరేఫరూపముకూడ నేర్పడినది. కాని యితర భాషలలో నెనిలోను శకటరేఫము లేకుండుటచేతను, మూలధాతువు రేఫసహితమే యగుటచేతను 'ఱోలు' అను రూప మపభ్రంశ మనవలయును. తెలుగులో శకటరేఫముతో నీ 'ఱోలు' శబ్ద మగపడుచున్నది గనుక

ఇదియే పురాతనరూప మని, తక్కిన నాలుగుభాషలలో రేఫయుక్తములై యున్న వర్వాచీనములని వాదించిన నెంత యాభాసికముగా నుండునో విచారింపుడు.

త. ఇఱక్కై — తెఱక్క. తమిళమునందలి 'ఇఱక్కై' అనునది తెనుగు 'ఱెక్క' అనుదాని నుండి యేర్పడిన యర్వాచీనరూపమని తమిళనిఘంటు చూపుచున్నది. అనగా 'ఱెక్క' అను తెనుగు పదము తమిళమున నిటీవల సంక్రమించిన దనుట. మూలభాషనుండి యేర్పడినవికాక ఒకభాషలోని పదములు మఱియొకభాషలో నానాకాలముల సంక్రమించుచుండుటయు గలదు. కాని తమిళమునందలి దీని ప్రాచీనరూపము 'ఇఱకు' అనునది. త. ఇఱకు; మ. ఇఱహు; క. ఎఱకె. తెనుగునగూడ 'ఎఱక' శబ్దమున్నది. తెనుగున తక్కినభాషలతోపాటు తొలికాలమున నేర్పడియున్న 'ఎఱక' శబ్దమునుండియే తరువాతికాలమున వర్ణప్లుతిచే 'ఱెక్క' శబ్దమేర్పడినది. ఇదే మరల 'ఇఱక్కై' అని తమిళములోనికి బోయినది. ఈ సందర్భములో తెలుగు 'ఱెక్క' తమిళ 'ఇఱక్కై' అయినదని, తెలుగురూపము తమిళముదానికంటె ప్రాచీనమని చెప్పిన చెప్పవచ్చునుగాని దీనినిబట్టి తెనుగుభాషయొక్క పురాతనత్వముమాత్రము సాధితము కానేరదు ఈ 'ఎఱక' అను శబ్దము త. 'ఇఱంగు', తె. క. ఎఱగు, మ. 'ఇఱఙ్ఙు'అను ధాతువునుండి యేర్పడియుండును. దీనికి క్రిందికిదిగుట (to **descend, get down, to alight**) అని యర్థము. 'ఎఱక'లు పక్షులు దిగుట కుపయోగించునవిగావున నాధాతువునుండి యీశబ్దము వచ్చియుండునని తలపనగును. 'ఎఱగు' - వ్రాలు, నమస్కరించు (**prostrate**) అను నర్థములను గలిగినవి.

తెనుగునందలి మఱికొన్ని రేఫాదిశబ్దములు, వాని ప్రాచీనరూపములు:—

తె. రెండు, త. ఇరణ్డు, క. ఎరడు, తు. రడ్డ- ధాతువు-ఇర్, ఇరు. cf. తె. ఇరువురు, ఇరుగడ, ఇర్నూరు < ఇన్నూరు మొ.

తె. రాయి; త. **arai**; క. అరె. ధాతువు - అరె, అరై (**to grind, pulverise**) cf. తె. రాయు, అరుగు, అరుగదీయు.

తె. రేగు, రేచు. రేపు-పైకెగురగొట్టు. cf. తె. ఎగురు. ధాతువు - త. క. మ.-ఎట్ (**to rise, stand up, go up etc**) cf. తె. ఎత్తు, ఎక్కు, ఎగయు మొ. క. ఎట్తర, ఎచ్చు మొ.

తె. రేవు—ధాతువు-ఇఱ్, క్రిందికిదిగుట, ఇఱ్ < డిగు < దిగు, cf. త. ఇఱంగు.

తె. రుబ్బు; త. మ. ఉరై, ఉర (**to grind**) క. ఉర్దు (**to rub on**) < [illegible]-రుద్దు. క. ఒరెగల్; త. ఉరైగల్; తె. ఒరగల్లు-ఒరపిడిరాయి.

రోజా, రొట్టె, రుసుము, రవిక, రుజావు, రుమాల్ మొదలగు రేఫాదిశబ్దములు విదేశీయ భాషలనుండి ఎరువుతెచ్చుకొనినవిగాని దేశ్యములుకావు.

దీనినిబట్టి తెనుగునందలి రేఫాదిశబ్దము లాభాషలోనికెట్లు వచ్చినవో, అరవకన్నడమలయాళ తుళు రూపములకంటె వాని పురాతనత్వ మెంతవరకు సాధింపనగునో గ్రహింపవచ్చును.

ఇక తెనుగునందలి నాలుక – నాల్క యను రూపములు శ్రీ లక్ష్మణరావుగారనినట్లుగా తమిళమునందలి 'నాక్కు'అనుదానికంటె పురాతనములు కావచ్చును. 'నాక్కు'అనుదానికి 'నా'అనికూడ మఱియొక రూపము కలదు. కాని నాలుక (**tongue**) అనునర్థమున మిక్కిలి పురాతనకాలపుటవమున 'నాల్కు' అను రూప ముండెననుట పొరపాటుగా గనబడుచున్నది. వారు చూపిన పానరర్ ఆఱ్ఱుప్పడై యను గ్రంథమున గల 'నాల్కు'అను శబ్దమునకు నాలుగు (**four**)అని యర్థమేకాని నాలుక అనునర్థమున ఈ శబ్దము తమిళభాషలో లేదని తద్భాషావేత్తలు చెప్పుచున్నారు. అచ్చట రథమునకు నాలుగశ్వములను బూన్చు సందర్భమున 'నాల్కు'శబ్దము ప్రయోగింపబడినది. 'నాలుక' అననర్థమున తమిళము, మలయాళముల 'నా','నాక్కు' అను రూపములే కానవచ్చుచున్నను, కన్నడతుళుభాషలలో 'నాలగె', 'నాలాయి'యను రూపము లగపడుచుండుటచే నీ'ల'కారముకూడ మూలశబ్దములో నుండియుండు నని యూహించుటకవకాశము లేకపోలేదు. తెలుగున 'నాలు'అను ధాతువంతరించిపోయినను తమిళమున 'వ్రేలాడు' (**to hang,**

to be suspended,) అనునర్థమున 'నాల్-నాలు' అను ధాతువు నిలిచియున్నది. దీనినుండియే 'నాలుక' వచ్చి యుండును. 'నాయి' (కుక్క) శబ్దముకూడ దీనినుండియే వచ్చినదని చెప్పుదురు. దీనికి తెనుగులో వ్యవహారము లేదుగాని నన్నిచోడుడు తెనుగుకవిత్వమున దీనిని జేర్చినాడు. తమిళమునుండి తెనుగెరువుతెచ్చికొనిన శబ్దములలో నిది యొకటిగా దలపవచ్చును. నాల్క శబ్దములోని లకారము కకారముతో సవర్ణీకరణము (assimilation) నొందుటచే 'నాక్క' రూప మేర్పడియుండును. అయినను దెనుగులో నాలుకతో నాకుటయే కాని 'నాల్కుట' లేదు. 'నాకు' అను ధాతువునుండి 'నాక్క' అను నామవాచకరూప మేర్పడవచ్చును గాని 'నాల్క - నాలుక' యేర్పడినదని చెప్పుటకు వీలులేదుగదా. కావున తెలుగులో నిలిచిన 'నాకు' అనునది యిటీవల నేర్పడిన ధాతువేకాని మూలధాతువు కాదనియు, 'నాలుక - నాల్క' యను తెలుగు నందలి నామవాచకశబ్దమునకును, తమిళమునందలి 'నాక్క' అనుదానికినిగూడ 'నాలు-నాలుకు' అను నదే మూలధాతువై యుండుననియు నూహింపవలసి యున్నది. ఇట్లే మన భాషలో వైయాకరణులు సామాన్యముగా ధాతువులని పేర్కొనునట్టివి - వచ్చు, పుచ్చు, వెలుగు, తునుగు, ఎక్కు, తగ్గు మొదలగునవి మూలధాతువు లని తలచుట కవకాశము లేదనియు, వీని నితరభాషలలోని ధాతురూపములతోడను, ఈ భాషలలోని యితర సన్నిహితశబ్దములతోడను పోల్చి చూచినగాని మూలధాతుస్వరూపమును నిర్ణయించుట సాధ్యము కానేరదనియు దీనినిబట్టి మనము గ్రహింపవలసియున్నది.

తెలుగున మూలార్థము నిలిచి తమిళాదులలో అర్థము మాఱిపోయిన శబ్దముల కుదాహరణముగా 'మగఁడు' అనుదానిని వారు చూపిరి. ఇట్టి వింక ననేకము లుండుననుటకు సందేహము లేదు. కార్ష్ణ్యము అను నర్థమున నల్ల, నలుపు అను శబ్దములు తెలుగున గలవు. 'నల్ల' యనగా నిప్పటి తమిళ వ్యవహారమున 'మంచిది' (**good, excellent**) అని యర్థము. కాని ప్రాచీన తమిళమున నలు పనునర్థము కలదట. 'నల్లం' అనగా బొగ్గు (**charcoal**), నల్లందనము (**blackness, darkness**) అనునర్థములు కలవని తమిళకోశమును తెలుపుచున్నది.

వ్యాకరణరూపముల విషయమున నొక్క 'పోదుమ్' అను తద్ధర్మార్థకరూపమే కాక భూతకాలిక క్రియారూపములు, ఉనున్నంతరూపములు మొదలగు మఱికొన్నిటి విషయమునగూడ తెలుగున నిలిచియున్న రూపములు తమిళ కన్నడాదులందలి రూపములకంటె పురాతనస్వరూపమును వహించి యున్నవనియేకాక, అట్లుండుటచే మూలభాషనుండి వీని పరిణామక్రమము నన్వేషించుట కెక్కువ తోడ్పడుచున్నవనియు జెప్పుట కవకాశము కలదు. అట్టివానిని గూర్చి మఱియొకవ్యాసమున వివరించెదను.

ఈ రీతిగా నొక్క కుటుంబమునకు జెందిన భాషలలో నొక్కొక్కదానియందు కొన్ని ధాతువుల యొక్కకాని, పదముల యొక్కకాని, క్రియారూపముల యొక్కకాని మూలరూపములు కాలగతిని ఉచ్చారణభేదముకలన గలుగు పరిణామములకు లోనుగాక నిలిచియుండుట తటస్థింపవచ్చును. అట్టివి యీ తెనుగు, అఱవము మొదలుగాగల వాఙ్మయసంస్కారములతో గూడిన భాషలలో నేకాక, సంస్కారరహితములైయున్న తోదు, కుయి మొదలగు ననాగరకభాషలలోగూడ గనబడవచ్చును. కావుననే యా కుటుంబమునకు జెందిన భాషలలోని సమానార్థకములగు నాయారూపముల నన్నిటిని బోల్చి పరిశీలించి శాస్త్రసంప్రదాయానుసారముగా వాని పరిణామక్రమమును దెలిసికొనినగాని మూలభాషాస్వరూపమును గుర్తించుట కవకాశము లేదని చెప్పబడుచుండును. ఏవో కొన్ని పదముల సాదృశ్యము నెత్తిచూపినంతమాత్రముచే అఱవమునుండి తెనుగు పుట్టినదని సాధింప యత్నించిన యా కాలమునందలి యఱవపండితుల వాదమును ఖండించు నుద్దేశముతో శ్రీలక్ష్మణరావుగా రీవ్యాసమును వ్రాసియుందురు. ఆ వాదమును ఖండింప యత్నించి నందులకు వీరు ప్రశంసనీయులు. కాల్డ్వెల్ పండితుడైనను తమిళమును తక్కిన భాషలకంటె బాగుగా

నేర్చినవాడనుటచే దానినుండి యుదాహరణము లెక్కువగా నిచ్చి, కొన్ని సంప్రదాయముల విషయమునను, కొన్ని రూపముల విషయములోను తమిళము మూలభాషాస్వరూపమును నిలువబెట్టుకొనియున్నది గావున నాయా మూలభాషారూపముల నన్వేషించుటలో మన కెక్కుడు తోడ్పడగలదని చెప్పనే కాని యితర భాషల సహాయ మక్కరలేకయే తమిళము మూలభాషాస్వరూపము మనకు తెలుపుచున్నదని చెప్పియుండలేదు. కావున తెనుగు తమిళమునుండి కాని, తెనుగుభాషనుండి కాని పుట్టెనను వాదమును బాటింప నక్కరలేదు. వీని పురాతనత్వము విషయము గూడ నట్టిదే. ఒక భాషలో కొన్ని పురాతనరూపములు నిలిచియుండవచ్చును. మరియొక భాషలో నవి మారిపోయినను మరికొన్ని నిలిచియుండవచ్చును. సజాతీయ భాషారూపముల నన్నిటిని బోల్చి పరిశీలించినగాని వాని పరిణామక్రమము, పురాతనత్వము నిర్ణయింప వీలుకాదు. ఒక కుటుంబమునకు జెందిన సోదర భాషలన్నప్పుడు వానిలో దేనినుండి యేది పుట్టినది, ఏది పురాతనమైనది అను ప్రశ్నలకు దావులేదు. ప్రాచీన ద్రావిడభాషాస్వరూప నిర్ణయము విషయమున నివి యన్నియు సమానప్రయోజనము కలవే. ఆయా భాషారూపముల పౌర్వాపర్యము, పరిణామక్రమము ధాతుస్వరూపనిర్ణయమును బట్టి, మూలరూపముల నిర్ణయమును బట్టి మారవచ్చును. తెలుగున దేశ్యశబ్దముల స్వరూపము విశేషముగా మారినట్లున్నను, భాషారూపములలో ప్రాచీనత ఎక్కువగా గనబడుచున్న దనుటకు సందేహము లేదు.

ఉత్తరహిందూస్థానభాషలు—దేశి*

కోరాడ రామకృష్ణయ్యగారు

ప్రస్తుతము హిందూదేశమున వ్యవహారములో నున్న భారతీయభాషలు మూడు తెగలై యున్నట్లు తెలియవచ్చుచున్నది. అందు నుత్తరహిందూస్థానము నందలి భాషలు మరాఠీ, ఉడియా మొదలగు వానితో గూడి ప్రాకృతభాషాజన్యము లగుటచే నార్యభాషాకుటుంబమునకు జెందినవిగా నెంచబడుచున్నవి. ఇక దక్షిణహిందూదేశమునందలి భాషలన్నియో, యివియు, వీనిలో గొన్ని భాషలయందు విశేషముగా సంస్కృతపదజాలము చేరియుండిన కారణముననూ, సంస్కృతభాషా వాఙ్మయనిష్ణాతు లగువారే మొట్టమొదట నీభాషలను వ్యాకరించి లక్షణగ్రంథములను రచించినవా రగుటచేతను, సంస్కృతభాషాజన్యములే యనియు, ప్రాకృతాపత్యము లనియూ పలువురచే దలంపబడినను, ఆధునిక భాషాతత్త్వవేత్తల విమర్శనపూర్వకంబులగు పరిశీలనాఫలితములనుబట్టి చూడగా నీభాష లార్యకుటుంబమునకు జెందినవి కావనియు, నొక ప్రత్యేకకుటుంబముగ నెంచదగి యున్నవనియు దెలియవచ్చుచున్నది. కాక వీని కార్యభాషాకుటుంబముతో కంటె సిథియన్ కుటుంబమునకు జెందిన భాషలతో నెక్కుడు సంబంధమున్నట్లును దెలియుచున్నది. ఈ దక్షిణదేశభాషలను ద్రావిడభాషలని చెప్పుచున్నారు. ఇవి కాక హిందుదేశ మధ్యభాగమున వ్యవహరింపబడు ననాగరకజాతుల భాషలు మఱికొన్ని గలవు. అవి ముండాశాఖకు జెందినవిగా దెలుపబడుచున్నవి.

ద్రావిడభాష లనబడు దక్షిణదేశభాషలు సంస్కృతభాషాజన్యములు కావని తలంచుట కాధారమేర్పడిన పిదప ఉత్తరహిందూస్థానమందలి ప్రాకృతాదిభాషలు ప్రాచీనార్యభాషనుండి బయలుదేరుటకును, ఈప్రాకృతములనుండి యాధునికభాషలు బయలుదేరుటకును గల కారణము అంతకు పూర్వమునుండియు నీదేశమున వ్యవహారములో నుండిన దేశీయభాషలతోడి సంసర్గమే యయియుండునా, లేక ఆర్యభాషయే కాలక్రమమున నిన్ని విధములుగ ప్రాకృతములక్రింద మాఱినదా యను విషయ మొకటి విమర్శనీయం బగుచున్నది. ప్రాచీనార్యభాష ప్రాకృతభాషలుగా మారుటకు కాలక్రమమున నొకభాషలో స్వాభావికముగా బయలుదేరు మార్పులే కారణమని చెప్పుట కవకాశము కనబడదు. ఏలయనగా, నార్యజనసంఘ మీదేశమునకు వచ్చునప్పటికి దేశము నిర్జనంబగు శూన్యదేశముగా నుండెనని తలంపదగదు. ఈదేశ మార్యులచే దస్యులు, నిషాదులు, మ్లేచ్ఛులు నని పేర్కొనబడిన యనాగరకులగు ననార్యజాతులకు నివాసభూమియై యుండెననుట నిర్వివాదాంశము. వీరప్పటప్పట గ్రామము లేర్పఱచుకొని, రాజ్యములను స్థాపించికొని తమభూముల నాక్రమించుకొన వచ్చుచుండిన యార్యులతో పోరుచు, వారి యజ్ఞయాగాదికర్మను ధ్వంసముచేయుచు ననేకవిధముల బాధింప జొచ్చిరి. కాని యార్యులు బలవంతు లగుటచే వారితో ననేకములగు యుద్ధములు సల్పి, యీ యనార్యులను వారి సుక్షేత్రములనుండి వెడలగొట్టి వాని నాక్రమించుకొనుచు, వారిని క్రమక్రమముగా తూర్పు దక్షిణభాగముల నరణ్యప్రదేశములకు తరుముచు వచ్చిరి. ఇది కొన్ని శతాబ్దముల కాలము పట్టియుండును. ఈకాలమునం దనవరతము యుద్ధములే జరుగుచుండెనని తలంపదగదు. ఆర్యులీయనార్యనివాసులకంటె నాగరకులును, సంపూర్ణమైన భాష కలవారు నగుటచే దమకంటె నధికసంఖ్యాకులై యుండిన యీ యనార్యులను దమ కధీనులుగా జేసికొని వారితో గలసి యుండుటయు సంభవించెను. అప్పుడు వారిపై తమయధికారమునే గాక భాషాప్రభావమును గూడ నెఱపిరి. ఇట్లన్యోన్యసంపర్కము గలిగిన సందర్భమున నీ యనార్యజనులు నాగరకులగు నార్యులభాష నభ్యసింప యత్నించియుందురు. వీరీ నూతనభాషను శిసు

---

* ఈ వ్యాసము ౩౧-౧-౧౯౩౯ నాడు మా కార్యాలయమును జేరినది.—సంపాదకుడు: భారతి.

వులు తమ మాతృభాష నభ్యసించు రీతినే యాభ్యసించిరి. కతిపయములైన ధ్వనులను తేలికైన సులభమైన రీతిని మృదువుగా జేసికొని సులభమైన రీతిని పలుకసాగిరి. భాషావైఖరి తమకు క్రొత్తగా నుండుటచే తమ కనువైన రీతిని తమ యుచ్చారణ పరిపాటి ననుసరించి యా యా ధ్వనులను, పదములను నుచ్చరింప సాగిరి. ఈకారణముచే గొంతకాలమున కార్యభాషా ధ్వనులయందును పదస్వరూపమునందును విశేషములగు మార్పు లేర్పడినవి. ఈ రీతిగా ప్రాచీన ప్రాకృతభాష వైదికయుగముననే యేర్పడినది. తరువాత పాళిభాషయు జనుల యుచ్చారణరీతులయందలి యా యా భేదములను బట్టి మాగధ, శౌరసేని, మహారాష్ట్రి మొదలగు ప్రాకృతభేదము లేర్పడినవి. ఇట్లార్యభాష దేశీయజనుల నోళ్లలో బడి నలిగి, మారురూపు జెంది వేరుభాషలుగా నేర్పడినను, ఈ జనులతోడను, వారి భాషలతోడను గలిగిన సంపర్కముచే నార్యభాషయు గొంత మార్పు చెందకపోలేదు. ప్రాచీన ప్రాకృతభాషకును లేదా పాళిభాషకును, సంస్కృతమునకును గల భేదములు ముఖ్యముగా స్వరములకు సంబంధించినవే(Phonology) వాక్యసంవిధానము, విభక్తిప్రత్యయములు మొదలగువానిలో నీపాళిభాషకును సంస్కృతభాషకును విశేషము వ్యత్యాస మగపడదు. అచ్చులలో గొంచెము మార్పు కలిగినను, హల్లులలో విశేషము మార్పు లేదు. సంస్కృతమున గల హల్లు లన్నియు పాళియందును గలవు. కాని తరువాతి ప్రాకృతభాషలలో అజ్మధ్యస్థములగు హల్లు లన్నియు జారిపోయి వాని స్థానమున 'అ'కారములు వచ్చినవి. అనగా భాష జనసామాన్యమున బాగుగా వ్యాప్తి జెందినకొలది ఉచ్చారణసౌలభ్యమునకై హల్లులు జారవిడువబడి యుండును విభక్తిరూపములలోను, క్రియారూపములలోను సంస్కృతమునకు, పాళికి నంత విశేషవ్యత్యాస మేర్పడలేదు. కాని తరువాతి భాషలలో మార్పు లధికముగా వచ్చినవి. ఉదాహరణముగా నొక వాక్యమును గ్రహింతము.

"అతీతే బారాణసియం బ్రహ్మదత్తే రజ్జంకారెన్తే బోధిసత్తో తస్స అమచ్చ రతనం అహోసి"

ఇందు 'వారాణస్యాం' అనుదానిలో 'వ'కారమునకు బకారము; సంయుక్తాక్షరమగు 'స్యాం' అనునది 'సియం' అని రెండక్షరములుగా నుచ్చారణసౌలభ్యము కొరకు విడగొట్టబడినది. ఇట్లు సంయుక్తాక్షరముల మధ్య నొక యచ్చు చేరి యొక యక్షరము రెండక్షరములుగా జేయబడినచో దానిని స్వరభక్తి(Anaptyxis) అని యందురు. (cf. Principles of Dravidian Syllabation). ద్రావిడభాషలలో పదమధ్యమున ద్విత్వాక్షరము దప్ప వేరే సంయుక్తాక్షర ముండదు. కావున నట్టి సంయుక్తాక్షరములు గల సంస్కృతపదము లీభాషలలో తత్సమములుగా చేరునపుడా సంయుక్తాక్షరముల మధ్య యచ్చులు బయలుదేరి యవి రెండక్షరములుగా మారుచుండును — సం. ప్రా:తె — ఉదా: కావ్యం—కావియం; మార్గ=మారియము; ... ద్యూతం=తివియం: గహ్వరం=రకసియం; ... =అమా లియు; గర్వ=కరువు.

రత్నం = రతనం — ఈరూప మీవాక్యములోనే ప్రాకృతరూపముగా నున్నది. ఇట్టిది ద్రావిడభాషలు మాటలాడు జనులకు సహజమైన యుచ్చారణరీతిగా గనబడుచున్నది.

రాజ్యపదము పైవాక్యములో 'రజ్జం' అయినది. ద్విత్వాక్షరమునకు పూర్వమందు దీర్ఘము హ్రస్వ మగును, లేదా మొదటి దీర్ఘాక్షరము హ్రస్వమైనపుడు దాని తరువాతి యక్షరము ద్విత్వమును జెందుటయు గూడ ద్రావిడభాషలలో పరిపాటిగనె యున్నది. యకారము తద్భవరూపములలో 'జ'కార మగుటయు గలదు. కార్యము=కజ్జము; ఆ+అది=అయ్యది; మూవురు=మువ్వురు; ఈయుము=ఇచ్చు; కాపు=కప్పు: ఇదియు ద్రావిడభాషా సంప్రదాయానుసారముగనె యున్నట్లగపడుచున్నది.

సత్వపదము సత్తయైనది. బోధిసత్వ=బోధిసత్త.

అమాత్య=అమచ్చ. తస్య=తస్స.

ద్రావిడభాషలలో సంస్కృతపదములలోని సంయుక్తాక్షరములనువిడగొట్టి రెండక్షరములు(Syllables)

గా జేయనపుడు అంపలి పూర్వాక్షరమును ద్విత్వముచేసి పలుకుటయు గలదు. పదమధ్యమున ద్విత్వాక్షరములు గాని సంయుక్తాక్షరములను వీరు పలుక లేకుండుటయే దీనికి గారణ మయియుండును.

పడమం-ఇది సం. 'ప్రథమం' అనుదానికి ప్రాకృతరూపము. ఇచ్చట రేఫ థకార సంయోగము 'డ'కారోత్పత్తికి కారణమైనది. ప్రాచీనార్యభాషలలో మూర్ధన్యాక్షరములు లేవనియు, ఇవి సంస్కృతభాషలో నార్యులు హిందూదేశమునకు వచ్చిన పిదప బయలుదేరిన వనియు, ఇవి ప్రాచీనార్యపదములలో రేఫసంయుక్తాక్షర సంయోగము కలిగినపుడే [illegible] వచ్చిన వనియు పాశ్చాత్య శబ్దశాస్త్రజ్ఞుడగు "ఫార్చునటోవ్" (Fortunatov) అనువాడు కనిపెట్టినాడు. కావుననే యీమార్పు అతని పేరుతో నొక సూత్రముగా 'Fortunatov' law" అని ప్రసిద్ధి జెందినది. కానియీ సూత్రమున కతివ్యాప్తిదోషము పట్టుచున్నదని [illegible] యనియు, నీ మూర్ధన్యాక్షరములు సంస్కృతభాషలో నిలబడినను ప్రాకృతభాషలతోడి సంసర్గమే కారణమనియు తలంపబడుచున్నది. ద్రావిడభాషలలో మూర్ధన్యాక్షరములతో గూడిన యనేకధాతువులు దంత్యాక్షరములతో గూడిన వానికంటె cf. ఓడు-ఓదు; కాడు-కాదు; ఉడి-ఉది; కట్టు-కత్తు; మట్టె-మత్తె; కొంట-కొంద; కొట్టు-కొత్తు - [illegible]కము లగుటచే మూర్ధన్యాక్షరములు ద్రావిడభాషలకు సహజములే గాని తెచ్చిపెట్టుకొనినవి కావు. ఇంతేగాక గ్రీకు, లాటిన్, గాథిక, జెండవెస్తా మొదలగు సింధునదికి పశ్చిమమున నున్న యార్యభాషలలో నీధ్వనులు కనబడక పోవుటచేతను, కఠినాక్షరములను పలుకలేని దక్షిణ హిందూదేశ జనుల భాషలలో నీధ్వనులు కనబడుచుండుటచేతను సంస్కృతమే యీభాషలనుండి యీధ్వనులను గ్రహించియుండును గాని వేరువిధముగా గాదని కాల్డ్వెల్ మొదలగు వారు నిరూపించియున్నారు. కావున 'ప్రథమం' అను సంస్కృతపదము అనార్యజనుల యుచ్చారణలో (వీరు మహాప్రాణముల-ద్విత్వాక్షరముల-యుచ్చారణ కలవాటు పడినవారు కాకుండుటచే) 'పడమం' అని కాగా, మూలరూపములో మహాప్రాణ ముండుటంజేసి మరికొంత కాలమునకు, మరికొందరీపదమధ్యమున మహాప్రాణమునే [illegible] యుందురు. తెలుగులో నిట్టి పదము లింకను గలవు. సం. పృథివీశబ్దము ప్రాకృతములో 'పుఢవీ' యయి, తద్భవపదముగా ద్రావిడభాషలోనికి వచ్చునప్పటికి 'పుడమి' యను రూపమును దాల్చినది. దీనినిబట్టి కాలమున నార్యజనసంఘమునకును ద్రావిడజనసంఘమునకును గలిగిన సమ్మేళన మెట్టిదో మన మూహింపవచ్చును.

ప్రాకృతభాషలలో సంస్కృతములో నున్న ఋ, ౠ, ఐ, ఔలు జారవిడువ బడినవి. ఋ, ౠలు అ, ఇ, ఉలుగా మారినవి: గృహం=గహం; ఋణం=ఇణం; ఋషభ=ఇసభ; ఋత్విజ=ఇత్విజ. ద్రావిడభాషలను మాటలాడు జనుల కీధ్వనులు పరిచితములు గాకుండుటయే గాక, 'ఋత్విజ' శబ్దము 'ఇరిత్విజ' అను రూపమును జెందుట. సం. కర్తృ-త ఇగర్తం; రాజన్=అరిశన్. etc. ఈ మార్పులను తద్భవరూపములను బోలియుండుటచే వానిలో నీరూప మేర్పడుటకు ద్రావిడజనుల యుచ్చారణసంప్రదాయమే కారణమేమో యని తలంపవలసియున్నది. ఐ, ఔలు ద్రావిడభాషలలో 'అయ్' 'అవ్' అని ద్వ్యక్షరములుగా బలుకబడుచుండుటచే నీ ద్రావిడవర్ణ సమామ్నాయమున నివి సంస్కృతభాషా సంసర్గము మూలమున జేర్చబడినవని తలంపబడుచున్నది. ఇక పదమధ్యమందలి పరుషములు సరళము లగుట గూడ ద్రావిడభాషా సంప్రదాయానుసారమే యైయున్నది. అనగా, పదమధ్యమున ద్విత్వాక్షరము లైనచో తప్ప సరళములే గాని పరుషము లుండవు.

సం. ఋతి-ప్రా. రుద cf. తె. [illegible].

సం. వ్యాపృత—ప్రా. వ్యావట. cf. తె. వ్యావృత్తి

సం. ఉత—ప్రా. ఉద. } cf. తె. అన్నదమ్ములు;
సం పృషత—ప్రా. పసద. } కూరగాయలు.

ఇక నాధునికభాషల విషయము జూచినను అందు అనార్యసంప్రదాయములు, ముఖ్యముగా ద్రావిడభాషా సంప్రదాయములు అనేకములు కనబడుచున్నవి. 1. ఈ భాషలలో గూడ ఋ, ౠలు లేవు. 2. ఆర్యభాషలలో లేని హ్రస్వ 'ఎ'కార 'ఒ'కారములు కలవు. ఇవి

ద్రావిడభాషలలో నుండుటచేతను, సంస్కృతమున లేకుండి యీ తరువాతిభాషలలో గనబడుటచేతను నిదియు ద్రావిడభాషా సంప్రదాయమే యనవలసియున్నది. 3. సంయుక్తాక్షరములకు బూర్వమున గల ఇ, ఉలు ఏ, ఓలుగా మారుట-సం. సిందూర—ప్రా. సిందూరో; మరాఠీ; శేందూర. సం. పుస్తకం—ప్రా. పొత్థ; అం. హిందీ-పోథా; మరా; పోథీ; cf. తెలుగు-పొత్తము.

సం. తుండం-ప్రా. తుండ; తోండం; మరా. తోండ; cf. తె. తొండము. సం. తాంబూల—మరా. తాంబోళీ; cf. తాంబోలము.

4. పరుషములు సరళము లగుట—సం. సకల—మరా. సగళ. సం. బకః-మరా. బగళా. సం. లోక—మరా. లోగ. cf. ఉలుగం (from ఉలో.)

సం. వాపి—మరా. బావడి. cf. తె. బావి.

5. లకారము నకార మగుట.

సం. నింబ—మరా. లింబ.

సం. లాంగల—మరా., గుజ నాంగర cf ములుగోరింట-మునిగోరింట; తోల్ పడి-తోణ్ బడి, etc.

6. మకార మనునాసిక వకార మగుట—

సం. భ్రమర—ప్రా. భ్రవర (భ్రవఁర).

సం. నామ—మరా. నాంవ.

సం. గ్రామ—మరా. గాంవ. cf. తె. మాను-మాఁవు; కామయ్య, కావఁయ్య etc.

7. సంయుక్తాక్షరము లేకాక్షరములుగా విడగొట్టబడుట—

సం. సంధ్యా—సింధి-సంఝ. cf. తె. సంజ.

సం. విద్యుత్—మరా. వీజ.

సం. శ్రీ—మరా. సిరీస. cf. తె. శ్రీ-సిరి.

సం. శ్లోక—మరా. శిలోక.

ద్రావిడభాషలలో తద్భవపదము లిట్లే విశ్లేషమును బొందును.

8. ఈ భాషలలో నార్యభాషలలో వలె నొక వాక్యమునందలి పదముల సంబంధమును సూచించుటకు విభక్తి ప్రత్యయ ముపయోగింపబడుటకు బదులుగా ప్రత్యేక పదములే యుపయోగింప బడుచున్నవి. ద్రావిడభాషలలో వలెనే యివి కొన్నిభాషలలో ప్రత్యేకపదములుగా గాక పదభాగములుగను, మరికొన్నిటిలో నంగమునకు జేర్పబడిన స్వతంత్రపదములుగను గానవచ్చుచున్నవి.

9. ద్రావిడభాషలలో వలెనే యీభాషలలో ద్వివచనము లేదు.

10. కొన్నిభాషలలో నపుంసకలింగము లున్నను, పూర్వహిందీ, బెంగాలీలలో రెండు—అనగా స్త్రీపుంలింగములు మాత్రమే కలవు. ఇది ద్రావిడభాషలలోని మహా నమహా ద్వైతముతో సరిపోవుచున్నది.

11. బహువచనము 'సకల', 'లోక' మొదలగు పదముల నేకవచనరూపమునకు జేర్చుటవలన నేర్పడుచున్నది. బెంగాలీలో కుక్కురసకల=కుక్కలు; బీహారీలో ఘోకరాలోక=పిల్లలు; మరాఠీలో దోఘజన; సగ్లెజన, etc.

ద్రావిడభాషలలోని ప్రాచీనస్థితి వీనియందు జూపట్టుచున్న దనవచ్చును. 'కళ్' అనుదాని యర్థ మిప్పుడు తెలియకున్నను అది యొక కాలమున బహువచనమును సూచించు ప్రత్యేకపదమై యుండు ననుట నిశ్చయము. 'రు' అనునది 'అవర్' అను పదముయొక్క యవశిష్టభాగము. సంస్కృతభాషలలో నాయా విభక్తుల కాయా బహువచనప్రత్యయము లుండుటయే గాని ప్రత్యేకముగా బహువచనప్రత్యయ మనునది లేకుండుట చేతను, ద్రావిడభాషలలో ప్రాచీనకాలమున బ్రబలి యున్న సంప్రదాయమును బట్టియే యీభాషలలో వేరు పదములను జేర్చి బహువచనరూపములను జేయు నలవాటు కలిగియుండు నని తలంపవచ్చును.

12 కొన్ని భాషలలో నిలిచియున్న కొన్ని ప్రాచీనప్రత్యయములు, క్రొత్తగా బయలుదేరిన ప్రత్యయరూప పదములును ద్రావిడభాషలలో వలెనే షష్ఠ్యంతపదమునకు జేర్పబడుచున్నవి. ఇదియే ద్వితీయాది విభక్తి ప్రత్యయములు చేర్పబడు నంగము (oblique base).

ప్రాచీనప్రాకృతమునకు అపభ్రంశమునకు చెందిన పదములనుండి యేర్పడిన వని చెప్పుటకు వీలులేని విభక్తిప్రత్యయములలో ముఖ్యమైనది యొకటి 'క' యను చతుర్థి ప్రత్యయము కలదు. అనేకములగు నాధునికభాషలలో గనబడుచున్న యీ 'క' ప్రత్యయము ద్రావిడభాషలలో చతుర్థీ లేక షష్ఠీ ప్రత్యయముగా నున్న 'కు' నుండి వచ్చిన దని కాల్డువేల్ (Caldwell) పండితుడు చెప్పియున్నాడు. కాని భండార్కరు పండితుడు దీని యసంగత మనియు, తక్కిన విభక్తిప్రత్యయము లన్నియు ప్రాకృతరూపములనుండియే వచ్చినట్లుగా గనబడుచుండుటచే నీ చతుర్థీ విభక్తి ప్రత్యయ మగు నొక్క 'క' యనునది మాత్రమే ద్రావిడభాషలనుండి యెరువు తెచ్చుకొనబడిన పదము కాదనియు, సంస్కృతాపభ్రంశపదమగు 'కేహిం' అనుదానినుండి యేర్పడియుండు ననియు దెలుపుచున్నాడు. మరి పండితుడు గూడ నిట్లే తలంచుచున్నాడు. ఈ యాధునిక భాషలు, అందు ముఖ్యముగా మరాఠీ మొదలగునవి, ద్రావిడ భాషలనుండికొంత పదజాలమును సంగ్రహించి యుండును గాని వ్యాకరణవిషయమున నట్టి సంగ్రహణము సంభవించియుండ దనియు, అందులో విభక్తు లన్నిటిలోనిది యొక్కటియే యెరువు తెచ్చికొనబడిన దనుట సహజము కాదనియు, కొందరు దీనిని 'కృతే' అను పదము నుండి వచ్చిన దని తలంచుచున్నారనియు, మొత్తముమీద భండార్కరు చెప్పినట్లుగా 'కేహిం'నుండి వచ్చిన దని చెప్పుటయే యుక్తముగా నున్నదని యభిప్రాయపడినాడు. ఏభాషకు సంబంధించిన వ్యాకరణవిశేషముల నా భాషాసంప్రదాయములను బట్టియు, తత్సన్నిహిత భాషలను బట్టియు సాధించుచు, వానికి తగిన రీతి నుపపత్తులను గల్పింపవలయు ననుట యుక్తమపద్ధతియే. కాని యీ యాధునికోత్తరహిందూస్థాన భాషలపై ద్రావిడ భాషా సంప్రదాయముల ప్రభావము (influence) కొంతవరకైన నుండె నని చెప్పక వీలు లేకుండుటచే నా'క'ప్రత్యయమునకు ద్రావిడభాషలయందలి 'కు'ప్రత్యయముతో గల సంబంధమును గూర్చి కాల్డువేల్ పండితుని యభిప్రాయమే సరి యగు నేమో యని సందేహము కలుగక మానదు. ఇంతకు ద్రావిడభాషలలో నైన నీ 'కు'ప్రత్యయముయొక్క పూర్వచరిత్రము - వ్యుత్పత్తి తెలియవచ్చుట లేదు. ఏపదముయొక్క యవశిష్టభాగమో దేనినుండి యేర్పడినదో, యీభాషలలో నేదైన పదమునుండి యేర్పడినదో, లేక మరే యితర భాషలనుండి యైన నీ ద్రావిడభాషలలో సంక్రమించినదో నిశ్చయముగా జెప్పుటకు వీలు లేకున్నది. ఈ ప్రత్యయము 'సిథియన్' కుటుంబమునకు జెందిన భాషలు కొన్నింటిలో గూడ గానవచ్చుటంజేసియు, ద్రావిడ భాషల కార్యభాషలతో కంటె సిథియన్ కుటుంబమునకు జెందిన భాషలతో వ్యాకరణవిషయము లందు గూడ నెక్కుడు సంబంధ మున్నట్లు గనబడుచుండ జేసియు నీ'కు' ప్రత్యయ మతిప్రాచీనంబగు ప్రత్యయ మనియు, నార్య భాషలలో గూడ దీనిపూర్వచరిత్ర నన్వేషించుట కడు దుర్లభంబగుచుండుటచేతను. ఒకవేళ నిది యనార్య భాషాసంసర్గముగలనే భాషలలో సంక్రమించియుండు ననియు నూహించుటకు దగిన యవకాశము లేకపోలేదు.

మరాఠీభాషలోని షష్ఠీవిభక్తి నిజమైన విభక్తియే కాదు. 'చ'అను నొకప్రత్యయమును నామమునకు జేర్చుటచే నది విశేషణ మగుచున్నది. తరువాతి నామముయొక్క లింగవచనవిభక్తు లన్నిటితో నీరూపమే యన్వయించుచున్నది. తెలుగులో నొపవిభక్తికప్రత్యయముగా జెప్పబడుచుండిన 'ఇ'ప్రత్యయము నిట్టిదే. ఇది 'ఇన్'గా మారిన 'ఇల్' పదముయొక్క యవశిష్టభాగము. ఇదియే కన్నడమున 'ఇన్'అను రూపమునను, తమిళమున 'ఇన్' అను రూపమునను జూపవిభక్తికప్రత్యయముగ 'ఇ' అనుదాని కర్మమునే నెరవేర్చుచున్నది. ఊరు, కాలు అను పదములకు 'ఇ' చేర్చుటచే 'ఊరి', 'కాలి' అని అవి విశేషణము లగుచున్నవి. ఈ 'ఊరి', 'కాలి' అనువానినే ద్వితీయాది విభక్తిప్రత్యయములు చేర్పబడు అంగముగా (oblique base) గ్రహించుచున్నాము. తమిళమున 'మరత్తు' అని 'అత్తు'అను నొకపదము చెప్పబడిన దానికే ఈ'ఇన్'అనుదానిని చెప్పిఅంగముగా గ్రహించుచున్నారు. ఈ ఇన్నంతముపై విభక్తిప్రత్యయములు చేర్పబడుచున్నవి: మరత్తిన్ అనునది షష్ఠి, మర

త్తినాత్, మరత్తినోడు, మరత్తినదు, మరత్తిఙ్కాఙ్'. 'ఇఙ్' అనునది షష్ఠి లేక విశేషణాద్యోతక ప్రత్యయమని యూహింపబడుటచే షష్ఠీవిభక్తికి ఇన్నంతముపై మరల యొక్క ప్రత్యయము చేర్పబడుచున్నది. మరాఠీభాషలో గూడ సంస్కృతాద్యార్యభాషలలోని పద్ధతికి విరుద్ధముగు నీపద్ధతియే యవలంబింపబడుటచే నిది ద్రావిడభాషా సంసర్గ ప్రభావమనియే నిశ్చయింపవచ్చును.

13. ఉత్తరాదీ బెంగాలీలలో తప్ప తక్కిన భాషలలో విశేషణములకు విశేష్యముల బోలె లింగభేదము సూచింపబడుచున్నది. కాని యాభాషలలో ప్రత్యయ లింగప్రత్యయములనే గాక, విభక్తి ప్రత్యయములను గూడ విశేషణము విశేష్యమువలె వహించుటను పొందును. ద్రావిడభాషలలోగూడ విశేషణములకు లింగవచనవిభక్తులు లేవు. ఉత్తరహిందూస్థానభాషలలో విశేషణ భాషలలోవలె ప్రత్యేకము లేనందున ద్రావిడభాషలతోడి సంసర్గ మెక్కువయగుటచే నట్లయ్యె ననియు, తక్కినవి మూలమగు సంస్కృత ప్రాకృత భాషా సంప్రదాయమునే యనుసరించినవనియు తెలియుచున్నది. మరియు విశేషణములలో తరతమభావము (comparison) అధిక, బహు, సమాన అను ప్రత్యేక పదముల సహాయముచే వ్యక్తము చేయబడుచున్నదిగాని 'ఈయస్', 'ఇష్ఠ' ప్రత్యయములచే గాదు. ద్రావిడభాషలలోగూడ 'మిక్కిలి', 'చాలా' ఇత్యాది పదముల మూలముగా జెప్పవలెనే గాని సంస్కృతమునందువలె ప్రియ, ప్రియస్, ప్రేష్ఠ మనునట్లు ఒక్క విశేషణపదమునుండియే యేర్పడిన రూపములు లేవు.

14. క్రియారూపప్రక్రియ పరిశీలించి జూడగా ఒక్క వర్తమానార్థకరూపమే ప్రాచీనభాషలనుండి యేర్పడినది; నవ్యభాషలలో నుపయోగింపబడుచున్నది. కాని సామాన్యముగా ద్రావిడభాషలలోవలె ధాతుజన్య విశేషణములనుండి క్రియారూపములను నిష్పత్తిచేయు పద్ధతి ఈభాష లన్నిటిలోను ప్రబలియున్నది. ప్రాకృతభాషలలోనే యంకురించిన వికరణభేదములు నవ్యభాషలలో నంతగా కనబడవు. ద్రావిడభాషలలో వలె నొక్కటే వికరణము(conjugation)అని చెప్పవచ్చును.

ప్రాచీన వర్తమానార్థక రూపములు పలుభాషలలో గనబడుచున్నను ఇవిగాక క్రియావిశేషణమునకు లింగపురుషద్యోతక ప్రత్యయములను జేర్చుటచే నేర్పడిన రూపములు మరికొన్నియు గలవు. ఈ రూపములు బెంగాలి, హిందీ మొదలగు వానిలో నిత్యవర్తమానార్థకమును (habitual present) సూచించునవైయుండ, మరాఠీలో ప్రాచీనవర్తమానార్థకరూపములు తదర్థబోధకంబగుచున్నవి. భూతభవిష్యత్ క్రియారూపములు గూడ క్రియావిశేషణములనుండి యేర్పడినవి. ఇట్లు భాషలలో సంస్కృతప్రాకృత రూపములనుండి యేర్పడిన క్రియారూపము లంతరించియుండగా క్రియాజన్యవిశేషణములకు లింగపురుషద్యోతక ప్రత్యయాదులను జేర్చుటచే క్రొత్తగా క్రియారూపములను నిష్పత్తిచేయుట ద్రావిడభాషాసాంగత్యమువలన గలిగిన ఫలమే యని నిశ్చయించుటకు నవకాశ మేర్పడుచున్నది. మరియొక విశేషము కలదు. మరాఠీభాషలలో భవిష్యదర్థసూచకములు 'ఈల' యను ప్రత్యయములు కలవు. ఇవి ప్రాచీనవర్తమానార్థక రూపములకు జేర్చబడుటచే నేర్పడిన రూపములు; భవిష్యదర్థద్యోతకము లగుచున్నవి. దీనినిబట్టి ప్రాచీనవర్తమానార్థకరూపము భవిష్యదర్థమును గూడ సూచించినదై యుండి, ఒకానొక కాలమున నొక రూపమును రెండర్థములయందు వాడుటవలన గలుగు చిక్కును తొలగించుటకు గాబోలు, భవిష్యదర్థసూచకములగు వేరు ప్రత్యయములు చేర్పబడినవి. ద్రావిడభాషలలోగూడ ప్రాచీనకాలమున రెండుకాలములను, మూడు కాలములనుగూడ సూచించు రూపములుండినవి. భవిష్యద్వర్తమానములను విభేదించుట యంతగా నుండెడిదికాదు. కాలక్రమమున నీభాషలలో ప్రత్యేకము వర్తమానకాలసూచకములు, భవిష్యత్కాల సూచకములునగు రూపములు బయలుదేరినవి. ప్రాకృతభాషలు, తజ్జన్యములగు మరాఠీ మొదలగు నుత్తరహిందూస్థానభాషలును ఆర్యభాషా కుటుంబమునకు జెందిన వగుటచేతను, సంస్కృతాదిభాషలలో వర్తమానాదిరూపములు ప్రత్యేకముగా నుండుటచేతను ఒక రూపమే రెండుకాలములను సూచించు పద్ధతి యార్యభాషలనుండి వచ్చినదని చెప్పుట కవకాశము లేకుండు

టచే, నిది యనార్యభాషాసంసర్గఫలమని చెప్పవీలు లేదు.

ఈపైని జూపిన విషయములనుబట్టి యార్యభాషలలో గొన్ని ద్రావిడభాషాసంప్రదాయములు - లేదా అనార్యభాషాసంప్రదాయములు వ్యాకరణవిషయములందు గానవచ్చుచున్నట్లు స్పష్టమగుచున్నది. సామాన్యముగా నొకభాష యితరభాషలతోడి సంబంధముకలిగినపు డితరభాషలనుండి కొంత నూతన పదజాలమును సంగ్రహించిన సంగ్రహించునుగాని తన వ్యాకరణపద్ధతిని విడిచి యన్యభాషావ్యాకరణమార్గముల ననుసరించుట సంభవింపదని భాషాతత్త్వవేత్తల సిద్ధాంతాభిప్రాయమై యున్నది. ఆపదములవిషయమునగూడ నొకభాష మాట్లాడు జనులు తమకు దెలియని పదార్థములను నూతనవస్తువులను భావములను సూచించుపదములనుమాత్రమే సంగ్రహింప నొరకొందురుగాని, యితరభాషలలోని పదజాలమునంతయు దెచ్చి తమభాషలో గలిపికొనుటకు కోరుకొనరు. కావుననే భాషలసాజాత్యమును నిర్ణయించునప్పు డాయాభాషలలో సామాన్యవ్యవహారమునను, నిత్యవ్యవహారమునను నత్యావశ్యకముగ బ్రయోగింపబడుచుండు సామాన్యపదములు సామ్యములుగలవా లేవా యనియు, నాయాపదములకు మూలములగు మూలధాతువులు, లేదా మూలరూపములలో (roots or elemental forms) సామ్యము కలదా లేదా యనియు పరిశీలింతురు. ఇట్టి పదజాలమును సామాన్యముగా నొకభాష మరియొక భాషనుండి యెరువు తెచ్చికొనుట సంభవింపదు గావున వీనియందలి సామ్యమునుబట్టి భాషలసాజాత్యము నిర్ణయింపబడును. ఇట్లు పదములవిషయమున భాషలలో నిచ్చి పుచ్చుకొను నాచారము కొంతవరకు ప్రబలముగా నున్నను, వ్యాకరణవిషయమున మాత్ర మట్టిది లేదనియే నమ్మబడుచున్నది. అయితే పై యార్యభాషలలో ననార్య సంప్రదాయములకు సంబంధించిన వ్యాకరణాంశములు గనబడుచున్న వేయనుశంక బయలుదేరకమానదు. పైవిషయము అల్ప సంబంధమమాత్రము గలిగిన భిన్నజాతీయములగు భాషలనుగూర్చి చెప్పబడినదని తలంపవలసియున్నది. ప్రస్తుతమాంగ్లభాషకును దేశీయభాషలకును గల సంబంధమట్టి దియు. ఇంతకుపూర్వము మహామ్మదీయుల రాజ్యపరిపాలన కాలమునుండియు ఉర్దు, పరిషియన్ మొదలగు భాషలకును ద్రావిడభాషలకును గలసంబంధము నట్టిదే. కావుననే యాకాలమున నీదేశభాషలలో ననేకములగు రాజకీయపదములును (తహసీల్దారు, గుమాస్తా, దఫేదారు, గోను ఈ మొదలగునవియు), ఇప్పటికాలమున నింగ్లీషునుండి రాజకీయవ్యవహారికపదములును (మునసబు, కలెక్టరు, లాంతరు, మొదలగునవియు) ననేకము లీభాషలలో నిమిడ్చిచేసినవి. కాని ఆయాభాషలవ్యాకరణ సంప్రదాయము లేమియు నీభాషలలో జేరియుండలేదు. ఇంత కాలమునుండి మహామ్మదీయులు దక్షిణదేశీయులతో గలసి యాయాప్రాంతములు నాయాదేశభాషలనే తాము నేర్చికొని వ్యవహరించుచు నచ్చటి జనులతో గలసి నివసించుచున్నను, వారిస్వీయభాషాసంప్రదాయము లీదేశభాషలలోనికిగాని, ఈదేశభాషా సంప్రదాయములు వారి మాతృభాషలోనికిగాని సంక్రమించినట్లు కనబడదు. కావున ప్రాకృతభాష లేర్పడు కాలమున నార్యభాషను వ్యవహరించిన జనులకును నచ్చటి యనార్యజనులకును గలిగిన సంబంధవిశేషమే యార్యేతరసంబంధముగల యీప్రాకృతభాషలలో ననార్యసంప్రదాయములు చొచ్చుటకు గల హేతువును నిరూపింపగలిగియుండునని తలంపవలసియున్నది. దీనినిబట్టి ప్రాకృతభాషల యుత్పత్తి పేరుకుగాక ద్రావిడభాషల ప్రత్యేకతయు నిర్ధారితంబగుచున్నది. ఇట్టివేళమున నాంధ్రనార్యజనులకు గలిగిన సంబంధస్వరూపము నందలి భేదమునుబట్టియే యీదేశమున నాయాప్రాంతములందలి యాయాభాషా వాఙ్మయములస్థితిగతు లేర్పడినట్లుగ పడుచున్నది.

ఆర్యభాషలలోని యనార్య సంప్రదాయములిట్లు ద్రావిడభాషా సంప్రదాయములను బోలియుండుటచే, హేమచంద్రాది ప్రాకృత వ్యాకరణకర్తలు ఆర్యభాషలకు సంబంధింపనివిగా దెలిపిన దేశిపదజాలముకూడ కొంతవరకు ద్రావిడభాషలకు జెందినదై యుండునని తలంపవచ్చును. ఇట్టి పదములనుగూర్చి కాల్డువెల్ పండితుడు విమర్శించుచు, నివి ద్రావిడభాషలకు సంబంధించిన పదములే యైనను, నీయార్యభాషాపదజాల

ములో సామాన్య ద్రావిడధాతువులు, నిత్యకృత్యముల నుపయోగములో నుండెడు కొన్ని పదములు నీ మొదలగు నవికూడ నుండవలసినదే యనియు, నట్టి వానిని తాము గాంచ గలుగలేదనియు జెప్పుచు నివి ద్రావిడభాషాపదములయి యుండ వను నభిప్రాయమును తేల్చినాడు—

"If the non-Sanskritic element contained in the northern vocabularies had been Dravidian, we might also expect to find in their vocabularies a few primary Dravidian roots such as the words for head, foot, eye, etc., but I have not been able to discover any reliable analogy in words belonging to this class. Few, if any, traces of distinctly Dravidian elements are discernible in the North Indian Vernaculars."

ఈభాషలలోని వ్యాకరణవిషయములందే ద్రావిడ సంప్రదాయముల ప్రభావము కనబడుచున్నప్పుడు సామాన్య వ్యవహారమునందలి పదములును గొన్నిగాన వచ్చిన నాశ్చర్యము లేదు. అయితే యీపదము లార్యజను లనార్యజనులనుండి సంగ్రహించి, తనుభాషలో నాయా యర్థములను దెలుపు పదములు లేక, తెచ్చిపెట్టుకొని వ్యవహరింప నొచ్చినారని తలంపదగదు. ఏలయనగా నార్యులీదేశమునకు వచ్చునప్పటికే నాగరకులై సంపూర్ణమైన భాష గలవారగుటచే తాము నిత్యవ్యవహారమున నుపయోగించుకొను 'పదములకొఱకై సంబంధమే సహింపని యనార్యజాతులనుండి గ్రహించిరనుట సమంజసముకాదు. ఒకవేళ వారు తమకు పరిచితములుగాని వస్తువులు, జంతువులు, చెట్లు మొదలగువానిని దెలుపుపదములను స్వీకరించిన స్వీకరింతురేగాని, తమకు పరిచితములగు వస్తువులను దెలుపుటకుగా తా మిదివరకు నిత్యము వాడుకొనుచున్న పదములను మాని యన్యభాషాపదములను గ్రహింపనొల్లరు. కావున నీభాషలలో నట్టిపదములు దొరకుట దుర్లభమై యుండవలసినదే. కాని హేమచంద్రుని దేశినామమాలలోని పదములలో గొన్ని యట్టి నిత్య కృత్యముల నుపయోగపడునవిగా నుండుటయు, నవి ద్రావిడభాషలకు సంబంధించినవిగా గనబడుచుండుటయును బట్టి విచారింపగా, నివి యార్యజనులచే సంగ్రహింపబడియుండవు గావున వారితో గలసి వారిభాషను నేర్చికొని వారితో సమ్మేళనమును బొందిన యనార్యజనుల మూలముగా నిత్యకృత్యముల వ్యవహారములో నుండు వారిస్వీయభాషలలోని పదములగూడ కొన్ని యీ యార్యభాషలలోని కెక్కియుండునని మనము తలంపదగియున్నది. ఇట్టి పదజాలముకూడ నాయా జనసంఘములకు గలిగిన సంబంధ స్వరూపమును తేటపరుప గలుగుచున్నదనుటకు సందియము లేదు. ప్రస్తుతము హేమచంద్రుడు దెల్పిన 'దేశి' పదములలో ద్రావిడభాషలకు సంబంధించిన వెంతవరకు గలవో పరిశీలింతము. దేశీనామమాల యను గ్రంథమున హేమచంద్రుడు తెలిపినపదము లాతని వ్యాకరణముచే సాధింపబడనివనియు, పూర్వపు కోశములలో దొరకనివియు, లక్షణార్థమును దెలుపునవి కావనియు, నట్టివానినె తా నిందు గ్రహించితిననియు దెలిపినాడు. ఇంతేగాక తరువాతిభాషలలో నింక ననేకపదములు చేరియున్నను, చిరకాలమునుండి ప్రాకృతభాషలో వ్యవహారములోనున్న పదములనుమాత్రమే తానీ దేశీ యను పదముచే దెలుపుచున్నట్లును చెప్పినాడు. అట్టి దేశిపదములలో గొన్నిటికిగల ద్రావిడ భాషా సంబంధ మీక్రింద దెలుపబడుచున్నది. అందు మొదటి అకారాదిపదములలోనే నాలుగైదుపదములు కుటుంబసంబంధమును దెలుపు పదములు కలవు.

1. ప్రా. అప్పో=తండ్రి ఇది 'అప్ప' యనురూపమున సామాన్యముగా ద్రావిడభాష లన్నిటియందును గానవచ్చుచున్నది.

2. ప్రా. అమ్మా, అవ్వా=తల్లి, తల్లితల్లి. ఈయర్థమున నివి ద్రావిడభాషలలోను కలవు. అమ్మ శబ్దము తుళుభాషలో తప్ప తక్కినభాష లన్నిటిలోను గలదు. 'అవ్వ'-అమ=అమ్మమ్మ. (Kittel) చిక్కవ్వ, దొడ్డవ్వ; ముత్తవ్వ etc. అని కన్నడభాషలో గలవు. తెలుగున భారతకాలములో 'అవ్వ' అను పదము అమ్మమ్మ (grandmother), ముసలమ్మ అను నర్థమునకేగాక

స్త్రీమాత్ర పరముగా పూజ్యారాలు అను నర్థమునగూడ వాడబడుచుండెడిది.

౩. ప్రా. అక్కా=అప్ప- వృద్ధభగినీ- (sister). "అంబార్థస్తు సంస్కృతసమః"-సంస్కృతములో 'నమ్మ' యను నర్థము కలదు.-కాని ద్రావిడభాషలలో ప్రాకృతమందువలెనే 'భగినీ' అప్ప యనియే దీని కర్థము.

౪. ప్రా.'అత్తా'="పితృష్వసా-శ్వశురభార్యా". ద్రావిడభాషలలో, ముఖ్యముగ దెలుగున నిది యీయర్థమే కలిగియున్నది.

౫. ప్రా. అద్దాఓ=దర్పణం—తె. అద్దము.

౬. ప్రా.భావో=భాగినేయః; భాఓ = జ్యేష్ఠభగినీపతి: భావ, బావ అను పదములు ద్రావిడభాషలలో నిగుల వాడుకలో గలవు.

౭. ప్రా.మమీ, మల్లాణీ, మామా=ప్రాతినోపమాతులానీ వాచకాః. దక్షిణదేశమున 'మామి' యను పదము, శ్వశ్రుభార్య యనునర్థమున వాడుకలో గలదు.

౮. ప్రా. వహుణీ="జ్యేష్ఠభార్యా-" తె. వదినె' తమి. మదిని. సంస్కృతములో 'వధూని' అను రూపమునజేరిన పదమునుండి ప్రాకృతములో నేర్పడియుండును. కన్నడమున వివాహము అనునర్థముగల 'మదువె, మదువె' అనుదానికి సంబంధించియుండవచ్చును.

౯. ప్రా. ఉద్దిగో=మాషధాన్యం. కొన్ని ప్రాంతములలో తెలుగున 'ఉద్దులు' అని చెప్పుటయు గలదు. కన్నడమున 'ఉద్దు-ఉద్దుఁ' అనగా 'మాషము'. తమిళమున, 'ఉళుందు' 'ఉలుందు' అనియును, మళయాళమున 'ఉలున్ను' అనియు, మహారాష్ట్రమున 'ఉడీద' యనియు పదములు గలవు. తమిళమునందలి 'ళ' తక్కిన కొన్ని భాషలలో 'డ' అగుట కలదు.

౧౦. ప్రా. ఊరో=గ్రామః, సంఘశ్చ. తె. ఊరు తమి. మళ. ఊర్. తుళు. ఊరు. ఇది 'ఉండు', 'నిలుచు' 'ఆగు' అను నర్థముగల "ఉఱ్" అను ద్రావిడధాతువునుండి వచ్చినది. తెలుగున 'to be fit'- తగియుండు: ఉఱ్—ఒఱ్ +పు='ఒప్పు'. ఉఱు=నిలిచిపోవు.వెను; దీరయు. cf ఉఱుదు, ఉఱక. ఈయర్థమొక్క వ్యతిరేకార్థరూపములయందే భాషలో నిలిచినది. తుళు-ఉన్తు- to stand, to stop, cease. cf. తె. "ఉండు."

౧౧. ఉచ్ఛిల్ల=ఛిద్రం—ఛిల్లశబ్దశ్ఛిద్రార్థే. ఛిల్ల ఉచ్ఛిల్లశబ్దౌ స్వతంత్రౌ. cf. తె. చిల్లి.

౧౨. ప్రా. కల్లా=కదిసం-మద్యం. cf. తె. కల్లు; కన్న. కల్లు; త. కళ్; మళ. కళ్, కళ్లు; తుళు. కలి: సంస్కృతములోని 'కల్యం' అను రూపము దీనినుండి యేర్పడినదే యగును.

౧౩. ప్రా. కారం=కటు—తె. కన్న, కార. 'ఖార' శబ్దభవమయి యుండును. మహారాష్ట్రము-ఖార అల్పప్రాణత్వము-ఖ-కయగుట ద్రావిడభాషా సంప్రదాయానుసారంబైయుండు

౧౪. ప్రా. కురులు = అదయానిపుణయోః- కుటిలకేశేన. తె. కురులు. కన్న. కురుళ్; త. కురళ్, కురుళ్, మురుళ్: మళ. కురుళ్, కుఱుళ్; మహా. కురుళ. cf. తె. సురుళ్-చుట్టు.

౧౫. ప్రా. ఖడ్డం=శ్మశ్రు—తె.గడ్డము; కన్న. గడ్డ; తమి. కట్టై.

౧౬. చిచ్చి=హుతాశన తె. చిచ్చు; కన్న. కిచ్చు; త. కిచ్చు.

౧౭. ప్రా. చించా=అమ్లికా. తె. చింతచెట్టు-పండు.

౧౮. ప్రా. చెండుఓ=కందుకః-తె. చెండు; కన్న. చెండు-చెణ్డు.

౧౯. ప్రా. ణేసరో=రవి-కన్న. నేసఱ్, నేసఱు; త. ఞాయిఱు, నాయిఱు; మళ. ఞాయఱు, ఞాయిఱు; (త. నిలాళ్ =light cf. తె. నీడ).

౨౦. ప్రా.పడ్డీ=ప్రథమప్రసూతా.cf. తె.ఆవుపడ్డ.

౨౧. ప్రా.పసిండి=కనకం—తె.పసిడి, పసిండి-పైడి. ధాతువు "పసుర్-పసిర్": కన్న. పసుర్ వణ్ణ= green, Yellowish colour తె. పసుపు.

౨౨. ప్రా. పావో=సర్పః. కన్న. పావు; తె. పాము; తమి. పామ్బు; మళ. పాముబ.

౨౩. ప్రా. పొట్టం=ఉదరం. cf. తె. పొట్ట; కన్న. పొట్టె-పుట్టి.

౨౪. ప్రా. పోయంతో=శపథః cf. తె. పంతము.

౨౫. ప్రా. పుల్లీ=వ్యాఘ్రః, సింహశ్చ- తె. పులి; త. మ. పులి-పిలి; క. పులి.

౨౬. ప్రా. పేండం=ఖండం, వలయశ్చ- cf. తె. పెండేరము, గండపెండేరము.

౨౭. ప్రా. బోంది=రూపం, ముఖం, శరీరం, చేటీ. cf. తె. బొంది, బొందె; త. బొంది.

౨౮. ప్రా. మేరా=మర్యాదా. cf. తె. అంతమేరకు.

౨౯. ప్రా. ముంగుసూ, ముగ్గసో=నకులవానరాః. cf. తె. ముంగిస; కన్న. ముంగిసి.

౩౦. ప్రా. మాసురీ=శ్మశ్రుః. cf. తమి. మసిర్. మయిర్, మయిరు.

౩౧. ప్రా. ముద్దీ=చుంబితం. cf. తె. ముద్దు; కన్న. ముద్దు, ముత్తు.

౩౨. ప్రా. మడో=కంఠః. తె. మెడ,

౩౩. ప్రా. మఇలో=కలకలో కతిశేషాశ్చ. cf. తె. మయిల, మైల.

౩౪. ప్రా. గడ్డీ=ప్రధానం. cf. తె. రెడ్డి; క. రడ్డి, రెడ్డి; త. ఇగడ్డి.

౩౫. ప్రా. రొట్టం=తణ్డులపిష్టం. cf. తె. రొట్టె; త. క. రొట్టి.

౩౬. ప్రా. మాడియం=గృహం. cf. త. మాడం; తె. మేడ.

౩౭. ప్రా. వాయణం = భోజ్యోపాయనం;- తె- వాయనము.

౩౮. ప్రా. సేట్టి=గ్రామేశః- తె. క. సెట్టి, చెట్టి. తు. సెట్టి.

౩౯. ప్రా. మొగ్గర=కుట్మల. cf. తె. మొగ్గ, మొగడ. (ధా) మొగడించు=ముకుళించు. ఇది వైకృతమని శ. రత్నా. కాని కన్న. మొగ్గె, మొగ్గు; తమి మొగ్గు-అని ద్రావిడభాష లన్నిటిలో నీరూపము లుండుటచేతను, 'ముగు', 'మూగు', 'మూయు' _ మొగిల్, మొగిలు, మొయిలు (మేఘము = సూర్యుని, ఆకాశమును మూయునది.) మొదలగు ననేకరూపము లీధాతువునుండి బయలు దేరియుండుటచే ద్రావిడభాషలనుండియే యిది సంస్కృతమున కెక్కి-యుండును.

౪౦. ప్రా. వెళ్లం=ధవళం_ తె. వెల్ల, వెలి, etc.; త. కన్న, వెళ్లి; తె. వెండి, etc.

౪౧. ప్రా. కావి=నీలివర్ణా. cf. తె. కావిరంగు; త. కావేరి.

౪౨. ప్రా. సూలా=వేశ్యా-కన్న. సూళె.

౪౩. ప్రా. కురుడో=అదయనిపుణయోః cf. తమి. కురుడర్; కన్న. కురుడ; తె. గ్రుడ్డివాడు; అర్థభేదము గలిగినది.

౪౪. ప్రా. మేంఠో=హస్తిపకః. cf. తె. మావటీడు; కన్న. మావటిగ.

౪౫ ప్రా. కసో, కచ్చరో = పంకః. cf. తె. కసవు; కన్న. కస, కసు, కసవు.

వైదిక సంస్కృతభాషలనుండి నిష్పత్తిచేయుట కనకాశము లేని దేశీయపదములు అని హేమచందు డిచ్చిన 'దేశీనామమాల' యను పదపట్టికలోని యీ పైపదములు ద్రావిడభాషలలో నిత్యవ్యవహారమునగూడ నున్నవగుటచేతను, కొన్ని యీభాషలన్నిటిలోను గన బడుమూలధాతువులకు సంబంధించినవిగా నుండుటచేతను, ప్రాకృతములకు నుత్తరహిందూస్థానభాషలకు గలిగిన యనార్యసంపర్కము ద్రావిడభాషాసంపర్కమే యయి యుండునని నిశ్చయింపదగియున్నది. ఆంధ్రభాషాలక్షణ కర్తలందరు నీభాష వికృతియేయని చెప్పినను, "తాన కొంత గలిగె"యని దేశ్యమును ప్రత్యేకముగా విడదీసి తెలుపుచుండుటచే నీయుత్తర దక్షిణదేశభాషలకు పద పరికరవిషయమున నిచ్చిపుచ్చుకొనుట కొంత గలిగినను, సాజాత్యసంబంధముమాత్రము కలదని తలచుట కవకాశ మేమియు నగపడదు.

శుక్ల సంవత్సర వైశాఖమాస భారతినుండి పునర్ముద్రితము.

ద్రావిడభాషలు-వర్ణవినిమయము

కోరాడ రామకృష్ణయ్య గారు, యం. ఏ.,

జీవద్వస్తువులన్నిటివలెనే జీవద్భాషలకును మార్పు సహజము. సజీవములగు పదార్థముల యభివృద్ధికిఁ దోడ్పడు లక్షణములు కొన్ని సహజముగ వాని జన్మమునకుఁ గారణములగు పదార్థములనుండియే సంక్రమించుచున్నను పరిసరముల స్థితిగతులుం గూడ కొంత తోడ్పాటు గావించుచున్నవనుట నిశ్చయము. ఈ రెంటియొక్క సమ్మేళనసాహాయ్యముచే నాజీవము పెంపొంది యభివృద్ధి గాంచుచు ననేకవిధములగు మార్పులకు లోనగుచు దనజీవయాత్ర కొనసాగించుచున్నది. అట్లే భాషలవిషయమునఁగూడ గాంచనగును. సమీపస్థములగు కొన్ని భాషలకు సహజములై సాజాత్యమును నిరూపింపఁగలిగిన సమానలక్షణములు కొన్ని మూలసృష్టికే యగపడుచుండును. అట్లయినను వీనికి భిన్నభాషలతోడి సాంగత్యమువలనఁగాని, దేశకాల స్థితిగతులనుబట్టి ఆయా భాషలను వ్యవహరించు జనుల యుచ్చారణపరిపాటిలోఁ గలుగుచుండు మార్పులవలనఁగాని మఱికొన్ని విశేషలక్షణము లబ్బుటచే నొక్కభాషయే భిన్నరూపములు గలదగుటయు, వీనిలో నొకదానికంటె మఱియొకటి విలక్షణమైన రూపమునొంది ప్రత్యేకభాషగా పరిగణింపఁబడఁదగినదై యుండుటయు సంభవించుచుండును. ఒక్కచెట్టునుండి వెలువడిన విత్తులే సహజముగ వానిలో సంక్రమించిన సత్తయందలి భేదమువలనను, పిదప నవి నాటఁబడిన క్షేత్రవిశేషములందలి గుణభేదమువలనను, అనంతరము వానికిఁ జేయఁబడిన దోహదవిశేషమువలనను, దేశకాలస్థితిగతుల సాహాయ్యమువలనను, భిన్నరీతులుగల వృక్షములై పెరిగి యొక్కొక్కప్పుడు వేఱువేఱురుచులుగల ఫలముల నిచ్చుచుండుటయు గలదు గదా. భాషలు నట్లే యొకమూలభాషనుండి బయలుదేరినవైనను దేశకాలస్థితులనుబట్టి యత్కించిద్భేదము గలవై పెరుగుచు వచ్చి తుద కొకకాలమున విడివడి పరస్పరసంబంధమును నిరూపించుటకు గూడ వీలులేనంతగా మాఱిపోయి కొంత కాలమునకు ప్రత్యేకభాషలుగ పరిగణింపబడుటయు తటస్థించును. భాషాబీజములు మొలకెత్తి శాఖోపశాఖలఁ దొడిగి వృద్ధినొంది భావఫలంబుల నొసంగుచు భిన్నరూపములుగల వృక్షములై విజృంభించుటకు వలయు నావాపభూమి మానవుని యాస్యరంగమే. ఈ రంగమున నా భాషానర్తకి వాచికాంగముల సాహాయ్యముచే ననేక చిత్రవిచిత్రరూపముల దాండవించుచు దన నాట్యకలాకౌశలముచే నొక్కభావమునే యనేకవిధములగు విచిత్రరూపముల వ్యక్తము చేయుచుండును. ఆంతరంగికమగు భావ మొక్కటియే యైనను ఆస్యరంగమున తాత్కాలికముగ గ్రహించిన ధ్వన్యాత్మక రూపభేదమునుబట్టి, ఆయా కాలములయందా భాషాసతిని పూర్వరూపమున మన కగపడినదానికంటె భిన్నమైనదానినిగనే మనము తలంచుచుందుము కాని తత్తత్కాలములందా నర్తకిచే గ్రహింపబడుచు వచ్చిన యాహార్యకసామగ్రి నించుక సూక్ష్మదృష్టితో పరికించినగాని తొలగించి చూచినగాని నైజంబగు మూలస్వరూపము మనకు వెంటనే గోచరింపక పోదు. ఈ భాషానర్తకి సులభముగ గుర్తింపఁబడుటకు వీలులేని పూర్వరూపములను గ్రహించుట కనువగు నాహార్యకసామగ్రిని సమకూర్చు ప్రధానసాధనము మానవుని యాస్యరంగమునం దమరియున్న వాచికావయవములే (Organs of Speech) యగుచున్నవి. ఈ యవయవసామగ్రియొక్క సౌష్ఠవాసౌష్ఠవములు, ప్రయోగసరణి, మొదలగువానియందలి భేదమునుబట్టియే యాభాషాసతి క్రొత్తక్రొత్తరూపములను వహించుచుండుట తటస్థించుచున్నది. విచిత్రరూపధారిణియగు నీమెరూపములలో నొకదాని నొకకాలమునఁ జూచి దానికలవాటుపడిన యొక జనసంఘ మదియే యామె నిజస్వరూపమని తలంచుచుండును. ఆ కాలముననే మఱికొంద ఱామెను మఱియొకరూపమునఁ గాంచి తాము గాంచినదే యథార్థరూపమని తలంచుచుందురు. ఈ జన

సంఘమే మఱికొంతకాలమున కామెను మఱియొకరూపమున గాంచి వెనుకటిరూపమే నిజరూపముగాని యిది కాదనియో లేదా ఈ నూతనరూపమే నిజమైనరూపముగాని వెనుకటిది కాదనియో తలంచుచు భ్రమించుచుందురు. ఇట్లీభాషాసతి దేశకాలానుగుణంబుగ భిన్నరూపములను బొంది ఆయాజనసంఘములం దాయారూపములతో గొంతకొంతకాలమువరకు నిలచియుండును. తనకు గోచరించిన రూపమునే భావించుచు తద్రూపప్రకటనమున కనువగునట్లే తమ వాచికాంగములను బ్రయోగించుట కలవాటుపడిన యా జనసంఘమున కారూపమే సంప్రదాయ సిద్ధంబైన దగును. భాషారూపములం దిట్టి సంప్రదాయములు స్థిరపడినకొలఁది మూలస్వరూపమును గనుఁగొనుట కవకాశము వీరికి తప్పిపోవుచుండును. కాని సూక్ష్మదృష్టితో పరిశీలించినచో నీభాషారూపములకును, జనుల వాచికావయవముల ప్రయోగసరణియం దేర్పడిన ప్రత్యేక సంప్రదాయములకును గల సంబంధము మూలముగా భాషారూపములకుగల పరస్పరసంబంధము, వాని పౌర్వాపర్యమును గొంతవఱ కన్వేషించి తెలిసికొని భాషాసతియొక్క మూలస్వరూపమును గూడ గుర్తించుట కేవల మసాధ్యము కాదు. ఈ మార్గము ననుసరించుటచేతనే భాషల సంబంధబాంధవ్యములు, నందలి సన్నిహితత్వా సన్నిహితత్వములును గూడ నిర్ణయించి భాషాకుటుంబముల నేర్పఱచుట సంభవించుచున్నది.

ప్రస్తుతము దక్షిణహిందూదేశభాగముల వ్యవహరింపఁబడుచున్న యాంధ్ర తమిళ కన్నడ మళయాళాది భాషారూపములకు ప్రాచీనంబగు మూలరూపం బెట్టిదో, యది యాయాప్రాంతజనుల వాచికావయవ ప్రయోగభేదమునుబట్టి యెట్టి మార్పులను జెందుచువచ్చి తుద కిట్టిరూపములను వహించినదైనదో యించుక పరిశీలింతము. మూలభాషారూపములయు, ధ్వనులయు యాథార్థ్యమునుగూర్చి చెప్పుట యంత సులభసాధ్యము కాదు గాని సమానార్థకములైన సజాతీయములగు సన్నిహిత భాషాపదములలో నీధ్వనులు పొందిన మార్పులను బట్టియు, నాధ్వనుల యుచ్చారణరీతులయందలి సౌలభ్యాసౌలభ్యములను బట్టియు నొక్కొక దేశమందలి యుచ్చారణపరిపాటిని బట్టియు మూలరూపము లివియై యుండునని కొంతవఱకు నిశ్చయింపవచ్చును.

ఈభాషలలోని పదాంతమందలి 'అ' కారధ్వని నిలకింపుదము. అది తమిళమున 'ఎయ్' అనియు, కన్నడమున 'ఎ' అనియు మాఱుచున్నది. మళయాళమున గూడ తెలుఁగున వలెనే అకారముగనే పలుకఁబడుచున్నది.

తె	తమి	మళ	కన్న	తుళు
తల	తలై	తల	తలె	తలె
మల	మలై	మల	మలె	మలె
వల	వలై	వల	బలె	బలె

తమిళమునకు రెండుప్రక్కలనున్న తెలుగు మళయాళములు రెండుభాషలలోను నీ 'అ'కారము తమిళమందువలె మార్పులేక అకారముగనే యుండుటను బట్టియు, అకారాంత సంస్కృతపదములు గూడ తమిళమున ఐత్వమును గ్రహించుచుండుటచేతను, cf అల-త. అలై, చిత్ర-త. శిత్తిరై etc. ఈ పదముల ప్రాచీనరూపము అకారాంతమే యనియు, తమిళమున ఐకారాంతములు లేదా ఎయ్కారాంతరములుగను, కన్నడమున 'ఎ'కారాంతములుగ పలుకఁబడుట ఆ జనసంఘముల యుచ్చారణవైఖరినిబట్టి తరువాతికాలమున నేర్పడినదే యనియు తలంపదగియున్నది.

కన్నడమున నిది 'ఎ'గా మారుటను బట్టి, దీనికి పూర్వరూపము తమిళమునందలి 'ఎయ్' అనియు నా 'ఎయ్'నుండియే ఈ 'ఎ' అంతరరూపము లేర్పడియుండుననియు తలంపవచ్చును. ఇంతేకాక పై పదములలో అకారాంతములే ప్రాచీనద్రావిడభాషారూపములని మఱియొకకారణముచే గూడ సాధింపవచ్చును. వలై, కొష్షై, నడై, మొదలగు రూపములు వల, కుజ్షి, నడ, అను అకారాంతధాతువులనుండి నామవాచకరూపములను కల్పించుటకుగా 'ఇ'కారప్రత్యయమును జేర్చుటచే తమిళమున నేర్పడినట్లుగపడుచున్నది. cf మణ్ వెట్టి-వెట్టు + ఇ;(తె. కోటు)=మన్ను నుసఱుకునది; త్రవ్వునది. అలరి—అలర్ ఇ= పువ్వు; తుణరి-తుణర్ + ఇ=అల, సముద్రము. ఈకార

ణముచే వల + ఇ, నడ + ఇ, కుజ్జ + ఇ-చేరి వలై, నడై, కుజ్జై అనురూపము లేర్పడి అవి కాలక్రమమున వలెయ్, నడై, కుజ్జయ్ అని యుచ్చరింపబడుచువచ్చి కన్నడదేశమున వలె, నడె, అను రూపములను బొంది యుండ వచ్చును. దీనిని బట్టి ప్రాచీనభాషలోని 'అ'కారధ్వని కాలక్రమమున నాయాభాషలలో నాయాదేశజనుల యుచ్చారణరీతులను బట్టి యెట్లు మార్పునొందినది తెలియుచున్నది.

కొన్నిభాషలలోని పదముల ఇకార, ఉకారములు మఱికొన్నిభాషలలో ఎ, ఒ, లుగా మాఱుచున్నవి. వీనిని బట్టి ప్రాచీనభాషారూప మిదియని నిశ్చయముగా చెప్పుట కవకాశము చాలకున్నను సరళాక్షరములతో (simple vowels) గూడిన రూపములే సంయుక్తాక్షరములతో (diphthongs) గూడినవానికంటె ప్రాచీనములై యుండునని తలంపఁదగియున్నది.

తమి.	తెలు.	కన్న.	
ఇడమ్	ఎడము	ఎడ	
ఇలసు	ఎల	లేత	
ఇలదు	(ఎలదు)	లేదు	
చెవి	చెవి	కివి	
చెవిడు	చెవుడు	కివుడు	
చెడి	చెట్టు	గిడ	
కేడు	చెడు కీడు చేటు	కెడు	
కెత్తు		కెరు	to scratch
ఇరంకు	ఎఱగు	ఎఱగు	to descend, to setdown as from a tree
కుట్టు	కొట్టు	కుట్టు	to beat
కొయ్	కోయు	కుయు	to cut
కుఱి	గొఱ్ఱె	కుఱి	sheep
	కొఱుకు	కుఱుకు	to bite
కుడై	గొడుగు	కొడై	
	గుత్తి	కొత్తు	bunch
కునై	కొన	కొనె	point
కో,కోర్	గ్రుచ్చు	కో	to string
		కోవె,కోవె	pearls, bead, etc
ఉడల్	ఒడలు		
ఉళ్	లో	ఒళ్	
ఉఱి	ఒర	ఒరె	
గుఱుకొట్టు		కొరె (నిద్రాంగధ్వని)	to snore

ఇం దికారోకారములతో గూడిన రూపములే ఎకారొకారములతోగూడిన రూపములకంటె ప్రాచీనములుగా నున్నట్లే రెండవతరగతి రూపములలో గలిగిన మార్పులను బట్టిగూడ మన మూహింపవచ్చును. అట్టి రూపములు తమిళ, కన్నడములందే తెలుగునందలివానికంటె హెచ్చుగా నున్నట్లగుపడుచున్నది. ఈపదములయందలి ఇకారోకారములు ఎకారొకారములుగ మాఱుటకు వాని తరువాతి వర్ణముపై గనబడుచున్న వివృతాకారముయొక్క సాహచర్యబలమే కారణమై యుండును. అనగా సంవృతాచ్చులగు 'ఇ', 'ఉ'లు వానితరువాత వచ్చిన వివృతాకారసాహచర్యముచే వివృతములై ఎ, ఒ,లుగా మాఱినవనుట. ఇట్టిమార్పు విశేషముగ నాంధ్రశాఖలో ప్రబలిన ట్లగపడుచున్నది. తుళుభాషలో మఱియొక విశేషముకూడ కలదు. ఇతరభాషలలో కొన్నిపదములలోని ఎకారము తుళుభాషలో ఒకారముగ పలుకబడుచున్నది.

త.	వెండుమ్	తు.	బోడ్
త.	విల్లి	తు.	బొల్లి

ఇచ్చటకూడ వకారము ముందుగా బకారంబై, యోష్ఠ్యబకారము తాలవ్యెకారమును ఓష్ఠ్యఒకారముగా మార్చివేసియుండును. మొత్తముమీద నీభాషలలో వర్ణసమీకరణ విధానము అనగా నొకవర్ణముయొక్క సాహచర్యమువలన సమీపమందలియితర వర్ణములుమార్పునొంది తత్ప్రభావమునకు లోబడి దానితో సమత్వమును, లేదా సావర్ణ్యమును జెందుట విశేషముగాఁ బ్రబలినట్లు గానవచ్చుచున్నది.


ఇట్టి మార్పు కేవల మచ్చులవిషయమునకేకాక హల్లులవిషయమునను గాంచనగును. దక్షిణ హిందూదేశ భాషలలో సజాతీయములని చెప్పదగిన యనేకపదముల లో పదాదికకారము కొన్నిభాషలలో చకారముగ మాఱుచున్న ట్లీక్రిందినిదర్శనమునుబట్టి మనకు దెలియ వచ్చుచున్నది. అనఁగా పదాదియందలి కంఠ్యకకారము లేదా కంఠ్యధ్వని తాలవ్యచకారము లేదా తాలవ్యధ్వనిగ మాఱుచున్నదనుట. ఈభాషలలోని యీ క్రిందిపదము లను గమనింపుడు:—

	కన్న.	తుళు.	తమి.	తెలు.	
1	కిచ్చు	కిచ్చి	కిచ్చు	చిచ్చు	Fire
2	కెట్ట	కెట్ట	కెట్ట	చెడ్డ	Bad
3	కిఱు కిత్తు	కిన్ని	చిఱు	చిఱి చిఱు	small
4	కిలబు కిలుబు కిలిబు	కలెంగు	కళిమ్పు మ.కిళర్పు	చిలుము	rust
5	కివి	కెమి కిబి	చెవి మ. చెవి	చెవి	ear
6	కివుడు	కెప్ప	చెవిడి	చెవుడు	deafness
7	కిళి	గిళి	కిళి మ.కిళి	చిలుక	parrot
8	కెక్కు	కెప్పె	కన్నం	చెక్కిలి చెక్కు	cheek
9	కెం కెప్పనె	కెంపు	చెం కెంపు ruby	చెం చెన్ను	red
10	కెఱె	కెదు	చెఱై	చెఱువు	tank
11	కెల్లె	...	చిల్లి	చిల్లి	a piece a splinter
12	కెళది	...	చిలది	చెలి	a female companion
13	గిడ	...	చెడి	చెట్టు	a tree
14	గేణ్ గేణ	గేణ్	చాణ్ శాణ్	జేన జాన	a span
15	కై-కహి	కైపె	కళిపు కైప్పు	చేదు	bitterness
16	...	...	కిట్టం	చిట్టము	rust, ore stone
17	కెల	కెల	చిల శిల మ. చిలె	...	some
18	కీరె	...	కీరై మ. చీర	కూర	greens
19	కెయ్	...	కెయ్	కయి చెయ్యి	hand

ఇట్టిమార్పు కొన్ని ధాతువులలోఁగూడ గానవగును.

19 a	...	...	కిఌప్పు	చింపు	tear off
20	కిఠ	...	చిరై	...	to slave
21	కీడు కెడు	కెడు	కెడు	చెడు	to get spoiled
22	కెత్తు	కెత్తు	చెతుక్కు	చెక్కు	to chip to make thin
23	కెదుకు	...	...	చిలుకు	to stir
24	కెదఱు	...	చెదఱు	చెదరు	to scatter
25	కెయ్	...	చెయ్	చేయు	to do
26	కెరె	...	...	చీరుట	to scratch with nails
27	కీ	...	చీఴ్ మ. చీ	చీము చీకు చివుకు	to become pus
27	...	...	కిత్తు కింతు	చిందు	to hop, to leap about
28	...	...	కిరంకు	చిరాకు	to be jaded fatigued
29	కెణకు	కెణకు	...	చెనకు	to provoke
30	కిముఱ్చు	...	...	చిముడు?	
31	కెళర్			చెలరేగు	to expand
32	కేఱు	శూర్పకరణే		చెఱుగు	to winnow

ఈ పదములలోని మార్పునుగూర్చి విచారింపగా విందలి పదాదికకారము తాలవ్యచకారముగా మారుటకు గల ముఖ్యకారణము ఈ పదములన్నిటిలోను నీకకారము తాలవ్య ఇ, కార, ఎ కారములచే ననుసరింపబడు



టయే యని తలంపవలసివచ్చుచున్నది. కంఠ్యకకారముపై వచ్చిన తాలవ్యములగు ఇ, ఈ, ఎ, ఏలు ఆకంఠ్యధ్వనిని తాలవ్యముగా మార్చియుండనోపును. కాని యిది సర్వ సామాన్యమని చెప్పుటకు నవకాశము లేదు. ఏలయనఁగా కొన్ని పదములలోని కకారము తాలవ్యైకారానుసృతంబె యైనను ఇట్టిమార్పు పొందిన ట్లగపడదు. దీనినిబట్టి ఈ మార్పు భాషలో నెదోయొకకాలమున ప్రాధాన్యము వహించి తన ప్రభావమును నెరపినదనిగాని, లేదా ఈపద ములు మొదటినుండియు తాలవ్యాచ్చులతో గూడినవి గాక కొంతకాలమున కొకజనసంఘము నుచ్చారణమందు గలిగిన మార్పుచే తాలవ్యాచ్చులతో గూడినవైనవని గాని చెప్పవలసియుండును. అట్టిపదములను కొన్నిటి నీక్రింద బొందుపఱచుచున్నాడను.

తమి.	కన్న.	తెలు.	
కెట్టం	గడ్డ	గడ్డము	Chin
కెట్టి	గట్టి	గట్టి	Firmness
కెచ్చకాయ్	గజగ	గచ్చకాయ	
కెచ్చం	గెజ్జె	గజ్జె	Tinkling anklet
కిళఱు	కెళరు	కెలకు	to poke, to dig up, stir
కిల్లు	చివుటు చిముటు	గిల్లు	to pinch pluck
కిటికి	కిటికి	కిటికి	window
కిట్టు గిట్టు	కిడై మ.కిడై	కిట్టు గిట్టు	to touch
కీఱు	కీఱు	గీరు గీచు	to scrape rub off
కీఴ్జ	...	క్రిందు (cf క్రీ గాలు)	
కెడువు	...	గడువు	term, fixed time
కెడై	...	గడ	pole
కెంపరై	గంపె	గంప	basket
కేల్ కెలి త్తల్	గెల్	గెలుచు	to conquer

ఇట్లు తాలవ్యములుగా మార్పునొందని పదముల లో సామాన్యముగా 'క'కార మాంధ్రకన్నడములందు 'గ' కారముగా పలుకబడుచున్నట్లు వీనినుండి మన ము గ్రహింపవచ్చును. గడ, గంప, గజ్జె మొదలగు కొన్ని పదములలో కంఠ్యముపై నకారమె తెలుగులో కనబడు చుండ తమిళమున 'ఎ'కారము కనబడుటయనునది యొక వేళ యిటీవలికాలమున జరిగినమార్పై యుండినను ఉండ వచ్చును. ఏలయనగా పదాదికంఠ్యముపై అకారముగల సంస్కృతపదములు తమిళమున నుచ్చరింపబడునపుడు 'ఎ'కారముతో గూడినవగుచున్నవి.

సం. గజ—త. కెజం

సం. గర్జిత—త. కెచ్చితం

ఈ కారణముచే తెలుగులోని గజ్జ, గచ్చకాయ గడ మొదలగుపదములు ప్రాచీనకాలమునుండియు 'అ' కారముతో గూడినవిగనేయుండ, నిటీవలికాలమున తమి ళమున నెత్వముతో పలుకబడు నలవాటు ఏర్పడియుం డునని యూహింపదగియున్నది.

దీనినిబట్టి చాలవఱకు మూలభాషలో ఇ, ఈ, ఎ, ఏలతోగూడిన పదాదికంఠ్యధ్వనులే, అనగా తాలవ్యా చ్చులు పరముగాగల కకారాదులే తాలవ్యధ్వనులుగ ననగా 'చ'కారాదులుగ మాఱినవి గాని తాలవ్యేతరాచ్చుపరక ములుగాని ధ్వను లట్లు మారక సారళ్యము మాత్రము (Softened) బొందినవని తెలియుచున్నది. ఈ కంఠ్య ధ్వనులు తాలవ్యములుగ మాఱుటకు వానికి బరములైన తాలవ్యాచ్చులప్రభావమే (influence) కారణమని నిశ్చయించుటకు మున్ను తాలవ్యేతరాచ్చుపరకము లగు సజాతీయపదములను మఱికొన్నిటిని పరికింతము గాక! ఈక్రిందిపట్టికలోని పదములలో నీతాలవ్యధ్వనులు గాన రాకుండుట గాక పైపదములలోవలె గొన్నిటిలో పదా దికకారము సరళత్వమునుబొంది 'గ'కారమగుటమాత్రము గానవగును.

కన్న.	తమి.	తెలు.	
కక్కు	...	కక్కు (కఱు)	Irregular surface, a notch



కక్కు	కఱుక్కు	కక్కు	to vomit
కణ్	కణ్	కన్ను	
కంకి	...	కంకి	an ear of jola
కట కట్ట కడ ...		కడ	end. corner
కడల్	కడల్	కడలి	sea
కట్టు	కట్టు	కట్టు	to bind
కత్తు	కఱుత్తు	కుత్తుక	neck, throat
కత్తె కత్తి	కఱుదె	గాడిద	an ass
కదలు	కదలు	కదలు	to move
కన కణసు	కనవు	కల	a dream
కనర్	...	కనరు	bitter
కనలు	కనల్	కనలు	to burn
కన్దు	కన్డు	కన్దు	a calf
కప్పు	కప్పు	కప్పము	tribute
కప్పు	కప్పు	కప్పు	to cover
కప్పు	కఱుప్పు / కప్పు	కప్పు / cf కాఱు	blackness
కమ్మి	కమ్మి	కమ్మి	beam
కర	కరై	కర	bank, shore
కల్	కల్	కల్లు	stone
కసవు	...	కసవు	rubbish sweepings
కళ్ల కళ్ / to steal	కళ్ళణ్	కల్ల / కల్లరి	
కయ్	...	కాయు కాచు	to protect
కాడు	కాడు	కాడు	forest
కాదల్	కాదల్ / మ. కాతల్	గాదిలి	affection
కార్	కార్	కారు	black rainy season
కాల్	కాల్	కాల్	foot
కావి	కావి	కావి (రంగు)	red earth
కుట్టు	కుట్టు	కొట్టు	to beat
కుడి	కుడి	cf కుడిచి త్రాగు	to drink
కుదురు	...	కుదురు	fit

కుఱ	...	కుదియు	to become tight
కుయ్ కొయ్ కొయ్		కోయు	to cut
కురుడ	కురుడ	గ్రుడ్డి	blind
కురుళ్	కురళ్ / కురుళ్	కురులు	a curl
కుఱళ్	కుఱళ్	కుఱు (చ)	shortness
కుఱుకు	కొఱి	కొఱుకు	to bite
కుయ్య	...	కొయ్య	wood
కుఱుచు	...	గుజ్జు	dwarfish
కుగ్గు కుగ్గు	...	క్రుంగు	to shrink bend.
కులుకు	కులై	కులుకు	to shake
		to be agitated	the body as in dramatic action
కుటి	గుఠి	గొయ్య	a hallow pit
కూగు	కూగు / కూవు	కు. తె. / కూయు	to cry aloud
కూడల్	...	కూడలి	a junction
కూడు	...	కూడు	to join
కూన్ / కూను / గూను	...	గూని	a hump
కూర్	కూర్	కూర్చు	to be attached
			to lose
కూలు	కూలు	కూలు	to fall down
కూసు	కుంజు	కూసు / కూతు	a young one, daughter
కొడ	...	కొదమ / కొడ	youth tenderness
కొడె	కొడై	గొడుగు	umbrella
కొండెయు	కుణ్డియ / మ. కుటిళ	కొండెము	back biting
కొత్తు	...	గుత్తి	bunch
కొన	కున్నై, కొన్నై	కొన	point extremity

కొబ్బరి	కొప్పరై	కొబ్బరి	
కొమ్ము	కొమ్ము	కొమ్మ	a horn
కొమ్ము, కొమ్మె	కొప్పు, కొమ్ము	కొమ్మ	the branch of a tree

కొన్ని ధాతువులు

కొాత్తు	కుత్తై	కొంత	to cut, smallness remainder
కొళ్	కొళ్, కొళ్లు	కొను	to take
కో	కో, కోర్	క్రోవ	
	cf ముత్యాలకోవలు		to string
	గ్రుచ్చు		to thread
కొంకు=కౌటిల్యే		cf కొంకి	to get crooked
కరగు=విలీనే		కఱగు	
కడంగు=ఔత్సుక్యే		కడంగు	
కర్చు=ఖదనే		కరచు	
కుట్టు=తాడనే		కొట్టు	
కడి=ఖండనే		కడికండలు	
కడె=మథనే, అవసానేచ		కెడగూడు, కెడయు	=చచ్చు
కాణ్=దర్శనే		కను	
కందు=గతకాంతౌ		కందు	
కుందు=క్షయే		కుందు	
కుప్పు=పుంజీకరణే		కుప్ప	
కుమ్మ=ముసలక్రియాయాం		కుమ్మ	
కొయ్=లవనే		కోయు	
కూర్=స్నేహే		కూర్చు	
కనర్=అపక్వరసనే		కనరు	
కిలిర్=హాయధ్వనౌ		పకిలించు?	
కవి=అచ్ఛాదనే		కవియు	
కాకు=దాహే		కాచు	

ఈపైజూపిన సజాతీయపదములను, ధాతువులను బట్టిచూడగా సామాన్యముగా 'క'కారము—లేదా, కంఠ్యహల్లునకు ఇ, ఈ, ఎ, ఏ, ఐ—అనగా తాలవ్యాచ్చులు పరమైనపుడే అది తాలవ్యహల్లుగా - చకార, జకారము లుగా మార్పునొందినట్లును ఆ కంఠ్యహల్లునకు తాలవ్యేతరములగు నచ్చులు పరమైనపు డాకంఠ్యధ్వని యన్ని భాషలలోను గూడ నట్లే నిలచియున్నట్లు గానవచ్చుచున్నది. ఈ నియమము చాలవరకు అన్ని భాషలకు సమానములగు మూలధాతువులలో గూడ గానవచ్చుచుండుటచే నీ సంప్రదాయ మతిప్రాచీనకాలముననే బయలుదేరినదనియు గూడ తలంపవచ్చును. కాని యిది యాంధ్రశాఖలో హెచ్చుగను, తమిళ మళయాళములలో స్వల్పముగను గానవచ్చుచున్నదే గాని, కన్నడభాషలో నంతగా వ్యాపించిన ట్లగపడుటలేదు. కావుననే తమిళాంధ్రములను, అందు విశేషముగా నాంధ్రమునను గానం బడుచున్న తాలవ్యచకార మాదివర్ణముగా గలిగిన పదములకు సజాతీయంబగు కన్నడపదము సామాన్యముగా కంఠ్యాదియై యుండుటను పై పట్టిక మనకు జూపుచున్నది. ప్రాచీనభాషలో నీపదములు కంఠ్యాదులే గాని తాలవ్యాదులని చెప్పుట పొసగదు. ఏలయనగా తాలవ్యాచ్చపరకములగుటచే తాలవ్యములనగా మాఱి పదాదిచకారముతో గూడిన పదములు, ధాతువులు విశేషము గాగల ఆంధ్రమునందు గూడ తక్కినభాష లన్నిటియందువలె నాపదకుటుంబమునకుం జెందిన కొన్నిరూపములలో కంఠ్యకకారమే కనంబడుచుండుట వలన కకారాదిపదములే ప్రాచీనములని చెప్పుగాని చకారాదులే ప్రాచీనములై యుండి కారణాంతరముచే నందలి చకారము కకారముగ మాఱినదని చెప్పుట కవకాశమేమియు నగపడదు. కయిశబ్దము చూడుడు. ధాతువు — కెయ్, గెయ్ అనునది. ఇది తెలుగున 'చేయు'ధాతువైనది. ఏ పనిచేయుటకైన నుపయోగించునది గావున హస్తము 'చేయి' అయినది. కాని ఇదియే దీని ప్రాచీనరూపమా యని పరిశీలించినచో 'కయి'రూపంబొకటి హస్తపర్యాయమై యేకవచనమునను బహువచనమున 'కేలు' అను రూపమును వ్యవహారసిద్ధంబులై యున్నవి. తక్కిన సజాతీయభాషలలో 'కయి' రూపమే ప్రాచుర్యమును వహించియుండుటను జూచియేయున్నాము. తమిళమున తెలుగువలెనే 'కెయ్'ధాతువు 'కెయ్'అనురూపమున

గానవచ్చుచున్నను కన్నడమున 'కెయ్' 'గెయ్' ధాతువులును, 'కయి' రూపమునేగాని తాలవ్యముతో గూడిన రూపమే లేకపోవుటచే ప్రాచీనధాతురూపము కకార విశిష్టమే యని యీ దానినుండి యేర్పడిన 'కయి' యే 'చెయ్'-'చెయ్యి'లకంటె ప్రాచీనమనియు మనము నిశ్చయింప దగియున్నది. కన్నడభాషలో తాలవ్యచకారముతో గూడిన రూపమొక్క 'చేయు' ధాతువునకే కనబడకపోవుట లేదు. ఇట్లు తాలవ్యములుగ మారిన పదాదికంఠ్యధ్వనిగల సజాతీయపదము లేవియు గూడ తాలవ్యములై కన్నడమున గానవచ్చుట లేదు. ఈ పదము లన్నియు కంఠ్యములతోనే యాభాషలో గానవచ్చుచుండెననుటకు పై పట్టికయే నిదర్శనము. ఈకారముచే నీధ్వనికి లేదా యీపదములకు సంబంధించినంతవరకు కన్నడభాషయే ప్రాచీనభాషారూపమును నిలుపబెట్టుకొనినదని మనము నిశ్చయింపవచ్చును.

కాని యీభాషలోగూడ నొక్క పదములో నీ మార్పు కనబడకపోలేదు. 'కెసు' [illegible] [illegible]గా మారకపోయినను కెం-చెం చెన్నుగా మాత్రము మారినదగుటచే వ్యాకరణములలో నీమార్పొక ప్రత్యేకసూత్రమున విధింపబడవలసి వచ్చినది. శబ్దమణిదర్పణమున,

"జని యిసుకం కెచ్చనె బె
చ్చనె పచ్చనెగళ్ చకార దోళ్ ముత్వం కె
చ్చనె యాగెగెబిన్దం మే
ణెనెపర ముకారమిత్వక్కెవ్వం.

కెచ్చనె, బెచ్చనె, పచ్చనె, పదముల [illegible]కారమునకు ముత్వము విధించుచు కెచ్చనె పదమునకు మాత్రము [illegible] '[illegible]' కారమునకు '[illegible]'వ్యవధానము చేయవలెనన. అనగా కెచ్చనె + నీర్ = కెం + నీర్ = కెన్నీర్ (చెన్నీర్). బెచ్చనె (=వెచ్చన) + నీర్ = వెం + నీర్ = వెన్నీర్. పచ్చన + నీర్ = పం + నీర్ = పన్నీర్. కెచ్చన + కణిగిలె = చెంగణిగిలె (cf కెంపమ్మ, చెంగావి) కెచ్చనె + కాయి (= [illegible]గాయ్; తె- చెంకాయ) = చెంగాయి.

ఇట్లే 'చెంగణిగిలె' మొదలగు కొన్ని రూపములలో దప్ప నీభాషలో కకార కంఠ్యధ్వని తాలవ్యాచ్చపరకమైనను తక్కిన కొన్ని భాషలలోవలె తాలవ్యచకారముగ మార్పునొందక, సామాన్యముగా ప్రాచీనభాషారూపముననే నిలచియున్నట్లగపడుచుండుటచేతను, తెలుగున విశేషముగను, తమిళమున తెలుగునందుకంటె కొంచెము తక్కువగను నీమార్పు ప్రాచుర్యమును వహించియుండుటచే, తెలుగు తమిళములు కన్నడమునుండి విడిపడినపిదపనే యీమార్పున కనువగు పలుకుబడి యీ జనసంఘములలో ప్రారంభించియుండునని తలంపవలసి వచ్చుచున్నది. పైని జూపిన సుమారు మున్నూరుపదములు గల పట్టికలో కన్నడమున కకారముతో గూడినపదములు కన్నిటికిని తెనుగున చకారముతో గూడిన రూపములే గానవచ్చుచుండ తమిళమున సుమారు సగము పదములు మాత్రమే తాలవ్యముతో గూడిన రూపములుగా నున్నవి. తాలవ్యాచ్చపరకములైన కంఠ్యధ్వనులు తాలవ్యములుగ మారుటను బట్టి "తాలవ్యీకరణవిధానము" (Law of Palatalization) నిద్రావిడభాషలలో నొక 'భాషానియమము'గా మనము గ్రహింపవచ్చును. ఈ సూత్రము [illegible] ప్రకారము కన్నడము తమిళ తెలుగులకంటె ప్రాచీనభాషారూపముల నెక్కువ జాగరూకతతో నిలుపుకొన్నదనియు మనకు తెలియవచ్చుచున్నది.

ఇండో యూరోపియన్ కుటుంబభాషలలో గూడ నిట్టి ధ్వనిసూత్రమే (Sound law) కొంచెము [illegible] చేసిన ట్లగపడుచున్నది. ఆ భాషలలో నయిదును తాలవ్యాచ్చపరకములగు కంఠ్యము లనేకపదములలో తాలవ్యములుగ మారినవి. దీనిమూలమున పాశ్చాత్యశబ్దశాస్త్రజ్ఞు లిండోయూరోపియన్ కుటుంబమునకు జెందిన భాషలకు గల సంబంధమును దాని సన్నిహితత్వమును గూర్చి కొంతవరకు నిర్ణయింపగలిగినారు. ఈకుటుంబమునకు జెందిన సంస్కృత, ఆర్మీనియన్, ఆల్బేనియన్, [illegible], [illegible]టన్, గ్రీక్, ట్యూటానిక్, [illegible] మొదలగు భాషాశాఖ లతిపురాతన కాలము క్రిందటనే మొట్టమొదట రెండు శాఖలుగా విడిపోయి యటుపిమ్మట నింకను భిన్నశాఖలుగా మారిపోయినవని ప్రాచీనభాషలలోని కంఠ్యధ్వను లీభాషా

శాఖలలో పొందిన మార్పులనుబట్టి నిశ్చయించుచున్నారు. ఈ యాదిశాఖలకు దేశవిభాగమునుబట్టి ప్రాగ్వ పశ్చిమశాఖలనియు (Eastern & Western) వాఙ్మనికి గలిగిన మార్పునుబట్టి—శతం-కెంటుం-భాషలనియు పేరిడిరి. 'నూరు' అను నర్థముగల ప్రాచీన భాషలోని 'కెంటుం' అనుపదము పశ్చిమ భాగమందలి లాటిన్, గ్రీక్, కెల్టిక్ భాషలలో వరుసగా 'కెంటుం, ఎకటాన్, హండ్' అను రూపములను పొంది యేక విధముగా కంఠ్యధ్వనిని నిలుపుకొనియుండ ప్రాగ్భాషలగు జెండు, సంస్కృతము, బాల్టో స్లావనిక్ భాషలలో నీ కంఠ్యకకారము 'ఊష్మము'గ మారిపోయి వరుసగా, 'సెతం, శతం, సింతాస్' మొదలగు రూపములను పొందుటచే నీ ప్రాక్పశ్చిమభాషల ధ్వని నుచ్చరించు విషయమున చిరకాలముక్రిందనే భేద మేర్పడినదని తెలియుచున్నది. ఇంతేకాక పశ్చిమ భాషలలో— బహుశః ప్రాచీనార్య ఇండో యూరోపియన్ భాషలో గూడ నిప్పుడు సంస్కృతమున గలయట్టి 'చ' కారము లేక తాలవ్యధ్వని యున్నట్లగపడదు. సంస్కృతమునను,—సంస్కృతమునందే గాదు — ప్రాగ్భాషలలో నీ తాలవ్యకారము కనబడుచున్నచోట్ల పదములు పశ్చిమశాఖకు జెందినభాషలలోని సజాతీయరూపములలో (Cognate forms) కంఠ్యకకారమే కన బడుచున్నది. ఇందుకు నిదర్శనముగా నీక్రిందిపదములను జూడుడు.

సం. పంచ	లాటిన్ పెంక్వె — గాథిక్, ఫిమ్ఫ్.
సం. చత్వార్	లాటిన్ — క్వాటోర్
సం. నరః	గ్రీక్ — ఏనేర్
సం. జఠరః	గాథిక్ కిల్థై
సం. ఓజస్	లాటిన్ ఔగెఓ
సం. జనః	లాటిన్ జెనోస్
సం. జజాన	లాటిన్ గెగోన్

కాని మఱికొన్ని పదములు కంఠ్యయుక్తములుగనే యెట్టి మార్పు లేకయున్నవి.

సం. కర్కటః	గ్రీ. కర్కినోస్
కారుః	గ్రీ. కారుస్
కాల	గ్రీ. కాలోస్
కతరః	గ్రీ. కోతరోస్
యుగ్మం	గాథిక్ జుక్ ఇంగ్లీ యోక్
గౌః	గ్రీ. బౌస్ (బ=గ)
గిరిః	లిథువా. గిరియ

పైనుదహరించిన పట్టికలలోని పదములట్లు తాలవ్యకారములుగ మారుటకు గల కారణమేమి యని విచారించినచో, మొదటిపట్టికలలోని లాటిన్ మొదలగు భాషాపదములలో కంఠ్యధ్వనిగా గనబడుచున్న 'క' కారము తాలవ్యప్రకారం బగుటయు, రెండవపట్టికలలోని కంఠ్యధ్వనులట్లుగాక, తాలవ్యాకారములను సవర్ణములు పరమందు గల వగుటచే యని మనము తెలిసికొనగలుగుదుము. ఇట్లు తాలవ్యాచ్చులు పరమందు ప్రాగ్వమునగల కంఠ్యధ్వనులను తాలవ్యములుగ మార్చునట్టి విధానమునే యిండో యూరోపియన్ భాషలలో పరిశ్రమచేసిన శబ్దశాస్త్రజ్ఞులు (Indo European Philologist) 'తాలవ్యకరణ విధానము' (Law of palatalization) అని చెప్పుచున్నారు. ఇట్టి శబ్దములు భాషాశాస్త్రజ్ఞులు [illegible] గూడ నీ వ్యాకరణికతనే సంభవించియుండునని వాంఛి తాలయనముల ప్రయోగసరణి ననుసరించి భాషలలో గలుగుచుండు వికారములు బాహ్యప్రకృతిక వికృతి చే జరుగుచుండునని తలంపబడుచున్నది.

ఈ కంఠ్యధ్వనులు పొందు మార్పునుబట్టి ఇండో యూరోపియన్ భాషల సంబంధమును నిర్ణయించినరీతిని ద్రావిడభాషల సంబంధమును గూడ నిర్ణయింపవలెనని [illegible] మనకున్న పదములు శిష్టభాషలనుండి, ప్రాచీన భాషనుండి చిరకాలముక్రిందనే విడిపోయియుండును నని యూహింపబడియున్నది. కాని యిది యింక నితర ప్రబలసాక్ష్యముచే ఋజువుచేయబడునంతవఱకు నిశ్చయింప వీలులేదు.

ప్రమోదూత సంవత్సర వైశాఖమాస భారతినుండి పునర్ముద్రితము.

ఆంధ్రదేశ్యము - అన్యదేశ్యము



= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఇప్పుడు ప్రపంచమున వ్యవహారమందున్న భాషలను వేలసంఖ్యచే లెక్కపెట్టవలసియుండునుగదా. కాని వీనిలో వేరొక్కటిగాని యేయితరభాషతోను ఎట్టి సంబంధము లేక స్వతంత్రముగ నిలిచియున్నదని చెప్పుటకుమాత్ర మవకాశము లేదు. కాలగతిని మానవసంఘములలో బరస్పరము కలుగు సంబంధములవలెనే వారిచే వ్యవహరింపబడు భాషలకును బరస్పరసంసర్గము కలుగుచుండుటయు, నొకటి మఱియొకదానినుండి పదములను, పదబంధములను, రచనారీతులను మొదలగువానిని సంగ్రహించుచుండుటయు ననవరతము తటస్థించుచునేయుండును. కాని మానవసంఘమునందువలెనే యీసంసర్గఫలము భాషావిషయములోగూడ సులభముగ గుర్తింపబడకపోవచ్చును. అట్లేయైనను మానవసంఘమునుగూర్చి చరిత్రకందని విశేషవిషయములను భాషాచరిత్ర సూచింపగలుగుచుండుననుటకు సందేహము లేదు.

ఒకభాషలోని శబ్దములను, ఆభాషాతత్త్వమును గూర్చి విచారించి వాని నితరభాషలతో బోల్చిచూచినచో, నాభాషకు సహజములైన మూలపదము లేవో, అందేయేపదము లేయే కాలములందేయేభాషలతో గలిగిన సంసర్గముచే నందు జేరియున్నవో తెలిసికొనునవకాశము లీకాలమున గలుగుచున్నవి. ఇప్పటి ఇంగ్లీషుభాషలో ననేకములగు నితరదేశభాషాపదములు చేరినవని చెప్పబడుచున్నది. అట్లన్యదేశీయపదములను విరివిగా దీసికొనుటవలననే యాభాష యంతగా నభివృద్ధి నొందిన దనియు తలంపబడుచున్నది. ఇప్పుడది ప్రపంచమందంతటను ప్రసిద్ధినొందిన భాషలలో ముఖ్యమైనదిగా నున్నది. దీనికాభాషను వ్యవహరించువారు భూభాగమునందనేకదేశముల ప్రబలులై యుండుటయేకాక, ఆభాషలో నాధునిక ప్రాపంచిక విజ్ఞానమంతయు నెలకొనియుండుటగూడ నొక కారణమని చెప్పవచ్చును. మొన్నమొన్నటివరకు హిందూదేశమున సంస్కృతభాష కట్టిస్థానమే కలదు. అది హైందవవిజ్ఞానమున కంతకు నాకరమై యుండుటచే హైందవుల నిత్యవ్యవహారమునుండి తొలగినను, ఈదేశమున దీని కట్టిస్థానమే లభించినది. కావుననే అప్పకవి యిట్లు చెప్పియున్నాడు.

"తమతమ బాసల కవితలు
దమతమ దేశముల కొప్పిదములగుఁబరదే
శములకుఁ గూడ నొకింతయు
నమరోక్తులు సకలభూములందును వెలయున్.

తలపగ సంస్కృతకావ్యం
బులు తమ యర్థములు సకలభూజనములకున్
దెలిసినను దెలియకున్నను
బొలుపొందఁగనిచ్చు నాల్గుపురుషార్థములన్."

దేశీయవిజ్ఞానమున కాకరమగుటచేతనే యీభాష నిత్యవ్యవహారమందు లేకున్నను, సర్వజనులకు దాని యర్థము తెలిసినను దెలియకున్నను పురుషార్థప్రదాయినిగా గ్రహింపబడుచున్నది. ఈదేవభాష అనుదానిలోగూడ ననేకములగు విదేశీయపదములు చేరియేయున్నవి. కాని తరువాతి వైయాకరణులు వాని యర్థములకు దగినట్లు ధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పించుటచే నవి యన్యదేశీయములుగా బరిగణింపబడుటలేదు. పిక, కాకశబ్దములు రెండును కై, గై శబ్దే అను ధాతువునుండి నిష్పన్నములైనట్లు లింగాభట్టీయము చెప్పుచున్నది. కాని 'పిక' శబ్దము లాటిన్ భాషలోని **'Pecus'** అనుశబ్దమునకు సంబంధించినది. ఇట్లే 'దీనార' శబ్దము గ్రీకుభాషలోని **'Dinarious'** అనుశబ్దమునుండి వచ్చినది. ఇట్లే యీభాషలో నింక పారసీక, యవన, రోమక, బర్బరాద్యన్యదేశభాషాపద

ములు చేరినవనియు, అట్టివాని కిటీవలి వైయాకరణు లేవో సంస్కృతధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పింప బూనుటయుక్తముకాదనియు, కుమారిలభట్టాచార్యు లన్యదేశపదముల కర్థనిర్ణయము చేయు టెట్లు అను విచారణసందర్భములో దన తంత్రవార్తికమున జెప్పి యున్నాడు. * సంస్కృతభాషకు లాటిన్, గ్రీకు మొదలగు భాషలతో గల సజాతీయతను సం. పితా - లా. పెటర్; సం. సప్త - గ్రీ. సెప్టెం- లా. హెప్త; సం. భరామి-లా. ఫెరొ, ఫెరో మొదలగు శబ్దములయు వ్యాకరణరూపములయు సామ్యమే వ్యక్తముచేయు చున్నది. కాని పిక, నేమ, దీనారాదిశబ్దము లాయా భాషలలోనుండి యర్వాచీనకాలమున వచ్చి యిందు కలిసినవి. కాని వీనికన్నిటికిని సమానముగనే వైయా కరణులు వ్యుత్పత్తులను గల్పించుటచే నేవి సజాతీయ ములో **(Cognate words)**, ఏవి ఎరువుగా వచ్చి కలిసి నవో **(Borrowings)** తెరువాత తెలిసికొనుట కవకాశము లేకపోయినది.

ఇట్లే ఆర్యులు హిందూదేశమున నెలకొన్న తరువాత వారి భాషలో దేశీయములగు శబ్దము లెన్ని యైనను చేరియుండునుగదా. కాని యట్లార్యభాషలో చేరిన శబ్దములను గనిపట్టి వానిని దేశీయములుగనో, లేదా విదేశీయములుగనో వైయాకరణులు పరిగణించిన ట్లగపడదు. క్రీ. శ. 8-వ శతాబ్దిని కుమారిలభట్టు విదేశీయపదములకు వైయాకరణులు సంస్కృతధాతు వులనుండియే వ్యుత్పత్తులను గల్పింపజూతురని చూపుటకు గొన్నికొన్ని ద్రావిడ భాషాశబ్దములను గ్రహించినాడు. అట్టి పాప్, వైర్, అతర్ మొదలగు నవికూడ నుదాహరణమునకుమాత్రమే యతనిచే గ్రహింపబడినవిగాని, ఆపదము లార్యభాషలో జేరిన వనికాదు. తరువాతి ప్రాకృతవైయాకరణులైనను ప్రాకృతభాషలలో జేరిన దేశీయశబ్దములను 'దేశీ నామమాల'లమూలమున ప్రత్యేకించి చెప్ప దొడంగిరి కాని సంస్కృతవైయాకరణు లట్టి పదములను ప్రత్యే కింపలేదు. వానికి గొన్ని ధాతువులను గల్పించి సంస్కృతపదములుగనే గ్రహించియుండురు. కావుననే దేశి, అన్యదేశి అను ప్రత్యేకపరిగణనమున కవకాశమే లేకపోయినది. ఆర్యు లీదేశమునకు వచ్చి నెలకొనిన తరువాత వారికి తెలియని దేశీయములగు క్రొత్త వస్తువుల పేళ్లనైనను గ్రహింపకతప్పదుగదా. దేశీ యులతోడి సంసర్గము పెరిగినకొలది తా మెంత నాగరకులైనను వారి భావములను, ఆచారములను కొంత వరకైన గ్రహింపకయుండలేరు. ఆధునికహైందవ నాగరకత యనునది ప్రాచీనమగు నార్యనాగరకత యొక్కయు, దేశీయమగు ననార్యనాగరకత యొక్కయు సహజసమ్మేళనముచే నేర్పడినదే యని తత్వజ్ఞులు తలంతురు. అట్లే ప్రాచీనార్యభాషలో వేదకాలముననే-అనగా ఋగ్వేదభాష సజాతీయ ములగు తక్కిన ఇండోయూరపియన్ భాషలనుండి విశేషముగ మార్పు నందలేదని చెప్పదగిన కాలముననే దేశీయపదము లనేకము లాభాషలో జేరినట్లు విమర్శ కులు చెప్పుచున్నారు. అట్టివానిలో ద్రావిడభాషలకు సంబంధించినవిగా నీక్రింది శబ్దములు తలంపబడు చున్నవి. అణు, అరణి, కటుక, కపి, కర్మార, కలా, కాల, కితవ, కుట, కుండ, గణ, నానా, నీల, నీహార, పుష్కర, పుష్ప, పూజన, ఫల, బిల, బీజ, మయూర, రూప, సాయం, వల్గు మొదలగునవి. కాల క్రమమున నీభాషలో బ్రవేశించిన యనార్యశబ్దము లింకను పెరుగుచువచ్చినవి. బ్రాహ్మణములు రచింప బడిన కాలమున క్రింది దేశీయపదములుకూడ నాభాషలో జేరినవి. ఆటవ, ఆడంబర, కులాల, తండుల, తిల, మర్కట, వలక్ష, వల్లీ, వ్రీహి, శవ మొదలగునవి.† కాలము గడచినకొలది కేవల వస్తుద్యో తకశబ్దములేకాక, భావావిష్కరణరీతులుకూడనీభాషల లోనికి సంక్రమింపదొడగినవి. కృ, భు, అస్ వంటి ధాతువుల సహాయమున నేర్పడిన భూతభవిష్యదర్థక రూపములు (ఏధాంచక్రే, పాతయామాస, గన్తా,

---

* "తద్యథా ద్రావిడాదిభాషా స్వేవృశే స్వచ్ఛందకల్పనా తదా పారసీకబర్బరయవన రౌమ కాదిభాషాసు కిం వికల్ప్య కిం ప్రతిపత్స్యన్త ఇతి నవిద్మః"

† **History of the Bengali Language by S. K. Chatarji.**

గస్తాస్మి మొదలగునవి.) పాణినికి బూర్వమే సంస్కృతభాషలో పొడసూపినవి. సంపూర్ణ క్రియారూపములకు బదులు క్తాంతరూపముల ప్రయోగముకూడ వాడుకలోనికి వచ్చినది. ఇంకను తరువాతికాలమున నార్యజనసంఘమునకు దేశీయులతోడి సంబంధము, కలయిక పెరిగినకొలది, దేశీయు లార్యజనసంఘములో జేరి వారి భాషను నేర్చికొని వ్యవహరింపదొడగినకొలది ఆర్యభాషలో దేశీయభాషాసంప్రదాయానురోధముగ ధ్వనులయందు మార్పులు, లింగవిభక్తివచనాదులందు మార్పులు, క్రియారూపములందు, వాక్యనిర్మాణపద్ధతులందుగూడ మార్పులు కలుగజొచ్చినవి. తొలికాలమున నీమార్పు లుచ్చారణరీతులలో మాత్రమే పొడసూపినపుడు ప్రాచీనార్యభాష తత్తద్దేశభేదమును బట్టి శౌరసేని, మాగధి, మహారాష్ట్రి మొదలగు ప్రాకృతముల రూపమును బొందినది. ఈ ప్రాకృతావస్థయందు భాషారూపములలో మార్పులు గలుగుట, దేశీయపదజాలము విశేషముగా జేరుట సంభవించినను, తరువాతి యాధునికార్యభాషలలోవలె వ్యాకరణపద్ధతులందును, వాక్యరచనారీతులందును విశేషములగు మార్పులు కలుగలేదు. ఈమార్పులు సహజపరిణామము వలననే కలిగినవని తలచువారు కలరు కాని యివి చాలవరకు దేశీయములగు ద్రావిడభాషాలక్షణసామాన్యములగుటచే, తద్భాషాప్రభావమే ప్రాచీనార్యభాషపై ప్రసరించి తత్తద్దేశకాలానుగుణములగు మార్పులను కల్పించి, యాప్రాచీనార్యభాష తొలుత ప్రాకృతభాషలుగను, తరువాత తదపభ్రంశములుగను, తుదకుత్తరహిందూస్థానమున నిపుడు వ్యవహరింపబడుచున్న యాధునికార్యభాషలుగను, పరిణామమును బొందుటకు ప్రధానకారణ మైనదని తలంచుట యుక్తియుక్తముగ దోచకపోదు. పైనుండి వచ్చిన విదేశీయు లెంత నాగరకులైనను, దేశీయులను వారు మూలముట్టుగ నశింపజేయగలిగిననేమోగాని, వారితో గలిసి దేశమున నివసింపదొరకొనినపుడు వారి భాషావిజ్ఞానముల ప్రభావము వీరిపై నొక కొంతయైన ప్రసరింపకమానదుగదా!

ఇట్లుత్తరహిందూస్థానమందు వ్యవహారములో నున్న ప్రాచీనప్రాకృతములు, ఆధునికార్యభాషలును గూడ ప్రాచీనార్యభాషాభవములే యగుటచేత ఇటీవల కొంత విజాతీయసంస్కారము గలిగినను, మొత్తముపై నందలి శబ్దజాలము, వ్యాకరణరీతులు నార్యభాషాసంబద్ధములే యనుట సుప్రసిద్ధమే. అట్లే యైనను ప్రాకృతవైయాకరణులగు హేమచంద్రాదులు ఆ భాషలకు లక్షణము చెప్పునపుడు వానిని తత్సమము, తద్భవము, దేశి అని మూడు భాగములుగ జేసిరి. ఆభాషలోని సామాన్య శబ్దజాలమేగాక యందలి వ్యాకరణరీతులు, సుప్తిఙంతములైన పదములు మొదలగు నవన్నియు గూడ ప్రాచీనార్యభాషాభవములే యగుటచే నాభాషలు తద్భవములగుటలో విప్రతిపత్తి లేదు. ఇందలి శబ్దజాలములో నెరువు తెచ్చుకొనిన దేశీయశబ్దములు కొన్ని గలుగుటచే అట్టివానిని వైయాకరణులు 'దేశి'యను విభాగమున జేర్చి చెప్పవలసి వచ్చినది. పైనుండి వచ్చి కలిసిన యీ 'దేశి'వర్గ మీ భాషలనుండి తొలగించినను, వాని స్వతంత్రస్థితి కెట్టి లోపము కలుగదు. ఈ దేశివర్గములో వస్తుద్యోతకములగు శబ్దములు మాత్రమేగాని వ్యవహారమునకు, వాక్యనిర్మాణమునకు నావశ్యకములగు సుప్తిఙాదిపరికరమేమియు నీవర్గములో జేరలేదు. కేవలశబ్దమాత్రముచేతనే వాక్యనిర్మాణము కాదుగదా. శబ్దము, లేదా ప్రాతిపదికము సుప్తిఙాదులతో గూడికాని పదముగాదు. పదముగాని సాకాంక్షితమగు వాక్యములో జేరదు. ఆకాంక్షావిరహితము వాక్యముకాదుగావున అన్వయములేని కేవలశబ్దములచే వాక్యమెట్లేర్పడును? శబ్దము లొకభాషలోనివి మఱియొక భాషలో జేరవచ్చునుగాని అన్వయరీతి వ్యాకరణపద్ధతి ఎరువుసొమ్ముగా మారునది కాదు. ఏ భాషాపద్ధతి ఆభాషదే. రామ, ధర్మ, గురు మొదలగు శబ్దములు సంస్కృతభాషా సంప్రదాయమున రామః, ధర్మః, గురుః అను రూపములను బొంది వాక్యమున బ్రయోగింపబడుచున్నవి. ఇవే ప్రాకృతమున రామో, ధమ్మో, గురు అనియు, ఆంగ్లభాషలో రామ, ధర్మ, గురు అనియు, తెలుగులో రాముడు, ధర్మము, గురువు అనియు తత్తద్భాషావ్యాకరణసంప్రదాయానుసారముగ మారుచున్నవి. ఇట్లా శబ్దము లీభాషలలోనికి సంక్రమించినను, వానిని వాక్యమున బ్రయోగించునపు డవి పొందు మార్పులు

తత్తద్భాషాసంప్రదాయానుసారములై యుండకమా
నవు. ఈ సంప్రదాయములను బట్టియే ప్రధానముగా
భాషల ప్రత్యేకత యేర్పడుచుండును. "రామం పూజ
యంతి-రాముని పూజించుచున్నారు." ఇచ్చట శబ్ద
ములు సమానమే యైనను పదములు భిన్నరూపములు
దాల్చినవి. **They worship Rama** అనుచో వాక్య
నిర్మాణమే మారినది. కావున శబ్దములు సమానమే
యైనను వానిని వాక్యమున బ్రయోగించు రీతినిబట్టి
భాషలు భిన్నము లగుచున్నవి. కావున దేశీయశబ్దము
లుత్తరదేశభాషలలో చేరినను అవి తద్భాషాసంప్ర
దాయముల కనుకూలములగు మార్పులతో వాక్యమున
బ్రయోగింపబడుచున్నవి. ఇట్టి దేశశబ్దములుగావున
'దేశి' శబ్దవాచ్యములైనను యూరపునందలి భాష
లతో సజాతీయములగు సంస్కృతాద్యార్యభాషల
కివి సహజముగ విదేశీయములే గావున నాదృష్టితో
జూచినపుడు వీనిని అన్యదేశ్యము లనియే చెప్పవలసి
యుండును. కాని ప్రాకృతభాషలు సంస్కృతభవము
లగుటచే, వైయాకరణులు స్వరముల మార్పులవలన
నందుండి గలిగిన శబ్దములను, పదములనుగూడ తద్భవ
ములని చెప్పి, దేశీయములగు శబ్దములను 'దేశి' యను
పేరనే విభాగించినారు. ఇది ఉత్తరహిందూస్థాన
భాషల స్థితి.

తొలుత వైదికసంస్కృతభాషలలోను, పిదప
ప్రాకృతాదులలోను చేరిన యీ దేశిశబ్దము లనునవి
ఆర్యు లీదేశము చేరునప్పటికీ దేశమున నివసించుచున్న
కోలులు, ద్రావిడులు మొదలగు జాతులవారి భాషల
లోనివై యుండవలయును గదా. అట్లుగాక ఇప్పటి
భారతీయభాష లన్నియు సంస్కృతోద్భవములో,
ప్రాచీనార్యభాషాభవములో యగు నన్నచో నార్యు
లీదేశమున బ్రవేశించునప్పటికీ దేశము నిర్జనమై యుం
డెననికాని, లేదా వారీదేశమువారిని సంపూర్ణముగ
రూపుమాపిరనిగాని చెప్పవలసియుండును. అట్టి
నిదర్శనములు లేకుండుటయేకాక మతసాంఘిక
సంస్కారాది విషయములందువలెనే భాషా విష
యమునగూడ ఆర్యానార్యసమ్మేళనము కాలక్రమ
మున జరిగినట్లు తెలియవచ్చుచున్నది. ఆర్యు లీ
దేశమునకు వచ్చునప్పటికి అనార్య జనులు (దస్యులు,
వ్రాత్యులు, మ్లేచ్ఛులు మొదలగువారనేవారు) ఈ
దేశమున నెలకొనియుండి వారి నడుగడుగునకు బ్రతిఘ
టించుచు వచ్చిరనుటకు ఋగ్వేదాది వైదికవాఙ్మ
యమునందలి నిదర్శనములే చాలును. ఈ యనార్య
జనములో నిప్పుడు దక్షిణదేశమున వ్యవహరింపబడు
ద్రావిడభాష లనబడువానితో సజాతీయములని చెప్ప
దగిన భాషలనే మాట్లాడినవారుకూడ ఆకాలమున
నుత్తరదేశమున నెలకొనియుండి క్రమముగ దూర్పు
దేశము నాక్రమించుచుండిన యార్యులను ప్రతిఘటిం
చినవారిలో నుండి రనుటకు ఇప్పటికిని పశ్చిమోత్తర
భాగమున వ్యవహారమున నిలిచియుండి ద్రావిడభాషా
కుటుంబములో జేరిన బ్రాహూయీభాషయే నిదర్శ
నము. అతిప్రాచీన మగు మొహెంజోదారో నాగ
రకత యంతయు దేశీయులగు ననార్యజాతులకు
సంబంధించినదే యని తలంపబడుచున్నదిగదా. ఇది
గాక ఆర్యులు వాయవ్యదిక్కునుండి తూర్పు దక్షిణ
భాగము లాక్రమించుచువచ్చినకొలది యార్యసంఘ
ములో జేరని యనార్యజాతులవారు వారిముందు నిలువ
లేక క్రమముగ భారతదేశ మధ్యభాగమును, దక్షిణదేశ
మును ఆక్రమింపజొచ్చిరి. తరువాతికాలమున వీరిపై
నార్యభాషాప్రభావ మెంత ప్రబలినను, సహజముగు
దేశీయత వీరిభాషలలో రూపుమాసిపోవుట తటస్థింప
లేదు. ఉత్తరహిందూస్థానమందువలె నిచ్చట అనార్య
భాషలను రూపుమాపి యార్యభాషలు వాని స్థానము
నాక్రమింపలేక పోయినవి. ఆర్యభాషనుండి పదపరి
కరమును విశేషముగా గ్రహించినను ఇచ్చటి దేశీయ
ములగు ననార్యభాషలు తమ సహజతత్వమును గోలుపో
లేదు. కావుననే ఇప్పటికిని భారతదేశ మధ్యభాగము
నాక్రమించియున్న కొండజాతివారు మాట్లాడు
ఖాండ్, మాల్టో, కులు మొదలగుభాషలు ఇటు దక్షిణ
దేశభాషలగు తెలుగు, తమిళము మొదలగు భాషల
తోను, అటు బ్రాహూయీ భాషతోను
సోదరభావమును వహించి యేకకుటుంబమునకు
జెందినవిగా నున్నవి. దీనినిబట్టి యొక కాలమున
నిప్పుడు బ్రాహూయీ భాష మాట్లాడువారు
నివసించు పశ్చిమోత్తర దిగ్భాగమునుండి హిందూదేశ
మధ్యభాగమునను, దక్షిణదేశమునను గూడ— అనగా

దాదాపు హిందూదేశ మంతటను గూడ నిప్పుడు ద్రావిడ కుటుంబ మనబడుదానిలో జేరినభాషలను మాట్లాడిన జనమే యాక్రమించియుండె నని యూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఆర్యు లీ దేశమును క్రమక్రమముగా నాక్రమించుకొని వచ్చుచుండి రనుటకు వైదిక వాఙ్మయమున గానవచ్చు బ్రహ్మావర్త, ఆర్యావర్తాది విభాగమే నిదర్శన మగుచున్నది. భాషావిషయమునగూడ ప్రాచ్యదేశమునందలిదానికంటె ఉదీచీదేశమునందలి భాషయే పరిశుద్ధ మైనదని, ప్రాచ్యభాగమునకు వచ్చినకొలది ఆర్యభాష సాంకర్యమును బొందుచుండినదని ఆకాలపువారు తలంచినట్లు స్పష్టము. "తస్మాద్ ఉదీచ్యాం దిశి ప్రజ్ఞాతతరా వా గుద్యతే. ఉదంచ, ఉ, ఏవ, యంతి వాచం శిక్షితుం, యోవా తత ఆగచ్ఛతి తస్యవా శుశ్రూషంత ఇతి"* (శతపథ బ్రాహ్మణము). బ్రహ్మావర్త మనునది - ఇదియే మధ్యదేశమనికూడ చెప్పబడును-సరస్వతీ దృషద్వతుల నడుమగల దేశము. అనగా వింధ్యాహిమాలయముల మధ్యను తూర్పున గంగాయమునల సంగమము గల ప్రయాగయే పరిహద్దుగా గలది. ఒక కాలమున దీనికి తూర్పున గల దేశములు కోసల, మగధ, వంగ, రాఢ మొదలగునవి. అనగా నిప్పటి బీహారు, బెంగాలు దేశభాగములు ఆర్యనివాసయోగ్యభూములు కాకపోవుటచే నచ్చటికి బోగూడ దను నిషేధము, వెళ్లినవారికి ప్రాయశ్చిత్తముకూడ ధర్మశాస్త్రములలో విధింపబడినది.

"అవంతయో౾ంగ మగధాః సురాష్ట్రా దక్షిణాపథాః
ఉపావృత్సింధుసౌవీరా ఏతే సంకీర్ణయోనయః.

ఆరట్టాన్, కారస్కరాన్, పుండ్రాన్, సౌవీరాన్, వంగాన్, కళింగాన్, ప్రానూనా నితిచ
గత్వాపునస్తోమేన యజేత సర్వపృష్ఠయావా.
పద్భ్యాం స కురుతే పాపం యః కళింగాన్ ప్రపద్యతే." (బోధా. ధర్మ. సూ. (౧-౧-౩౦)

వంగదేశము నాశ్రయించియున్న వంగ, పుండ్ర, రాఢ మొదలగు జనులు మ్లేచ్ఛజనులుగా పరిగణింపబడియున్నారు. ఐతరేయబ్రాహ్మణమున నీపుండ్రులతో జేర్చి ఆంధ్రులుకూడ మ్లేచ్ఛులుగనే గ్రహింపబడియున్నారు. "త ఏతే అంధ్రాః పుండ్రాః పులిందాః మూతిబాః" దీనినిబట్టి అవంతి, మగధ, అంగ, వంగ మొదలగు ప్రాచ్యదేశము లన్నియు యొకకాలమున బ్రహ్మావర్తమున జేరక, అనగా నార్యులకు నివాసభూములు కాక, అనార్యులు మ్లేచ్ఛులు ననబడు దేశీయులచే నాశ్రయింపబడియున్నవనియు, కాలక్రమమున నీదేశములుకూడ నార్యులచే నాక్రమింపబడినట్లును తెలియుచున్నది †. వంగదేశము ఆర్యాక్రమణమునకు బూర్వము అనార్యజనులకు నివాసమై యున్నదనియు, నచ్చటి ప్రాచీనభాష అనార్యభాషయే యనియు, మిథిల, మగధదేశము లార్యవిజ్ఞానమునకు, భాషకు స్థానము లైనపిదపనే వంగదేశమున నార్యవిజ్ఞానము, భాష వ్యాపించిన దనియు నిశ్చయింపదగియున్నది. ఇది సుమారు క్రీస్తుశకప్రారంభము కావచ్చునని తద్భాషాచరిత్రకారుడగు సునీతికుమారఛటర్జీగారి యభిప్రాయము. అంతకుపూర్వ మిచ్చట నివసించియున్న జనులలో కోల్, ద్రావిడజాతులువారుకూడ నుండియుందు రనియు, ఆకారణముచేతనే తరువాత గలిగిన ఆర్యభాషాప్రాబల్యమునుబట్టి బెంగాలీభాష ఇప్పు డార్యభాషాజన్యమే, లేదా ప్రాకృతజన్యమే యని తలంపబడుచున్నను ఆభాషలో ద్రావిడభాషా సంప్రదాయములు విశేషముగా కనబడుచున్నవనియు నాతడు నిదర్శనపూర్వకముగా దెలిపియున్నాడు. ఒక్క బంగాళీభాషలోనేగాక ఇతరములగు ఆధునికార్యభాషలలోగూడ నీ ద్రావిడభాషాసంప్రదాయములు కనబడుచునేయున్నవి. కావుననే ఆర్యులీదేశము నాక్రమించుటకు పూర్వ మీదేశ మంతటిలోనుగూడ ననార్యులగు ద్రావిడజను లచ్చటచ్చట నివసించియేయుందురని, ఆర్యజనుల యాక్రమణమును తొలికాలమున ఆఫ్ఘనిస్థానము, పంజాబుప్రాంతముల నుండి ప్రతిఘటించినవారిలో నీద్రావిడభాషలను

*** In the Northern quarters is speech utterd with more discernment, and North ward go men to learn speech; he who comes thence, to him men hearken."**

† ఈ దేశములలో నగ్ని ముందు ప్రవేశించి పవిత్రమైనవానినిగా జేసినట్లు కథలు గలవు.

వ్యవహరించిన జనులుకూడ నుండియుందురని నిశ్చయింపదగియున్నది. ఉత్తరదేశము క్రమముగా నార్యుల వశము కాజొచ్చినపిదప వీరిలో కొంద రచ్చట నిలిచిపోయి యార్యజనసంఘములో కలిసి వారి భాష నభ్యసింపగా, మరికొందరు దక్షిణాభిముఖులై స్వీయ భాషను వ్యవహరించు జనులతో గలిసిపోయియుందురు. ఇట్టివారినే యార్యులు ద్రావిడులని చెప్పియుందురు. తొలుత జాతివాచకముగా గనబడుచున్న 'తెలుగు' శబ్దము తరువాతికాలమున 'త్రిలింగ' శబ్దభవముగా పండితులచే సమర్థింపబడుచుండినట్లుగానే 'తమిళ్' శబ్దముకూడ తరువాతికాలమున 'ద్రావిడ' శబ్దభవము గనో, లేదా దానికి ప్రకృతిగనో సాధింపబడుట తటస్థించినది. ఎట్లైనను దక్షిణదేశీయములు, ద్రావిడ శబ్దసంకేతితములు నగు తెలుగుతమిళకన్నడాదులును, దీనికి సంబంధించిన బ్రాహూయీ, గోండు, మాల్టో, కుయి మొదలగు నాటవికభాషలును ఆర్యు లీదేశమునకు వచ్చుటకు పూర్వమే యీదేశమున వ్యవహారములో నుండిన వనుటకు సందేహము లేదు. కావున నార్యభాషలనుబట్టి చూచినపు డివి దేశీయములే. వీనిలో నార్యభాషాశబ్దములు చేరినపు డివి అన్యదేశీయములే యగును గాని వేరు కావుగదా. హిందూస్తానీ, ఇంగ్లీషు మొదలగు భాషలలోని తాసిల్దారు, ఆసుపత్రి, లాంతరు, రోడ్డు మొదలగు శబ్దములు తెలుగున జేరినట్లే పుడమి, సిరి, వాక్కు మొదలగునవి సంస్కృతమునుండి వచ్చిచేరినవి. మరి కొన్ని అకారాంత శబ్దములు రాముడు, వనము మొదలగునవి తెలుగుప్రత్యయములను గ్రహించినవి. అట్లే దీర్ఘ సమాసములును చేరినవి. ఇట్లీ భాషలో సంస్కృత భాషలోని శబ్దములే వచ్చిచేరినవి గాని యార్య భాషలే యగు ప్రాకృతములు, ఆధునికములగు నుత్తర హిందుస్థానభాషలలోవలె సంస్కృతభాషలోని పదములు (అనగా సుప్తిఙంతములగు పదములు) కూడ తద్భవములుగా చేరలేదే. "రాజ్ఞో వాశిష్ఠీపుత్రస్య మహాదేవీ ఆజ్ఞాపయతి" అను సంస్కృతశబ్దములను అట్లే "రణ్ణో వాసిఠీపుతస్స మహాదేవీ ఆణపేది"? అని ప్రాకృతముగా చెప్పుట కవకాశము కలదు. కావుననే యీ భాషలు సంస్కృతభాషాజన్యము లనియో, లేదా ప్రాచీనార్యభాషాజన్యము లనియో చెప్పగలుగుట. పైపదములను తెలుగుభాషలో చెప్పవలె నన్నచో, ఆశబ్దములనే గ్రహించి చెప్పినను అన్వయము, పద్ధతి అంతయు మార్పవలసివచ్చునుగదా. "రాజు అయిన వాసిష్ఠీపుత్రునియొక్క...మహాదేవి... ఆజ్ఞాపించుచున్నది." ఈ అన్వయపద్ధతి, రూపనిష్పత్తి సంస్కృతప్రాకృతములకంటె భిన్నమేగదా. సంస్కృతము మొదలగు ఇతరభాషలలోని ప్రాతిపదికలు, ధాతువులు ఎన్ని యీభాషలో చేరినను, వాక్యనిర్మాణపద్ధతిమాత్రము (**Syntactical form**) దక్షిణదేశీయమే. ద్రావిడభాషా సామాన్యపద్ధతి ననుసరించినదేగాని ఆర్యభాషాపద్ధతి ననుసరించినది గాదు. ఆధునికార్యభాషలలోనికి దక్షిణదేశీయ వ్యాకరణ పద్ధతి కొంత సంక్రమించినదిగాని, దక్షిణదేశీయములగు ద్రావిడభాషలలోనికి ఆర్యభాషా వ్యాకరణపద్ధతి సంక్రమింపలేదు. ఈ భాషల లక్షణరచనాపద్ధతిమాత్రము పాణిన్యాదుల సంస్కృతభాషావ్యాకరణప్రణాళిక ననుసరించి రచింపబడుట తటస్థించినది. అదియు నేతద్భాషాసంప్రదాయ దృష్టితో జూచినపుడు కొంత యనర్థహేతువే యైనదని చెప్పకతప్పదు. అయినను, తొలికాలమునుండియు శబ్దజాలము మాత్రమే వచ్చిచేరినదిగాని నిర్మాణపద్ధతి, వ్యాకరణరీతులు ఇందు చేరలేదు. ఇట్టివానిని వైయాకరణులు మొదటినుండియు వారి గ్రంథములలో వారించుచునే యుండి రనుటయే యిందుకు నిదర్శనము. తెలుగు భాషకు తొలుత లక్షణము చెప్పిన కేతన ఈ విషయమును ఈ క్రిందరీతిని సువ్యక్తమే చేసినాడు. సంస్కృతపదములను తెలుగుగావించు తెరంగునుగూర్చి చెప్పుచు—

"వృక్షేణ దక్షాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు దెనుంగునకుఁ జొరవు
అస్తి ప్రయాతి గాయంతి భుంక్తే సంతి
నయతి స్మరతి యను క్రియలు సొరవు
గత్వా హసిత్వా ప్రకాశ్య సంత్యజ్య నా
దనరు క్త్వాంతల్యబంతములు సొరవు
గంతుం పురీం రిపుం హంతుం సుతం పాతు
మను తుమున్నంతంబు లరయఁజొరవు

"అపిచ తుహి పైన వా నను లనఁగ బెక్కు
లవ్యయంబులు చొరవెందు నాంధ్రకవిత
చెరపదంబులతోడను దొరలినిల్చు
నవి తెనుంగులు గావింతు నభిమతముగ."

అని చెప్పినాడు. అనగా సంస్కృత ప్రాతిపదికములు, ధాతువులేగాని వాక్యనిర్మాణమున కావశ్యకములగు విభక్తి ప్రత్యయములతో గూడిన రూపములుగాని, అవ్యయాదులు గాని యిందు ప్రయోగింపబడవని నిషేధించినట్లయినది.* ప్రాకృత వ్యాకరణ విషయ మట్లుకాదు. ప్రాకృత వ్యాకరణ కర్త యగు హేమచంద్రుడు "అథ ప్రాకృతం" అను ప్రాకృత వ్యాకరణ ప్రారంభమాత్ర వ్యాఖ్యాన సందర్భమున సంస్కృతానంతరమున ప్రాకృతానుశాసనము సిద్ధ సాధ్యమాన భేదము గల సంస్కృత జన్య భాషకే యీ లక్షణము గాని దేశ్యమునకు గాదని జ్ఞాపకము కొరకని తెలుపుచు నీ ప్రాకృతమున ప్రకృతి ప్రత్యయ లింగ కారక సమాస సంజ్ఞాదులు సంస్కృతమందు వలెనే తెలిసికొనవలె ననియు, లోకమునుండి కొంత తెలిసికొనవలసినది కూడ కలదనియు చెప్పినాడు.† ప్రాకృతాది భాషలవిషయమున నే ప్రకృతి ప్రత్యయ లింగకారక సమాసాదులు సంస్కృతమునందువలెనే తెలిసికొనవలసినట్లుగా జెప్పబడినవో, అవే తెలుగు విషయమున భిన్నము లగుటచే "చొర నెందు నాంధ్ర కవిత" అని కేతన చెప్పవలసి వచ్చినది. కావుననే యితర భాషలనుండి శబ్దజాల మెంత వచ్చి చేరినను, తెలుగు ప్రాకృతాదులవలె సంస్కృతజన్య మగు 'వికృతి' భాష కాక ప్రత్యేక స్వతంత్ర మగు భాషగా గ్రహింప దగిన దని వ్యక్తమగుచున్నది గదా. ఈ విషయమునే కేతనయు,

"తల్లి సంస్కృతంబె యెల్లభాషలకును
దానివలనఁ గొంత గానఁబడియెఁ
గొంత తాన కలిగె నంతయు నేకమై
తెనుఁగుబాస నాఁగ వినుతి కెక్కె"

అని తెలుగంతయు సంస్కృతభాషకు వికృతియనియే చెప్పక కొంత తాన కలిగినది కలదని చెప్పుటయేగాక, "తెలుఁగై సంస్కృతము చెల్లు తెఱగులను గూర్చి" అనగా సంస్కృతపదంబులు తెనుంగుగా వించు రీతులనుగూర్చి ప్రత్యేకముగా జెప్పవలసినవాడైనాడు. ప్రాకృతవ్యాకరణము రచించిన హేమచంద్రున కీతత్సమ రూపములను గూర్చి ప్రత్యేకముగా చెప్పవలసిన యావశ్యకత లేకపోయినది. "సంస్కృత సమంతు సంస్కృతలక్షణేనైవ గతార్థం" అని చెప్పియూరకున్నాడు. తెలుగుభాష ప్రాకృతాదులవలె సంస్కృతజన్యము కాక విజాతీయ మగుటచే తనే తద్విభక్తులు ప్రాకృతాదులందువలె నిందు చొరవుగావున సంస్కృతమును తెలుగులో గలుపుకొనదగిన పద్ధతులను గూర్చి లాక్షణికులు చెప్పవలసి వచ్చినది. దానినే

---

* అట్లు అవ్యయముల ప్రయోగము నిషేధింపబడినను దేశమున సంస్కృతమునకు గల ప్రాబల్యము వలన వ్యవహారములో సదా, వృథా, సర్వత్ర, మొదలగునవి కొన్ని చేరినవి. కవులును ప్రయోగించినారు. ఇవియు కేవలశబ్దములే. విభక్త్యంతములు గావు. అనంతుడు 'వృథ' యనుదాని ప్రయోగము నంగీకరించినాడు.

"వృథయనునవ్యయమొక్కటి, ప్రథితంబై చెల్లు
గృతుల వృథసేయక" అట్లె-సర్వదా-
"ఒకదివసంబు నానందకాననమునందు సర్వదా
సిద్ధించుట." (శ్రీనాథుడు. కాశీ.)
"స్వస్తిజగత్త్రయీ భువనశాసనకర్తకు."(భాగవతము)
"నాకుఁ గించిత్తయిన మనోధనవంచన
మిచ్చోటలేదు." (జై. భార.)

† "అథ ప్రాకృతం" ప్రకృతిః సంస్కృతం. తత్ర భవం తత ఆగతం వా ప్రాకృతం. సంస్కృతానంతరం ప్రాకృతస్యానుశాసనం సిద్ధ సాధ్యమాన భేద సంస్కృతయోనే రేవ తస్య లక్షణం న దేశ్యస్య ఇతి జ్ఞాపనార్థం. సంస్కృత సమంతు సంస్కృత లక్షణే నైవ గతార్థం. ప్రాకృతేచ ప్రకృతి ప్రత్యయ లింగ కారకసమాస సంజ్ఞాదయః సంస్కృతవ ద్వేదితవ్యాః. లోకాత్ ఇతి చ వర్తతే. అస్వరం, వ్యంజనం, ద్వివచనం, చతుర్థీ బహువచనం చ నభవతి" (హేమచంద్ర ప్రా. వ్యాకరణం).

"మును సంస్కృతపదములపై
దెనుగువిభక్తులు ఘటించి తేటపడగ జె
ప్పిన నది తత్సమ మనఁజను"

"ఇల సంస్కృతపదములపై
నెలకొని నిల్చిన విసర్జనీయంబులు సు
న్నలు నిలువవు తెనుగులలో
నలవడగా బల్కుచోట నభినవదండీ"

ఇత్యాదులచే "తెలుగున సంస్కృత పదములు పలికెడి తెఱఁగెఱిఁగినంత ప్రవ్యక్తముగాఁ దెలిపితి" నని చెప్పినాడు కేతన.

ఇట్లే యీతని తరువాతి లాక్షణికుడగు పెద్దనయు నీతని మార్గమునే యనుసరించి

"పరగ సంస్కృతంబుపైఁ దెనుంగువిభక్తు
లునుపఁబడి పొసంగియుండెనేని
తత్సమంబునాగఁ దగ నండ్రు సుకవులు
తద్విహీనకావ్యతతియు లేదు"

అని శబ్దము సంస్కృతమైనను దానిపై విభక్తులు తెనుంగువిభక్తులు చేర్పబడినచో నది తత్సమ మగునని చెప్పి, యట్లు "వెలయు సంస్కృతంబు తెలిఁగించు తెఱఁగు"ను-అనగా సంస్కృతశబ్దములను తెలుగులోనికి దెచ్చుకొను రీతులను ప్రత్యేక ప్రకరణములో జెప్పినాడు.

ఇక నీతనికి దరువాతి లాక్షణికుడు, ఛందోదర్పణకారుడు నగు ననంతామాత్యుడు ఛందోలక్షణమునే ప్రధానముగా దెలుపనెంచినవాడైనను, చతుర్థాశ్వాసమున దోషాధికారసందర్భమున అపశబ్దదోషప్రసంగము నాధారముగా జేసికొని కొంత భాషాలక్షణమునుగూడ జెప్పవలసినవాడైనాడు.

"కనుగొనంగ నాదికవుల కావ్యంబుల
లలితమైన లక్ష్యలక్షణములు
రూఢిగాని పెఱవిరోధోక్తు లపశబ్ద
సంజ్ఞికంబు లండ్రు జగతి కృష్ణ."

ఇట్టి లక్ష్యలక్షణరూఢి లేని యపశబ్దదోషములలో పుష్పవిల్లు, భూరుహపండ్లువంటి వైరిసమాసములను జేర్చుటయేగాక 'దుష్ప్రయోగ' మను దోషమున సంస్కృతవిభక్తులను దెనుగుపదములతో వాక్యమున నన్వయింపజేయు 'మణిప్రవాళ' పద్ధతిని జేర్చి దానిని పరిహరించినాడు. దుష్ప్రయోగము—

"సత్యము సన్నృపస్య పదం
గత్వా యాతఁడు నిహత్య కంటకులసఖీ
భూత్వా మెలఁగెడు నన్నఁగ
విత్వవిదులు దుష్ప్రయోగవిధ మండ్రు హరీ."

అనుకరణవిధానమునమాత్ర మిది సుప్రయోగమే యగును.

"నిక్కమను సుప్రయోగము
'ధిక్కృతదురితాయ భగవతేస్తు నమో' యం
చక్కడ నీకును నమరులు
మ్రొక్కుదురని తిఙ్సుబంతములఁ గూర్ప హరీ"

ఇట్లు విసంధికదోషపరిహారార్థము సంధిసమాసములనుగూడ చేర్చినాడు.

పిదప నీభాషలోని కారకశబ్దములను దెలుపుచు తత్సమ, తద్భవ, దేశి, అచ్చదెనుగు భేదము వెనుకటి యిద్దరు లాక్షణికులవలెనే వ్యక్తముచేసినాడు. కాని యీశబ్దములలో గ్రామ్యమును జేర్చినవాడు కాడు. కారణ మీతడు కావ్యలక్షణములో దోషాధికారమును జెప్పుచుండుటయే కావచ్చును.

"సంస్కృతము తెనుఁగైనఁ దత్సమపదంబు
దానబుట్టి తెనుంగైనఁ దద్భవంబు
దేశి తెనుఁగు దేశజ, మచ్చ తెనుఁగు తెనుగు
నిర్మలుఁడు సిరి యొడయఁడు నిక్కమనఁగ"

కేతన, పెద్దన, అనంతులు ముగ్గురునుగూడ తెలుగైన సంస్కృతమే తత్సమమని వ్యక్తముచేసినారు. కాని యీతొలిలాక్షణికులు ఆంధ్రభాషవికృతి యనువారుగా గనబడరు. అయితే సంస్కృతంబుపై తెనుంగువిభక్తులనుజేర్చగా నవి తెలుగుపదములైనవి గదా! కాగా వీనిని సంస్కృతసమములని-తత్సమములని చెప్పనేల? తెలుగుపదము లని, తెలుగుపదములతో సమానములైనవని చెప్పటయే సమంజసముగా గనబడును. సంస్కృతంబునంబుట్టి తెనుగైనవి తద్భవములై

నవి. అందుబుట్టుట యనగా నేమో పెద్దన వ్యక్తముచేసి నాడు. "సిద్ధాక్షరముల వర్ణముల దూలిపోబలుకఁగ నర్థదమై ప్రాకృతనిభ మగునది తద్భవపదము" అని వర్ణములందు మార్పు గలిగి యేర్పడినది తద్భవము కాగా, అట్లు మార్పేమియులేక యేర్పడినచో నది ప్రాకృతములందువలె సంస్కృతసమము కావచ్చును. కావుననే హేమచంద్రుడు దానిని "సంస్కృతలక్షణే నైవగతార్థం" అన్నాడు. కాని తెలుగున తత్సమము లేర్పడురీతికూడ ఒక ప్రకరణముగా జేసి చెప్పవలసి వచ్చినది. గౌరీ-గౌరి యయినది. వాణీ-వాణి యయి నది. వానునకు వంశము, మానునకు మంశుడు, ఉష్ట్రం తనుపై వుట్టు, అష్టంతముపై ముట్టు, ద్విట్ పదమునకు ద్విషుడు, భుక్-భుజుడు, దిక్-దిక్కు, భూ-భువి, నౌకు నావ ఇత్యాదులు మార్పు లనేకములు. ఈ మార్పు లన్నియు నాపదములను తెలుగుపదములుగా జేయుటకై చేయబడినవే కాని సంస్కృతసమము లుగా జేయుటకు కావుగదా. కావున వీనిని సంస్కృ తసమము లనుట యంత సమంజసముగా కనబడదు. కాని భాష నిట్లు విభాగించు సంప్రదాయము వీరి కెచ్చటినుండి వచ్చినది, వీ రెందుక ట్లీభాషను విభా గింపవలసివచ్చినది, ఒక భాషలోని కితర భాషలనుండి సంక్రమించిన పదము లన్నిటిని అన్యదేశ్యములుగా బరిగణించిన చాలదా అని విచారించినచో వీరి కీసం ప్రదాయము ప్రాకృతవ్యాకరణములఫక్కి ననుసరిం చుటవలన వచ్చినట్లు తెలియకపోదు. మొదట 'తత్సమ తద్భవదేశి' విభాగము ప్రాకృతవ్యాకరణములలో కన బడుచున్నది. ఆంధ్రవైయాకరణులును వాని మార్గ మునే యనుసరించియుందు రనుటకు సందేహము లేదు. కేతన సూచనమాత్రముగ దెలిపినను పెద్దన యీవిష యమును వ్యక్తమే చేసినాడు. గీర్వాణభాషాకావ్య లక్షణము లన్నిటిని దెచ్చికూర్చినను తెనుగుకావ్య మనగానే, తెలుగంచు జెవినిబెట్టక తెలుగు దేశభాష, వ్యవహారమున దెలిసికొనవలసినదే దీనికి వ్యాకరణ మేమిటని యీసడించువారికి సమాధానముగా విన్న కోట పెద్దన

"విశ్రుతులు హేమచంద్రత్రివిక్రమాదు
లొనరఁజూపిరి ప్రాకృతంబునకు త్రోవ
ఆంధ్రభాషయు ప్రాకృతాహ్వయముగాన
వలయు వల్లక్షణంబును వరుసదెలియ"

అని ఆంధ్రభాషను ప్రాకృతాదులలో జేర్చి తాను తలపెట్టిన భాషాలక్షణరచనాకార్యమును సమర్థించుకొనినాడు. కేతనకూడ—

"సంస్కృతప్రాకృతాదిలక్షణముఁ జెప్పి
తెనుగునకు లక్షణముఁ జెప్పకునికి యొల్ల
గవిజనంబుల నేరమి గాదు నన్ను
ననుగ్రహింపఁ దలఁచిన తలపుగాని."

అని సంస్కృతప్రాకృత లక్షణములను స్మరించి యప్పటికి తెనుగునకు లక్షణ మేర్పడకుండుటను సూచించుచు తాను "క్రొత్తగ నాంధ్రభాషకును కొంతొకొంత లక్షణ మిట్లు చెప్ప" బూనుకొనినట్లు తెలిపి యున్నాడు. కావున సంస్కృతభాషాలక్షణముతో పాటు ప్రాకృతభాషాలక్షణముకూడ వీరి దృష్టిపథమం దున్నట్లు స్పష్టమగుచున్నది. కావున ప్రాకృతభాషా లాక్షణికులు చేసిన తత్సమతద్భవదేశ్యవిభాగమునే వీరు నవలంబించియుందు రనుటకు సందేహము లేదు. ఆ భాషలలో విభక్తిప్రత్యయములతో గూడిన పదములు సంస్కృతమునందువలెనే మార్పు లేకయుండుటచే సంస్కృతసమము లనుట యుక్తమేగాని, ఈ భాషలో క్రొత్త ప్రత్యయములతో గూడి ప్రాతిపదికములో గూడ మార్పులు గలుగుచున్నపుడు తత్సమము లనుట యుక్తముగా గనబడదు. కన్నడవైయాకరణులుగూడ నీవిభాగక్రమమునే యవలంబించినారుకాని వారు మార్పేమియు లేకయే కన్నడమున జేరిన శబ్దములను సమసంస్కృతములని (అనగా రామ-రామం, భీమ-భీమం, నారద-నారదం ఇత్యాదులు), సంస్కృత మందును, కన్నడమందును వ్యవహారములో నున్న శబ్దములను తత్సమములని ఒకవిధమైన విభాగమును గల్పించినారు. సంస్కృతకన్నడములందు సమాన ముగా నున్న శబ్దములు తత్సమములని చెప్పి, అట్టి శబ్దముల నిరువదింటి నొక పట్టికగా 'శబ్దమణిదర్పణ' కారు డిచ్చియున్నాడు. మణి, మంచం, తోరణం, కంకణం, గోణి, మాలె, అట్టం, గణం, గంధం- ఇత్యాదులు. ఇవి రెండు భాషలకు సమానములనుటలో

గల విశేష మేమనగా నీ తత్సమపట్టికలోని శబ్దములు సంస్కృతశబ్దములతోను, కన్నడశబ్దములతోను గూడ సమాసమున నిలువగలిగియుండుటయే. సమసంస్కృతము లట్లు నిలువగూడదట. తత్సమశబ్దములకు సంస్కృత శబ్దములతోను, కన్నడశబ్దములతోను సమాసములు కూడును. ఉదా-దినమణి, ఉడెమణి, రత్నమంచం, తూగుమంచం, మకరతోరణం, తళిర్తోరణం ఇత్యాదులు. సమసంస్కృతముతో దేశ్యశబ్దము సమసించినచో నది అరిసమాస మగునుకావున ముఖతావరె, అరస కుమారం ఇత్యాదులు నిషిద్ధములైనవి. మొత్తము మీద నీకన్నడమున తత్సమశబ్దమున కొక క్రొత్త యర్థము కల్పింపబడిన ట్లగపడుచున్నది గాని కేవలము తెలుగులోవలెగాదు. తొలుత నీశబ్దమును వాడుకలోనికి దెచ్చిన ప్రాకృతవైయాకరణాలు దీనిని వర్ణములం దట్టిమార్పులేక ప్రాకృతభాషలో నట్లే నిలిచిన సంస్కృతశబ్దముల పరముగా వాడినటుకు సందేహము లేదు. ఉదా:కమల, తరల ఇత్యాదులు. ఇక జన్యభాషలలో గొన్ని మార్పులకు లోనై చేరిన సంస్కృతశబ్దములు తద్భవము లైనవి. ఈతద్భవశబ్దములలో గలిగిన మార్పులు చాలవర కుత్తరదేశభాషలలోను, దక్షిణదేశ భాషలలోను సమానములుగనే యుండుట మనము గమనింపదగిన విషయము. ఇట్లగుటకు దేశీయులగు అనార్యజనుల యుచ్చారణరీతులు, సంప్రదాయములు మొదలగువాని ప్రభావముకూడ నొక కారణమైయుండునని తలంపనగును. ఏలయనగా నీప్రాకృతభాషలలో గలిగిన మార్పులు ద్రావిడభాషాసహజ సంప్రదాయముల కనుగుణములయియేయున్నవి.

ఉదా (౧) పదాదియందలి శ, షలు 'స'గా మారుట. ద్రావిడభాషలలో ఊష్మవర్ణములు లేవు. cf **తె.** శాణము - సాన, శ్రీ సిరి etc.

(౨) పదమధ్యమున సంయుక్తాక్షరము నిలువదు. ద్విత్వాక్షరము నిలుచును. సం. పుత్ర - ప్రా. పుత్త; సం. ఆర్యపుత్ర - ప్రా. అజ్జఉత్త; cf సం. ఋక్ష- తె. రిక్క.

(౩) ప్రాకృతములలో భకారము హకారముగా మారును. ద్రావిడభాషలలో మహాప్రాణములు లేవు. సం. భవతి- ప్రా. హోది- హోఇ; భవిష్యతి- (సౌ) హవిస్సది; సం. ముఖ-ముహ; (తె. మొహము) సం. మేఘ-మేహ, అభినవ-అహినవ etc.


(౪) పదమధ్యమునందలి క, త, ప వర్ణములు గ, ద, బలుగా మారును. ఇదియు ద్రావిడభాషా సంప్రదాయమే. సం. అతిథి-(శౌ) అదిధి; సం. పారితోషిక-శౌ. పారిదోసియ; సంస్కృత-సక్కద, సం. లోక-(అర్ధ. మా) లోగ; సం. ఆకాశ-ఆగాస; పట-పడ; కుటుంబ-కుడుంబ.

(౫) పదాదియందు సంయుక్తాక్షర ముండదు. ద్రావిడభాషలలోను అట్లే. స్నానము-తె. తానము; వ్యాపార-బేహార.

పదమధ్యమందలి సంయుక్తాక్షరము ద్విత్వమును జెందుటయో, లేదా స్వరభక్తిచే రెండక్షరములుగనో తటస్థించును. ఇంద్ర-ఇందర; ద్వార-దువార; వర్ష-వరిస; హర్ష - హరిస; సం. యుక్త-జుత్త; ఉత్పల-ఉప్పల; అగ్ని-అగ్గి; వింధ్య-వింఝ; వల్కల-వక్కల; పక్వ-పక్క; సత్య-సచ్చ; చక్ర- చక్క.

ఇట్టి మార్పులను బొంది సంస్కృతము ప్రాకృతముగా మారినది. దక్షిణదేశభాషలలోను సంస్కృతభవముల కిట్టి మార్పులే కనబడుచున్నవి గదా. కాని సంస్కృత శబ్దములు దక్షిణదేశభాషలలో నెట్టిమార్పులను బొంది తద్భవములై ప్రవేశించినను అన్యభాషాశబ్దము లీభాషలలో ప్రవేశించినట్లే యగునుగదా. కావున నన్యదేశీయములే యని యెందుకనగూడదు?

[సశేషము]



సంపుటము 21
సంచిక 9

భారతి

తారణ, భాద్రపదము
1944 సెప్టెంబరు

విశ్వసంగీతము

= శ్రీ రా. వేం. మ. గం. రామారావు =



ఆరిపోయిన దీపము లారిపోవ,
వెలుగు దీపము లంతట వెలుగుచుండు ;
చచ్చిపోయినవారలు చచ్చిపోవ,
పుట్టువారలు లక్షలు పుట్టినారు.

భవ్యకాశ్మీర నగరాజ పంక్తియందు
సూర్యకిరణాల వేసంగి సొలసి కరగి
హిమము సెలయేళ్ల హోరున ఏడ్చుచుండ
పకపకా నవ్వె పువ్వుల వరుస లచట.

శిఖరికాంతలు మేఘాల చీర కప్పి,
ముసుగు సిగ్గుల పగలెల్ల మురిసినారు ;
రాత్రిసమయాన విరహాన క్రాగిపోయి,
పండువెన్నెల వస్త్రాల వదలి పడిరి.

వెలికిలుగ సోలిపడియుండు వీరిపాలుపు,
వీగు ఘనకుచ శిఖరాల పెంపు నొందు ;
దాని చూచియెకాబోలు తార లంత
కన్నుగీటుల నేమేమొ కబురులాడె.

కురియు వర్షము కురిసెను కుంభవృష్టి ;
కాయు నెండయు కాసెను కాక ఎండ ;
వీచు వాయువు వీచెను వెఱ్ఱిగాలి ;
పాడుకొనువార లేదేదొ పాడుకొనిరి.

ఆంధ్రదేశ్యము - అన్యదేశ్యము



= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

(అనువృత్తము)

ఇక దేశ్యములను గూర్చి విచారింతము. సంస్కృత భాషకు సంబంధించినది గాని, దానినుండి నిష్పన్నమైనది గాని కాక దేశీయవ్యవహారములో నుండి ప్రాకృతభాషలలోనికి వచ్చిన శబ్దజాలము దేశి యని చెప్పబడుచున్నది. ఇట్టి దేశీయ శబ్దజాలమును హేమచంద్రాదులు 'దేశినామమాల' అను పట్టికలలో జూపినారు. హేమచంద్రుని యీ పట్టికను పరిశీలించినచో ననేకములు తద్భవశబ్దములు గూడ నందు చేరినట్లు కనబడుచున్నది. (గంధనీ, గండీసం, మేహుచ్ఛీరం, ధూమద్ధారం మొదలగునవి దేశి శబ్దజాలములో చేరినవి.) కాని దేశీయములగు అనార్య భాషాశబ్దములును పెక్కు గలవు. అందు ద్రావిడ భాషాశబ్దములును కొన్ని లేకపోలేదు. ఉదా: ఊరు (ఊరో గ్రామః); ఛాణం, ఛాణీ=గోమయ (cf. తె. చాణి); ఛిల్లం= ఛిద్రం (cf తె. చిల్లి); పసండి = కనకం (cf తె. పసిండి); దోరో=కటిసూత్రం (cf. తె. దారము) ; మాడిఅం=గృహం (cf. తె. మేడ, క. మాడి, త. మాడం); మడో=కంఠః (cf. తె. మెడ) ; ఖడ్డ = శ్మశ్రు (cf. తె. గడ్డము, క. గడ్డ) ; చిచ్చి=హుతాశనః (cf. తె. చిచ్చు, క. కిచ్చు); కేసరో=రవిః (cf. క. నేసర్, త. ఞాయిఱ్); తలారో = నగర రక్షకః (cf. తె. తలారి, త. తలెయారి)

దేశీయములగు నితరానార్య భాషాశబ్దములును కొన్ని వీనిలో జేరియుండును. కాని ఆంధ్రదేశ్యములు కూడ కొన్ని యీ ప్రాకృతలాక్షణికుల 'దేశి' లో జేరియుండుటయే విశేషము.

ప్రాకృత వైయాకరణుల ననుకరించుట వల్లనే తెలుగు లాక్షణికులును తెలుగుభాషకు తత్సమ తద్భవము లనియేకాక, దేశ్య మను విభాగమునుగూడ గల్పించినారు. మూలభాష సహజముగ దేశ్యమే యైనపుడు మరల దేశ్యవిభాగ మనున దెందుకు? ఇంతే కాక వీరి దేశ్యమున ఆంధ్రదేశ్యము, అన్యదేశ్యము అను మరియొక విభాగమునుగూడ చేసినారు. ఆంధ్రదేశ్యమే అచ్చతెనుగనియు జెప్పబడుచున్నది. ఇది ఆంధ్రదేశపురస్థాయులైన సకలజనులకు సులభముగ దెలిసెడి శబ్దజాలము. 'విన్నవారికిఁ మనమున దేటగా దెలియు మాటల యచ్చతెనుంగునా జనున్' అని పెద్దన. ఇక దేశ్యాంతరీణము—

"శ్రేయములై బహుదేశా
నేయములై చక్కదనము నెఱవనములు పై
యాయా నెలవులఁ జెవులకు
దీయము లగు పలుకులెల్ల దేశ్యము లరయన్."
"కేశవ యాంధ్రులు నానా
దేశంబులయందు నిలిచి తెలుగులె తత్త
ద్దేశోక్తు లంట బలికిన
నాశబ్దము లన్యదేశజాంధ్రము లయ్యెన్."

(అప్పకవి)

అనగా నాయా దేశభాగములయం దాంధ్రుల నాడుకలో వెలసిన శబ్దము లన్నమాట. వీనిని మాండలికశబ్దము (**Provincialisms**) లనియు చెప్పవచ్చును. ఇట్టి శబ్దము లాయా ప్రాంతములందలి కవులు వారి గ్రంథములలో ప్రయోగించినచో, నా గ్రంథవ్యాప్తిని బట్టి ఇతర కవుల గ్రంథములలోని కెక్కి క్రమముగ దేశమునం దంతటను వ్యాప్తి గాంచును. అట్టివి నిత్యవ్యవహారప్రసిద్ధికంటె వాఙ్మయప్రసిద్ధి విశేషముగా గలవై (**Literary forms**) యుండును. ఎట్లైనను ఆంధ్ర భాషలోని ఆంధ్ర దేశ్యమునకు గల ప్రాచుర్యము, సహజత్వము ప్రాకృతభాషలోని 'దేశ్యము'న కుండవు గదా. ఎందుచేత ననగా, నీ భాషలో తత్సమ, తద్భవశబ్దజాల మెరువుసొమ్మయినట్లే ఆ భాషలలో నీ

'దేశి' శబ్దజాలమును ఎరువు సొమ్మే. భాషకు ప్రాణ మనదగిన వాక్యనిర్మాణపద్ధతులు, వ్యాకరణ సంప్ర దాయములు నీభాషకు 'దేశ్యము' అను భాగము లోనే స్వతంత్రము లై యుండగా, ప్రాకృత భాష లకు 'తద్భవ' భాగములో సంస్కృత మూలములై యున్నవి. కావుననే తెలుగుభాష ప్రాకృతభాషల వలె తన జీవికకు సంస్కృతముపై నాధారపడి యుండ నావశ్యకత లేదు. దీనినిబట్టియే ప్రాకృతము లార్య భాషాజన్యములు, ఆంధ్ర మనార్య మగు స్వతంత్రభాష యని చెప్పుట కవకాశము కలుగుచున్నది. కాని దీనికి సంస్కృత ప్రాకృతములతో గలిగిన చిరకాల సంబంధముచే వానితో గాఢసమ్మేళనమును బొంది శరీరపుష్టిని, రసపుష్టిని గాంచుటను బట్టి సంస్కృత భాషాభిమానులగు వైయాకరణు లీ తెనుగునుగూడ ప్రాకృతములవలెనే సంస్కృతజన్యమని, తద్వికృతి యని తలంపసాగిరి. కాని వారీ భాషను తత్సమ తద్భవ దేశ్య విభాగముచేసి వాని కుదాహరణములుగా శబ్దముల నిచ్చిరే గాని వాక్యముల నిచ్చియుండకపోవు టయే గాక ఇందలి భాషారూపములనుగాని, విభక్తు లనుగాని సంస్కృతప్రాకృతములనుండి నిష్పన్న మైనవని సాధింప యత్నింపనైన లేదు గదా! అది సాధ్యమగునదియు గాదు. కావుననే ఆంధ్ర మార్య భాషాజన్యము కాక, భిన్నకుటుంబమునకు జెందిన దనుచున్నది. ఇందలి విభక్త్యాదులు, వ్యాకరణప్రక్రియ దక్షిణదేశభాషాలక్షణమును బోలిన వగుటచే నిది దక్షిణ దేశభాషా కుటుంబమునకు జేరినదని నిశ్చయింప వలసియున్నది. ఇట్లీ భాష దేశియమే యగుటచే మరల దేశివిభాగమున కావశ్యకత లేదు.

ఆంధ్ర మార్యభాషాజన్యము కాక దక్షిణ దేశ భాషలతో సాజాత్యము కలిగినదన్నపుడు, ఈ భాషకు సహజ మనదగిన యీ 'దేశ్యము' తక్కిన దక్షిణ దేశ భాషలతో సంబంధించినదై యుండవలయును గదా. ఈదేశ్యము, లేదా అచ్చతెనుగనునది సంస్కృత సమ, సంస్కృత భవ భిన్నం బని వైయాకరణులు చెప్పినపు డే దీని నిష్పత్తిని గూర్చి సంస్కృత మెట్టి సహాయము చేయలేదని వారు చెప్పిన ట్లయినది. కావున సన్నిహిత ములగు దక్షిణదేశ భాషలతో బోల్చి చూచుటచేతనే దీని (దేశ్యముయొక్క) లక్షణమును, చరిత్రను మనము కనిపెట్టవలసియున్నది.

ఎల్లవారికి చేటతెల్లముగా దెలిసెడి పలుకులు అని కేతన పెద్దన లిచ్చిన శబ్దములు, వాని కితర ద్రావిడ భాషలతో గల సంబంధమును గూర్చి పరిశీలింతము.

" తల నెల వేసవి నుడి మడి
పులి చలి మదు గూరు పేరు బూరుగు మగవా
డలుక..." (అని కేతన.)

తల—త. తలై; క. తలె; మళ. తల.

నెల—త. నిలావు (Moon).

వేసవి— క. బేసగె (బిసు = వేడి); త. వేనిల్.

పులి— త, మళ. పులి; క. పులి; తు. పిలి.

చలి— క. చళి, సళి; (కళిర్) తుళు. చలి, చళి.

మదుగు— క. మడు, మడువు; త. మడు.

ఊరు — త, మ, క. ఊర్; తు. ఊరు.

పేరు—త, మ. పెయర్, పేర్; క. పెసర్, హెసరు; తు. పుదర్.

మగవాడు—త. మగన్ (son); క. మగ (a son) a male.

బూరుగు—క. బూరుగ, బూరుగె (=a silk cotton tree); త. పూలై.

అలుక—క. అలుగు (=to be agitated, shake); త. అలంగు.

ఇక పెద్దన అచ్చ తెనుగు శబ్దములు :—

ఎనుములు—క. ఎమ్మె; త. ఎరుమై; మళ. ఎరుమె; తు. ఎర్మె.

గుఱ్ఱములు—త. కుదిరై; క, తు. కుదిరె.

పండులు—క. పణ్ణు, హణ్ణు; త, మ. పఴమ్.

బండులు—త. వండి.

ఉప్పు—త, మ, క, తు. ఉప్పు.

పప్పు—తె, మ. పరుప్పు.

ఆకు—క. ఆకు (cf. ఆగె = a seedling, a sprout).

నేయి—క. నెయ్ ; త. నెయ్. (Fat, grease) (స్నేహ ?)

నూనె—(నూవు + నెయ్) cf. త. ఎళ్ + నెయ్=ఎణ్ణె.

పాలు—తె, క, మ. పాల్.

తోలు—తె, క. ఉరల్—తోలు.

అప్పకవి ఆంధ్రదేశ్యము చెప్పునప్పుడు కూడా ఉదాహరణముగా పాలు, నేయి, పెరుగు, తోలు, ఉట్టి మొదలగునానిని ఇచ్చియున్నాడు. ఈ ఆంధ్ర దేశ్యమని అప్పకవి చెప్పినదానినే కేతన పెద్దన లచ్చతెనుంగని చెప్పినారు. కేతన దేశ్యమని వ్యవహరించినదానినే అప్పకవి అన్యదేశ్య మన్నాడు. కేతన దేశ్యమునకు ప్రత్యేక లక్షణము చెప్పకనే "ఎలుకువ, నెత్తమ్మి" ఇత్యాది శబ్దములను ఉదాహరించినాడు. కాని పెద్దన లక్షణముకూడ నిట్లు చెప్పియున్నాడు.

"శ్రేయములై బహుదేశా
నేయములై చక్కదనము నొందనములు నై
యాయా తెలుగుల తెవులకు
దీయములను పలుకు లెల్ల దేశ్యము లరయన్."

దీనినే అప్పకవి యనువదించినాడు.

"కేవల యాంధ్రములౌ నానా
దేశంబులయందు నిలిచి తెలుగులై తత్త
ద్దేశోక్తు లంటబలికిన
నాశబ్దము లన్యదేశజాంధ్రము లయ్యెన్."

"బహుదేశానేయములైనవి" గాని, అనగా ఇతరదేశములనుండి వచ్చి యీ భాషలో జేరినవి గాని, ఆంధ్రులే యితరదేశములందు నిలిచి తెలుగులే తత్తద్దేశోక్తు లంటబలికిన పలుకులుగాని అన్యదేశ్యములగునని తెలియుచున్నది. కాని లాక్షణికు లుదాహరించిన శబ్దములనుబట్టి యివి యెట్లన్యదేశ్యములనదగునో, అనఘా నేయేదేశభాగములలోనివో ఇప్పుడు గ్రహించుట యంత సులభసాధ్యముగా గనబడదు. వీనిలో పెక్కు కావ్యభాషయందే విశేషముగా గనంబడుటనుబట్టి పైదెలుపబడిన అచ్చతెనుగుశబ్దములవలె నంత విశేషముగా నిత్యవ్యవహారములోనుండి యందరికి సులభముగ దేటపడియెడు మాటలు కావని మాత్రము చెప్పవచ్చును. ఇవి యిప్పుడు హైదరాబాదు, బళ్లారి, బరంపురము, మద్రాసు మొదలగు ప్రాంతములందు నివసించువారు తత్తద్దేశోక్తు లంటబలుకుచుండిన పలుకుల రీతినే ఆకాలమున నానాదేశములందు నిలిచిన యాంధ్రుల వ్యవహారములోని మాటలై యుండును. అనగా నాకాలపు ప్రాంతీయాంధ్ర శబ్దము (Provincialisms) లని తలంపవలసియున్నది. కాని వీనిలో పెక్కు శబ్దములు సమాసపదములుగను, గ్రంథస్థములగు కావ్యభాషా సామాన్యములుగనే యుండుటనుబట్టి నిత్యవ్యవహారములోనివి గాని గ్రాంథికభాషారూపములనే వీ రిట్లు గ్రహించిరా యనియు సందేహింపవలసియున్నది.

"ఎలుకువ, నెత్తమ్మి, ఎరగలి, ఎసకంబు
నొసలింతి, నేటి పెక్కసము, నెమ్మి
మక్కువ, నెచ్చెర, మచ్చిక, పొన్నెసము
కసిమి, యేడ్తెర, లగ్గు, కలవలంబు
... ...
ఎల్లి కోలలుంట, వీచోపు, లుల్ల మువిద
మీకకాతియ, గద్దలు, వేట, గేణి
కొను పాలిండ్లు లోగి మొగిగనయమిట్టి
తెలుగుపలుకులు ఘనదేశితెనుగు లయ్యె"
(ఆం. భా. భూ.)

వీనిలో 'గద్ద'శబ్దము గృధ్రశబ్దభవ మను తలంపుతో కోశకారులు దీనిని తద్భవ మని చెప్పుట కలదుగాని తమిళమునందలి 'కలు-కలుదై' అనుదానికి సంబంధించిన దని తలంచినచో నిదియు దేశ్యమే కావచ్చును. ఇట్లు పైపద్యమున కేతన తెలిపిన శబ్దము లన్నియు దేశ్యములే యగునుగాని యేయేదేశభాగము నుండి వచ్చినవో చెప్పుట కవకాశము చాలదు. అందు పెక్కు శబ్దములు కావ్యభాషాప్రాచుర్యముమాత్రము కలవని చెప్పవచ్చు. ఇక తెమ్మెర, లేమావి, క్రొన్నన, కోడెడు, వాలుగంటి, కెమ్మోవి, కెంజాయ,

తామరకంటి, నలువ, చిగురుబోడి మొదలగునవి సమాసపదములు. పెద్దనయు కేతన చెప్పినవానిలో ఎల్లి, నెత్తమ్మి, క్రొన్నెల, పాచ్చెము అను శబ్దములను గ్రహించి ఇంక వాలాయము, ఆలము, వంగడము, అంగడి, నన్ను, నావిరి, నాగెంబు, అక్కజము, అచ్చెరువు, వేసలి, వేసవేలు మొదలగు మఱికొన్ని కావ్యభాషలోనే సాధారణముగా గనబడు శబ్దములను ఇచ్చియున్నాడు. ఇందు వంగడము, అక్కజము, అచ్చెరువు తద్భవములుగానే శబ్దరత్నాకరకారాదులచే గ్రహింపబడుచున్నవి. వంగడము వంశశబ్దభవమును, అక్కజము ఆశ్చర్య శబ్దభవమును కావచ్చును. దక్కినవానిలో పెక్కు ఇతరదక్షిణదేశభాషలకు సంబంధించినవియు గలవు.

ఎలుకువ—త. అట్, అడవు, అడక్కు.

మను—త. మణ్. మణల్.

ఇంతి—త. ఇల్ తి.

తెమ్మెర—క. తెమ్ + ఎలర్ (> ఎరల్)= తెమ్మెలర్, తెంబెలర్.

కడలి—త. కడల్ = అల.

నాగు—వ, క. నాక్, నాగు.

ప్రాద్దు—బ్రధ్న శబ్దభవ మందురుగాని వ, క. పొలుగు అనుదానికి సంబంధించినదై యుండును.

తనివి—(తనివు. తనుపు = తృప్తికలుగజేయు) తణ్ - తని = చల్లని cf త. తన్నీర్.

అంగడి—త, క. అంగాడి.

కేలు—త. కై; క. కయి.

పొరు—త, క. పోర్.

అప్పకవియు అన్యదేశజాంధ్రములలో కేతన పెద్దన లిచ్చిన వాలాయము, ఆలంబు, ఎలనాగ, చెలది, నెలత, తొయ్యలి, బోటి, ఇంతి, ఏడ్తెఱ, పొలుపు, వీనులు, ఉల్లము, కేలు, నెమ్మి, సోయగము, చెచ్చెర, మక్కువ మొదలగువానినే చేర్చినాడు. కాని కేతన అచ్చతెనుగులుగా నిచ్చిన నెల, వేసవిశబ్దముల నప్పకవి అన్యదేశజాంధ్రములుగా గ్రహించినాడు. కేతన పెద్దనలు తత్సమము, తద్భవము, అచ్చతెనుగు (సహజాంధ్రదేశ్యము), దేశ్యము (దేశ్యోద్భవము), గ్రామ్యంబు నాగగ లవైదు తెలుగులు "పంచవిధములై తెలుగుపలుకు జాతముపరగుక్"అని చెప్పి తెలుగున గల భేదమునుమాత్రము చెప్పగా, అప్పకవి "తెలుంగుమఱుంగులు" "ప్రౌఢ నుంగులు" సను మరిరెండు విశేషములను గల్పించియున్నాడు."అబ్ధిమేఖల కుదయించినట్టి సీత" అనుటకు బదులుగా "కడలిమొలనూలిచేడియ గనిన పడుచు"అని చెప్పినచో నది "తెలుగుమఱుగు"అగునట. అనగా తత్సమపదములను పరిహరించి తదర్థమును డొంకతిరుగుడు తెలుగుసమాసముల మూలముగా జెప్పినచో నట్టి శబ్దములు తెలుగుమఱుగు లగును. ఇవి భాషలో సహజముగ వ్యవహారములో నున్నవిగాని, ప్రాచీనకవుల రచనాపరిపాటిలోనివి గాని కాక, విశేషంబుగా తత్సమబహుళంబుగా జొచ్చిన ఆంధ్రభాషపై గలిగిన యేవగింపును సూచించుటకో యన్నట్లు ౧౬-వ శతాబ్ది ప్రాంతమున గొంద రాంధ్రకవులు అచ్చతెనుగుపేరుస కల్పించిన యొకవిధమగు కృతకభాషారూపములని చెప్పవలసియున్నది. అప్పకవి పేర్కొనిన యీ తెలుగుమరుగు లనువానిని వనుకటి లాక్షణికులు పేర్కొనకపోవుటచే నివి అప్పకవికి సమీపకాలముననే బయలుదేరిన వనవచ్చును. అంతకుపూర్వపు లాక్షణికులు సంస్కృతవిభక్తులు, క్రియారూపములు, అవ్యయములు, వైరిసమాసములు నీభాషలో జేరకూడదని శాసించి తత్సమరూపములలో గూడ గలుగు మార్పులను సూచించియు తెలుగుదేశీయసంప్రదాయమును నిలుపబెట్ట యత్నించిరి. అట్లే ప్రాచీనకవులలో కొందరు "ఆరూఢగద్యపద్యాదిప్రబంధ, పూరితసంస్కృతి భూయిష్ఠరచన" నిరసించి యీభాషలో ప్రసన్నతకు నెలవగు జానుతెనుగురచనను ప్రోత్సహింపదొడంగిరి. అప్పటికి దెనుగుమఱుగులు భాషలో బయలుదేరలేదు. తొలికాలమున తత్సమబహుళమగు శిష్టకవులరచనను ప్రతిఘటించుటకుగా బయలుదేరిన "జానుతెనుంగు" టుద్యమమే అప్పటి పండితకవుల యాదరమును బడయలేక దేశమున నంతర్వాహినిగా ప్రవహించి మఱికొంతకాలమునకు 'తెనుగుమరుగు' లను మారురూపమును వహించి అచ్చ తెనుగురచన మనుపేరుతోనే బయలువడజొచ్చినది. కాని యీమరు గా జానుతెనుగుజా

తనమునకు మరుగే యైనదిగాని మెరుగుపెట్టజాలినది కాలేదు. సహజమగు దాని తియ్యదనము మరుగువడి కృత్రిమరుచులు పెరుగుటచే సహృదయుల హృదయము నాకర్షింపజాలకపోయినది. కావుననే యీ యచ్చ తెనుగురచనయు నచిరకాలములోనే యంతరించుటయు తటస్థించినది. దీనితోపాటు వెనుకటి "జానుదెనుంగు" మాటయు నడుగునబడిపోయినది.

అప్పకవి అచ్చతెనుంగున కీ తెలుగుమరుగులనే కాక "ప్రాదెనుగు" లనువానినిగూడ జేర్చినాడు. "తొల్లింటికవుల వాక్యములెల్లను బ్రాదెనుగులయ్యె." అవియే యిటీవలివారికి జెల్లుబడిగ్రాయె ప్రాతతెనుగు లగునట. కాని యీ చెల్లుబడి విషయమున నభిప్రాయ భేదము లనేకరీతుల లేకపోలేదు. అప్పకవియే అపు, ఈపు అనునవి గ్రామ్యోక్తు లన్నాడు. ఇవి తిక్కనార్యుని ప్రయోగమందు గలవు. తిక్కనార్యుడే యీ ప్రాతవడ్డమాటల ప్రయోగమునుగూర్చి

"పలుకుల పొందు లేక రస
భంగముసేయుచు ప్రాతవడ్డ మా
టల దమ నేర్పు సూపి"

ఇత్యాదిపద్యమున నీసడించినాడు. ఈ 'ప్రాతవడ్డ మాటలు' అప్పకవి చెప్పిన పూర్వకవుల ప్రయోగములే యని తలంపవచ్చును. ప్రాతవడ్డ మాటలలో దన నేర్పు చూపుచు, నస్లైసను హృదయ మలరింపలేని కుకవిని దుర్విటునితో బోల్చుచు నిందించియున్నాడు. అనగా పూర్వకవిప్రయోగములను గ్రహింపవల దనియా యీతని యుద్దేశము? గ్రహించినను హృదయ మలరించునట్టివిగా వానిని జేయవలయునని యేమో. కావచ్చును. పూర్వకవులలో నొకడగు నన్నిచోడుని కవితనుండి యీత డట్టివానిని కొన్నిటిని గ్రహింపక పోలేదు. కాని వానికి మెరుగుపెట్టినాడనియు జెప్ప వచ్చును. నన్నిచోడుడు కత్తిగొంటులయిన అత్త గంతును—వేశ్యమాతలను గూర్చి వారి సామర్థ్యాతిశయ మునుగూర్చి వర్ణించు సందర్భమున వారు "నేలయు నింగియు దాలముల్ వాయింప, నెండమావుల 'బట్ట బండతలయు, మోకాలు ముడివెట్ట..." నేర్పుగల వారని వస్తుస్థితిని వర్ణించినాడు. ఈ "నేలయునింగియు దాలముల్ వాయించు"టను సోమనాథుడు, తిక్కన గూడ గ్రహించినారు. అందు తిక్కనార్యుడు దీనిని ప్రయోగించిన రీతి గమనింపదగినది. కీచకునిచే కొంకుకొస రించుకయు లేక కూలదన్నబడిన ద్రౌపది భంగపాటును విరటుని యాస్థానంబున నుండి

"కనుగొని కోపవేగమున
కన్నుల నిప్పులు రాల నంగము
ల్దనరగ సాంద్రఘర్మసలి
లంబులు గ్రమ్మ నితాంతదంతపే
షనరటదాస్యరంగవిక
టభ్రుకుటీచటుల ప్రవృత్తన
ర్తనఘటనాప్రకారభయ
దస్ఫురణాపరిణద్ధమూర్తియై"

న పవనతనయుని భయంకరాకారమును మన కనులయెదుట నిలబెట్టుటకుగా తిక్కనార్యు డీవిషయ మును గ్రహించినాడు. నన్నిచోడుని వేశ్యమాతల నేర్పరితన మును వస్తుస్థితివర్ణనమునకంటె తిక్కనార్యుని యీ భావస్ఫోరకవర్ణన సందర్భమున నా వాక్యమున కెట్టి మహత్తరశక్తి, ఔచితి కలిగినవో పరికింపుడు.

"నేలయు నింగియు దాలముల్ గావించి
యేపున రేగి వాయించి యాడ
కులపర్వతంబులు గూర్చి యొండొంటితో
దాకంగ వీకమై దన్ని యాడ
నేడు సాగరములు నిక్కడక్కడ బెట్టి
పలుచని రొంపి మై నలదికొనగ
దిక్కులు నాలుగు నొక్కచోటికి దెచ్చి
పిసికి పిండలుసేసి పిడిచికొనగ
మిగిలి బ్రహ్మాండభాండంబు పగుల వ్రేయ
నప్పళించుచు బ్రళయకాలానలమున
గండరించిన రూపంబుకరణి భీము
డతిభయంకరాకారత నతిశయిల్లె."

నన్నిచోడుడు:—(కుమా. సం. ౧౨)

"ధరణీచక్రము దిర్దిర
దిరుగ బయోనిధులు గలగ దెసదప్పి భయా
తురులై సురకిన్నరఫణి
నరవరు లని దూలిపాఱ నరకుడు దాకన్"

తిక్కన:—భీముడు ద్రౌపదితో—

"అవనీచక్రము సంచలింపగ దివం బల్లాడ నాశాచయం బవఘూతంబుగ గోత్రశైలనికరంబాకంపముం బొంద న ర్ణవముల్ ఘూర్ణన మొంద గ్రోధముగ్రతార్థత్వంబు నొందించి చి త్రవధప్రౌఢి వహించి సూతునకు రౌద్రం బేర్పడం జూపెదన్" (విరా. ౨ - ౨౫౪)

నన్నిచోడుడు:— గుణధ్వని—

"ధర గంపింప బయోనిధుల్ గలగ ది
గ్దంతుల్ భయంబంద భూ
ధరముల్ డొల్ల వియత్తలం బద్రువ దై
త్యశ్రేణి భీతిల్ల భా
స్కరరథ్యంబులు మ్రొగ్గి మగ్గబడ నా
శాచక్రముల్ మ్రోయ భీ
కరమై దారుణమై గుణధ్వనిమహో
గ్రంబై చెలంగెన్ వడిన్"
(కు. సం. ౧౨-౯౧౨)

తిక్కన:—పార్థుడు శంఖమొత్తినక—

"కలగెన్ తోయధిసప్తకంబు గిరివ
ర్గం బెల్ల నాటాడె సం
చలతన్ బొందె వసుంధరావలయ మా
శాచక్ర మల్లాడె గొం
దల మందెన్ త్రిదశేంద్రుపట్టణము పా
తాళంబు ఘూర్ణిల్లె నా
కులమయ్యెన్ గ్రహతారకాకులము సం
క్షోభించె నవ్వేధయున్" (విరా. ౫-౧౬౨)

నన్నిచోడుడు:—"షణ్ముఖునురుభుజాస్తంభ భా గమున జయశ్రీ బొందె సాలభంజికవిధమున" (౧౨-౯౪౪)

ఈభావము తిక్కనార్యుని నిర్వచనోత్తర రామాయణమున తొలిశ్లోకమునసే ఎట్లు విస్తరింప బడినదో చూడుడు :

"శ్రీరాస్తాం మనుమక్షితీశ్వరభుజాస్తంభేజగన్మండల ప్రాసాదస్థిరభారభాజిదధతీ శ్రీసాలభంజీశ్రియం"

ఇట్లు వెనుకటికవుల భావములను, మాటలను గ్రహించినను వానిమూలమున చదువరుల హృదయ మలరించునట్లుగా రచింపగలిగిననేకాని సుకవి కాలే డని యాతని భావమైయుండును.

"తఏవ పదవిన్యాసాః తాఏవార్థవిభూతయః
తథాపి నవ్యం భవతి కావ్యం గ్రథనకౌశలాత్"

అనిన యాలంకారికుల యభిప్రాయమునే యాత డనువదించుచున్నట్లున్నాడు. ఇట్లు నన్నిచోడుని భావములను గొన్నిటిని గ్రహించి వానికి మెఱుగుపెట్టి ప్రయోగించినను, ఈతని తొలిరచనయే యనదగిన నిర్వ చనోత్తరరామాయణములో నీతడు చేసిన కుకవినింద, చెప్పిన కవితాలక్షణవిశేషములు, సూచించిన పద ప్రయోగపద్ధతి మొదలగునవి యాతడు నన్నిచోడుని రచనసే మనమున నిడికొని చేసెనా యని తలంచుట కవకాశము కలుగుచున్నది. భాషాసాహిత్యరచనాపద్ధ తుల విషయమున నన్నపార్యుని పక్షమునందే యాద గము గలవాడగు తిక్కన యారీతికి భిన్నములగు పలు కుల పొందులేమి, దాని మూలమున గలుగు రసభంగము, ప్రాతపడ్డ మాటలు, విశేషణవిశేష్య ముల లింగవచనముల భేదము మొదలగు రచనావిష యములనుగూర్చి ఖండింపవలసినా డనుటనుబట్టియు, నీలక్షణములు కొన్ని నన్నిచోడుని రచనలో గాన వచ్చుటంజేసియు నన్నిచోడుని రచనయే యాతని విమ ర్శకు గారణమనుట యుక్తియుక్తముగా గనబడకపోదు.

పలుకుల పొందు లేకపోవుట యను తిక్క నార్యుని యాక్షేపణమును నన్నిచోడుని రచన కన్వ యించినచో, నన్నయాదుల రచనలో గానరాని యన్య దేశీయ పద, పదబంధముల ప్రయోగసరళి యొకటి యీరచనలో గానవచ్చుచుండుట మనము గమనింప దగిన విషయములలో నొకటి యగును. అయితే నన్న యకు పట్టుపడని యీక్రొత్తరీతి యాతనికిమాత్ర మెచ్చుటినుండి వచ్చినది, ఏల రావలయును అను ప్రశ్న వెంటనే కలుగకమానదు. పరిశీలించినచో మన దేశము నందలి తక్కిన పెక్కువిషయములందువలెనే—అంత దూరమేల, మన యాంధ్రుల జాతీయజీవితచరిత్రమందు వలెనే ఆంధ్రవాఙ్మయరచనారీతులందును ఆర్యానార్య భాషాసాహిత్యపద్ధతుల సహజసమ్మేళనము చక్కగా సాధింపబడియున్న దని మనము గుర్తింపవలసియుం

డును. దీనిని మొదట చక్కగా సాగించుటలో ప్రోత్సాహకులై కీర్తిగన్నవారు చాళుక్యరాజులు-సత్యాశ్రయునిగొట్టి చాళుక్యనృపులే కావచ్చును. అట్టిదానిని తొలుతొలుత సాధించి పేరుగాంచినవాడు నన్నపార్యుడు. వీరి కవివిషయమున గొంతవరకు మార్గదర్శకమైనది కర్ణాటభాషాసాహిత్యము. అందప్పటికిపూర్వమే యీ సమ్మేళనపద్ధతులు స్థిరపడి సాహిత్యము పెంపొందియున్నది. ఆ సాహిత్యరీతులనే తన దేశకాలానుపరిస్థితుల కనుకూలమగునట్లుగను, "అనఘమై శిష్టాగ్రహారభూయిష్ఠమై ధరణీసురోత్తమాధ్వరవితానపుణ్యసమృద్ధమై పొలుచు" వేగిదేశమందలి గోదావరీతీరంబున నివసించు తన వైదికసంపత్తి కనుగుణమగునట్లుగను గ్రహించి "తెనుంగున మహాభారతసంహితారచన బంధురుడయ్యె" నన్నయ. కాని నన్నిచోడున కీగోదావరీతీర వేంగిదేశపు వైదికసంపత్తి లేదు. ఆంధ్రదేశ పశ్చిమభాగమునందలి అన్నితెలంగాణపు దేశీయాభిమానమునకు దోడు తన్నిమిత్తమున నగు నన్యదేశీయసంప్రదాయప్రవణతకూడ ప్రబలినట్లగపడుచున్నది. కావుననే నన్నయ యవలంబించిన మార్గపద్ధతి నవలంబింపక, దేశిమార్గములను దేశీయములుగా జేసి కవిత సాగింపవలె నని తలచియుండును. ఆంధ్రదేశపశ్చిమభాగము కన్నడదేశప్రాంత మగుటచే నచ్చటి దేశికి కన్నడభాషాసంపర్కము హెచ్చుగా నుండకమానదు. గద్యపద్యోభయసమ్మిశ్రితమగు వాఙ్మయము కన్నడభాషలో నింతకుపూర్వమే వెలసి ప్రసిద్ధిగాంచియుండుటచే నావాఙ్మయమే, అందు రత్నత్రయమని ప్రసిద్ధిగాంచిన కవిత్రయమే పెక్కువిషయముల నన్నిచోడునికి మేలుబంతి యగుటలో నాశ్చర్యము లేదు. ఈ కారణములచే నీతని రచనలో తమిళకన్నడభాషాపదములు, ప్రయోగములు, సంప్రదాయములు మొదలగునవి కొన్ని ప్రబలుట, అవి తరువాతివారికినచ్చకపోవుట తటస్థించినది. కేవలము నన్నయ యవలంబించిన మార్గమునే యవలంబింపక నన్నిచోడుని వలె దేశిపద్ధతికై ప్రాకులాడిన పాల్కురికి సోమనకూడ తరువాతికవుల యీసడింపులకు గురియగుటకు, తక్కినవారి భాషకంటె వీ రిద్దరి భాషలోను, ప్రయోగపద్ధతిలోను కొంత సామ్య మగపడుచుండుటకుగూడ కారణము వీరిది పశ్చిమాంధ్రదేశీయ సంప్రదాయ మగుటయే కావచ్చును. కావున వీరి విశేష ప్రయోగములలో కొన్నిటిని పశ్చిమాంధ్రదేశీగను, కొన్నిటిని అన్యదేశీయములుగను మనము గ్రహింపవలసియుండును. కేతనాదులు చెప్పినట్లు తల, నెల, గుడి, మడి, ఊరు, పేరు, పాలు, పెరుగు మొదలగు శబ్దములు దక్షిణదేశ భాషలన్నిటికిని మూల మగు తల్లిభాషనుండి వచ్చినవే యైనను, ఈ భాషలు వేరుపడి స్వతంత్రములైన పిదప అందలి సాహిత్యముల పరిణామమువలనగాని, ఆయా భాషలను వ్యవహరించువారి సాన్నిధ్యము, కలయికల వలనగాని ఒకభాషలోని శబ్దములు మరియొక భాషలోనికి సంక్రమించుచుండును. అప్పు డవి యన్యదేశ్యములుగనే పరిగణింపబడును. ప్రాంతీయము లగు నిట్టి శబ్దముల నాయా కవుల ప్రయోగబాహుళ్యమును, బలమును బట్టి యితరకవులును సహించి గ్రహించినచో నవి యాభాషాసాహిత్యమున నిలిచిపోయి యా భాషలో నంతర్భాగ మగును. లేనిచో నాయా ప్రాంతీయ కవుల రచనలలో మాత్రమే పొడసూపుచు భాషలో విశేషవ్యాప్తి గాంచవు. నన్నిచోడ సోమనాథుల రచనలలోని కొన్ని ప్రయోగముల కిట్టి స్థితియే గలిగినది. తిక్కనవంటి మహాకవి యట్టి యసాధారణాన్యదేశీయ ప్రయోగములను గూర్చి వెంటనే నిరసింప తటస్థించుటయు నట్టివి కాలక్రమమున నంతరించుటకు గారణమైయుండును. **పలుకుల పొందు లేక** ఒకటన్ హృదయం బలరింపలేని కుకవులను నిందించుటతోపాటు "తెలుగుకవిత్వము చెప్పం దలచిన కవి యర్థమునకు దగియుండెడు మాటల గోన" వలయునని చెప్పుచు తెలుగు కవిత్వము చెప్పదలచిన కవి యనుసరింపవలసిన విధానమును గూర్చిగూడ తిక్కన చేసిన సూచన నన్నిచోడాదుల విజాతీయ ప్రయోగములనే లక్ష్యముగా జేసికొన్నదిగా కనబడుచున్నది. అట్టి నన్నెచోడుని అన్యదేశీయములుగా బరిగణింపదగిన కొన్ని ప్రయోగములను బరిశీలింతము. ఇవి విజాతీయము లనబడుట అప్పటి నన్నయాదుల మార్గపద్ధతిని బట్టి చూచుటవలనను, ఆమార్గము నవలంబించిన తరువాతి కవులు వాని నంతగా గ్రహింపకపోవుటచేతను గలిగినదే. లేనిచో నివియు అప్పకవి చెప్పిన ప్రాత తెనుగులో

చేరవలసినవే. నన్నిచోడుని రచనలో పలుకుల పొందిక లేకపోవుట విజాతీయములగు నన్యదేశ్యపు పలుకుబళ్లను ప్రయోగించుటచేతనే యనుదాని కుదాహరణముగా నీ తమిళ భాషా ప్రయోగములను జూపవచ్చును.

నాయి దోర్ప నేర్చుగాక ఏమి నేర్పనేర్చు - cf. త. నాయి=కుక్క.

ఈ వచ్చిన **వేళ్ల** యందు - cf. త. పేయర్ - పేర్=నామము. ఎత్తనిపేర్=ఎంతమంది.

వేల, వేలగా-ని cf. త. వేలై=పని, ఉద్యోగము.

పురులు—ఘనము. cf. త. పొరుళ్=అర్థము.

ముడి గలపినగతి — cf. త. ముడి = కిరీటము. పొన్‌ముడి=బంగారు కిరీటము.

పొయిదల - cf. త. పొయి = అబద్ధము.

తన్నీర—cf. త. తణ్ణీర్—> తన్ని=ఉదకము= చల్లని నీరు.

పద్మిని **యొండమి** యొల్ల చూఱగొని — cf. త. ఒడమె=ఘనము.

కట్టాయము—cf. త, క. కట్టాయము = నిర్బంధము, నిశ్చయముగా.

నవ్వులక్ **ములరుల** కిచ్చి — cf. త, క. మలర్=పువ్వు.

కుళిరు గొన — cf. త, క. కుళిర్ = చల్లదనము.

తళియ — cf. త. తళిఘు=భోజనము, వంట.

తమిళ భాషా పదములకంటె కన్నడభాషా పదములు, ప్రయోగములు నీతని రచనయందు విశేషముగా గానగును. అవి పంపాది కన్నడ కవుల గ్రంథములం దీతనికి గల యాదరమును, పరిచయమునే విశేషముగా సూచింపగలదు. శ్రీ మానవల్లి రామకృష్ణకవిగా రట్టి వానిని విశేషముగా జూపియున్నారు.

ళితికి **కండవదంబు** సుట్టి(= కొండపటము = తెర); కేనము, కెలసము, అగుర్వు, విగుర్వించు, అబ్బగింపక, ఎల్లిదించు, మేలివెంచలు, దేసి, పందల, ఉరి(=దహనే), తుంతుర్వని (తుంతుర్=**drizzling, spray,** పని=**drop, dew**), మేలిల్లు, బాలకి, బేటము, బేటంబేటము, కొలవేళులు, పీలితొంగళ్లు, పేర్చిందులు, ఎలర్, వఱిడియలు, మేఘడంబరములు, కెడ్పెరసు, ముట్టినూదలించు, కునిసియాడు, అపమానము, మ్రోయు (= వీణవాయించుటకే), క్రుక్కిదము మొదలగు శబ్దములును,

"ఆ యవనీసురాసుర **చయంబు దద్దణాధి**పుల గాంచుచు **మీదికిమీద జీవముల్ పోయిరి**"

"తలచియో- కాదు- నిక్కము తపము సేయ వలచియో."

"తడియారదు నేనియు."

"నీ ప్రాప్తియే."

"వచ్చు కాడవు గాక."

"బాసితి మీకు నింటితోణ్."

"కూతం గంతులు సనిన."


"గౌరి నీ వెంత నెట్లపురులో."

"కులిరుగొన మేన నొత్తిరి."

ఈ మొదలగువాని విచిత్ర ప్రయోగము కన్నడ భాషాసంప్రదాయ సిద్ధమే యని తలంపవచ్చును. వీనిలో గొన్ని పశ్చిమాంధ్ర దేశ భాగ వ్యవహారములో నుండినను ఉండవచ్చును. కాని వాని ప్రసిద్ధి కన్నడ దేశ వ్యవహారముననే యగుటచే, నివి యన్నియు నీ భాషలో నన్యదేశీయములుగనే పరిగణించవలసి యుండును. కాని వీనిని తరువాతి కవులకు జెల్లుబడి గాక పోవుటచే గాబోలు ప్రాతతెనుగులో జేర్చినట్లు లేదు.

ఇట్లు సంస్కృతాద్యార్యభాషలలో మాతా, పితా, కరోతి, గచ్ఛతి మొదలగు శబ్దములు తక్కిన గ్రీకు, లాటిన్ మొదలగు భాషలలో వలెనే మూల భాషనుండి వచ్చిన సజాతీయ శబ్దములే యైయుండ, ఇటీవల నా భాషలనుండియు దేశీయభాషలనుండియు సంక్రమించిన పిక, దీనారాది శబ్దము లన్యదేశ్యము **లైనట్టులే దక్షిణదేశీయము లగు అరవము, తెలుగు,**

కన్నడము మొదలగువానిలోఁగూడ తల, నెల, ఊరు, పేరు మొదలగు, మూలభాషనుండి సంక్రమించిన సజాతీయ శబ్దములు కేవల దేశ్యములుగా గ్రహింపబడు చుండ, తరువాతికాలమున పరిసర ప్రదేశములందలి హిందూస్థానీ, మహారాష్ట్రి మొదలగు విజాతీయ భాషలనుండివలెనే సజాతీయభాషలనుండి సంక్రమించిన శబ్దములును అన్యదేశ్యములుగనే గ్రహింపబడుచుండును. కావున ఉత్తరహిందూస్థాన భాషలలోని 'దేశి' ఆ భాషలలో నన్యదేశ్యము కావలసినట్లే, దక్షిణదేశభాషలలోని తత్సమతద్భవములును అన్యదేశ్యములుగనే పరిగణింపబడవలసియున్నది. ద్రావిడ భాషలు సహజముగ దేశ్యములే యగుటచే నందు దేశివిభాగ మావశ్యకముగా దోపదు.



ఇది స్వరాజ్యోత్సవముకాదు ; మా ఊరికి సినిమాతార వచ్చినది.

ఆంధ్రభాష - ధాతువులు

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

సామాన్యముగా నేభాషనైనను వ్యాకరించి లక్షణ మేర్పరచు సందర్భమున వైయాకరణు లాభాషాశబ్దములకు మూలరూపము లనదగిన ధాతువుల స్వరూపమును గుర్తించుటకు బ్రయత్నింపవలసినవా రగుదురు. ఏలయనగా నాభాషను వ్యాకరించి యందలి శబ్దముల రూపనిష్పత్తిక్రమమును వివరించునప్పుడు అవి యేమూలరూపములనుండి ఏయే యితరశబ్దరూపములయు, లేదా వాని భాగములకు ప్రత్యయాగమాదులయు కూడికచే నేర్పడి తత్తదర్థభేదములను సూచించుచున్నవో యను విషయమును వారు సాధించి వ్యక్తపఱుపవలసియుండును. కావున వా రాభాషలో సరూపములై సన్నిహితార్థసంబంధము గల శబ్దముల నన్నిటిని పోగుచేసి, వానిలో నేయే భాగ మెట్టి యర్థవిశేషమును దెలుపుచున్నదో, వాని కన్నిటికిని సంబంధము గల్పించు మూలార్థమును సూచించు సామాన్యభాగ మేదో కనిపట్టి, దాని నుండి రూపకల్పనము చేయ యత్నింతురు. ఇట్లొక భాషలోని శబ్దముల రూపనిష్పత్తిక్రమమును సాధించుటకై యందలి యొక్కొక శబ్దకూటముయొక్క సామాన్యార్థమును సూచించు మూలరూపములే యాభాషలోని ధాతువులని చెప్పబడును. కావున నాభాష కివి మూలబీజములే యని చెప్పదగియుండును. ఇవి రసాయనశాస్త్రజ్ఞుని మూలధాతువులవంటివే. కాని వీనిని సన్నిహితములగు సజాతీయ భాషారూపములతో బోల్చి పరిశీలించినగాని వీని మూలరూప మిది యని నిర్ధారణ చేయుటకు వీలుపడదు. సన్నిహితభాషాజ్ఞాన మలవడని యప్పు డొక్కొక భాషలోని మూలరూపములనే ధాతువులుగా గ్రహించి వానినుండి వైయాకరణు లాయా భాషలలోని రూపముల నిష్పత్తిక్రమమును దెలుపుదురుగాని, యంతమాత్రమున నాధాతువుల మూలస్వరూపముగాని, ఆభాషయొక్క సమగ్రచరిత్రగాని వ్యక్తము కాబోదు. సజాతీయభాషలలోని ధాతువుల స్వరూపమును బోల్చి చూడగా, నీధాతువు... భిన్నభాషావర్గములలో భిన్నరీతులు గలవై ... వనియు, వాని నాయాదేశములందలి జనసంఘ... వారు, వారివారి వ్యవహారమున నుపయోగించుకొను రీతినిబట్టియే, భూభాగమునందలి భాషలను వర్గీకరింపవలసియుండు ననియు నాధునిక భాషాతత్త్వవేత్తల యభిప్రాయమైయున్నది.

ధాతువుల స్వరూపమునుబట్టి ఆసియా ఐరోపా దేశములందలి భాషలు మూడు తరగతులుగ విభజింపబడినవి. అందు చీనాదేశపుభాష మొదటితరగతిలోనిది. దీనిలో సామాన్యముగా నొక్కొక్క ధాతువే యొక్కొక్క సంపూర్ణభావమును సూచించును. ఒక వాక్యమున భిన్నధాతువులు చేరికవలన వానిలో నెట్టిమార్పును గలుగదు. స్థానమునుబట్టియే యొక వాక్యమునందలి భిన్నశబ్దముల సంబంధము సూచింపబడును. ఈధాతువులన్నియు నేకాక్షరధాతువులే. వీనిని ధాతురూపపదభాష (Isolative or Radical languages) లని యందురు. రెండవతరగతికి జెందినవి సెమిటిక్‌కుటుంబభాషలు. ఇందలి ధాతువులు ద్వ్యక్షరధాతువులు. అవి సామాన్యముగా మూడు హల్లుల కూడిక గలవై యుండును. ఈహల్లుల... చేర్పబడు నచ్చులలోని భేదమునుబట్టి భావ...భావభేదము, వ్యాకరణసంబంధము మొదలగునవి సూచింపబడును. ఇక మూడవతరగతికి జెందిన భాషలలో నిట్టి భావభేదమును, వ్యాకరణసంబంధమును సూచించుటకు ధాతువునకు ముందుగాని, వెనుకగాని కొన్ని ప్రత్యయములు - లేదా పదములు చేర్పబడుచుండును. ఇండోయూరపియన్ సిథియన్‌కుటుంబముల భాష లన్నియు నీతరగతిలో చేరియున్న. అయితే, ఇండో

యూరపియన్ భాషలలో నీప్రత్యయము లనబడునవి యేమూలరూపములనుండి వచ్చినవో గుర్తింపరాని స్థితి గలవై యుండ, సిథియన్ భాషలలో నివి తమ మూలరూపములనుండి విశేషముగ మార్పు నొందనివై తొలి ధాతువుతో నైక్యమును బొందక తమ ప్రత్యేకతను నిలుపుకొనుచు మూలార్థమును సూచించునవై యున్నవి. కావున నివి సంయుక్తపదరూప భాష (Agglutinative languages) లనియు, నవి ప్రత్యయాంతభాష (Inflexional languages) లనియు చెప్పబడుచున్నవి. ఇది స్థూలదృష్టిని చేయబడిన విభాగమే కాని, ఒక తరగతిలోనివాని చిహ్నము లితరతరగతులలో నేమాత్రమును కనబడవని చెప్పుటకు వీలులేదు. ఒకప్పు డొక వర్గములోని భాషలు-అనగా ధాతురూపపదభాషలు కాలక్రమమున సంయుక్తపదరూపత్వమును బొందవచ్చును. ఇవి మఱి కొంతకాలమునకు బ్రత్యయాంతత్వమును బొందవచ్చును - అని శబ్దశాస్త్రజ్ఞులు చెప్పుదురు.

ప్రస్తుతము ద్రావిడభాష లనబడు దక్షిణహిందూదేశభాషలు సంయుక్తపదరూపభాషాలక్షణములే విశేషముగా గలవగుటచే, చిరకాలముక్రిందటనే సంపూర్ణముగ ప్రత్యయాంతత్వమును బొందినవని చెప్పదగిన ఇండో యూరపియన్ భాషలతోడి సన్నిహితసంబంధము వీనికి లేదనియు, సంయుక్తపదరూపత్వము నెక్కుడుగా గనబఱుచుచున్న టర్కిష్ మొదలగు సిథియన్‌కుటుంబమునకు జెందిన భాషలతోనే యెక్కుడు సాదృశ్యము కలదనియు కాల్డ్వెల్ పండితుడు మొదలగువారు తలచియున్నారు. పరిశీలించిచూచినచో నీద్రావిడభాషలు సంయుక్తపదరూపభాషావస్థనుండి ప్రత్యయాంతస్థితిని బొందుమార్గమున బడుచున్నను, వాని పూర్వస్థితిచిహ్నములను స్పష్టముగనే కనబఱుచుచున్నవనుట విశదము కాకమానదు. కాని వీనికి చిరకాలముక్రిందటనే సంస్కృతభాషాసంసర్గము కలుగుటచేతను వీనిని వ్యాకరించి లక్షణ మేర్పఱిచిన లాక్షణికులు ప్రత్యయాంతభాషయగు సంస్కృతభాషయొక్క లక్షణపద్ధతినే వీని కన్వయింపజేయుటచేతను, వీని *సహజస్వరూపము మఱుగుపడిపోవుచుండుట తటస్థించినది. కాని యీభాషారూపములను పరిపోల్చి, వీని లక్షణమును బాగుగ పరిశీలించినచో వీనిపూర్వచరిత్ర వ్యక్తమగుటయేకాక, వీని సంయుక్తపదరూపత్వముకూడ (Agglutinative nature) స్పష్టముకాకమానదు.

ఈ దక్షిణహిందూదేశమున వ్యవహరింపబడు భాషలలో నొకటియగు తెలుగుభాషకూడ కొన్ని మూలధాతువుల సంయోగముచేతనే యేర్పడియుండునా? అట్లే యైనచో నీభాషయందలి ధాతువుల స్వరూప మెట్టిది? ఆంధ్రవైయాకరణులు నిర్ణయించిన ధాతువులే మూలధాతురూపము లనదగునా? ఈ మూలధాతువుల స్వరూపమును దెలిసికొనుట కితర తమిళకన్నడాదిసన్నిహితభాషారూపము లెంతవఱకు దోడ్పడును? ఈభాషారూపము లన్నియు కొన్ని మూలధాతువుల సంయోగముచే నేర్పడినవే యని నిరూపింప సాధ్యమగునా? అను విషయములను పరిశీలించినగాని యీ భాషయొక్క పూర్వచరితము బయలుపడదు.

మానవుని ప్రత్యేకస్వత్వ మనదగిన యీభాషయొక్క మూలబీజములు ధాతువులే యను వాద మీదేశమున క్రీస్తునకుపూర్వము పెక్కుశతాబ్దములక్రిందటనే బయలుదేరినది. ఆధునికశబ్దశాస్త్రవేత్తలలో పలువు రావాద మిప్పుడును అంగీకరించుచునేయున్నారు. రసాయనాద్యాధునిక ప్రకృతిశాస్త్రము లన్నియు నీప్రపంచమున సామాన్యముగా స్థూలదృష్టికి గోచరమగుచుండు వైవిధ్యమును బోద్రోలి వానియందేకత్వమును సాధించుటకై ప్రయత్నించుచున్నట్లే, శబ్దశాస్త్రముకూడభూభాగమున వ్యవహరింపబడుచున్న భాషలలో నట్టి వైవిధ్య మేర్పడుటకు గల కారణముల నారసి, వానియందేకత్వ మెంతవఱకు సాధింపనగునో తెలిసికొనటకే యత్నించుచున్నది. భాషలయొక్కయు, భాషాకుటుంబములయొక్కయు పూర్వచరిత మన్వేషింపబడినకొలది స్థూలప్రపంచమునందు వలెనే, భాషాప్రపంచమునందును నైక్యభావము సాధింపబడుచున్నదివలెనే కనబడుచున్నది. ప్రాచీనహైందవవైయాకరణులీవిషయమును తాత్త్వికదృష్టితో బరిశీలించి శబ్దస్వరూపుడగు బ్రహ్మయే యీ జగమున

నర్థరూపముగా వివర్తము నొందుచున్నాడనియు, నీ శబ్దార్థములకు నిత్యసంబంధము కలదనియు జెప్పియు న్నారు.

"అనాదినిధనం బ్రహ్మ శబ్దతత్త్వం ప్రచక్షతే,
వివర్తతే అర్థభావేన ప్రక్రియా జగతో యతః"
(వైయాకరణభూషణము)

మన దేశమున భాషాతత్త్వపరిశీలనము వేదకాలము నాడే బయలు దేరినది. 'సర్వాధారః కాలః' అనునట్లు మాన వప్రపంచమువలెనే శబ్దప్రపంచముకూడ కాలాధీనమై యనవరతము మార్పులకు లోనగుచుండుటచేత, వేదశా ఖాధ్యాయులలో గాలక్రమమున గలుగుచువచ్చిన యుచ్చారణభేదరూపమగు మార్పును దొలగించి వేద పాఠనిర్ణయము చేయుటకుగా నాకాలమందలి మహ ర్షులు శబ్దోత్పత్తివిధానమును, వర్ణోత్పత్తిక్రమమును బరిశీ లించి, వేదమునందలి యేయేవర్ణముల నెట్లుచ్చరింపవల యునో తెలుపుచు 'శిక్ష'లను గ్రంథములను రచించిరి. కావుననే "అథ శిక్షాం వ్యాఖ్యాస్యామః, వర్ణః స్వరః, మాత్రా బలం, సామ సంతానః, ఇత్యుక్తః శిక్షాధ్యాయః" అని బ్రాహ్మణములయందు వేదో చ్చారణక్రమమును దెలుపు 'శిక్ష'ను గూర్చిన ప్రశంస ముందు జేర్పబడుట తటస్థించినది. ఇట్టి 'శిక్షల' మూల ముగా గాలక్రమమున వర్ణోచ్చారణములో గలుగు మార్పుల మూలముగా వేదము మార్పు నొందకుండ కాపాడబడుటయేకాక, యజ్ఞకర్మలయందు ప్రయోగ సౌష్ఠవముకూడ సాధింపబడుట తటస్థించినది. ఈవిష యమునే నిరుక్తవ్యాఖ్యాన కర్త యగు దుర్గాచార్యు డిట్లు చెప్పియున్నాడు: "శిక్షా తావత్ అత్మా బుధ్యాసమేత్యార్థాన్ ఇత్యేవమాదిక్రమేణ స్వరవ్యంజనాభివ్యక్తి లక్షణం......యథాధ్యేయ మధీతస్యచ స్వరసౌష్ఠవ యుక్తస్య యజ్ఞకర్మణి ప్రయోగ ఇత్యేవమాద్యర్థ జాతం నిరువాచ."

ఈ శిక్షలు వైదికశాఖలలో గ్రమముగా పెరిగి యింకను విశేషవిషయములతో గూడినవై పార్షద ములు-లేక ప్రాతిశాఖ్యలు అనబరగినవి. ఈపార్షదము లనునవి పదపాఠముపై నాధారపడినట్లు "పదప్రకృతీని సర్వచరణానాం పార్షదాని" అను యాస్కుని వచ నమువలన దెలియుచున్నది. కాలక్రమమున గొన్ని శబ్దములు ప్రాతవడి యర్థమే బోధపడని స్థితి గలిగి నపుడు ఆ వైదికశబ్దముల కర్థనిర్ణయము చేయుటకు గా నిఘంటువులును, ఆ నిఘంటువులందలి శబ్దముల యర్థమును సమర్థించుటకు నిర్వచనముకూడ చేయ వలసివచ్చినది. ఇట్లు వైదికశబ్దముల నిఘంటువును- నిరుక్తమును రచించినవారిలో నగ్రగణ్యుడు యాస్కా చార్యులు. ఈతడు దీనిని రచించుటయేకాక తన్కా లమున భాషాతత్త్వపరిశీలకుడై యనేకములగు భాషా శాస్త్రవిషయముల నాధునికశబ్దశాస్త్రజ్ఞులకు మార్గ దర్శకుడయ్యెనని చెప్పదగియున్నాడు. ఈతడు పాణినికి రెండుమూడువందల సంవత్సరములు పూర్వ మున, ననగా సుమారు క్రీస్తునకు ౭,౮ వందల సంవత్స రములకాలమున నున్నవాడు. ఈతడు రచించిన నిరుక్తగ్రంథమున నైరుక్తులు, వైయాకరణులు, నైగ ములు, ఐతిహాసికులు, నైదానులు మొదలగు భిన్న మతములవారి (Schools of thought) యభిప్రాయ ముల బరిశీలించియుండుటచే, నీతనికి చిరపూర్వమే యాయావిషయములగూర్చిన విద్యావిధాన మెట్టి యుచ్చస్థితిలో నుండెడిదో మన మూహింపవచ్చును. స్వరశాస్త్రముయొక్క ప్రాధాన్య మప్పటికే ప్రాతి శాఖ్యలమూలమున బ్రతిపాదింపబడియుండినది. సంస్కృతభాషావర్ణసమామ్నాయము వర్ణోత్పత్తిస్థాన బాహ్యాభ్యంతరప్రయత్నానుసారముగ వర్గీకరింపబడి యుండుటనుబట్టియే యాకాలమున స్వరశాస్త్రపరి శ్రమ మెట్టిప్రాముఖ్యమును బొందియుండినదో మనము గ్రహింపవచ్చును. ప్రాక్పశ్చిమదేశములందు నిరుక్త గ్రంథమును రచించినవారిలో మొదటివాడు యాస్కా చార్యులు. కేవల నిరుక్తమును రచించుటయేకాక తత్కాలమున భాషాతత్త్వసూత్రములనువ్యక్తపరచినవారిలో నీతడు ప్రథముడు. భాషలోని శబ్దములన్నియు కొన్ని మూలరూపములనుండి యేర్పడినవి. ఈమూలరూపములే ధాతువులు. కావున ప్రతిశబ్దము నొక ధాతువునుండి నిష్పన్నమైనట్లు చూపి దానికి నిర్వచనము కల్పింపవల యును. స్వరసూత్రము (Phonetic land)లచే సాధింప దగిన యత్కించిద్భేదము ధాతురూపమున గనబడినను శబ్దనిర్వచనమునకు భంగము కలుగబోదు. 'పాచక'

శబ్దము పచ్ ధాతువునుండియు, 'పావక' శబ్దము పవ్ ధాతువునుండియు నిష్పన్నములనుట వ్యక్తమే. కాని 'ఇష్టి' శబ్దము 'యజ్' ధాతువునుండి నిష్పన్నమైనదని చెప్పటలో రూపమునందలి భేదమునుబట్టి నిరుక్తకారుడు సందేహింప నక్కరలేదు. ఏలయనగా భాషాతత్త్వశాస్త్రజ్ఞుడు వ్యాకరణరూపములమీదనే కేవల మాధారపడగూడదు. భాషారూపముల కన్నిటికిని వ్యాకరణము సమాధానము చెప్పలేదు. వ్యాకరణ సూత్రముల కనేకము లపవాదము లుండకపోవు. కావున నట్టిరూపములను సాధించుటకు స్వరశాస్త్ర సంప్రదాయములుగూడ (Phonetic laws) నాధారముగా గొనవలయునని తెలుపుచు యాస్కాచార్యు లట్టి మార్పులకు గారణములగు కొన్ని స్వరశాస్త్రనియమములను బ్రతిపాదించినాడు. అవి యీకాలపు శబ్దశాస్త్రవేత్తలును గ్రహించి ప్రతిపాదించుచున్నవే.

ఒకప్పుడు స్వరము(Accent)నందు గలిగిన మార్పువలన పదమధ్యాచ్చు లోపింపవచ్చును. ఉదా: జగామ, జగ్ముః. దీనినే ఆధునికశబ్దశాస్త్రవేత్తలు Syncope అని చెప్పుచున్నారు. ఇట్టి పదమధ్యాజ్లోపముచే గలిగిన రూపాంతరములు తెలుగుశబ్దములలో ననేకములు కలవుగదా. చిలుక - చిల్క, తరుసు - తర్గు - తగ్గుము.

వర్ణవ్యత్యయముమూలముగా నొక ధాతువు, దానినుండి నిష్పన్నమైన శబ్దము రూపమున భిన్నములు కావచ్చును. దీనిని Meta thesis అని ఆధునికశబ్దశాస్త్రజ్ఞు లందురు. దీనికి యాస్కాచార్యు డిచ్చిన యుదాహరణములు — శ్చ్యుత్ ధాతువునుండి 'స్తోకా'శబ్దము, సృజ్ నుండి రజ్జుశబ్దము. అట్లే కృత్-తర్కు (Knife) మొదలైనవి.

ఒక ధాతురూపమునగాని, పదరూపమునగాని యొక అచ్చు, లేదా హల్లు నడుమ చేరవచ్చును. దీనిని స్వరభక్తి, లేదా Anaptyxis అని యందురు. 'వృ'ధాతువునుండి 'ద్వారః' అనుశబ్దము, 'భ్రస్జ్' ధాతువునుండి 'భరూజాః' శబ్దము ఏర్పడినట్లు చెప్పబడినది.

తుల్యోచ్చారణము గల రెండక్షరము లొక దానితరువాత నొకటి వచ్చినచో నుచ్చారణసౌకర్యముకొఱకు నొక వర్ణము లోపింపవచ్చును. దీనిని Haplo-logy అని యందురు. ఉదా: త్రి + ఋచ = తృచ.

దీనినిబట్టి యాస్కాచార్యుని నిరుక్తరచనాపద్ధతి యెట్లు స్వరశాస్త్రశిక్షణమూలకమైయున్నదో, ఎట్లాధునికభాషాతత్త్వసూత్రవిధానమును దలపించుచున్నదో వ్యక్తము కాకమానదు. నిఘంటువులో దేవతల వర్గీకరణవిషయమునగాని, వైదికశబ్దముల కర్థనిర్ణయవిషయమునగాని, దాని నిర్వచనకల్పనవిషయమునగాని యాస్కాచార్యులు చక్కని శాస్త్రీయపద్ధతి ననుసరించినవాడే కాని కేవలము ఊహాప్రపంచమున విహరించినవాడు కాడు. అట్లైనను ఈతని నిర్వచనములు కొన్ని బ్రాహ్మణాదులయందలి పురాణగాథలపై నాధారపడుటచే సమంజసములుగా లేవని తలచువారును కొందరు గలరు. భాషోత్పత్తిక్రమవిషయమున నీతడు నిరుక్తినాదుల మార్గమునే యనుసరించి భాషాపదములన్నియు కొన్ని మూలధాతువులనుండి నిష్పన్నములైన వనువాదమును నిలువబెట్టుటకై యత్నించినాడు. ఈతనికి బూర్వమే యీధాతువాదమునుగూర్చి కొంత వివాదము జరిగిన ట్లీతడు తన నిరుక్తమున శాకటాయనునకు, గార్గ్యునకు నీవిషయముగూర్చి వాదము జరిగినట్లు చెప్పటను బట్టి మనము గ్రహింపవచ్చును. శాకటాయనుడు ధాతువాది. భాషలోని పదము లన్నియు ధాతువులనుండి యేర్పడినవే యనియు (సర్వాణ్యాఖ్యాతజాని నామాని), ధాతువు లన్నియు గ్రియావాచకములనియు నాతని మతము. గార్గ్యాదు లీవాదము నొప్పుకొనలేదు. కాని యాస్కాచార్యుడు ధాతువాదమునే బలపఱచి శబ్దము లన్నియు ధాతువులనుండి యేర్పడినవే యనియు, శబ్దనిర్వచనము ధాత్వర్థమును బట్టియే చేయవలయుననియు నిర్ణయించినాడు. భాషలో ధ్వన్యనుకరణశబ్దములే యుండవని ఔపమన్యాదులు వాదించుచుండ యాస్కాచార్యు లట్టి శబ్దములు క్వాచిత్కముగ నుండవచ్చునని చెప్పుచు కితవ, దుందుభి, కృకవాకు మొదలగు కొన్ని శబ్దముల నుదాహరణము

అంగా గ్రహించినాడు. కాని యిటీవల మోక్షముల్లరు మొదలగువారు కొందరు తలచినట్లుగా ధ్వన్యనుకరణ శబ్దములే భాషకు మూలభూతమను వాదము (Max Muller's Bow - vow theory) ను మాత్ర మితఁ డంగీకరించిన ట్లగపడదు.

ఈ ధాతువులు క్రియాభావద్యోతకములా, సామార్థబోధకములా యను వాదముకూడ నాకాలమున బయలుదేరినది. ఈ వాదమును బరిశీలించి ధాతువులు క్రియాభావద్యోతకములే యను శాకటాయనుని వాదమునే బలపరచినాడు యాస్కుడు. "తద్యాని యేనాభిదధాతి సత్త్వం, తదాఖ్యాతం యేన భావం స ధాతుః" ధాత్వర్థము భావము, లేదా సత్త యని చెప్పదగును. ఈ భావవికారములే జాయతే, అస్తి, విపరిణమతే, వర్ధతే, అపక్షీయతే, వినశ్యతి అనురీతి నారువిధములుగ భాసించునని యాతని యభిప్రాయము. ఈ భావములనే తరువాతి వైయాకరణు లవలంబించినారు.

"ఫలవ్యాపారయో ర్ధాతు
రాశ్రయేతు తిఙః స్మృతాః,
ఫలే ప్రధానం వ్యాపారః
తిఙర్థస్తు విశేషణం"

"క్రియావాచినో భ్వాదయో ధాతుసంజ్ఞాః స్యుః"

ధాతువు వ్యాపారమును సూచింపగా నా వ్యాపారాశ్రయమును తిఙ్ ప్రత్యయము సూచించునట. అనగా తి, సి, మి ఇత్యాది ప్రథమమధ్యమోత్తమ సర్వనామప్రత్యయములు వ్యాపారాశ్రయములు. ఇందు ప్రధానము వ్యాపారము. తిఙర్థము - అనగా సర్వనామము విశేషణము. దీనినిబట్టి ధాత్వర్థమగు వ్యాపారమునకు ప్రాధాన్యమును, కర్తను సూచించు సర్వనామమునకు విశేషణత్వము-అనగా అప్రాధాన్యమును సిద్ధించుచున్నది. కావుననే 'నడుచుచున్నవాడు' అను నర్థము గల 'గచ్ఛతి' అను శబ్దమునకు 'తత్కర్తృకగమనానుకూలవ్యాపారః' అని అర్థము, శాబ్దబోధ చెప్పుకొనవలసియున్నది. ఇక్కడ 'తి' అనునది ప్రత్యయము, 'గమ్' ధాతువు అయినవి. ఈ 'తి' ప్రత్యయముయొక్క మూలస్వరూప మేదో తెలిసికొనుటకు సాధ్యము కాకపోవుటచేతనో, (అది తచ్ఛబ్దావయవమే యని తలపబడినను) ఇంక నట్టి యనేకముల వాని మూలరూపములను గుర్తించుట కవకాశము లేనివి యీభాషలో గనబడుచుండుట చేతనో—ఈ భాషను వ్యాకరించినవారు ఇందలి శబ్దములను ప్రకృతి, ప్రత్యయము అని విభాగించి, ఆయా ప్రత్యయము లాయాప్రకృతులపై నాయాయర్థములలో వచ్చి చేరుచుండునని చెప్పినారు. ప్రకృతి అనునది మరల రెండువిధములైనది—ప్రాతిపదిక, ధాతువు అని. ప్రాతిపదికయే నామమనికూడ చెప్పబడును. యాస్కుడు తొలుత భాషలో "నామాఖ్యాతోపసర్గనిపాతాశ్చ" అని నామము, ఆఖ్యాత, ఉపసర్గ, నిపాత అను నాలుగువిధములగు శబ్దము లుండునని చెప్పినాడు. ఆఖ్యాతమే ధాతువు. "క్రియాప్రధాన మాఖ్యాతం, సత్త్వప్రధానాని నామాని." ధాతువు క్రియాప్రాధాన్యము గలది; నామము సత్త్వప్రాధాన్యము కలది. కాని ఈ రెండును భిన్నములా? శబ్దము లన్నియు ధాతుజన్యములనియేకదా నైరుక్తుల వాదము? అంటే, దానికి సమాధానము—నామమునకు, ధాతువునకు పరస్పర సంబంధము లేకపోలేదు, అవి భిన్నములు కావు, ధాతువులో భావ యిమిడియున్నది, నామములో క్రియయు నిమిడియున్నది, నామమునకుగూడ ధాతువే మూలము అని నిరుక్తవ్యాఖ్యానకర్తయగు దుర్గాచార్యుడు సమన్వయించినాడు. "నామ్నో యో ధాతుః సకృత్ప్రత్యయోపజనితేన ... ప్రాతిపదికాంతర్లీనవృత్తిరేవ ...ద్రవ్యప్రధానఏవ భవతి" (నిరుక్త. పుట ౮౦).

నామమునం దిమిడియున్న ధాతుస్వరూపము కృత్ప్రత్యయము చేరినపుడు ప్రాతిపదికగా వ్యక్తమగుచున్నది. అప్పు డది ప్రత్యక్షక్రియాద్యోతకత్వశక్తిని వదలిపెట్టి లింగవచనాదిసూచకశక్తిని బడయుచున్నది. పాణిన్యాచార్యులు ప్రాతిపదికము ధాతుప్రత్యయముల కంటె భిన్నమనియే చెప్పినాడు. "అర్థవ దధాతు రప్రత్యయః ప్రాతిపదికం". ఇచ్చట ప్రాతిపదికయే అర్థవత్తు. కాని ప్రత్యయములకు ప్రత్యేకార్థము లేదు. తదర్థద్యోతకములు మాత్రమే యగును. కావుననే "ప్రత్యయాస్తు నియోగతః ప్రకృతీ రనుగచ్ఛంతః

తదర్థానపేక్షైవ స్వార్థా నభిదధానాః" అని కౌతంత్రపరిశిష్టము.

ప్రాతిపదికలు - లేదా నామములన్నియు ధాతువులనుండి నిష్పన్నములై నవేనా యనువిషయమునగూడ నభిప్రాయభేదము కలదు. "ఉణాదయో అవ్యుత్పన్నాని ప్రాతిపదికాని" అని భాష్యకారుడగు పతంజలి చెప్పుటనుబట్టియు, పాణిన్యాచార్యులు "ఉణాదయో బహులం" అనుసూత్రమున బహుళగ్రహణము చేయుటనుబట్టియు భాషాశబ్దము లన్నియు క్రియాభావద్యోతకములగు ధాతువులనుండియే నిష్పన్నములైనవని చెప్పుట వారి యుద్దేశ్యము కాదని తెలియవచ్చుచున్నది. ధ్వన్యనుకరణమూలకములగు శబ్దములు భాషలో గొన్నియుండిన నుండవచ్చును గాని, పెక్కుశబ్దములు ధాతుమూలకములే యనుట సత్యదూరము కాదేమో. మూలధాతువుల రూపము విశేషముగా మార్పులకు లోనైన భాషలు, అనగా ముఖ్యముగా ప్రత్యయాంతభాషలలో (Inflexional languages) విషయ మెట్లున్నను, ధాతుస్వరూపము విశేషముగా మారనిసంయుక్తపదరూపభాషలలో (Agglutinative languages) ధాతురూపము సులభగ్రాహ్యము కావచ్చు ననుటకు సందేహము లేదు.

దక్షిణహిందూదేశభాషలలో నర్థభేదమును సూచించుటకుగా ధాతువుపై జేర్పబడు మఱియొక సహాయధాతువుమూలముననగాని, కాలాద్యర్థబోధక చిహ్నములను జేర్చుటవలనగాని యీ ధాతురూపమునకు సంస్కృతాదులలోవలె విశేషముగా మార్పు లేమియు గలుగవు. ఈ కారణముచే నిందలి ధాతురూపములను గుర్తించుట యంత కష్టసాధ్యముగా కనబడదు. కాని ఆంధ్రవైయాకరణులచే ధాతువులుగా బరిగణింపబడిన రూపములలో ననేకము లంతకుబూర్వమే భిన్నధాతుసంయోగముచే నేర్పడినవై, యుచ్చారణవేగాదికారణములచే గలిగిన వర్ణలోపాదుల మూలమున మారురూపు జెందిన వగుట దటస్థించిన తటస్థింపవచ్చును. అట్టివాని మూలరూపము నితర సన్నిహిత భాషారూపములతో గాని, ఆ భాషలోనే నిలిచియున్న యితర రూపములతో గాని పోల్చి పరిశీలించి కనిపట్టవలసియుండును. దీనికి—దీనికే కాదు భాషాచరిత్ర నన్వేషించి తెలిసికొనవలయు నన్నచో ప్రతివిషయమునను గూడ- సన్నిహితములగు సజాతీయభాషాజ్ఞానము, తద్రూపములతో బోల్చి చూడవలసిన యావశ్యకతయు నడుగడుగునకును గలుగుచునేయుండును. తారతమ్యపరిశీలనము లేనిది యేవస్తువుయొక్క గాని విలువ, యథాగస్థితి బోధపడదుగదా! ఆంధ్రవైయాకరణులు ధాతువులుగా గ్రహించిన రూపము లనేకములు వాస్తవముగా ధాతువు లని చెప్పుటకు వీలులే దని వారు కల్పించుకొనిన సూత్రములే నిదర్శనము లగుచున్నవి. అయితే వారొకకాలమునందలి భాషయొక్క యథార్థస్థితికి లక్షణము కల్పించి చూపిరేకాని పూర్వాపరచరిత్ర నన్వేషింప దొరకొనలేరు గదా! పరికింపుడు: "అగు, వచ్చు, చొచ్చు, చూడ్ములకు ముత్తు పరమగునపుడు కా, రా, చొరు, చూడులగు" "ఇచ్చునకు సర్వంబున కీయగు" "తెత్తెరులు తెచ్చున కగు." "చావునోవులు చచ్చునొచ్చులకగు" (బాల. వ్యా. క్రియా పరి.)

'అగు' అనుదానిని ధాతువుగా గ్రహించుటచే ముత్తు పరమగునపుడు అగు + అ + డు = అగఁడు అను రూపము కావలసియుండగా, అగు అనుదానికి 'కా' ఆదేశము చెప్పి 'కాఁడు' అను రూపము సాధింపవలసివచ్చినది. ఈ భాషలో 'అగఁడు' అనునది 'కాఁడు' అను రూపముగా మారినపిదప వ్యవహారములో నంతరించినను, దాని రూపాంతరమే యగు 'అవఁడు' (గకారము వకారముగా మాఱిన రూపము) అనునది వ్యవహారములో నుండనే యున్నది. అగడు > కాడు అయినట్లే, అవడు > వాడు కాలేదు. 'అవన్' నుండి యేర్పడిన వాణ్ణు-వాఁడు శబ్ద మొకటి భాషలో నుండుటచే గాబోలును. 'అగడు' అంతరించినను 'అగుము, అగుడు' అను రూపములు కూడ కమ్ము, కండు అను రూపాంతరములతో గూడి భాషలో నిలిచియేయున్నవి. ఈద్వైరూప్యమును వైయాకరణుడు "అనుకనులకు ముజ్జిత్తులు పరంబులగునపుడు కానాకానలు విభాషనగు" అను మఱియొక సూత్రమున వైభాషికత్వము చెప్పి సాధింపవలసినవాడయ్యెను. అగడు, అగదు అనునవి వర్ణస్థితి—

లేదా వర్ణవ్యత్యయము అను నుచ్చారణసంప్రదాయమునుబట్టి రెండవస్థానమున నున్న కకారము ముందుకు వచ్చుటచే అకారకకారములకు స్థానవ్యత్యయము కలిగి క్+అ+అ+డు అని అయి, కాడు అను రూప మేర్పడినది. అట్లే అగదు—కాదు అయినది. ఈవర్ణప్లుతినే శబ్దశాస్త్రజ్ఞులు Metathesis అని చెప్పుదురు. ఇట్టి మార్పు తక్కిన ద్రావిడభాషలలో కంటెను తెనుగులో హెచ్చుగా కలిగిన ట్లగపడు చున్నది. ఈమార్పునూలమున నే పెక్కు తెనుగు శబ్దములు తమిళకన్నడాదిభాషారూపములతో సజాతీయములే యైనను, భిన్నరూపములు కలవిగా కనబడు చున్నవి. ఈ సంప్రదాయమును వివరించుటకు గాక పోయినను, మూలధాతుస్వరూపమును గుర్తించుటకైన నావశ్యక మను తలపుతో కొన్నింటినిమాత్ర ముదాహరించెదను.

అనఁగ—నాఁగ, అనవుడు—నావుడు
అది—(అదిని)దాని
అవండు>వాండు, వాఁడు
అటుసిన>డస్సిన
అలవు>లావు
అరగు (అరగదీయు) >రాయు, రాపిడి, రాయి
అడఁగు>డాఁగు>దాఁగు
ఇరు(>ఇరండు)>రెండు. (త) ఇరట్ట>రెట్టి
ఇవన్>వీండు
(త. ఇళై)ఎల>లే-లేఁబ్రాయము
(త. ఇల్లదు)లేదు. ఇల్లామై>లేమి
ఉగురు>గోరు
ఉరల్ > రోలు, ఉమియు — ఉమ్మి > మూయు (రాయలసీమలో)
త. ఏరు—తె. ఎక్కు>రేగు, లేచు, లే.
ఎఱుక>ఱెక్క
ఎవడు>వేడు; ఎవరు⌋వేరు
త. కురుంగు — క. కురుగు⌋ తె. క్రుంగు.
త. కీఴ్—తె. క్రింద, క్రీ, కిడు.
త. కుటి — తె. గ్రోచ్చు, క. కాఱ్ — తె. క్రాయు, క్రక్కు.

త. తిర్, తిరుప్పు—తె. తిరుగు>త్రిప్పు
త. పుఱు; తె. పురుగు⌋ప్రువ్వు⌋ప్రుచ్చు
త. పరంబు, పమ్బు; క. పబ్బు — తె. ప్రబ్బు, పంబు.

త. ముఱంగు, క. మొఱగు, తె. మ్రోగు, మొరగు, మోగు.

త. విరల్ — తె. వ్రేలు.
త. విఴుంగు, తె. మ్రింగు.
త. వరై — క. బరె, తె. వరవడి>వ్రాయు, వ్రాత.
త. మరం — క. మరను, తె. మ్రాను.
త. తోర్, తె. (తోర్చు) > త్రోవ — ఁక — తోఁచు.
త. తుటి — తుటికు, తె. త్రొక్కు.
త. పేట్ — తె. ప్రేలు.

ఇట్లే యింక ననేకములు కలవు. ఒక వర్ణవ్యత్యయమే కాక యొకప్పు డక్షరవ్యత్యయముగూడ కలుగ వచ్చును.

తె. అగప — అబక; తుఱుము — తుమురు; ఉమియు (⌋ఉమురు) మూయు—రాయలసీమలో

తె. గులివి — గుబిలి; చమురు — చరుము; దబ్బ (త. తప్పై) — బద్ద.

పిచ్చిలు (త. పిచిర్) — చిప్పిలు. క. పిళిగు — (త. పీలిక) పిగులు.

తె.—పొక్కిలి; క. పొకుళ్; త. కొప్పూళ్.

వీనిలో నేది పూర్వము, ఏది పరము, ఏది మూలధాతువునకు సంబంధించినది అను విషయము నిర్ణయింపవలసివచ్చినపు డితర భాషా రూపములతో పోల్చుట, ఆయా భాషలలోని స్వరసంప్రదాయలక్షణములనుగూడ గమనించుట యత్యావశ్యక మగును. వెనుక చెప్పబడిన అగు — కా అనుదానిని గూర్చియే పరిశీలింతము. వైయాకరణులు 'అగు' అనుదానినే ధాతువుగా గ్రహించి 'కా' అనుదానిని దాని కాదేశముగానే గ్రహించియున్నారు. ఈ మార్పు వర్ణ వ్యత్యయ మను స్వరసంప్రదాయమునుబట్టి కలిగి

యుండునని మన మూహించినాము. అనగా 'అగదు' అనునది 'కాదు', అగన్ - కాన్ ఈ రీతిగా మారినవి అని. అయితే ఇక్కడ అగదు - గాదు, అగన్ - గాన్ అని కావలయును గాని 'కాదు-కాన్' అని పరుషాదిరూపము లెట్లు సిద్ధించిన వను సందేహము కలుగకపోదు. భాషలో పరుషాదిరూపములే స్థిరపడియుండుటనుబట్టి పై పదములలో నొకకాలమున పరుషమే యుచ్చారణమందున్న ట్లూహింపదగియున్నది. ఇందు కుపబలకముగా నన్నయకు బూర్వమున గల కొన్ని ప్రాచీనశాసనములలో "పాతకున్తకున్" అని 'అకున్' అనునది పరుషవర్ణసహితముగా వ్రాయబడియున్న ట్లగపడుచున్నది. కన్నడమున గూడ ఎనిమిదవ శతాబ్దిలోని కొన్ని బాదామిశాసనములలో "పంచమహాపాతకన్ అకుమ్" "ఏళనెయా నరకదా పుగు అకుమ్" అని 'అకుమ్' రూపము కలదు. వీనికి సమానార్థకమగు తమిళరూపము 'ఆకుమ్' అనునది. ఇందు పరుషమే వ్రాయబడినను ఇటీవలి యుచ్చారణములో నది సరళముగనే కానబడుచున్నది. పదాదియందు పరుషోచ్చారణము, పదమధ్యమందు సరళోచ్చారణము అనునది తమిళభాషాసంప్రదాయముగా జెప్పెదరు. ఎట్లైనను ఒకకాలమున నీరూపమున పరుషమే యుండెననుటకు సందేహమగపడదు. కాని తమిళరూపములో నాదిని దీర్ఘాకారము కనబడుచున్నది. అందలి వైయాకరణులు 'ఆ' అనునదే ధాతువనియు, 'కు' వర్ణ మనుబంధమనియు జెప్పెదరు. ఆకాదు, ఆకైయాల్ మొదలగు రూపములు కాదు, కాన్ అనువానికి సమానములై, సమానార్థకములై యుండును. వీనిలో ధాతుస్థానమున దీర్ఘాకారమే కనబడుచున్నది. భూతకాలిక రూపములలో తెనుగునగూడ దీర్ఘాకారమే కనబడుచున్నది. 'కు' వర్ణము కానవచ్చుట లేదు. అగు-ఆగెను అని కావలసియుండగా "అగునకు వక్రంబు గూడుచో దీర్ఘంబగు" నని దీర్ఘమును విధించి 'ఆయెను' రూపమును సాధించినారు. తమిళమునందువలెనే కన్నడమునను 'ఆ' అనునదే ధాతువుగా గ్రహింపబడినది. 'కు' 'కుమ్' అనునవి సామాన్యముగా వర్తమానార్థకమున నేకవచన బహువచనముల జేర్పబడు ననుబంధములని తమిళవైయాకరణులు చెప్పగా, కన్నడవైయాకరణులు 'కుం' అనునది కాలాదిభేదము లేకయే ధాతువులపై జేర్పబడుచుండునని చెప్పినారు. కావున కు-కుం అనువాని లక్షణము, చరిత్ర ఎట్టిదైనను, 'ఆ' అనునదే మూలధాతు వనియు, కు-కుం అనునవి ఏదోయొకయర్థమున నాధాతువుపై నొక కాలమున జేరినవనియు, ఆయా భాషలలో నీధాతువునుండి బయలుదేరిన రూపములు కాలక్రమమున బొందిన మార్పులనుబట్టి, కొన్నిటిలో 'ఆ' అనునది, మఱికొన్నిటిలో 'అగు-అకు' అనునది ధాతువుగా లక్షణకర్తలచే గ్రహింపబడిన దనియు దెలియవచ్చుచున్నది. తక్కిన ధాతువులనుగూర్చి మఱియొకసారి పరిశీలింతము.

ఆంధ్రభాషాచరితము-

ధాతువులు

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =



ఆంధ్రమున 'అగు' అనునది ధాతువుగా గ్రహింపబడగా, తమిళమున 'ఆ' అనునదే ధాతువైనది. కన్నడమున 'ఆగు-ప్రాదుర్భావే' యని శబ్దమణిదర్పణకారుడు 'ఆగు' అనుదానినే ధాతువుగా బరిగణించినాడు. కాని 'ఆగు' అనుదానికి 'అగు' అను రూపాంతరముకూడ నాభాషలో కొన్నిచోటుల కనబడుచున్నది. 'అగు' అనునదే తెలుగులో ధాతువుగా గ్రహింపబడినను భూతకాలిక రూపమగు 'ఆయెను' అనుదానిలో దీర్ఘాకారము కానవచ్చుచునే యున్నది. ఈదీర్ఘత్వమును సాధించుటకే "అగునకు వక్రంబు గూడుచో దీర్ఘం బగు" (బాల. క్రి. ౧౦౦ సూ)అను సూత్రమును వైయాకరణుడు కల్పించినాడు. పిదప మరల దీర్ఘమునకు హ్రస్వము విధించి, త్రికము మీది అసంయుక్తహల్లునకువలె ద్విత్వముచేసి "ఆకన్య-అక్కన్య" వలె 'ఆయెను' అనుదానినుండి 'అయ్యెను' రూపమును సాధించినాడు. ఇది యీధాతువునకు సంబంధించిన రూపసాధనప్రక్రియ. ఇచ్చట హ్రస్వవర్ణముతో గూడినది మూలధాతువా, లేక దీర్ఘవర్ణముతో గూడినదా యను విషయమును నిర్ణయించుట కొంత కష్టమేయైనను, ఇతరసజాతీయభాషలలోని పెక్కురూపములలో దీర్ఘమే తరుచు కనబడుచుండుటచేతను, తెలుగునగూడ కొన్నిటిలోనైన నది గానవచ్చుటచేతను 'ఆ' అనునదే మూలధాతు వనుట సమంజసమనవచ్చును. అయితే తెలుగుకన్నడ వైయాకరణులు 'గు' వర్ణమునుగూడ ధాతురూపములోనే చేర్చియున్నారుగదా. అ దెట్లు వచ్చిన దన్న విషయము పరిశీలింపవలసియున్నది. మన చిన్నయసూరిగారికి సుమారు రెండువేల సంవత్సరములు పూర్వమున నున్న తమిళభాషా వ్యాసకర్త యగు తొల్కాప్పియనార్ అనునాతడు ధాతువులపై కు, డు, తు, అు అనునవి యనుబంధములుగా జేరుచుండు నని చెప్పియున్నాడు. తరువాతికాలపు శబ్దమణిదర్పణకారుడు కన్నడభాషలో గూడ 'కుం' అనునది ధాతువులపై జేరుచుండు ననియు, నా కుమంతరూపము కాలాదిభేదము, లింగవచనభేదము లేకయే తెలుగులోని తద్ధర్మార్థకరూపములవలె ప్రయోగింపబడుచుండు ననియు దెలిపియున్నాడు.

"సననాగి భూతదొళ్ లిం
గవచనదొళ్ తుత్తు వర్తమానభవిష్య
ద్వ్యవహృతిగళ కుంకుంప
ల్వ్యవు తావస్యైకవచనదొళ్ నెలసిర్కుం"

(శ. మ. ద.)

తమిళమున 'ఆ' ధాతువునుండి 'ఆగుం' అనురూపము వర్తమానభవిష్యత్తులయందు ప్రయోగింపబడును. ఇదియే తెలుగున 'అగును' అయినది. కన్నడమున 'ఆగు'పై 'కుం' చేర్చుటచేగాబోలు (ఆగుకుం) 'అక్కుం' అను రూప మేర్పడినది. 'పో' అనునదే తమిళమున ధాతువుగా గ్రహింపబడుచున్నది. తెనుగున 'పోవు' ధాతువు. ఈ 'వు' అనునది 'గు' వర్ణముయొక్క

రూపాంతరమే యైనచో 'పోగు' అనునది దాని వెనుకటిరూప మగును. తమిళమున 'పో' అనునదే ధాతువు గావున 'ఆగుం' వలెనే 'పోగుం' అను రూపముకూడ నేర్పడి యున్నది. ఇదియే తెనుగున 'పోవును' అను రూపమున నున్నది. కన్నడమున 'అక్కుం' వలెనే 'పోక్కుం' అను రూపము నేర్పడినది. ఇట్లు కాలాదిభేదము తెలుపని-అనగా తద్ధర్మార్థకము లనబడు నీ ఆగుం - అక్కుం - అగును; పోగుం-పోక్కుం-పోవును మొదలగు రూపములలో 'కుం' అనునది యీ భాషలలో సమానముగనే కనబడుచున్నను, ఇది యెట్లు వచ్చినదో, దీని సహజరూప మేమో తెలిసికొనుట కవకాశము కనబడుటలేదు. ఇందుకనే కాబోలు రెండువేలయేండ్లక్రితము తొల్కాప్పియనార్ చెప్పినట్లే ఆధునికశబ్దశాస్త్రజ్ఞుడగు కాల్డ్వెల్ పండితుడుకూడ కు-గు, చు-జు, తు-దు, టు-డు, పు-బు మొదలగునవి ధాతువులపై జేర్పబడు ననుబంధము లని మాత్రమే చెప్పియూరకున్నాడు. కాని యివి యెట్లేర్పడినవో, వీని మూలరూపము లేమైయుండునో పరిశీలింప దొరకొనలేదు. ఎట్లు తెలిసికొనుట ? సంస్కృతమున ధాతువుపై జేర్పబడు వికరణప్రత్యయములగు అ, య, ను మొదలగువాని మూలరూపములుగాని, విభక్తిప్రత్యయములగు అం, భ్యాం, భిస్, ఏ, సు మొదలగువాని మూలరూపములుగాని తెలియవచ్చినవా ? అట్లే యివియు నానాయర్థములను సూచించు ప్రత్యయములే గాయుండు నను భావమే ప్రబలియుండుటచే, వాని మూలస్వరూపాన్వేషణమునుగూర్చియు నౌదాసీన్యము కలుగుట తటస్థించినది. కాని యీదక్షిణదేశభాషాస్వరూపలక్షణములు సంస్కృతాది భాషాలక్షణములకంటె నించుక భిన్నములుగా గనబడుటనుబట్టి,తద్భాషాసంప్రదాయచిహ్నములనుబట్టి వీని జాడల నన్వేషించినచో వాని మూలరూపముల జాడలును దెలియవచ్చునేమో యను నాశ కలుగకపోదు. ఈద్రావిడభాషలను వ్యాకరించినవారు సంస్కృతభాషావ్యాకరణపక్కినే యవలంబించి, సప్తవిభక్తులను ఏర్పరించి ఆయావిభక్త్యర్థములను సూచించు ప్రత్యయము లనువానిని విడదీసి చూపియున్నను, అందు ద్వితీయాషష్ఠుల, లేదాచతుర్థులలో గనబడు 'ని, కు' అనునవిగాక తక్కిన విభక్తి ప్రత్యయము లనబడునవి- చేత, వలన, కంటె, అందు, లోపల మొదలగునవి కేవల ప్రాతిపదికపైనిగాని, సంబంధార్థద్యోతకచిహ్నముతో గూడిన ప్రాతిపదికపైగాని చేరిన స్వతంత్రపదములే యను విషయము పరిశీలించినవారికి వ్యక్తమగుచునేయున్నదిగదా. వీనికి స్వతంత్రప్రయోగమును భాషలలో కలదుగదా. అట్లే యీభాషలలో అర్థభేదమును సూచించుటకుగా శబ్దకల్పన మేరీతిని జరిగియున్నదో, జరుగుచున్నదో పరిశీలించినవారికి సామాన్యముగా నీభాషలు మొదటినుండియు తమ సంయుక్తపదరూపత్వలక్షణమును (Agglutinative Nature) నిలుపుకొనుచువచ్చినవే యను విషయము పొడకట్టకమానదు. కాలక్రమమున నుచ్చారణమందలి వేగము, అలసత మొదలగు కారణములచే నానారూపములలో గొంత మార్పు కలుగుట తటస్థించినను, మొత్తముపై నీభాషలలో ప్రత్యయములుగా గ్రహింపబడుచున్న ఆయా శబ్దములు తమ ప్రత్యేకతను సంపూర్ణముగా గోలుపోయి కేవల మర్థము గుర్తింపరాని యట్టి ప్రత్యయావస్థ నింకను బొందినట్లగపడదు. ఇట్టివానిలో గొన్నిటికి వైయాకరణులు శబ్దపల్లవము లని పేరుపెట్టిరి. "ధాత్వాదులకు ధాతువు లనుప్రయుక్తంబు లయి విలక్షణార్థాభిధాయకంబులగు నీయవి శబ్దపల్లవంబులు నాఁబడు" (బాల. క్రియా. ౧౧౮ సూ) అని చిన్నయసూరి వీనికి నామనిర్దేశము చేసెను. కొన్ని ధాతువులకుగాని, శబ్దములకుగాని యితరధాతువులు జతపరుపబడినపు డాశబ్దద్వయసమ్మేళనమువలన బూర్వమందున్న యర్థముకంటె భిన్నమగు నర్థము బోధింపబడుచున్న దను భావము సామాన్యమైన ఫలితార్థముగా గ్రహింపవచ్చునుగాని, బాగుగ పరిశీలించినచో పెక్కుస్థలములయందు మొదటి ధాతువుయొక్క, లేదా శబ్దముయొక్క మూలార్థమును వ్యక్తీకరించి దానిని క్రియారూపమును బొందించుటకు దోడ్పడు సహాయధాతువు (Auxiliary root)గా నీరెండవధాతువు నిలుచుచున్నదని చెప్పవలసియుండును. ఒక్కొక్కప్పుడు కేవలము భిన్నార్థము కలుగుటయు లేకపోలేదు. ఈభాషలలో నొకధాతువుపై, లేదా శబ్దముపై నర్థభేదచ్ఛాయలను

సూచించుటకు వేరుశబ్దము లనుప్రయుక్తము లగుచు వచ్చుటచేతనే యీభాష యంతయు నిట్లు పెరుగుచు వచ్చిన దని చెప్పవచ్చును. ఇట్టిశబ్దపల్లవము లెన్నివిధములుగా నేర్పడుచున్నవో ముందు పరిశీలింతము. ఈభాషలలో నూతనశబ్దకల్పనమునకు విశేషముగా తోడ్పడినవానిలో 'కొను' ధాతు వొకటి. కొను- దీనికి తమిళకన్నడములలో 'కొళ్' అను రూపము కలదు. దీనిని సహాయధాతువుగా గ్రహించి కన్నడమున నేర్పడిన కొన్ని రూపములు:—

కన్న. కణ్‌కొళ్-తె. కన్గొను. త. కణ్డుకొళ్.

కెయ్‌కొళ్ — చేకొను, కయికొను, కైకొను. త. కైకొళ్.

దొరెకొళ్—దొరకొను.

బెంగొళ్—వెనుకొను

మాకొణ్ళ్—మార్కొను. త. మారుకొళ్

ముంగొళ్—మునుకొను

నెలెకొళ్—నెలకొను. త. నిలైకొళ్.

త. భయంగోళ్, భయంగొళ్. భీతిగొను. భయశబ్దము తెనుగున పడు ధాతువుతో జేరినది.

కూన్తుకొళ్—కూరుచుండు. 'కూన్తు' అనుదాని మూలరూపము 'కూర్' అయియుండును. తెలుగున నది 'కూరుచు' అయి 'ఉండు' అను సహాయధాతువుతో గూడినది. కాని కొనుతో జేరలేదు.

ఆంచికొను, ఆంకొను (ఆంకలి + గొను), ఈకొను—ఈయకొను— ఇయ్యకొను. (ఇచ్చుటను గ్రహించుట—(To be prepared to yield)

క. మెయ్‌గొళ్. మేకొను — మెయికొను (తనపైవేసికొనుట)-అంగీకరించుట. (To take upon oneself)

త. విఱిత్తుకొళ్ — మేలుకొను. (మేలుకను- కాంచు) = పైని (బాహ్యమును) చూచుట.

త్రెక్కొను. త. ఎడిత్తికొళ్—ఎత్తికొను—ఎత్తికొళ్. పుచ్చుకొను. త. ఆడిక్కొళ్—ఆడుకొను, ఆడికొను (ఆడికోలు). త. ఒప్పికొళ్—ఒప్పుకొను, ఒప్పికొళ్. సాచికొను. వీడుకొను-బీళ్‌కొళ్. వలగొను- క. బలగొళ్. త. వలంగొళ్. కోలుకొను. త. తేఱికొళ్—తేఱుకొను.

తోడ్కొను, దూకొను, పాల్గొను, పెనగొను, ఊకొను, ముంచుకొను, ఉసికొను, అడగొను, మునురుకొను, అడ్డుకొను, అరిగొను, అంకెగొను = కప్పుకొను, తఱిగొను, తలకొను, కడుకొను, గొనకొను, గుఱుకొను, అనుకొను, తమికొను, గొదకొను, అలముకొను, కడలుకొను, తూకొను, నెట్టుకొను, తక్కొను, తార్కొను, డీకొను, పయికొను (త. మేఱ్‌కొళ్), మొనకొను, మొదలుకొను (త. ముదఱ్‌కొళ్), పట్టుకొను (పట్టుకోలుపు-త. పఱ్ఱికొళ్), దొద్దకొను, అనుకొను, కలగొను, కొల్లగొను (త. కొళ్ళైకొళ్) చూఱగొను (త. చూఱైకొళ్), దోచుకొను.

తమిళవైయాకరణు లిట్లు సహాయధాతువులుగా వచ్చునని చెప్పినవి ముఖ్యముగా నాలుగు ధాతువులు కలవు. కొళ్, విడు, ఇరు, ఒఴి.

విడు—వందివిట్టాన్ (=వచ్చివేసినాడు), పడిత్తు ట్టాన్ (=చదివివేసినాడు). ఇరు — ఎడుత్తిరుందాన్ (=లేచియున్నాడు). ఒఴి—కెట్టొఴిందాన్ = (=చెడిపోయినాడు)

తె. క.

ఆడు:—అల్లాడు—అల్లాడు,

ఓలలాడు—ఓలాడు,

కొట్లాడు — కొట్టాడు,

కొండాడు — కొణ్డాడు.

తెనుగున కొండాడు, కొనియాడు అను రెండు రూపములు కనబడుచున్నవి. 'కొని' అనుదానితో సమానమైన భూతన్యూనరూపమే 'కొణ్డు' అనునది కన్నడమున. 'కొనియాడు' అని తెనుగురూప ముండగా 'కొండాడు' అను మఱియొకటి యీభాషలోని కన్నడభాషాసంసర్గమువలన సంక్రమించియుండును.

కొనియాడు, ఊగాడు, ఊటాడు, గునిసాడు, చెరలాడు, దోగాడు, పెనాడు, లాగులాడు, వేటాడు, తిరుగాడు (క. తిరిగాడు), పోరాడు (క. హోరాడు), మాటాడు (త. సొల్లాడు), వ్రేలాడు, విడనాడు.

పొలసాడు, తునుమాడు, తూటాడు, తగవులాడు, తూగాడు, అసియాడు, నలుమాడు, చెండాడు, ఉల్లసమాడు, ఉరియాడు, ఇగ్గులాడు.

పడు:—అలవడు, ఏరుపడు, చొప్పడు, వెలువడు, తడబడు, తలపడు, కీడ్పడు, చేడ్పడు, మ్రాన్పడు, భయపడు, పీడ్వడు, ఉరలబడు, పొల్పడు, విరుగబడు, విడివడు—వీడుపడు, వెన్బడు, అగపడు (అగ్గము=అధీనము. cf త. అగమ్=లోపల Inside), ఈడిగిలబడు, కనబడు, కూడబడు, చేరబడు, చేపడు, చిక్కువడు, కోల్పడు, తోడ్పడు, తొట్రుపడు, అదిరిపడు, కట్టుబడు, చొరబడు, వినబడు, నిలబడు, దిగబడు.

ఆరు:—అసలారు, ఏపారు, ఒప్పారు, అలరారు, పొంగారు, తనుపారు, పొలుపారు, పొనరారు, వెలరారు, పొంగారు, చల్లారు, అణగారు, ఎలరారు, ఎసలారు.

పోవు, పోయు:—మూరిఁబోవు, ఆపోవు, పఱిపోవు, కొంపోవు, బుసివోవు, అమ్ముడుపోవు, సరిపోవు, పొంపిరివోవు, ఈచబోవు, పొలివోవు - పారివోవు, ఈడఁబోవు, పాలువోవు, వీటిబోవు, తలపోయు, బుసివోవు, వాపోవు, ఎత్తువోవు, లొట్టపోవు.

తెంచు, తేరు:—అరుగుదెంచు – అరుదెంచు, అడరుదెంచు, ఏతెంచు—ఏగుదెంచు, తోఁతెంచు, తాకుదెంచు, పోవుదెంచు, పుత్తెంచు, నడతెంచు, బయలుతెంచు, వీతెంచు, చనుదెంచు, మొలతెంచు, కవియుదెంచు, చొత్తెంచు, పఱతెంచు, అగుదెంచు, నెగయుదెంచు.

అలు:—ఉక్కలు, ఏపలు, పెంపలు, పొలుపలు, రూపలు, సిగ్గలు.

ఉండు:— కూరుచుండు. 'కూరిచి + ఉండు=' అనియు, నిందు 'కూరుచు' ధాతువునకు క్రియపడు నని యర్థ మనియు సుప్తార్థప్రకాశికాకారుని మతము. కన్నడమున 'కూన్తుకొండు', 'కూడ్రువదు' అను రూపములు గలవు. 'కూడ్రు' అనునది అర్వాచీనము, వ్యావహారికము. దీనినిబట్టి 'కూఱు' అనునది మూలధాతువై యుండునేమో యని తోచుచున్నది. కూఱు, కూన్తు, కూన్తు అయియుండవచ్చును. 'కూడ్రు' అను నాసికరహితరూపము కావచ్చును. కూరు, కూర్చు = ప్రియము అను నర్థము కలది వేరుధాతువై యుండును. కన్నడమున 'కూర్ — కూరు' అను ధాతువు (To sit down) ఈయర్థముననే గలదు. ఇది 'కుళిర్' అనుదాని రూపాంతర మని నిఘంటుకారుని యభిప్రాయము. 'కుళిర్' 'కుళ్లిర్' యొక్క రూపాంతరమైయుండును. ఇదియే ఆభాషలో ప్రాచీనరూపము. 'కుళ్లిర్' అనుదానినుండి యేర్పడిన అర్వాచీన రూపములు కుళిర్, కుణ్ణు), కుళ్లు, కూడ్రు, కూర్ అనునవి కలవని కిట్టెల్ పండితుడు నిఘంటువులో నిచ్చియున్నాడు. 'కుళితు' నుండి కుళితుకొండు— కుళితుకొళ్లు—కూతుకొళు— కూన్తుకొళ్ అను రూపములు పెరిగినవి. వీనినుండియే తెలుగున (కూతుకొను) 'కూకొను' అను బ్రాహ్మణేతరులలో వ్యవహారమునన్న రూప మేర్పడియుండును. కుళ్ + ఇరు = కుళ్లిర్ — కూడ్రు — కూరు—కూరు—చు—ఉండు = కూర్చుండు—ఇట్లేరూప మేర్పడియుండును. దీనినిబట్టి చూడగా మొత్తముమీద వీని కన్నిటికి 'కుళ్లు' (కుఱుళ్) అనునదే మూలరూపముగా నున్నట్లగపడుచున్నది. 'కుళ్లిర్' కుర్రు — కూరు అని శిష్టభాషలో నేర్పడి దానిపై ఇసు — ఉండు చేరగా కూరిసు - కూర్చు — కూర్చు + ఉండు='కూర్చుండు' అను రూపము కలిగియుండును. 'కుళిర్' అనుదానికి 'వంగు' అను నర్థముకూడ కన్నడమున నుండుటచేతను, ('కుళిర్ బుజు భేదే' అని శబ్దమణిదర్పణము. To bend, To stoop, Squat) 'కుళిర్' (To seat, Rest) అని తమిళమునను, 'కూండు' అని వ్యావహారికతమిళమున నుండుటచేత నిది కూను, గూను, కుని మొదలగు శబ్దములకు సంబంధించినదై "వంగి ఆసీనుడగుట" అను మూలార్థముగల ధాతువుగా గానవచ్చుచున్నది.

'ఉండు' సహాయధాతువుగా గలిగిన మఱికొన్ని శబ్దపల్లవములు : పరుండు, పన్నుండు, నిలుచుండు.

ఇంచు:—అంగవించు, అగ్గలించు, అప్పళించు, ఉంకించు, ఊకించు, ఉమ్మలించు, ఏగులించు, ప్రుళ్లగించు, గమకించు, మొక్కలించు, గుంపించు, ఒత్త

రించు, పిచ్చలించు, బెగ్గలించు, ముచ్చిలించు, దొంగిలించు, అడ్డగించు, పంతగించు, మందలించు, పాటించు, కొందలించు, కళవళించు, తమకించు, వేగిరించు, ఈసడించు, తుఱంగలించు, తొంగలించు, చెంగలించు.

ఇల్లు:—పుల్లగిల్లు, బెగ్గడిల్లు, దద్దరిల్లు, తల్లడిల్లు, తారసిల్లు, పుల్లసిల్లు, దురపిల్లు, తత్తరిల్లు, గాసిల్లు, పల్లటిల్లు, ఊరడిల్లు, నివ్వటిల్లు, దూపిల్లు, అంపిల్లు, పిక్కటిల్లు, పరిఢవిల్లు.

ఈ ఇంచు, ఇల్లు అను ధాతువు అనేకములగు సంస్కృతధాతువులను తెలుగుధాతువులుగా మార్చుట కుపయోగపడుచున్నది: రంజ్ – రంజిల్లు; భిద్ – భేదించు, భేదిల్లు; గర్జ్ – గర్జించు, గర్జిల్లు; జి – జయించు; భుజ్ - భుజించు; గుణించు, అర్థించు, యాచించు, శయనించు, పోషించు, సంతోషించు, వర్షించు, హర్షించు.

ఇట్లు సంస్కృతధాతువులను తెలుగుధాతువులుగా మార్చుట కుపయోగపడిన సహాయధాతువగు 'ఇంచు' అనునది ఈ, ఇచ్చు, ఇంచు, ఇసు ఇత్యాదిరూపములు గల 'ఈ' ధాతువే యైనను, దీని నొక 'ఇంచుక్' ప్రత్యయముగా జేసి యీప్రత్యయము సంస్కృతధాతువులపై వచ్చు నని వైయాకరణులు సూత్రించినారు: "సంస్కృతంబునకు, అంగలాదులకు ఇంచుక్కగు" (బాల వ్యా. క్రి. ౬3)

కావున నీ 'ఇంచు' అను సహాయధాతువుమూలముగా ననేకములగు సంస్కృతధాతువులకేకాక, పెక్కు దేశీయధాతువులకు, శబ్దములకును ఈభాషలో ప్రయోగార్హత, మరల ధాతుత్వసిద్ధి యేర్పడినది.

అంగలాదులలో కొన్నిటిని పరికింపుడు:

అడకించు, పరికించు, పలవించు, ఒప్పగించు, అరగించు, ఆవులించు, ఊంకించు, ఓసరించు, కారించు, గాలించు, జాడించు, తిలకించు, తులకించు, అప్పగించు, అలించు మొదలైనవి.

వీనిలో తద్భవరూపములు కొన్ని గలవు. అప్పగించు– 'అర్పణ' అనుదానినుండి, అలకించు– 'ఆలక్ష' అనుదానినుండి యేర్పడియుండవచ్చును. 'ఒప్పగించు' అనుదానిలో 'ఒప్పు' అంగీకారమును దెలుపును. రూపాంతరము 'ఒవ్వు' (వ్యతి. ఒవ్వని). త. ఒవ్వు = To be like, To be congruous. ఇది త. 'ఓ' = To be of the same mind — ఏకీభావము అను నర్థము గల ధాతువునుండి యేర్పడియుండవచ్చును. లేదా త. ఒల్లు (To agree, To be fit, Suitable, To combine, Unite, Join) అను ధాతువునుండి ఒల్ + పు=ఒప్పు అని యేర్పడినను ఏర్పడియుండవచ్చును. 'ఒల్లు' నుండియే వ్యతిరేక రూపము త. ఒల్లామై=Contempt, Absence of desire, తె. ఒల్లమి అనునది యేర్పడియుండును. దీనినుండియే 'వలచు' ధాతువుకూడ తరువాత నేర్పడియుండును.

ఇట్టి భాషలలోని మూలరూపములను బరికింపగా 'ఒప్పు' అనునదే మూలధాతు వని చెప్పుటకు వీలులే దనియు, ఇది 'ఒల్' అనుదానినుండియో, 'ఓ' అనుదానినుండియో యేర్పడిన రూప మనియు తెలియవచ్చుచుండగా, ఈ 'ఒప్పు' అనుదానికి 'ఇంచు' అను సహాయధాతువును జేర్చి దానిని ధాతుపల్లవముగా జేయు సందర్భమున అది 'ఒప్పించు' అనియేకాక 'ఒప్పగించు' అను రూపముగాగూడ నేర్పడుచున్నది. భాషలో నదివరకు ఏర్పడియున్న యీ రెండవరూపమునుగూడ సాధించుటకొరకే వైయాకరణుడు "అడ్డాదుల కించుక్కు పరంబగునపుడు గుగాగమం బగు, నప్పాదులకు విభాష నగు" అను సూత్రముచే నొక గుగాగమమును వికల్పముగా విధింపవలసివచ్చినది. ఈ'గు'గాగమము తొల్కాప్పియర్ తమిళ భాషావ్యాకరణమున ధాతువులపై గలుగు నని విధించిన 'గు–కు' అనుదానితోను, కన్నడమున శబ్దమణిదర్పణకారుడు విధించిన 'గుం-కుం' అనుదానితోను, కాల్డ్వెల్ పండితుడు తెల్పిన 'కు–గు' అనుదానితోను సమానమైనదేకాని, తద్భిన్నమని తలపవలసిన ట్లగపడదు, అయితే ఇది మూలధాతువులతో సంబంధించినదికాక కొన్నింటిపై నేదో యొక్క ప్రత్యేకార్థమున చేర్పబడుచు

వచ్చిన దనిమాత్రము మన మూహించుట కవకాశము కలుగుచున్నది. ఇంతకుపూర్వము మనము గమనించిన యీ భాషలలోని సంప్రదాయమునుబట్టి యీ 'గు' అనునది యితర ధాతువులపై నొక కాలమున జేర్పబడిన యొక సహాయధాతువుయొక్క యవశిష్టరూపమా యను సందేహమును గలుగకమానదు. ఆంధ్రవైయాకరణుని సూత్రముప్రకారము ప్రేరణార్థమును సూచించుటకుగా అడ్డాదులపై నించుకు్క, లేదా 'ఇంచు' అనుదానిని జేర్చి రూపనిష్పత్తి చేయు సందర్భమున నడుమ నొకప్పుడు 'గు'గాగమము రా నగత్య మేమి? ఇది శాస్త్రపక్కి ననుసరించి చేయబడిన విధానముగాని వాస్తవముగా నీ 'ఇంచు' అనునది 'అడ్డగు' అనుదానికి జేర్పబడియుండును. 'అడ్డు' అనుదానిపై జేర్చి కల్పింపబడిన రూపము భాషలో లేకపోవుటచేకాబోలు దీనికి వైకల్పికత్వమును చెప్పలేరు. 'ఒప్పించు-ఒప్పగించు' అనుదానివలె 'అడ్డించు - అడ్డగించు' అని రెండు రూపములు లేవన్నమాట. 'అడ్డు' సకర్మకమైనపుడు 'అడ్డివేయు' అను రూపము వ్యవహారమున గలదు. నామవాచకమైనపుడు 'అడ్డు' అనగా అభ్యంతరము. దీనినుండి క్రియారూపము, లేదా ధాతుపల్లవము 'అడ్డగు' (అడ్డు+అగు) = అభ్యంతరము కలుగు. దీనినుండి ణిజర్థకము - ప్రేరణార్థకరూపము చేయవలసినప్పుడు 'ఇంచుక్' లేదా 'ఇచ్చు' అను సహాయధాతువు యొక్క సానునాసికరూపమును జేర్పగా 'అడ్డగు + ఇంచు = అడ్డగించు' అగును. అనగా అభ్యంతరము అగునట్లుగా ఇచ్చుట—లేదా చేయుట. ఇదియే 'కాన్ (అగ) ఇచ్చుట = కావించుట + అభ్యంతరము కావించుట' కూడ నగును. దీనినిబట్టి 'అడ్డగించు'లోని 'గు' గాగమస్వరూప మెట్టిదో మనకు కొంతవరకైన బోధపడుట లేదా ?

తక్కినవానినిగూడ బరిశీలింతము. 'ఓరగించు'- 'ఓర' అనగా ప్రక్క, అంచు. ఇది విశేషణముగానే కాని క్రియారూపముగా వ్యవహారమునుండి తొలగినది. cf. ఓరచూపు. కావున దీనిని క్రియగా జేయుట కొక సహాయధాతు వావశ్యకము. ప్రాచీనకాలమున 'అగు' ధాతువు ఇట్టి సహాయధాతువుగా చాల పనిచేసిన ట్లగపడుచున్నది. కావుననే యీ భాషలలోని యనేకమూలధాతువులపై 'అగు' అను సహజస్వరూపముతోగాని, యొకప్పుడు తదవశిష్టరూపమగు కేవల 'గు' వర్ణముగాగాని యది పొడసూపుచున్నది. ఓర + అగు = అనగా ప్రక్కకు అగు—వంగు అను నర్థమున 'ఓరగు' అనునది యేర్పడినది. దీని రూపాంతరమే 'ఒరగు' అనునది. ఒరగునట్లుగా ఇచ్చుట, లేదా కావించుట-చేయుట = ఓరగు + ఇంచు = ఓరగించు. పెల్లగించు — పెల్ల అనగా ఎండి ముక్కలుగానైన మంటిగడ్డ (A chip, A flake, A clod). పెల్ల అగునట్లుగా ఇచ్చుటకావించుట- పెల్ల + అగు + ఇంచు పెల్లగించుట. (పెల్ల) అగు (నట్లు)- ఇచ్చుటయే అగించుట. ఇదియే వర్ణవ్యత్యయముచే 'కావించుట' అగుచున్నది. భూమిలోపల వ్రేళ్లు గల యొక మొక్కను పైకి లాగి ఉన్మూలించినచో, దాని మొదట నున్న భూభాగము పగిలి పెల్ల అగునట్లు చేయుటయే అగును గదా. కావుననే పెల్లగించుట అనుదానికి ఉన్మూలించుట అను నర్థ మేర్పడినది. ఇదియే దీనికి సహజమగు మూలార్థము. దీనినిబట్టి "హృదయమునుండి భావములను పెల్లగించు" అను సందర్భములలోగూడ లాక్షణికముగా నిది ప్రయోగింపబడుచుండును. ఇట్లే చిత్తగించు, మేళగించు మొదలగునవి. చిత్తము (దాని యందు) అగునట్లు ఇచ్చుట (=చేయుట)= చిత్తగించుట. (రెండువస్తువులు) మేళనము అగునట్లు ఇచ్చుట= మేళగించుట. 'గ' కారము 'వ' కారముగా మారుటచే 'మేళవించుట' కూడను. వీనికి పెల్లించు, చిత్తించు, మేళించు అను రూపములు లేవు. కాలేదు. కాని 'ఒప్పు' మొదలగు కొన్ని దేశ్యశబ్దములపైని, 'కుప్' మొదలగు కొన్ని సంస్కృతశబ్దములపైని 'ఇంచు' అనునది చేరునప్పుడు 'గు' గాగమము విభాష అన్నారు. ఒప్పించు-ఒప్పగించు, అప్పించు - అప్పగించు, కోపించు-కోపగించు, పల్లించు- పల్లగించు— ఇవి యుదాహరణలుగా జెప్పబడినవి. వీనిలో అప్పగించు అను రూపము ప్రయోగములతో నిఘంటువులలోగూడ గ్రహింపబడినది గాని 'అప్పించు'రూపము కనబడుట లేదు. వ్యవహారమునను గానరాదు. 'అప్పగించు' 'ఒప్పగించు' అనుదానితో సమానార్థకము

గనే తెలుపబడినది. ఇక పల్లము—సున్నముపై వేసెడు జీను. దీనినుండి 'పల్లించు' రూపమే ప్రాచీనప్రయోగ ములందు గానవచ్చుచున్నదిగాని పల్లగించు అను రూపము కానవచ్చుట లేదు. క్వాచిత్కముగా నెచ్చట నైన నుండుటనుబట్టి వైయాకరణుడు గ్రహించెనేమో. కోపించు, కోపగించు అను రూపము లున్నవి. నిఘంటువులలో నీరూపద్వయము సమానార్థకమే యైనట్లు సూచింపబడియున్నదిగాని (అప్పగించు - ఒప్పగించు - ఒప్పించు; కోపించు-కోపగించు) వీనికి గొంతయర్థభేద మున్నట్లు పొడకట్టకపోదు. ఒకవిషయమై వానిని ఒప్పించుట-తనతో నేకీభావము కలవానినిగా జేసి కొనుట ఒప్పించుట. లేదా ఒకపనిని చేయుట కంగీకరించునట్లుగా జేయుట ఒప్పించుట. ఈ యర్థముననే 'ఒప్పగించు'అనునది ప్రయోగింపబడునా? మూలార్థము ఒప్పు-ఏకీభావము-అగునట్లుగా చేయుటయే యైనను, వ్యవహారమున నొక వస్తువును వానియొద్ద నుంచుకొని రక్షించుటకు అంగీకరించునట్లు చేయుట అను నర్థములో బ్రయోగింపబడుచున్నది. ప్రాచీనకాలమున "తిన కానుక లొప్పగించి" - "కానుకలను ఇచ్చి" అను నర్థములోగూడ నుండియుండును. కాని 'ఒప్పించుట' 'ఇచ్చుట' కాదుగదా. ఒకనిని పట్టి మఱియొకని కొప్పగించుటకును, ఒప్పించుటకును భేద మున్నది.

ఇంతకును ముఖ్యముగా మనము గమనింపవలసిన దేమనగా, నీభాషలలో కొన్ని మూలధాతువులపై నాధాత్వర్థమును క్రియారూపముగా మార్చుటకు, లేదా ధాత్వర్థమునందలి క్రియాభావవ్యక్తీకరణమునకు గాని, ఆభావముయొక్క భిన్నచ్ఛాయలను సూచింప వలసినప్పుడుగాని వేరొక ధాతువును జేర్చి చెప్పుచుండెడివారనియు, కొంతకాల మైనపిదప నుచ్చారణవేగముచేతగాని, స్వరము, ఊనిక మొదలగువాని యందు గలిగిన భేదముచేగాని యా చేర్పబడిన ధాతువులోని భాగము లేమైన లోపించినచో, తరువాతి కాలమువా రది యంతయు గలిసి యొకే ధాతువనియో, లేదా అర్థభేదమును సూచించు నాయావర్ణము లేమూలధాతువుయొక్క యవశిష్టభాగములో తెలియనప్పుడు అవి ఆయాయర్థములను సూచించు ప్రత్యయములనియో తలచుట సంభవించిన దనియు తెలియవచ్చుచున్నది. ఇంతేకాక యావర్ణముల నితరధాతువులపై గూడ నాయర్థమున జేర్చుచుండుటయు గలుగవచ్చును. ఇట్లాయావర్ణములు మూలార్థ మేమో తెలియక ఒక ప్రత్యేకార్థమును సూచించు వ్యాకరణచిహ్నములుగా బరిణమించును. ఇట్టి చిహ్నములు పెరిగినకొలది ఆ భాషయొక్క ప్రత్యయాంతావస్థ ముదురుచుండును. కొంతకాలమున కిప్పటి ఇండోయూరపియన్ భాషలయందువలెనే వాని పూర్వ చరిత్రమును దెలిసికొనుట కవకాశము లేని స్థితి యేర్పడ వచ్చును. ప్రస్తుతము ద్రావిడభాష లనునవి యట్టి స్థితి కింకను వచ్చిన ట్లగపడదు. వాని సంయుక్తపదరూపావస్థ (Agglutinative nature) కొంతవర కింకను సువ్యక్తముగానే యుండుటచేత, తత్తద్భాషాసంప్రదాయరీతులనుబట్టి, అందు ప్రత్యయావస్థను బొందినవాని పూర్వచరిత్ర నన్వేషింప యత్నించినచో, వాని మూలరూపములను కనిపట్టుటయేకాక, వీని కన్నిటికిని మూలభాష యనదగిన ప్రాచీనద్రావిడ భాషయొక్క స్వరూపలక్షణముల నూహించి తెలిసికొనుటకు దగిన యవకాశ మేర్పడగలదని తోచుచున్నది.

ప్రస్తుతము అడ్డాదులకు,అప్పాదులకు ఇంచుక్ పరమైనపుడు చేయబడిన 'గు'గాగమము కేవల మర్థము లేని 'గు'వర్ణమాత్రముగాక అడ్డు, ఒప్పు మొదలగు వానికి ధాతుత్వమును కల్పించుటకుగా జేర్పబడిన 'అగు' అను సహాయధాతువుయొక్క యవశిష్టరూపమైయుండు నని ఆయారూపముల యర్థవిచారణవలన మనకు దెలియవచ్చుచునేయున్నదిగదా. వాస్తవముగా అడ్డగు, అప్పగు, కోపగు అనునవి స్వతంత్రధాతువులుగా నీభాషలలో లేకపోవుటనుబట్టియు, 'ఇంచు' చేర్చినప్పుడే ఈ గువర్ణము కనబడుచుండుటనుబట్టియు ఇది 'ఇంచు' అనుదానిని జేర్చినపుడే వచ్చు నొక ఆగమ మని వైయాకరణులు తలచుటలో నాశ్చర్యము లేదు.

ఈ 'గు' వర్ణమిట్టిసందర్భముననే కాక యీ భాషలలో ధాతువులుగ బరిగణింపబడుచున్న యనేక

రూపములలోగూడ గనబడుచున్నది. ఆంధ్రవైయాకరణు లట్టి సువర్ణాంతరూపము నే ధాతువుగ గ్రహించి, దానినుండి క్రియారూపనిష్పత్తి సలుపుచున్నారు. అట్టి వానిని గొన్నిటిని బరిశీలింతము. వైయాకరణులు చెప్పిన అడంగ్వాగులు కలవు. వీనికిని ప్రేరణేంచుక్క పరము గునపుడు వీని కడ్రవాలికి బహుళముగా లోపమును విధించినారు. అనగా 'ఒప్పగించు-ఒప్పించు' వలెనే అడగించు-అడచు; కరగించు-కరచు; నలిగించు-నలచు- ఈరీతిగా సువర్ణాంతములుగా గ్రహింపబడిన ధాతువుల నుండి సువర్ణవిరహితములగు ప్రేరణార్థకరూపము లేర్పడుచున్నవి. వెనుకటివానికిని, వీనికిని భేద మేమ నగా, అవి—అప్పాదులు — సువర్ణాంతములు కావు. కావున ఇంచుగాగమము చేసినప్పుడు గుక్ విధానము చేయవలసివచ్చినది. ఇవి సువర్ణాంతములు. కావున రెండవ రూపమును సాధించుటకు కడ్రవాలికి లోపము చేయవలసివచ్చినది. మొత్తముమీద ప్రేరణార్థమున 'గు' వర్ణవిరహితరూపములు అచ్చట నిచ్చటగూడ నుండుట నిశ్చయము. ఇట్లే ఇంకను కొన్ని క్రియా రూపములలో నీ సువర్ణము కానరాకుండుటచేతనే ఇది మూలధాతువునకు సంబంధించినది కాదని, 'అగు' అను సహాయధాతువుయొక్క అవశిష్టభాగమని ఎంచబడినది.

వీని నితరభాషారూపములతో బోల్చిచూచి నచో వీనియందలి 'గు'వర్ణము సహజముగ ధాతుగతమో, లేక యాగంతుకమో యను విషయమే కాక ఆయాధాతువుల మూలరూపము లేమైయుండునో యను విషయము గూడ గొంతవరకైనను దెలియకపోదు. అట్టివానిని గొన్నింటిని బరిశీలింతము.

అడంగు-అణంగు—అడంగు < అడు. cf అడ్క= అడ్డము. త. అడి=To strike, Press; అడై Obstruct, Hide, Conceal. క. అడె, అడగు = To hide, Disappear.

అఱుగు=జీర్ణించు. త. అఱు; క. అఱుగు.

అలంగు=శ్రమపడు. త. అలు; క. అల=To be tired, weary.

ఇలుగు=చచ్చు, త. మ. ఇల=To die.

ఉడుగు=కృశించు. త. ఉడై; క. ఒడె = To break, Crack, Despair. క. ఉడుగు=To shrink, To desist. (సం. ఉపహత ?)

ఊఁగు—త. మ. క. ఉటిల్ = To swing, Oscillate. త. ఊఞ్జల్, ఊచల్, ఊంచల్ = ఉయ్యాల.

ఎఱఁగు = దిగు, నమస్కరించు. త. క. ఇఱి; తు. ఇళి = To come down. త. ఇఱంగు; క ఎఱగు.

ఎఱుఁగు = తెలియు. త. మ. క. అఱి = To know, Understand.

ఒదుఁగు = తొలఁగు. త. ఒత్తు=To make room for, ఒదుంగు=To step aside.

ఒరగు=వంగు, ప్రాలు. త. ఓరం=Sideways, Edge. క. ఉఱగు=To be bent (సం. ఉద్వర్త?)

కడఁగు=యత్నించు. త. మ. తు. కడ (కడచు) To pass through, To excel, Overcome. త. కడమై=Duty, Obligation (సం. కృత?)

కడుగు=ప్రక్షాళించు. త. కఴు, క. కళె = To remove.

కరఁగు=ద్రవించు-త. కరై=To be reduced from a solid to liquid form, dissolve. క. కరంగు.

కలఁగు=కలతపడు. త. కల=To mix, Mingle కలక్కం=Distress, Perplexity.

కలుగు=అగు, క. కలి=To join, To come together.

కాఁగు=తపించు. త. క. కాయ్.

క్రుంగు=దిగబడు. త. కుఴి=To dig, Make hollow.

గొఱుగు=క. కెరె-కెరి=to Shave. త. చిరై.

చినుఁగు, చిరుఁగు=ఛిన్నమగు. త. క. కీఱ్= To tear, Rend, (సం. ఛిద్?)

చివుకు-చీఁకు=సారహీనమగు. క. కి-ర క్తపక్వే, కివు=To be decomposed. త. చి, చీట్.

చెరుగు—క. కేఱు; మ. జేఱు=To Winnow.

డాఁగు=దాఁగు. త. అడై=To hide. అడఁగు > డాఁగు (Skt ధా?)

డిగు=దిగు. త. ఇఱి, ఇఱు=Come down, Descend-క. ఇఱిగు.

తఱుగు=ఖండించు. త. క. తఱి=To cut off, Chop off into small pieces.

తరుగు-తగ్గు. ఇది 'తా-తరు' అనుధాతువునుండి యేర్పడిన ట్లున్నది. త. తా-తరుదల్ = To give, Hand over. తరువి=Giving. తరుకు=Brokerage.

తొలఁగు, త. తొలై, తులె. క. తొలగు=To go away; To go aside.

తిరుగు=సంచరించు. త. మ. క. తిరి=To turn round.

తునుఁగు=ఖండితమగు-త. తుని=To cut. క. తుండు, తునుకు, తె. తుండు, తునియ, తుంపర...

తూఁగు-త. తుయుల్ = To wave, Swing, Hang

తొడఁగు=ప్రారంభించు, త. తొడు=to touch మ. తుడజ్జు; క. తొడగు=To commence, Undertake.

తోఁగు, దోఁగు —త. క. తుయ్, తోయ్=To dip, Soak

తొరఁగు=స్రవించు-త. చోరి, చురి, క. తొరి= To flow down

నుడుగు=త. నొడి, క. నుడి=To sound, Utter, Speak.

పఱఁగు=త-పఱ=To fly, Run swiftly క. పఱె, పఱు.

పెరుఁగు=త. క. పెర్, పేర్=big Largeness, పెర్చు. Increase.

పెనఁగు=త. మ. పిన్ను=To twist, To be entangled. క. పెణె=To entwine.

మడఁగు=వంగు-త. క. మడి=To fold, A fold క. మడిసు=To fold. cf మడచు.

రేఁగు=క. త. ఎఱ్, ఏఱు=To rise.

విఱుగు=త. మ. విరి. క. బిరి = To burst, Open, To crack.

వెలుఁగు=ప్రకాశించు. త. వెళ్, క. బెళ్= White, Shining త. విళక్కు=Light. cf. వెండి-క. బెళ్లి, వెల్ల.

తెలుగులోవలెనే కన్నడమునను పెక్కు ధాతువులు గువర్ణాంతములుగనే గ్రహింపబడినవి.

ఆగు-ప్రాదుర్భావే; కూగు - ఉచ్చైర్ధ్వనౌ; తూగు - తులనే; పొంగు - స్ఫుటనే; తొలగు - వివిక్తే; కరగు- విలీనే; ఎఱగు - ప్రణతే; మఱుగు - సంతాపే; తుఱుగు - సంఘర్షే; ఉడుగు - సంకోచనే; తొడగు - ప్రారంభే; ముఱుగు - నిమగ్నే; తగ్గు - క్షీణత్వే; మొగ్గు - నమనే; మొఱగు - వాదనక్రియాయాం; నుగ్గు- సంమార్గే; కుగ్గు- ఆకుంచనే; కగ్గు - కార్ష్ణ్యే మొ. (శబ్ద. ద. ధాతుప్రకరణ.)

వీనిలో కొన్ని తెలుగులోగూడ నట్లే యున్నను, మఱికొన్ని తెలుగురూపములకు వెనుకటి రూపములను జూపునున్నవి వలెనే యున్నవి. 'ముఱుగు' అనునది 'మునుగు' అనుదాని ప్రాచీనరూప మన వచ్చును. అట్లే తగ్గు — తగ్గు; మొగ్గు - మ్రొగ్గు, మ్రొక్కు; మొఱగు - మ్రోగు; నగ్గు - నుగ్గు; కుగ్గు - క్రుంగు; కగ్గు - కగ్గు అనురీతిగా తెనుగులో మారినవి. ఇది చిరకాలమునుండి యీభాషలలో గువర్ణాంతముకే లైయుండు ననుటకు సందేహము లేదు. కాని యీభాషలన్నిటిలో గూడ నాయాధాతువులనుండి యేర్పడిన యనేక శబ్దములలో-ముఖ్యముగ నామవాచకశబ్దములలో నీ గువర్ణ మగపడకుండుటనుబట్టి ఇది ఆయా మూల ధాతువుల క్రియాభావమును వ్యక్తీకరించుటకుగా జేర్పబడిన యొక సహాయధాతువునకు సంబంధించిన భాగముగాని వేఱు కాదనుట స్పష్టమగునుగదా. అటి

సహాయధాతువుగా జేర్పబడుటకు దగిన ధాతువు 'అగు' అనున దొకటి కనబడుచునేయున్నది. కావున నతిప్రాచీనకాలముననే యనేకమూలధాతువులపై నీ 'అగు' అనునది చేరి, వానిని ధాతుపల్లవములనుగా జేయుటకు దోడ్పడియుండు ననుటకు సందేహింప నక్కరలేదు. ఒకవేళ 'కుం' అనునది వర్తమానార్థక ద్యోతకము, లేదా చిహ్నమైయుండు ననితలచుటకును వీలులేదు. ఏలయనగా ననేకములగు నితరధాతువులపై 'కుం' వచ్చుట లేదు. కాని 'ఉం' అనునదిమాత్రమే వచ్చుచున్నది. నడచును, పాడును, తినును, పెడలును, వీడును, మానును, ఆగును. తమిళమునందును ఆడుం, పాడుం, వరుం మొదలగువానిలో 'ఉం' అనునదే తద్ధర్మార్థకరూపమును గల్పించుచున్నదిగాని 'కుం' వచ్చుటలేదు.

దీనిబట్టి తేలిన దేమనగా ప్రాచీనకాలమునందలి ద్రావిడభాషలో అడ్, కలి, వలి, అఱె, అఱి, కిల్, తిర్, తుఱ్, కుఱి, తుఱ్, పెర్, పెణె, పఱు, మూగి, మడి, వెళ్ మొదలుగునవి మూలరూపములుగా నుండగా, వాని క్రియాభావములను వ్యక్తము చేయుటకు అగుట, సంభవించుట, ప్రాప్తించుట అను సామాన్యార్థము గల 'అగు' ధాతువు వీనిపై జేర్పబడియుండుటచే, అడఁగు, కలుగు, నలుగు, ఎఱుగు, తిరుగు, తునుఁగు, పెరుగు, పెనగు, మూగు, మడగు, వెలుగు మొదలగు రూపము లేర్పడిన వనియు, వీనిపై 'ఉం' చేరుటచే తద్ధర్మార్థకరూప మేర్పడిన దనియు తెలపదగియున్నది.

ఈ గువర్ణాంతము, లేదా 'అగు' ధాత్వంతరూపము పైగలెనే కొన్ను, ఆడు మొదలగు సహాయధాతువులతో గూడిన ధాతుపల్లవ రూపములనుండియు తద్ధర్మార్థక రూపము 'ఉం' చేర్చుటచేతనేగదా యేర్పడుచున్నది. చూడుడు.

చేసికొను—చేసికొనును. త. శెయ్దుకొళ్లుం.

పోరాడు—పోరాడును.

ఏర్పడు—ఏర్పడును.

ఒప్పారు—ఒప్పారును.

కొనిపోవు—కొనిపోవును.

కూర్చుండు—కూర్చుండును.

అడ్డగించు—అడ్డగించును.

తల్లడిల్లు—తల్లడిల్లును.

ఏగుదెంచు—ఏగుదెంచును—ఏతేరును. ఇచ్చట మాత్రము 'తెంచు' నకు 'తేరు' కూడ వచ్చి రెండు రూపము లగుచున్నవి.

ఇట్లే వచ్చు, తెచ్చు మొదలైన ధాతువులకు వచ్చును, తెచ్చును అనియే తెలుగున రూపము లగుచున్నను తమిళమున వరుం, తరుం అని రేఫసహిత రూపము లగపడుచున్నవి. దీనినిబట్టి విచారింపగా అడఁగు, తఱఁగు, వెలఁగు మొదలగువానిలోని 'గు' వర్ణము సహజముగా మూలధాతువునకు సంబంధించినది కాకపోయినట్లే ఈ తెచ్చు, వచ్చు, పుచ్చు, మెచ్చు, విచ్చు, త్రచ్చు, గ్రుచ్చు, నచ్చు, చొచ్చు, నొచ్చు, చచ్చు మొదలగు రూపములలోని తుది 'చు' వర్ణముకూడ నేదోయొక సహాయధాతువుయొక్క యవశిష్టభాగమే యేమో యని తలంపదగియున్నది. ఈ 'చు' వర్ణ మీధాతువులనుండి నిష్పన్నమైన రూపము లన్నిటిలో కనబడుట లేదనియు, కొన్నిటిలో వేరు రూపము లగుచున్నవనియు వ్యాకరణమున జెప్పబడినదానిని బట్టియే తెలియుచున్నది గదా. 'తెచ్చు'నకు తే - తేరులు, 'వచ్చు'నకు రా, 'చొచ్చు'నకు 'చొరు', చచ్చు నొచ్చులకు చా-నోవులు—ఇవి కొన్ని రూపములలో నాదేశము లగుచున్నవి. సామాన్యముగా నొక ధాతువుయొక్క సహజరూపము, లేదా మూలరూపము విధ్యర్థకమధ్యమపురుష క్రియారూపములో గానబడుచుండును. ఇది వ్యవహారములో తొలుదొల్త ప్రయోగములోనికి వచ్చియుండదగు రూపముగనుక. కాని ఇటీవలి భాషలో కాలక్రమమున గువర్ణాంతములు, చువర్ణాంతములుగూడ విధ్యర్థకములుగా బ్రయోగింపబడుచునే వచ్చినవి. ఏలయనగా అనియే ధాతువులుగా గ్రహింపబడినవి గనుక. 'తెచ్చు'నకు విధ్యర్థకము 'తే' అని, 'వచ్చు'నకు 'రా' అని మన భాషలో నున్నవి

గాని, ఇతర భాషారూపములతో బోల్చిచూచినచో, ఈభాషలలోని యితరరూపములతోగూడ బోల్చినచో తేర్, వర్ అనునవి మూలరూపము లనిపించును. తమిళమున నివి తర్, వర్ అను రూపముల నున్నవి. ఆభాషలో 'తా' ధాతు వనియు, 'తర్' దాని రూపాంతర మనియు, అట్లే వర్, (క. బర్) ధాతు వనియు, 'వా' 'బా' వాని విధ్యర్థకరూపములనియు చెప్పెదరు. విచారింపగా 'తర్' 'వర్' అనునవి మూలరూపము లని తోచకపోదు. వ్యతిరేకరూపము త 'వరాదు' క. 'బారదు'. ఇందు వర్—బర్ అను రూపము కనబడుచునే యున్నది.

ఇట్లే చొచ్చు—చొరు; మెచ్చు—మెఱు; పుచ్చు—పురు; త్రచ్చు—తఱు; విచ్చు—విడు; గ్రుచ్చు—కో—కోర్; నచ్చు—నమ్; చచ్చు—చా; నొచ్చు — నో అనియు మూలరూపములైనట్లు వ్యక్తమగుచున్నది. ఐనచో నీ 'చు' అనునది మరియొక ధాతువునకు సంబంధించిన దనియు, నాయాధాతువుల లోని రేఫాదులకిచువర్ణముతో గలిగిన సమీకరణము (Assimilation) మూలముగా నీధాతువులు 'చ్చు' వర్ణాంతము లైనవనియు తెలియుచున్నది. విచ్చు, గ్రుచ్చు మొదలగువాని యర్థమునుబట్టి యివి విడు, కో-కోర్ అనువాని ప్రేరణార్థక రూపములుగా గనబడుటచే నీ 'చు' అనునది కన్నడమున 'ఇసు' అను రూపము గలిగియున్న 'ఈ' ధాతురూపమగు 'ఇచ్చు' అను దానికి సంబంధించిన దని యూహింపనగును. విడు-వదలుట; విడిసు-విడుచు=వదలునట్లుగా జేయుట-విచ్చుట దీనినుండి మరల ప్రేరణార్థకము 'విప్పుట' అనియు నేర్పడినది. కాని విడుచు - విచ్చు అయిన దనుటకు సందేహము లేదుగదా. అట్లే తెర్ + ఇచు= తెరిచు > తెర్చు < తెచ్చు. వర్ + ఇచు = వచ్చు, (క. బరిసు); చొర్ + ఇచు = చొర్చు, చొచ్చు; మెఱ్ + (ఇ)చు = మెచ్చు (క. మెఱయిసు); తె- మెఱయించు; కో—కోర్ + (ఇ)చు = (కోరిచు) గ్రుచ్చు; నో + (ఇ)చు = నొచ్చు; చా + (ఇ)చు = చచ్చు; పుర్ + (ఇ)చు = పుచ్చు (cf. ప్రుచ్చు, ప్రువ్వులు—పురుగులు, ప్రువ్వఁడిట్టు) ఈ మొదలగు రూపము లేర్పడియుండును. కావున వర్, తర్, చొర్, మెఱ్, కోర్, చా, నో మొదలైనవే మూల ధాతువు లనియు, తెలుగున ధాతువులుగా గ్రహింపబడినవాని తుద గనబడు 'చ్చు' అనునది 'ఈ'ధాతు రూపాంతరమగు 'ఇచు' అనుదానిలోని 'చు'వర్ణ మాయాధాతువులలోని యంత్యవర్ణముతో గలియుటచే నేర్పడిన దనియు స్పష్టమగుచున్నది.

ఇట్లొక కాలమున సహాయధాతువుగనో, ప్రేరణార్థముననో చేర్పబడిన 'ఇచు' అనున దాయామూల ధాతువులతో జేరి మార్పు జెందిన దగుటచే దీని తొలి రూపము మరుగువడి, కాలక్రమమున 'చు'వర్ణకమో, ఇంచుగాగమమో యగుట తటస్థించినది. ఈవర్ణములు మరికొంతకాలమున కాయాయర్థములను బాగుగ వ్యక్తీకరింపకున్నచో మరల వానిపై వేరుశబ్దములు, ధాతువులు చేర్పబడుచుండును.

మెఱ్ - మెఱయు: ధాతువు, మెఱ్ + ఇంచు- మెచ్చు, మెరయించు, మెఱయునిచ్చు. దీనిపై 'కొను'- మెచ్చుకొను. దీనిపై ప్రేరణము మెచ్చుకొనజేయు. దీనిపై విధి మెచ్చుకొనజేయవలయు. విర్-విడు + ఇచు=విడుచు-విచ్చు-విడిపించు. దీనిపై కొను - విడిపించుకొను. దీనిపై చేయు-విడిపించుకొనజేయు. దీనిపై వలయు - విడిపించుకొనజేయవలయు (+ ఉమ్)ను.

ఇట్లీభాషలలో వర్ణభేదమును సూచించుటకుగా నొక ధాతువుపై మఱియొక ధాతువును జేర్చుటచే రూపకల్పనము జరుగుచుండుటయేకాక ఆయా ధాతువులు సామాన్యముగా నారూపములందు తమ స్వరూపమును, స్థానమును నిలుపుకొనుచు నుండుటనుబట్టియే యీభాషలు సంయుక్తపదరూపము (agglutinative) లని చెప్పుటకును, వాని పూర్వరూపము లన్వేషించి తెలిసికొనుటకును గొంతవరకైనను సాధ్యమగుచున్నది.

ఆంధ్రభాషాచరితము - ధాతువులు

[అనువృత్తము]

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఆంధ్రవైయాకరణులచే నీభాషలో ధాతువులుగా బరిగణింపబడిన 'గు'వర్ణాంత, 'చ్చు' వర్ణాంతరూపముల పూర్వచరిత్ర నన్వేషించి పరిశీలింపగా నివి వాస్తవముగ భాషలో ధాతువులుగ బరిగణింపబడదగిన మూలరూపములు కావనియు, యత్కించిదర్థభేదమును సూచించుటకుగా నితర ధాతువులతో గూడి కాలక్రమమున నేర్పడిన ధాతుపల్లవము లనదగిన వై యుండెననియు మనకు దెలియవచ్చుచున్నది. ఆయారూపములలోని 'గు'వర్ణ మొక మూలధాతువునకు సహాయధాతువుగా జేర్పబడిన 'అగు'అనుదాని యవశిష్టరూప మైయుండు ననియు, 'చ్చు' అనునది 'ఈ' ధాతురూపాంతరమగు 'ఇచు' అనుదాని 'చు'వర్ణము తొలిధాతువు తుదినున్న రేఫాది వర్ణములతో సమీకరణమునొందుట (Assimilation) వలన నేర్పడిన దనియు గూడ నూహింపదగియున్నది. ఇట్లే 'గు', 'చు,' 'చ్చు' మొదలగు వర్ణములను ఆయారూపములనుండి విడదీసి వాని స్వరూపమును మనము గుర్తింపగలిగినచో, నిక మిగిలిన మూలరూపములు—అనగా అడ్, తున్, తర్, వెళ్, పెర్, తిర్, కీఱ్, కాయ్, వర్, తర్, చొర్, చా, నో మొదలగునవి చాలవరకు ఏకాచ్ధాతువులుగ నుండెననుటకు సందేహము లేదు. ఇవియే యితరసహాయధాతువులతో గూడి యాయా రూపము లైనవని గ్రహించితిమి. వీనిపై 'ఈ' ధాతురూపమగు 'ఇచు' చేర్పగా 'చ్చు' వర్ణాంతరూపము లేర్పడిన వని చెప్పుచున్నారుగదా. ఈ'ఇచ్చు' ధాతు వెట్లు వచ్చినది? 'చు' వర్ణమే ఆయా యర్థముల జేర్పబడిన దనుకోరాదా అను ప్రశ్న కలుగవచ్చును. అట్లే 'అ' ధాతువుగా గ్రహించినప్పుడు 'అగు' 'ఆగు' అనుదానిలో గూడ 'గు' వర్ణము కనబడుచున్నది గదా, తక్కిన ధాతువులపై 'అగు' చేరినదనుటకంటె ఏదో అర్థములేని 'గు' వర్ణమే చేరిన దనుకొనుట యుక్తముగదా అనియు ననవచ్చును. వాస్తవమే. కేవల ప్రత్యయాంత భాషయైన (Completely inflexional language)సంస్కృతభాషాసామ్యదృష్టితో జూచినప్పు డట్లుతోచుట న్యాయమే. అందలి వికరణ ప్రత్యయములకుగాని, క్త్వార్థకణిజాద్యర్థక ప్రత్యయములకుగాని అర్థమేమో, వాని మూలరూపము లేవో తెలిసికొనుటకు మన కవకాశము కలుగుటలేదు. కావున నాదృష్టితో జూచినచో నట్లే ఇచ్చుటను తటస్థించియుండు ననుటకు సందేహములేదు. కాని యీద్రావిడభాష లట్టి నిరూఢమైన ప్రత్యయాంతత్వస్థితిని బొందని వగుటచే నాయా భాషలలో నిలిచియున్న రూపములను బరిశీలించినచో గొంతవర కాయాప్రత్యయము లనబడువాని మూలరూపములను గనిపట్టుట కవకాశ మేర్పడగల దని యూహింపవచ్చును. కావున సంస్కృతభాషావ్యాకరణ సామ్యదృష్టితోగాక ద్రావిడభాషా స్వరూపతత్త్వ పరిశీలనదృష్టితో జూచినచో వీని మూలరూపములను గనిపట్టవచ్చునేమో యారయవలసియున్నది. అట్లు

విచారించినచో నర్థభేదచ్ఛాయలను సూచించుటకుగా నొక ధాతువుపై మఱియొకధాతువును జేర్చి చెప్పుట యిప్పటికి నీభాషలలో సాగుచునేయున్న దని మన మింతకుబూర్వమే గ్రహించియున్నాము గావున నీ సూత్రమే ప్రాచీనకాలమున గూడ ననుసరింపబడి యుండునని తలచినచో నీ ధాతురూపములపై జేరిన యితర ధాత్వవశిష్టరూపములే కాక, నామవిభక్తి ప్రత్యయములు, క్రియారూపములలో భిన్నార్థముల జేర్చబడు చుండు ప్రత్యయములు మొదలగునవన్నియు నీభాషల లో నొకకాలమున స్వతంత్రప్రయోగము గలిగిన ధాతువులో, శబ్దములో, లేదా వాని యవశిష్టరూపములో యయియుండునని తెలిసికొనుట కవకాశ మేర్పడ వచ్చును. సంస్కృతభాషలోగూడ నాయా ప్రత్యయము లనబడునవి అట్లే యేర్పడియుండవచ్చునుగాని, దాని పూర్వచరిత్ర నన్వేషించుచు వాని నితరములగు గ్రీక్, లాటిన్, జర్మానిక్ మొదలగు నిండోయూరపియన్ భాషారూపములతో పోల్చిచూచినప్పటికిని, అతిప్రాచీనమగు నీభాషారూపములలోగూడ నిరూఢమగు ప్రత్యయాంతస్థితియే కనబడుచుండుటచే నాయా ప్రత్యయములే స్వతంత్రపదముల యవశిష్టరూపములో కనుగొనుట భాషాతత్త్వవేత్తలకు సాధ్యము కాలేదు. ద్రావిడభాష లట్టి స్థితి కింకను వచ్చినట్లు కనబడక పోవుటచే, నీభాషారూపముల చరిత్ర నన్వేషించినచో నందు ప్రత్యయములుగా గ్రహింపబడినవి యే మూల స్వతంత్రశబ్దముల భాగములో కొంతవరకైనను తెలిసికొనవచ్చు నని తోచుచున్నది.

ప్రస్తుతము ఆ, ఈ అనునవే మూలధాతువులైనచో వీనిపై గు, చు, సు మొదలగున వెట్లు వచ్చినవి, ఇవి యితరధాతువులపై గనబడుచున్నట్లే వీనిపైని గూడ నేదోయొక యర్థమున జేరియుండగూడదా అను విషయము పరిశీలింపవలసియున్నది. అగు, ఇచ్చు, ఉండు అనునవి అ, ఇ, ఉ అను తొలియచ్చులకు సంబంధించినవై భాషలో మానవుని వ్యవహారమున నత్యావశ్యకములు, నతిసామాన్యములు నగు వ్యాపారములను సూచించు ధాతురూపములుగ నున్నవి. కంఠ్యతాలవ్యాచ్చులగు ఆ, ఈ లనునవే మూలధాతువులైనచో వాని నుచ్చరించునపుడు వివృతత్వమును పొందిన, అనగా తెరవబడిన (ముఖము మొదలగు) వాచికావయవములు మరల వాని యథాపూర్వస్థితిని బొందునపుడు ఆ కంఠస్థానమునగాని, తాలవ్యస్థానమునగాని శ్వాసవాయువు నిరోధింపబడి స్పర్శకలిగినచో నాయా స్థానముల కంఠ్యస్పర్శవర్ణమగు 'క' కారము, తాలవ్యస్పర్శవర్ణమగు 'చ' కారము బయలుదేరుట స్వాభావికముగదా. ఈకారణముచే 'ఆ' అనునది యుచ్చారణవశమున 'ఆగు'–'అగు' అగుటయు, 'ఈ' అనునది 'ఈచు', 'ఇచు' అగుటయు సంభావ్యమే. కావుననే 'ఆ' ధాతురూపమే ఆగు - అగు అనియు, 'ఈ' ధాతురూపమే ఇచు-ఇగు అనియు నూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఇక 'ఉండు' ధాతురూపములలో దీర్ఘ ఊకారము కనబడుట లేదు. కావుననే 'ఊ' ధాతువుగా గ్రహింపబడలేదు. ఈభాషలలో మనకు లభించిన రూపములనుబట్టియేకదా మన మూహింపవలసినది. కావున 'ఉండు' ధాత్వర్థమునకు సంబంధించిన ఉన్ఱు, ఉఱు, ఉళ్ మొదలగు రూపములు కొన్ని భాషలలో కనబడుచుండుటచే వానిలో నొకటి దీని పూర్వరూప మైయుండవచ్చు నని తలపబడుచున్నది. ఈధాతువులే భాషలో నతిప్రాచీనములుగ గనబడుటచే నతిప్రాచీనకాలమున నీభాషలను వ్యవహరించినవారు వీని నితరధాతువులకు సహాయధాతువులుగ జేర్చి తమ భావములను వ్యక్తపరచికొని రని యూహింపవచ్చును. తరువాతి కాలమున నింక నితరభావభేదములను సూచించుట కితరములగు కొను, ఆడు, తెంచు, పడు, చేయు మొదలగున వనేకము లుపయోగపడినట్లు మనకు తెలియుచునేయున్నది. ఇప్పటికి మనము 'చేసికొనుము' అనుదాని రూపాంతరముగా–లేక సంగ్రహరూపముగా 'చేసికో' అనుదానిని గ్రహింపగలుగుచున్నామేగాని, మరికొంతకాలమునకు వీనికి గల పరస్పర సంబంధజ్ఞాన మంతరించుట తటస్థించినచో నప్పటి వైయాకరణుడు "'చేసి'శబ్దముమీది 'కొనుము' అనుదానికి 'కో' ఆదేశంబగు" అని సూత్రించి 'కో' అనుదాని నొక ప్రత్యయమాత్రముగ గ్రహింపవచ్చుగదా! దీనిపై విధ్యర్థమున 'వాలి' అను ప్రత్యయ మాదేశ మగుననియు చెప్పవచ్చును. ఇప్పటికే 'చేసికొనవలయును' అనుదాని వ్యావహారికరూపమే,

లేదా రూపాంతరమే 'చేసికోవాలి' అనన దన్న భావము మరపునకువచ్చుచున్నది. వెళ్లాలి-కొట్టాలి-తినాలి అనువానినిబట్టి ఇదే 'అలి' ప్రత్యయముకూడ కావచ్చును. కొన్నివందల యేండ్ల తరువాత నీ 'అలి' ప్రత్యయము కేవలవిధ్యర్థక మను భావమే నిలిచి దీని మూలస్వరూప మేమో తెలిసికొనుట సులభ సాధ్యము కాకపోవచ్చును. కాని భాషాచరిత్రకారు డీ యర్థమును భావములో సూచించు ప్రాచీన రూపమును దొరకినంతవరకు సమకూర్చుకొని, దీని చరిత్ర నన్వేషించి అపుడు తెలుపగలడు. ఈ 'అలి' అను ప్రత్యయము 'ఒల్' ధాతువునుండి బయలు దేరిన రూప మగును. 'ఒల్ = to be pleased, to will, to like, to love' అనునది మూలధాతువు. దీనినుండి యేర్పడిన ఒల్లు, ఒల్లమి, ఒల్లని మొదలగురూపములు కలవు. ఈ 'ఒల్' అనునదే 'వల్' అయి, పిదప 'వలయు' ధాతువైనది. ఇది 'చేయక్' అను అన్నంత రూపముపై జేరి 'చేయక్‌వలయు'- చేయుటకు ఇష్టపడు, సిద్ధపడు అను నర్థము నిచ్చినది. వ్యతిరేకార్థమున 'చేయనొల్లను' అని 'ఒల్లు' ధాతువే కనబడుచున్నది. "నీవు చేయవలయును" అనునది విధ్యర్థమున వాడుకలోనికి వచ్చి కాలక్రమమున "చేయవలెను > చేయవలె > చేయాలె > చెయ్యాలె > చెయ్యాలి అను రూపముగా మారినది. ఇట్లు 'అలి' అనున దిప్పుడు ప్రత్యయావస్థకు వచ్చినను, దీని చరిత్ర నన్వేషింపగలిగినచో నొకకాలమున నిదియు స్వతంత్ర పదముగా నుండె ననియు, నిట్లే యీ భాషారూపములొక కాలమున స్వతంత్రపదసంయోగముచేతనే యేర్పడిన వనియు నిర్ణయింప నవకాశ మేర్పడును గదా.

'ఈ' ధాతురూప మగు 'ఇసు' 'ఇచు' అనునది 'అగు' అనుదానివలెనే యితరధాతువులపై సహాయ ధాతువుగ చేర్చబడుచువచ్చె నని మనము గమనించి యున్నాము. ఈ భావములో నీ ధాతు వింక ననేకవిధముల నుపయోగపడిన ట్లగపడుచున్నది. సంస్కృతధాతువులను స్వయంకర్తృకములగు తెలుగు ధాతువులుగగాని, కన్నడధాతువులుగగాని చేయుటకై వానిపైని 'ఇంచు' 'ఇసు'లను చేర్చుట కలదు. కన్నడము:—ఖండిసు, చిత్రిసు, ముద్రిసు, శాసిసు, భంజిసు, రంజిసు, కోపిసు మొ. ఇట్లే తెలుగునను ఖండించు, చిత్రించు, ముద్రించు, ధ్యానించు, భుజించు మొదలగు రూపములలో నిది 'ఇంచు' అను రూపమున గానవచ్చుచున్నది. స్వయంకర్తృవివక్షయందు దేశీయధాతువులపైగూడ నిది వచ్చును. కన్న : నిట్టిసు, కంటిసు, తుట్టిసు, దళ్లిసు, అలిసు—ఆకర్ణనే, ఓసరిసు—అపాదానే, ముక్కళిసు—గండూషే, అక్కళిసు—నిమ్నకుక్షౌ, అప్పళిసు — ఆస్ఫాలనే, ఉమ్మళిసు — చింతాయాం, కళవళిసు—మనోవైకల్యే, కినిసు-కోపే, విన్నవిసు—విజ్ఞాపనే మొ. ఇట్టి వనేకములు తెలుగునను గలవు. వీనిలోగూడ 'ఇంచు' అనునదే కనబడును. నిట్టించు, అలించు, ఓసరించు — ఓసరిల్లు, పుక్కిలించు, అక్కళించు, అప్పళించు, ఉమ్మలించు, కళవళించు, కినియు, విన్నవించు. ఇది 'విజ్ఞాపించు' అనుదాని తద్భవరూపము — కినియు, కినిసు అనునవి తెలుగుకన్నడములలోని రూపములు. ఇది తమిళమున 'చిన' అను రూపము గలదై యున్నది. అనగా 'ఇసు' చేరలేదన్నమాట. 'క' కారముమాత్రము తాలవ్యాచ్చరకమగుటచే చకారముగా మారినది. కన్నడమున 'కినిసు' అని ఇస్వంతముగా నున్నది తెలుగున 'కినియు' అని ఇయ్వంతముగా నుండుట విశేషము. ఈ 'ఇయు'కూడ 'ఈ'ధాతురూపమే కావచ్చును.

తెలుగునందువలెనే కన్నడమునను కొన్ని ధాతువులపైని చేరిన 'ఇసు'అనునది 'చు' గా మారినట్లు చెప్పుచు శబ్దమణిదర్పణకారు డీక్రిందిధాతువుల నుదాహరించినాడు. ఈ 'చు'వర్ణాంతరూపములు మరల ధాతువులుగనే పరిగణింపబడునట — "ధాతో రిసు ప్రత్యయస్య చాదేశే పున ర్ధాతుత్వం."

అలర్చు—వికసనే(అలర్ + ఇసు = అలరిసు > అలర్చు)

సార్చు—సమీపాగమనే (cf. తె. చేర్-చేరు + చు = చేర్చు)

అమర్చు—సంఘటీకరణే (అమర్చు)

పొణర్చు—సంయోగే (పొనర్చు)

పడిల్చు—శైథిల్యే (సడల్చు)

మరల్చు—మగుల్చు - పరాఙ్ముఖీకరణే (మరల్చు-మగుడ్చు)

కఁదల్చు—పృథక్కరణే (కదల్చు)

నెగల్చు—విఖ్యాతౌ

మఱికొన్ని చువర్ణాంతధాతువులుగనే గ్రహింపబడినవిఖూడ నొకకాలమున 'ఇచు - ఇసు' ధాతువుతో జేరినవే కావచ్చును.

మించు (మిన్ = ప్రకాశము + ఇసు=మినిసు - మించు.)

పించు (పిఞ్=వెనుక + ఇసు=పినిసు> పించు.)

పొంచు-సంకేతోద్యోగే (తె. పొంచియుండు.)

అఱుచు-ఉచ్చైర్ధ్వనౌ (cf. అఱు + ఇసు—చు= అర్చు)

పెర్చు— విస్తారే (పెర్ + ఇసు — ఇచు = పెర్చు) > పెచ్చు - పెరుగు.

కర్చు - ఖాదనే (cf. కడి. తె.కఱచు.)

తీర్చు - నివృత్తౌ (cf తీర్, తీర్చు)

బిర్చు - విభజనే (cf విడు - వీఱు — విడుచు> విచ్చు)

మెర్చు - అభ్యుపగమే (మెఱ్ + చు=మెచ్చు)

ఇట్లే తెలుగున నింక ననేకధాతువులు చువర్ణాంతము లీధాతుసహాయమున నేర్పడినవే యైయుండును. లేదా 'ఉండు' (> ఉళ్) ధాతువునకు సంబంధించిన 'ఉతు> ఉచు' అనుదాని మూలముననైన నేర్పడియుండును.

కుడుచు—త, క: కుడి = to drink—కుడిసు> కుడిచు <కుడుచు.

కొలుచు—త, తు, క: కొళగ = measure.

ఏడుచు—త,మ,క: అఱు = to weep, cry < ఏడ్వు — ఏడిసు> ఏడుచు.

ఒలుచు—త: ఉరి = to strip of covering —ఉరిచు <ఒలుచు

గెలుచు—త: కెల్. క: గెల్ — గెలి = to win — గెలిచు> గెలుచు> గెల్చు

నోఁచు—త: నోల్, క: నోన్ + చు = నోంచు> నోఁచు.

తాఁచు—క: తాకు — తాగు, తాంగు = to come in contact with—తాంకిసు> తాంకించు> తాఁచు> తాఁచు = తన్ను

తూఁచు—తూ = to weigh — తూకు — తూకిసు> తూచు.

మడుచు—త, క: — మడి = to bend, fold. మడిసు> మడుచు

తోఁచు—త: తోన్ఱు = to be visible, to appear - తోన్ఱిసు> తోంచు. తోఁచు, cf తోఱ్ - త్రోవ.

తొలఁచు—త: తుళై = to cut a hole - తొళయిసు> తొలచు.

తొలుచు—క: తొళె =to wash, తొళసు> తొలుచు.

కరచు—త: కరై = to melt, కరగు - కరగిసు> కరగించు> కరచు

మొలుచు—త, క: మొళె = to sprout - మొళెయిచు > మొలచు.

విలుచు—త: విల్ = to buy - విలిచు> విలుచు.

చెఱుచు—త, క: కెడు = చెడు, to be spoiled (కీఱ్) ఇచు-చెఱచు.

పిలుచు—క: విళి = to call - విళిసు> పిలుచు.

రాచు—త: అరై = to rub-అరై - ఇచు> రాచు.

తెంచు—తెగు - ఇచు - తెగిసు - తెగించు> తెంచు.

ముంచు—త, క: ముఱు =to be immersed, ముఱుగుఇసు> ముఱుగిసు> ముంచు.

వేఁచు—వేయ్ - వేఁగు - వేయిసు - వేచు.

కాచు—కాయ్ - కాయిసు - కాచు.

చాచు—చా - చాగు, చాగిసు> చాచు

అడచు—త: అడై - అడైసు - అడైచ్చు> అడచు

ఉంచు—త, క: ఉళ్ = to be, ఉళిసు> ఉంచు.

అలర్చు—త, క: అలర్ = to blossom - అలరిసు> అలర్చు.

ఓర్చు—త: ఓర్ = to consider, ఓర్మై్క - fortitude. ఓరిసు> ఓర్చు.

ఈ పైధాతువులలో, లేదా ధాతుపల్లవములలో తుదనున్న 'చు' వర్ణము ణిజర్థమును సూచించుటకుగా జేర్పబడిన ఇసు-ఇంచుధాతువునకు సంబంధించిన 'చు' కారమే యైనను, అది తొలిధాతువుతో గలిసిపోయి 'చు' వర్ణమాత్రావశిష్టమై, తచ్చువర్ణాంతరూపమును మరల ధాతువుగా, లేదా ధాతుపల్లవముగా జేయుటకు దోడ్పడినది. వీనిపై మరల ణిజర్థమును జెప్పవలసివచ్చినపుడు మాత్రము 'ఇంచు' అనుదాని సంపూర్ణరూప మగపడుచున్నది.

ఏడుచు—ఏడిపించు
తోచు—తోపించు
పిలుచు—పిలిపించు
తొలచు—తొలపించు
మొలచు—మొలపించు మొ.

ఇందలి 'చ'కారము పకారముగా మారుట గమనింపదగినది. cf రావించు-రప్పించు, ఏడుచు-ఏడుపు-ఏడిపించు, పిలుపు-పిలిపించు. ఇటీవల 'ఇంచు' ధాతుసహాయమేగాక 'చేయు' ధాతుసహాయముకూడ గ్రహింపబడుచున్నది. ఇది అన్నంతరూపముపై జేర్పబడును: గెలుచు-గెలిపించు- గెలువజేయు, మొలచు- మొలవజేయు మొ.

ఇట్లు తెలుగుకన్నడములలో 'ఇంచు', 'ఇసు' అనువానిని జేర్చుటచే ప్రేరణార్థము సూచింపబడుచుండ తమిళములోమాత్ర మట్లగుచుండుట లేదా యను ప్రశ్న బయలుదేరకమానదు. తమిళమున ధాతువుపై వి, బి, ప్పి అను వర్ణములను జేర్చుటచే ప్రేరణార్థము సూచింపబడుచున్న దని వైయాకరణులు చెప్పుచున్నారు. ఇవి కేవల మర్థము లేని వర్ణములా, ఇసు, ఇంచులతో వీనికి సంబంధ మేమైన గలదా, లేక ఇవి యేదైన మరియొక పదముయొక్క యవశిష్ట రూపములా యని పరిశీలింపవలసియున్నది. తమిళమున కొన్ని ధాతువుల ప్రేరణార్థకరూపములను బరిశీలింపగా నవి యాయాధాతువుల తుదిహల్లునకు ద్విత్వము చేయుటచేతనే యేర్పడుచున్న ట్లగపడును. చూడుడు: ఆ—ఆగు—ఆక్కు ; పో—పోగు—పోక్కు ; ఆడు—ఆట్టు (= ఆడించు) ; కాణ్—కాట్టు; —ఓడు ఓట్టు; ఆఱు—ఆఱ్ఱు మొ.

ఇదియే యీ ద్రావిడభాషలలో ణిజర్థమును సూచించుట కవలంబింపబడిన ప్రాచీనపద్ధతి యైయుండును. ఈపద్ధతి చాలదని తోచినప్పుడు ఈభాషను వ్యవహరించినవారు ఈ ధాతుసహాయమును గైకొన నారంభించియుందురు. అదియు చాల దనుకొనినప్పుడు 'చేయు' ధాతు సహాయముకూడ గైకొనబడిన దని తెలియుచునేయున్నది గదా. తెలుగు కన్నడములలో 'ఇసు' ధాతు సహాయము గైకొనబడినట్లు తెలియుచుండగా తమిళమున మాత్రము గైకొనబడియుండదా అని పరిశీలించినచో కాయ్— కాయ్చ్చు— కాయ్త్తు, అడై—అడైసు > అడైచ్చు మొదలగువానిలోని 'చు' అనునది దీనికి సంబంధించినదై కనబడుచున్నది. ఇది 'ఇచు-ఇచ్చు'లోని ఇకారము లోపింపగా మిగిలిన 'చు'వర్ణమే కావచ్చును. కాని వి,పి అనువర్ణములే ప్రేరణార్థకరూపములలో బహుళముగా గనబడుటను బట్టి అవి యేతదర్థసూచకములుగా గ్రహింపబడినవి. ఈ వి,పి అనునవి తెనుగునమాత్రము క్వాచిత్కముగ కనబడుటలేదా, 'వచ్చు'ధాతువునుండి ప్రేరణార్థకరూపము 'రావించు' అగునుగదా — అట్లే అగు — కావించు, చూ—చూపించు, నో—నొప్పించు, తే— తెర్ — తెప్పించు, చొరు—చొప్పించు ఇత్యాదులు. వచ్చునకు 'రా' ఆదేశమగునని చెప్పబడినను 'వర్' అనునదే ధాతువని గ్రహించినచో వర్ + ఇసు = వరిసు—వర్చు> వచ్చు అని యొక రూపము కాగా, 'ఇసు' ప్రేరణార్థకమై చేర్పబడినపుడు వర + ఇసు— వరవిసు> రావిసు = రావించు అను రూప మేర్పడుటయేగాక దీనినుండి తొలిదీర్ఘమునకు హ్రస్వము, మీది హల్లునకు ద్విత్వముకూడ కలుగుటచే 'రప్పించు' అను

రూపముకూడ కలిగినది. అట్లే ఆగు–ఆగిసు–కాఇసు–కావిసు – కావించు, చొరు + ఇసు = చొరువిసు–ఉకారలోపముచే చొర్విసు–రేఫవకారముల సమీకరణమువలన (Assimilation) చొప్పిసు – చొప్పించు, నో–నోవ్ + ఇసు = నొప్పించు, తే–తెర + ఇసు= తెరవిసు> తెప్పించు ఇత్యాదు లేర్పడియుండును. దీనినిబట్టి తొలుత 'వ'కారము ఆ + అక్, ఈ + అన్ = ఆవన్, ఇవన్ మొదలగు రూపములలో సంధ్యక్షరముగా (Glide Sound) బయలుదేరి తెలుగున తరువాత వర్ణవ్యత్యయము మూలముగా నేర్పడిన వాక్ - వాండు, వీండు మొదలగు రూపములలో ప్రాధాన్యము వహించినట్లే యిచ్చటను వరవిసు, కావిసు, నోవిసు మొదలగు రూపములలో గూడ సంధ్యక్షరముగ జేరి, కొన్ని స్థలములలో బరుషాక్షరసంయోగముచే బరుషత్వమును, ద్విత్వమును బొంది ఆయారూపములలో ప్రాధాన్యము వహించుటచే వి, బి, ప్పి అనునవే కొన్ని భాషలలో ప్రేరణార్థక చిహ్నములుగా బరిగణింపబడుట తటస్థించియుండునని యూహింపదగియున్నది. ఇట్లే భాష లన్నిటిలో ఈ ధాతురూపములగు ఇసు, ఇంచు అనునవి యితరధాతువులకు సహాయధాతువులుగనే గాక, అర్థభేదమును సూచించుటకుగూడ వానిపై జేర్పబడుచుండు నని నిశ్చయింపుట కవకాశము కలుగుచున్నది.

'ఈ' ధాతురూపమగు 'ఇతు' అనునదే ధాతువులపై భూతకాలిక చిహ్నముగాగూడ జేర్పబడుచు వచ్చిన దని తెలుగుభాషలో నిలిచియున్న చేస్–ఇతు–ని=చేసితిని, చేసితివి, చేసితిరి మొదలగు రూపములను బట్టి నిశ్చయింపదగిన ట్లగపడుచున్నది. క్త్వార్థక ఇకారమనునది 'ఇతు'లోని తువర్ణలోపముచే మిగిలిన 'ఇ' కారమే. ఇతరదక్షిణదేశభాషలలో త: శెయిదు> శెయ్దు; క: గెయిదు > గెయ్దు మొదలగువానిలో ఇతులోని 'ఇ'కారము లోపించి దకారమే ప్రాధాన్యము వహించుటంజేసి 'ద' కారమే భూతకాలిక చిహ్నముగా తద్భాషావైయాకరణులచే గ్రహింపబడినది. మలయాళమున 'పోయి' అను నికారాంతరూపమే సంపూర్ణ క్రియారూపముగ గ్రహింపబడజొచ్చినది. అనగా 'ఇతు' లోని ఇకారమునకే ప్రాధాన్యము గలిగిన దన్నమాట.

ఈ ధాతువు మఱియొక యర్థభేదమునుగూడ సూచించుచున్న దనవచ్చును. చేయనిమ్ము, తిననిమ్ము ఇత్యాది రూపములలో నీధాతు వంగీకారమును తెలుపుట కుపయోగపడుచున్నది. "నన్నాపని చేయనిమ్ము – అనగా చేయుటకు నీ వంగీకారమును దెలుపుము" [చేయక్ = to do, ఇమ్ము = give (me permission) = let me do it] అను నర్థమున ఈ ధాతుసహాయము గైకొనబడినది. 'ఇమ్ము' అనునది 'ఈ' రూపమునుగూడ దాల్చినది. చేయనీ, తిననీ.

ఇట్లు అగు, ఇతు, ఉచు మొదలగు కొన్ని ధాతువులు ఇతర ధాతువులపైగాని, శబ్దములపైగాని చేర్చుట మాత్రముచేతనే వానిని భిన్నధాతువులుగ మార్చుటకు గాని, అర్థభేదమును సూచించుటకు గాని తోడ్పడుచున్నవనియు, ఇట్లే యీ దక్షిణదేశభాషారూపము లన్నియు జెరిగియుండు ననియు తలచుట కవకాశ మేర్పడుచున్నది. ఈ భాషలలో 'చు' 'చ్చు' వర్ణాంత ధాతువులవలెనే ఇవి మూలధాతువులు కాక ధాతుపల్లవములైనను ధాతువులుగనే వైయాకరణులచే వ్యవహరింపబడుచున్నవిగావున నట్లే యందము. కు, గ్గు, ట్టు, త్తు, ప్పు, ళ్లు, ల్లు మొదలగు ద్విత్వాక్షరము లంతమందు గల ధాతువులును విశేషముగాగలవు. కాల్డ్వెల్ పండితుడును వీనిని ధాతువులపై జేర్పబడు ప్రత్యయములుగానే గ్రహించినాడు. కాని, ఇవియు భిన్నధాతు సంయోగముచేతనో, లేదా ధాతువునందలి భిన్నవర్ణముల సమీకరణముచేతనో యేర్పడినవిగానే కనబడుచున్నవి.

ఈభాషలలో కువర్ణాంత-క్కువర్ణాంత ధాతువులలోని 'కు'వర్ణము 'అగు' ధాతురూపాంతరమగు 'అకు' లోని కువర్ణమే యైయుండునని యూహించితిమిగదా. కొన్నిటిలో అగు-అకు-లోని అకారము కనబడకపోవుటచే 'కు' వర్ణము మాత్రమే చేర్పబడియుండునేమో యనియు దలపనగును.

ఎక్కు—ఇతర దక్షిణదేశభాషలలో 'పైకి బోవుట'అను నర్థమున ఏఱ్–ఏఱు అను ధాతువు కలదు. ఏఱు + (అ)కు> ఏఱుక్కు> ఎక్కు అను రూప మేర్ప

డినది. 'ఎఱ్కు' వాడుకలోనికి వచ్చుటచే గాబోలు ఏఱుధాతువు తెలుగున నంతరించినది. తమిళకన్నడముల లోమాత్ర మిది యిప్పటికిని వ్యవహారములో నున్నది. క. ఏఱు-(ప్రేర.) ఏఱిసు, దీనినుండి యేర్పడిన ఏఱ్టమ్-ఏఱాము, ఏఱ్టుమతి = ఎగుమతి మొదలగునవి యతిక్రాంచిద్భేదముతో నీభావములలో వాడుకయం దున్నవి. క. ఎగరు-తె. ఎగురు(to rise up), ఎత్తు, (height) మొ.

కఱ్కు, క్రఱ్కు-త, క: కాఱ్ - ధాతువు (= to vomit). దీనినుండి వర్ణవ్యత్యయముచే 'క్రాయు' అను ధాతువు తెనుగున నేర్పడియున్నది. కాఱ్ అనుదానిపై '(అ)కు' చేరుటచే 'కాఱ్కు'> క్రఱ్కు> కఱ్కు అనురూపములు తరువాత నేర్పడినవి.

క్రుఱ్కు, కుఱ్కు = త, క: కుఱి (to make a hollow, to dig)ధాతువు. దీనినుండియే క్రొచ్చు, క్రొయ్యు అను ధాతువు లేర్పడినవి. కన్నడమున 'కు' వర్ణముతో గూడిన 'కుఱ్గు' అను ధాతుపల్లవము కలదు. దీనికి క్రుంగు(to contort, to shrink)అని యర్థము. దీనినుండి యేర్పడిన సకర్మకధాతువే 'క్రుఱ్కు'అను నది. ఇచ్చట 'ఱ'కారము రేఫగా మారినది. క్రుఱ్కుట అనగా పల్లము నేర్పడునట్లుగా జేయుట. కుఱ్కు అను నది పదాదిరేఫము లోపించుటచే నేర్పడిన యర్వాచీన రూపము.

చెఱ్కు—దీని మూలరూపము 'కెత్తు' అను నదిగా కన్నడమున గనబడుచున్నది (= to make thin, to chip, to scrape or chip off as grass). మలయాళమున 'చెత్తు' అని కలదు. దీనిపై 'కు' వర్ణము చేరిన రూపము తమిళముననే యేర్పడినది. త: చెదుక్కు. ఇవన్నియు ప్రాచీనమగు 'కెత్తు' అను దానిలోని 'క'కారము తాలవ్యాకారపరకమగుటచే తాలవ్యచకారముగా మారుటవలన నేర్పడినవే. కకార మొక్క కన్నడరూపముననే నిలిచియున్నది. 'చెదుక్కు' అనునది తెలుగున 'చెఱ్కు' అయినది.

చొఱ్కు—క: సొఱ్కు = to grow intoxicated - సొఱ్కు> సొఱ్కు రేఫకకారముల సమీకరణము.

నిఱ్కు—నిల్ = to stand - నిల్కు> నిఱ్కు.

త్రొఱ్కు, తొఱ్కు—త, క: = తుళి - (= to tread upon) తుళి +(అ)కు> తొళికు> త్రొఱ్కు.

పొఱ్కు—త, క: పుఱుంగు (to be boiled, burn, blister) > పొఱుంగు> పొంగు - పొఱ్కు.

మ్రొఱ్కు—క: ముఱ్గు - మొఱ్గు (=to bow, to bend, an obeisance) మ్రొగ్గు, మ్రొఱ్కు - మొఱ్కు.

దఱ్కు—క: తంగు (=to stop, stay, etc.) దఱ్కు = to remain, to be preserved, to be obtained, got, to remain in one's possession.

స్రుఱ్కు—త, క: చురుళ్, సురుళ్ (=to contract, to shrivel, shrink), సురుగు (తె: చొరుగు. అరటి చొరుగు-a withered dry portion of a plantain leaf) సురుళ్ + కు = సురుళ్కు > స్రుఱ్కు.

నఱ్కు—త, క: నరి (=a Jackal). నరి + కళ్ =నరికళ్ > నక్కళ్ > నక్కలు. నక్క—లు. 'నక్క' అనునది ప్రాచీన బహువచనరూపమగు 'నరికళ్'అనుదాని రూపాంతరమగు 'నక్కళ్' అను దానినుండి తెలుగున బహువచనప్రత్యయముగా నేర్పడిన 'లు' అనుదానిని వేరుపరుపగా నేర్పడిన యేకవచనరూపము. 'నక్క'కు సహజముగ చేష్టనుండి 'నఱ్కు' అను క్రియారూప మేర్పడి యుండవచ్చును.

ఇక 'గ్గ' వర్ణాంతధాతువులలో పెఱ్కు రేఫ-గ కార సమీకరణముచే నేర్పడిన ట్లగపడుచున్నవి.

తగ్గు—తెఱుగు> తర్గు> తగ్గు. క. తఱి=ఖండనే.

మగ్గు—క: మఱ = (dimness) — మఱ్గు (=to grow dim or faint, disappear, perish) > మగ్గు (=to grow pale, wither, destroyed) త: మరిగు (=to disappear, perish) తె: మఱుగు > మర్గు> మ్రగ్గు> మగ్గు.

మ్రొఱ్కు, మ్రొగ్గు—క: ముఱ్గు — మొఱ్గు (to fall, fall down, to make obeisance)> మ్రొఱ్కు, మ్రొగ్గు. cf. మురి - వక్రభావే= to be bent) మురి +కు> మ్రొఱ్కు.

నెగ్గు—నెరయు—నెర+గు=నెర్గు=నెగ్గు. త, క: నెగఱ్=తె: నెగడు - నెగ్గు.

ఒగ్గు—క, త: ఉఱుగు, ఒఱుగు (=to be bent, crooked, to lie down, to fall down) > ఒగ్గు= to let fall down.

డిగ్గు—త, క:=ఇఴింగు - ఇఴి (to descend, to come down) ఇఴి+గు=డిగ్గు (వర్ణవ్యత్యయము - ఴ కారమునకు డకారము.)

నుగ్గు—నుఱు-నుఱుచు - నఱుము = చూర్ణము చేయు - నుఱు+గు = నుగ్గు.

'ట్టు' వర్ణాంతములు:—

ఊట్టు—స్రవించు, కారు. త: ఊఱై (= to drop as the rain leaking) ఊఱ్ఱు> ఊట్టు) = ఊట్టు. cf తె: ఊరియు.

ఒట్టు—కలుగు, ఉంచు, రగుల్చు. త: ఉఱు (= to be, to dwell, to touch, come in contact)> ఉఱ్ఱు> ఒఱ్ఱు> ఒట్టు (చిచ్చొట్టు)

పట్టు—త: పఱ్ఱు (= to grasp, seize, catch etc) పట్టు)> పట్టు.

పుట్టు, పట్టు—త: - పిఱ (= to be born, to arise) త, క: పెఱ్, పెఱు = to beget, generate, give birth to) పెఱు - పెఱ్ఱు - పెట్టు > పుట్టు (cf గుడ్లుపెట్టు)

తిట్టు—త, క: తెగఱ్ = తె: తెగడు (= to condemn) తెగఱ్ > తెగడు> తెగటు> తిట్టు.

తొట్టు—త: తుడంగు - తొడు, క: తుడంకు- తొడగు (= to begin, commence) తొడర్ (=to be connected, to join) తొడరు> తొట్టు)> తొట్టు.

చుట్టు—త, మ: చుఱ్ఱు > చుట్టు)> చుట్టు. క: సుత్తు = to surround, to go or turn round. చుఱె - సురుగు = what is dried and rolled up త: చురుట్టు. చుట్ట = a roll, a cheroot or igar.

మెట్టు—క: మెట్టు = చరణవిన్యాసే. to step, to tread or trample on. త, క: మిది,మిరి = to pound, tread, trample. మిదిసు - మెట్టు?

కట్టు—త, క, తు: కట్టు = to bind.

కొట్టు—త, మ, క, తు: కుట్టు = to beat, strike, pound. కుట్టు> కొట్టు.

ముట్టు—త, మ, క : ముట్టు = to dash, to touch, strike.

మిట్టు = ఎగురు—త: మిఱల్ - మేడు; తె: మిఱ్ఱు> మిఱ్టు> మిట్టు. క: మిఱి=to leap, bounce.

మొట్టు—క: మొట్టు = to rap the head with the knuckles of the fist. మ: ముట్టు.

తట్టు—క: తట్టు = to tap, touch, strike.

మట్టు—క: మడు = to put firmly, to join closely. త: మడ్గు = to be pressed.

నెట్టు—త: నెఱ్ఱు > నెట్టు) > నెట్టు = to push, dash.

ఎత్తు—త, క: ఎఱ్, ఏఱు = (to stand up, to rise, to arise etc.)ఏఱ్+ఇసు-ఇతు= ఏఱ్+ తు> ఎఱ్తు> ఎడుత్తు> ఎత్తు.

మొత్తు - మోదు> మొత్తు.

మెత్తు—త, మ : మెఴుగు = to daub a place with cow-dung, to varnish క: మెత్తు = to plaster.

అద్దు—త: అఴున్దు = to become pressed, to press close, press down.

బిద్దు—క: బిఱ్దు> బిద్దు, త: విఱు, వీఱు = to go to ruin, to be spoiled.

దిద్దు—త: తిర్=తిరున్దు> తిద్దు> దిద్దు.

రుద్దు—త: ఉరై, ఉరె; క: ఉర్దు> ఉద్దు = to rub. ఉర్దు> రుద్దు.

దున్ను—త, క, మ; ఉఴు; తుళు: ఉడ్ = to plough, to dig up. ఉఴుందు> దున్ను.

పన్ను—త, క: పణ్-పణ్ణు=to make ready, make, perform. ణ్ణు> న్ను.

ఎన్ను—త, క: ఎణ్ - ఎణ్ణు = to count, think, consider. ణ్ణు > న్ను cf. ఎణ్ణిక > ఎన్నిక

తన్ను—త, క: తాంకు, తాంగు=to strike, hit. తాంచు > తన్ను.

ఒప్పు— త, క: ఒల్ (ఉలు) = that is true, nice, good, to agree with. ఒల్ + పు=ఒల్పు > ఒప్పు.

ఉప్పు = ఆవిరిపోక ఉడికించు. cf. ఉబ్బు, ఉమ్మ - steam త, క: ఉరి=to burn - to be hot ఉరిపు > ఉప్పు.

ఉబ్బు—క: ఉరుబు - ఉబ్బెల్ > ఉబ్బు.— ఉలు = to become large. క: ఉబ్బ = to rise, to bubble up.

కప్పు—త, మ, క: కవి = to cover, to overspread, కవి + పు=కప్పు.

తప్పు - క: తప్పు, to make a false step, to be missed, to fail. త: తవర్, తఱు > తప్పు.

తిప్పు, త్రిప్పు—త, క: తిరి = to go round, revolve. తిరుగు (caus) తిరుపు—తిరుప్పు > త్రిప్పు.

మప్పు—మరగు=పరిచితముగు, అలవడు. మరపు > మప్పు.

విప్పు—విడు = to break, open. విడుపు > విప్పు; విడుచు > విచ్చు.

ప్రబ్బు—త, క: పరి=to spread, పర్బు > పంబు, పర్బు > ప్రబ్బు.

నమ్ము—త, క: నమ్బు > నమ్ము.

గ్రొయ్యి— త, క: కుటి = to become hollow, depression. కుటియు > గ్రొయ్యి. cf. గ్రొచ్చిపాతెదల=త్రవ్వు.

త్రెయ్యి=తెగు—క: తెఱ, తెఱ, an opening, gap, interstice.

క: తెఱయిసు=to cause an opening. తెఱయు > త్రెయ్యి.

తుళ్లు—త, క: తుళంకు = to be agitated, to shake, spill as water.

మళ్లు—మరలు > మర్లు > మళ్లు-త: తుళ్లు = to leap, frisk, jump.

త్రెళ్లు—తెరలు > త్రెళ్లు. క: తెరళు = to move, stir, tremble.

వెళ్లు—వెడలు > వెళ్లు.

సళ్లు—సడలు > సళ్లు.

ఒవ్వు—త: ఉవ= to love. క: ఓ= to be attached to, to love, to be pleased with ఓవు > ఒవ్వు.

కవ్వు—క: కవి = to overspread, cover కవియు > కవ్వు.

త్రవ్వు—త, క: తురు=to bore, drill-తురవు తె: గొరువు = well made by excavating the land తురవు > త్రవ్వు.

నవ్వు—త, క: నగై, నగె=to smile, laugh- నగవు > నవ్వు.

తెలుగులోని 'ఉ' వర్ణాంతధాతువులు కొన్ని యితర దక్షిణదేశ భాషలలో 'ఇ' కారాంతములై యున్నవి.

ఏడు - ఏడ్చు—త, మ, క: అఱు = to cry, weep. cf తె. అడలు.

అడు(చు)—త, క: అటి = to destroy, to ruin etc.

ఈడు(చు)—త, క, మ: ఇఱు = to draw, pull.

పండు—త: పఱు = to become old, ripe. cf. పఱం = fruit - పండు.

పూడు—క, మ: పూఱ్ = to bury, to inwrap.

ఊడు—క: ఉటి; త, మ: - ఒఱి = to abandon, to quit.

కూడు—క: కూడు - కుడై = to be mixed, కుఱు = crowd, multitude.

వాడు—క: బాడు > బాల్ = to fade, to become weary (బడలు)

తెగడు—త: తిగళ్, క: తెగళ్ = to rebuke, blame.

నెగడు—త: నిగళ్ = to happen, to be carried on.

పొగడు—త: పుగళ్, క: పొగళ్ = to praise.

ఈ భాషలోని కొన్ని నకారాంత లకారాంత ధాతువులు ఇతర భాషలలో ణకార ళకారాంతములై యున్న ట్లగపడు చున్నవి.

అను—త, మ, క: అణై = to touch, to approach, to join, meet, lean upon. cf త: అణై కట్టు - తె: అనకట్ట.

పూను—త, క: పూణ్ = to undertake, begin, consent etc.

పేను—క: పెణె - మ: పిణి - పెణె = to entwine, twist, to tie together.

కొను—త, క: కొళ్ = to seize, lay hold of, seize, cf ఎచ్చుకోలు - పుచ్చుకోలు అను భావార్థకరూపములలో ప్రాచీనరూపమగు 'కొళ్' అనుదానిలోని 'ళ' కారము 'ల' కారరూపమున నిలిచియుండి కానవచ్చుచున్నది.

అను—త: 'ఎన్' to say, utter. 'ఎన్' అనుదానిలోని నకారము తమిళమునందలి పదాంతనకారమనబడు దంత్యనకారభిన్నమగు ప్రత్యేకవర్ణము.

మాను—త: మాణ్.

కను—త, క: కాణ్ = to see.

తని(యు)—త: తణి = to be appeased, satisfied. తణ్ = coolness.

తునియు—త, క: తుణ్ - తుణి = to be broken.

వేలు(చు)—క: వేళ్ - హవిః ప్రదానే.

తగులు—క: తగుళ్ - అనుధావనే.

పొరలు—క: పొరళ్ - లుఠనే.

చీలు—క: సీళ్ - విదారణే.

తెలి(యు)—క: తిళి - జ్ఞానే - to know.

తోలు(చు)—క: తొళె - ప్రక్షాళనే.

మొల(చు)—క: మొళె-ప్రరోహక్రియాయాం. to sprout

తెలుగున ఎకారాదిగా నున్న కొన్ని ధాతువులితరభాషలలో అకారాదులై కనబడుచున్నవి.

ఎఱుగు—త, క: అఱి = to know

ఏలు—త, క: ఆళ్ = to rule

ఏడుచు—త, క: అలు = to cry

ఎయ్దు—క: అయ్దు = to pursue, reach

ఏరు—క: ఆరిసు = to pick out, select

తెచ్చు—త, క: తా-తర్ = to bring

నెరియు—త, క: నరై, నరె=to become grey

భిన్నధాతు సంయోగముచే ప్రాచీనకాలమున ననేకాచ్చకములై యేర్పడిన ధాతువులలో, లేదా ధాతుపల్లవములలో రెండవవర్ణము రేఫముగా నుండుట తటస్థించినచో, దెనుగున వర్ణవ్యత్యయముగలిగి తొలివర్ణము రేఫసంయోగము గలదగుట తటస్థించినది.

క్రాయు—త, క: కార్-వమనే to vomit

క్రీ(గా)లు—త: కీఴ్ (కొక్కర్)

క్రుక్కు, క్రుంగు, క్రుళ్లు—క: కుగుఱ, త: కుఴి=to make hollow

క్రోలు—క: కొరల్, త: కురల్= throat, neck.

క్రోల్చు=శబ్దించు—త: కురల్, క: కొరల్ = sound, voice. క: కొరల్చు = to call or cry out > క్రోలు.-కొసరి వసంతకాలమున కోయిల క్రోల్చిన భంగి నేడ్చె నల్లిసఖహాపత్రనేత్ర (కాశీ).

త్రిప్పు—త, క: తిరు, తిరుగు, తిరుప్పు > త్రిప్పు=to turn

త్రొక్కు—త, క: తుఴి-to tread upon తుఴిక్కు > త్రొక్కు.

త్రవ్వు—క, త: తురి, తురువు = to hollow, to bore. cf తె: దొరువు తురవు > త్రొవ్వు > త్రవ్వు

త్రెవ్వు, త్రెయ్యు = ఖండితముగు—క, త: తెఱవు=opening, interstice. తెఱవు > త్రెవ్వు

త్రెళ్లు—త, క: తెరళ్=to shake, tremble. తెరళు>త్రెళ్లు.

త్రోయు—త, క: తుఱు, తొఱె=to leave, to reject తొఱయు>త్రోయు.

ప్రబ్బు—త, క: పరె= to spread. పర్బు> ప్రబ్బు—పంబు.

ప్రుచ్చు—త, క: పుఱు=to get worm eaten పుఱుచు>ప్రుచ్చు. cf ప్రువ్వు.

బ్రుంగు=త, క: ముఱుగు, ముళ్గు = to sink, set immersed, to be ruined-ముఱుంగు>బ్రుంగు.

ప్రోచు—క: పొరె = పోషణే- to nourish, protect. పొరెయిసు>పొరచు>ప్రోచు.

వ్రాయు—త: వరై—క: బరె=విలేఖనే..బరెయు >వ్రాయు.

మ్రోగు—త: ముఱంగు. క: మురె=to sound as the lute. మురంగు>మ్రోగు.

మ్రొక్కు—క: ముఱగు, మొగ్గు=to fall down, to make obeisance.

గ్రొయ్యి>గ్రొచ్చు. త: కుతె — to make a pit. కుతిచు>గ్రొచ్చు.

బ్రదుకు—క: బాళ్ = జీవనే-బరుఁగు> బ్రదుకు.

క్రొవ్వు—త: కొఱు=to grow fat, కొఱువు <క్రొవ్వు.

మ్రింగు—త: విఱుంగు=to swallow. విఱుంగు <మ్రింగు.

ప్రేలు—క: పేళ్=to utter, say. త, మ: పేచు—to chatter as bird.

ప్రాకు—క: పరె, పరి=to spread, extend, to spread out as creepers.

ప్రీలు—త: పీరి. క: బిరి=to burst, break.

వ్రేయు—క: బీఱు=to throw, fling to throw as an arrow or stone.

ఇట్లీయాంధ్రభాషలో ధాతువులుగా గ్రహింపబడుచున్న వాని రూపముల నితరదక్షిణదేశభాషలలోని ధాతురూపములతో బోల్చిచూచి వాని పూర్వచరిత్ర నన్వేషింప యత్నించినచో, వీనిలో పెక్కింటిని ధాతుపల్లవము లనుటయే యుక్తమనియు, వీని మూల రూపములను గనిపట్టుట కితరభాషారూపములతో బోల్చి పరిశీలించుటయే కాక, తత్తద్భాషాసంప్రదాయానుసారములగు స్వరసూత్రములు, లేదా స్వరసంప్రదాయములను (phonetic laws) బట్టి యవియే యితర సహాయధాతువులతో గూడి యేయేకాలముల నెట్టిమార్పులను బొందినవో తెలిసికొనుటగూడ నావశ్యకమే యనియు, నట్లు పరిశీలించిననే కాని ప్రాచీనభాషలోని మూలధాతురూపము లెట్టివో, యవి భిన్నభాషలలో నెట్లు మారుచువచ్చినవో నిర్ణయించుట సాధ్యము కాదనియు దెలియవచ్చుచున్నది.

